
సహజమార్గదర్పణంలో

# దివ్యదేశదర్శనం



- కస్తూరి చతుర్వేది

సహజమార్గ దర్పణంలో

# దివ్యదేశ దర్శనం

కస్తూరి చతుర్వేది

ప్రచురణ:

**జి.డి. చతుర్వేది**

సి-830ఎ, పారిజాత, హెచ్ రోడ్, మహానగర్

లక్నో - 226 006

Sahajamarga Darpanamlo
**DIVYADESA DARSANAM**
by **Kasturi Chathurvedi**

1st Edition: Nov. 2000
Copies : 2000

Rs.**70/-**

Publisher:
**G.D. Chathurvedi**
C-830A, Parijatha
H-Road, Mahanagar
LUCKNOW - 226 006

Typesetting & Printing:
**VIJAYAMARUTHI D.T.P.**
VIJAYAWADA-11

# సమర్పణ

సమర్పణ ఎవరికి చేద్దును? నా దైవమూ, దివ్య అవతారులూ వారే అయిన నా 'శ్రీ బాబూజీ' యొక్క కృపతో సర్వమానవాళికి సులభమైన 'దివ్యదేశ దర్శనము' సహజ మార్గ దర్పణములో సహజంగానే స్పష్టమౌతుంది. నాకు వచ్చీరాని భాషలో దివ్య-ఆధ్యాత్మిక-స్థితులు అను మణిమాణిక్యాలతో కూర్చబడిన నా ఈ పుస్తక రూపమాల వారి పావన చరణాలకే సమర్పితం.

- కస్తూరి

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | నేను కనుగొన్నాను | 9 |
| 2. | లక్ష్యము | 14 |
| 3. | లక్ష్య సార్థకత | 24 |
| 4. | ధ్యానము | 31 |
| 5. | ధ్యాన మహిమ | 40 |
| 6. | ధ్యానావశ్యకత | 52 |
| 7. | ప్రాణాహుతి | 67 |
| 8. | ప్రాణాహుతి యొక్క కార్యదక్షత | 88 |
| 9. | దివ్య చైతన్యము - అనుభవము | 97 |
| 10. | సంకల్పము మరియు చైతన్యము | 112 |
| 11. | అహం | 124 |
| 12. | ముగింపు | 145 |



సమర్థ సద్గురు శ్రీరామ చంద్రజీ (ఫతేఘర్)

లాలాజీ మహారాజ్



కస్తూరి చతుర్వేది

## సహజమార్గ దర్పణంలో

# దివ్య దేశ దర్శనం

### నేను కనుగొన్నాను

అది 1949వ సంవత్సరం. ఒక సాయంకాలం - ఇంటి పనులన్నీ ముగించుకుని తీరికగా ఆలోచనా రహితంగా అలా కూర్చున్నాను. యాదాలాపంగా ఆకాశంవైపు చూస్తుంటే కాసేపటికి ఆకాశంలో ఉన్నట్లుండి ఓ కాంతిపుంజం వ్యాపించడం కనిపించింది. అలాగే చూస్తూండగా భగవత్ స్వరూపుడైన శ్రీరాములవారి రూపం ఆ ప్రకాశం మధ్యలోద్యోతకమైంది. ఆ రూపం అదృశ్యమై శ్రీకృష్ణ భగవానుని స్వరూపం గోచరమైంది. మెల్లమెల్లగా అదీ మాయమై అక్కడ 'ఓమ్' ఆకారము కనిపించింది. చూస్తూండగానే అదీ చెదరిపోయి తేజోమయమైన దివ్యముఖంతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఒక దుర్బల శరీరం చిన్నగడ్డం కల ఓమహాత్ముని రూపం ఆ కాంతి పుంజంలో చూశాను. దాన్ని అలానే చూస్తూండిపోయాను. అలా ఎంతసేపు చూస్తూండి పోయానో తెలీదుకాని స్పృహలోకి వచ్చేటప్పటికి ఆకాశం మామూలుగానే ఉంది. ఎక్కడా ఏకాంతీలేదు. కళ్ళునులుముకుని మరల మరల చూసినా ఆ రూపం కనిపించలేదు. నాకు తెలియకనే నాహృదయం వారి నిరీక్షణలో ఉండిపోయింది.

మరుసటిరోజు, అందమైన ఉదయపువేళ. ఐనా ఏదో తెలీని ఆదుర్దా. రోజంతా ఆ ఆతురతలోనే ఇంటిపనుల్లో తలదూర్చినా విసుగు, ఉదాసీనత అనుభవమవుతున్నాయి. ఆనాటి సాయంకాలం - "సహజ మార్గాన్ని" ప్రతిపాదించిన రాజయోగియైన ఓ మహాత్ముడు రేపు సాయంకాలం మన యింటికి వస్తున్నారు. అని, నాన్నగారు చెప్పారు. దీని వల్లా ఏ ఆనందం కలగలా. ఎందుకంటే మా యింటికి సాధువులు, మహాత్ములు రోజూ ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు.

ఆ రాత్రి సుమారు ఒంటిగంటసమయంలో ఓ కలగన్నాను. ఎదురుగా విశాలమైన కాళీమందిరం. మా కుటుంబం అంతటితో కలసి నేను దాని ముఖద్వారం ఎదుట నిలబడి ఉన్నా. ఆ ద్వారం ముందు పొడవైన గడ్డంకల ఒక మహాపురుషుడు, శాంతస్వరూపుడు నిలబడి ఉన్నాడు. ఒక అడుగు ముందుకువేసి మందిర ప్రవేశానికై ఆ మహనీయుని అర్థించాను. మృదుగంభీర స్వరంతో ఆయన "అలాగే ప్రవేశించవచ్చు. కాని దానికొక నియమం ఉంది. వెళ్లేముందు ఈ కత్తితో నీతల ఖండించి నాచేతులలోఉంచి మందిరంలోకి వెళ్లు" అన్నారు.

చాల చిత్రంగా ఉంది. విచిత్ర నియమం. తల ఖండించి ఇచ్చి మందిరంలోకి వెళ్లాలి. కాని నియమం నియమమే కదా! తప్పక పాటించాలి. నేను వెంటనే ముందుకు వెళ్లి "ఇదేమంత పెద్ద విషయం కాదే", అని వారి చేతిలోని కత్తి తీసికొని నా శిరస్సు ఖండించి వారి చేతిలో పెట్టి మందిరంలోకి ప్రవేశించాను.

ఆశ్చర్యం! అక్కడ విగ్రహమేదిలేదు. ఒక అలౌకికమైన దివ్యవాతావరణం ఆవరించి ఉంది. నేనూ ఆ దివ్య స్థితిలోనే ఉన్నా. ఇలాంటి దివ్యస్థితి కోసమే ఇంతకాలంగా నేను తపించి పోతున్నాననిపించింది. ఈ దివ్య వాతావరణాన్ని అనుభవించడానికే - ఆస్వాదించడానికే నేను ఇంతకాలంగా ఆర్తితో ఉన్నాననిపించింది. అలా కల చెదిరి పోయిందికాని, ఆ దివ్యానుభూతి మనసులో అలానే నిలిచి పోయింది.

శుభోదయవేళ. నేటిసాయంత్రమే ఆ రాజయోగి, సహజమార్గద్రష్ట, మా యింటికి వస్తున్నారు. మనస్సు లోలోపలే ఆతురతపడుతోంది. సాయంత్రం పనులన్నీ త్వరత్వరగా పూర్తిచేసుకుని ఆమహాత్ముని రాకకై ఎదురు చూస్తున్నాము. మహాపురుషుడు ఎలా ఉంటారో! నన్ను పలకరిస్తారా? నాతో మాట్లాడతారా? నన్ను ఆప్యాయంగా చూస్తారా? ఇలా ఎన్నెన్నో ఆలోచనలు పరంపరలుగా వస్తున్నాయి.

మాకు నూతన జీవనాన్ని ప్రసాదించడానికి నవజీవంతో సాయంత్రం రానేవచ్చింది. బయట నాన్నగారి మాట వినిపించింది - బాబూజీ మహారాజ్ విచ్చేశారు చూడండి, అని. మా అమ్మా, మేము అందరం బయటికి పరుగెత్తాం. నాన్నగారి వెనక ఆ పరమ పురుషులు నడచి వస్తున్నారు. నేను వారినే చూస్తున్నాను. నమస్కరించడం కూడ మరచిపోయాను. అప్రయత్నంగా నా నోటినుంచి "బాబూజీ! ఇన్ని రోజులు మీకోసం వెదుకుతుంటే ఈ రోజు కనిపించారా!" అన్నమాటలు వెలువడ్డాయి. అప్పుడే నేను ఒక మధుర స్వరాన్ని విన్నాను "బిటియా నేను కూడా నీకోసం వెదుకుతున్నా నేడు దొరికావ్" అంతే. ఆ ప్రథమసమాగం చిరసౌభాగ్యమై నా అంతరంగంలో ఇమిడిపోయింది. సంవత్సరాలపాటు రేయింబవళ్లు సాగిన, నా అన్వేషణ ఫలించింది.

ఆ పరమపూజ్యులు కూర్చుని ఉపాహారం తీసుకున్నాక మా అందరికీ సిటింగ్ ఇచ్చారు. ఆసిటింగ్ ఏమిటోగాని అంతరంగమంతా కూడా ఈశ్వరుడే నిండి పూర్తిగా ఆ కలలోని మందిరపు వాతావరణమే! "బస్" అని చెప్పినప్పటికీ కళ్లు తెరుచుకోడానికి ఇష్టపడ్డం లేదు. విచిత్రమైన స్థితి. అంతరంగములో ఆ అలౌకిక స్థితిలోనే మునిగి ఉండాలనే కోరిక! ఎదురుగా కూర్చుని ఉన్న ఆ పరమ ప్రియుని అలానే చూస్తూండాలని కూడా తాపత్రయం. కళ్ళు సందిగ్ధంలో పడ్డాయి. ఇంతలోనే ఒక మధుర స్వరం నా కర్ణపుటాల్లో ప్రవేశించింది.

'బిటియా! కళ్ళు తెరు. అప్పుడే ఏం చూశావ్. ధైర్యముంటే ఇకచూడు'

నేను వెంటనే అన్నాను. "మిమ్మల్ని పొందడంలో కలిగే కష్టాల్ని ఎదుర్కోడంలో నేను నిజమైన సిపాయినే అయ్యాను. నేను వెనకడుగువేయడం మీరెప్పుడూ చూడరు".

అన్వేషణ పూర్తయి సత్యసాధన మొదలైంది. సహజమార్గసాధన మా పాలిట వరమైంది. శ్రీరామ చంద్రమిషన్ మాస్వగృహమైంది. కొట్టుకుపోతున్న జీవితనౌకను బాబూజీ మహారాజ్ రక్షించారు. ఒక అద్వితీయ దిశవైపు, అనంతం వైపు, దివ్యదేశంలోకి మేము ఆనందంతో కొట్టుకుపోయాం. రండి!

ఇప్పుడు మిమ్మల్ని కూడా ఆ పరమపావనదేశానికి తీసుకువెళ్తాను. ఆత్మ దర్శనం పొందడానికి అక్కడ ఒక్క క్షణమైనా చాలు.

అనుభవాన్ని ఆధారం చేసికొనే నా యీ పుస్తకమంతా వ్రాయబడింది. రచయిత ఎవరో ప్రియపాఠకులే చెప్పాలి. 1957నాటిదీ విషయం! శ్రీరామ చంద్రమిషన్ "సహజ్ మార్గ్" పత్రికను వెలువరించడమూ, దానిలో వ్యాసాలు వ్రాయడమూ అను ప్రశ్న ఎదురైనప్పుడు బాబూజీ మహారాజ్ నన్నుచూసి "వ్యాసాలు వ్రాయి. నీవు వ్రాయగలవు," అన్నారు. నేను నిర్ఘాంతపోయి ఆయన ముఖమే చూస్తూండిపోయాను. ఏమిటి? నేనా! నేను కేవలం అప్పర్ మిడిల్ వరకే (హిందీలో) చదువుకున్నాను దానిని మరచిపోయి కూడా చాలా కాలమైంది.

"ఏమిటి - నేను వ్యాసాలు వ్రాయగలనా?" అన్నాను. మరల సశక్తి యుతమైన అదే మధురస్వరం వినిపించింది.

"నీవువ్రాయగలవు. చాలా బాగా వ్రాయగలవు". ఈ పలుకుల్లో రచనా శక్తి నాలో నిండిపోయినట్లుగా అనిపించింది. నిజంగా మొట్టమొదటగా కలం పట్టుకున్నది ఆరోజే. కలం పట్టి ఆలోచనలను కాకుండా కేవలం హృదయంలో నిండి ఉన్న అనుభవాన్నే వ్రాసింది.

రచయిత ఎవరో పాఠకులీపాటికి అర్థం చేసికొని ఉంటారు. ఈశ్వరుడు తనశక్తిపై ఆధిపత్యాన్ని ఇచ్చి బాబూజీని పంపారు, అనే విషయం పలురకాలుగా నా అనుభూతిలోకి వచ్చింది. బాబూజీ మహారాజ్ ఎవరి హృదయాన్నైతే ప్రేమతో తన హృదయంతో చూస్తారో వారంతా ఈశ్వరీయప్రకాశంతో ప్రకాశిస్తారు. ప్రసాదించబోవు ఈశ్వరీయస్థితికి అనుగుణంగా వారి హృదయాలను పవిత్రదశకు చేరుస్తారు. ఇంతేకాదు. ఈశ్వరీయ క్షేత్రంలో ఎవరి కొరకైనా కొంచెం స్థానం ఇవ్వదలచి "వారి" నుండి అనుకోకుండా (తటాలున) ఆమాటలు వచ్చినా సరే ఆవ్యక్తి హృదయానికి అటువంటి పవిత్ర స్థితి ప్రాప్తించుట ప్రారంభమవుతుంది. నేను చాలా సార్లు నాలోను మరియు అనేకమంది అభ్యాసుల హృదయాల్లోనూ ఈరకమైన

అద్భుతదృశ్యాల్ని చూశాను. ఆధ్యాత్మిక ఉన్నతిని ప్రసాదించే అలౌకిక కార్యంలో "వారి" ప్రాణాహుతిశక్తి ఎదురులేనిది. "వారి"' గ్రహణశక్తి అత్యద్భుతమైనది. పాఠకులు ఈ క్షేత్రపు అనుభూతులను మాటల రూపంలో కూర్చబడిన ఈ చిన్ని పుస్తకమునందు పొందుతారు.

ఈ పుస్తకం వ్రాసే ప్రేరణ నాకెలా లభించింది అన్నదీ ఒక అపూర్వ సంఘటనే! శ్రీ బాబూజీ కృపవల్ల ఒకశ్రేష్టస్థితి యందు నాలో ఆలోచనలు ఒక ప్రవాహం వలె రాసాగాయి. ఆ ఆలోచనా పరంపర నేను ఆపినా ఆగనిది. నాకు వచ్చిన ఆలోచనలను ఒక్కోసారి ఏదోకాగితం మీదా, మరోసారి డైరీలోను, వ్రాస్తూండే దాన్ని. నాయీ పనిని చూసి సోదరుడు గైక్‌వాడ్ ఓరోజున "మీ మనస్సులో ఆలోచనల పరంపర కొనసాగుతుంటే వాటిని మీరొక పుస్తకంగా వ్రాయండి", అన్నాడు. అతడిప్రేరణ వల్ల నేను నా అనుభవాలకు, ఆలోచనలకు పుస్తకరూపం ఇవ్వాలని నిశ్చయించుకున్నాను. ఈ పనిలో నాకు సహాయాన్ని ప్రేరణను అందించిన సత్సంగసోదర సోదరీమణులకు ఎంతో కృతజ్ఞురాలను. ముఖ్యంగా సోదరులు కృష్ణ స్వరూప్‌నిగమ్, పి.సి. శుక్లాగారు, ఎస్.పి. కులశ్రేష్టగారు శోభ, దక్ష్మ, సుష్మ, సోదరి కేసరికి నాప్రత్యేక కృతజ్ఞతలు. వీరందరూ తమ అమూల్యమైన సహకారాన్ని ఈ పుణ్యకార్యంలో నాకందించినందుకుగాను శ్రీ బాబూజీ మహరాజ్ తన ఈ బిడ్డలను తమకృపాశక్తితో పరిపూర్ణులను చేయాలని హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను. బాబూజీ మహారాజ్ ఆ పరిపూర్ణ స్థితిని వీరికి ఇవ్వకుండా ఉండలేని పరిస్థితి ఈ అందరూ పొందాలని ఆకాంక్షిస్తున్నాను.

# 2. లక్ష్యము

ఈ ఆధునికయుగం శాస్త్ర సాంకేతికయుగమని వింటున్నాం. ఈ వైజ్ఞానిక యుగానికి పరిపూర్ణత నివ్వడానికే భగవంతుడు ఆధ్యాత్మిక విజ్ఞానంలో మహిమాన్వితుడైన శ్రీరామచంద్రజీమహరాజ్ (షాజహాన్‌పూర్) ను అవతరింపజేశాడు. శ్రీరామచంద్రజీ మహారాజ్‌ను మనం ప్రేమగా "బాబూజీ ' అని పిలుచుకుంటాం. "ఈ ప్రపంచంలోనికి మహాపురుషులు తమంతటతాముగా రారు. అవసరమైనప్పుడు మాత్రమే వారు ప్రకృతిశక్తిద్వారా పంపబడతారు. అన్న "వారి" మాటలు యదార్థం. శాస్త్రీయ విజ్ఞానంతో పాటు ఆధ్యాత్మిక విజ్ఞానం ఉన్నప్పుడే పరిపూర్ణతచేకూరుతుంది. అందుకే మనబాబూజీ మహారాజ్ సామాన్య ప్రజలకోసం ఆధ్యాత్మిక అధ్యాయాన్ని తేట పరచి వ్యక్తిగత జీవితంలో పూర్ణత్వాన్ని ప్రసాదించడానికి గాను "సహజమార్గాన్ని" అన్వేషించారు. నిజానికి భగవత్ సాక్షాత్కారానికి "సహజమార్గము" ఒక స్వాభావిక మార్గం.

ఆధ్యాత్మిక ఉన్నత స్థితులను ఉన్నవి ఉన్నట్లుగా మానవుల హృదయాలలో పరిపూర్ణంగా అవతరింపజేయడానికి "ప్రాణాహుతి" శక్తిని చేబూని బాబూజీ మన మధ్యకు వచ్చారు. ఆధ్యాత్మిక మార్గంలో సూక్ష్మాతిసూక్ష్మదశలను దృష్టిలో ఉంచుకొని మానవాళినంతా ఆధ్యాత్మికతవైపు మరల్చి ఈశ్వరప్రాప్తిని కలిగించటానికి ఒక సువర్ణ అవకాశాన్ని ప్రసాదించారు. ఆధ్యాత్మికక్షేత్రంలో మానవునికి మార్గదర్శకత్వం చేయగల సాధు పురుషుల కొరత భారతదేశంలో గతంలో లేదు - ఇక ముందూ ఉండబోదు. కాని గృహస్థాశ్రమంలో ఉంటూ కర్తవ్యాలను సక్రమంగా నిర్వహిస్తూ మనం మన మహోన్నత లక్ష్యాన్ని చేరుకోగలిగి నిరంతర శాశ్వతానంద రసాస్వాదాన్ని ఈజన్మలోనే పొందగలిగిన మనఃస్థితిని తమ ప్రాణాహుతి శక్తి ద్వారా మన మనస్సులలో నింపుటకే వారు శ్రీరామ చంద్ర మిషన్‌ను స్థాపించారు.

శ్రీరామచంద్రమిషన్ సహజమార్గ సాధనలో ధ్యానానికి సర్వోన్నత స్థానం ఇచ్చారు. ఈశ్వరీయ స్థితుల ఆనందము నిరంతరం భగవత్‌ధ్యానంలో ఉండడం వల్లనే కలుగుతుంది. అదే ఈ మార్గంలో ప్రత్యక్షంగా చూపబడింది.

ఆధ్యాత్మికతలోని సూక్ష్మాతి సూక్ష్మతత్వము దృష్టిలో ఉంచుకుని ఆధ్యాత్మిక విజ్ఞానమే అన్ని జ్ఞానములకు మూలమని నిరూపించారు. సహజ మార్గం ద్వారా ఆధ్యాత్మిక ఉన్నతికి చెందిన అపారమైన స్థితులు చైతన్యం చెందటం నేను స్వయంగా చూశాను.

బాబూజీ మహరాజ్ యొక్క ప్రాణాహుతి శక్తి ద్వారా అభ్యాసీలందరిలో ఏదో ఒక దశయందు స్వచ్ఛమైన దివ్యప్రకాశం చూడగలం. అంతేకాక మన ఈ సంస్థలోని ప్రతి అభ్యాసీ ఆధ్యాత్మికంగా తాను పురోభివృద్ధి నొందుతున్నానని దృఢంగా చెప్పగలడు కాకపోతే మన లక్ష్యం పూర్తిగా ఈశ్వరప్రాప్తి మాత్రమే అయి ఉండాలి. అప్పుడే ఈశ్వరీయ శక్తిపై ఆధిపత్యం వహించి ఈ ప్రపంచానికి అరుదెంచిన ఆ దివ్యపురుషుని వల్ల సత్ప్రయోజనం పొంది వారిని గౌరవించినట్లవుతుంది. భౌతిక సంబంధమైన లక్ష్యం భౌతికశక్తిపై ఆధిపత్యం పొందిన వారిద్వారా నెరవేరుతుంది. ఈశ్వరీయ శక్తిని (సహాయాన్ని) ఈశ్వర ప్రాప్తికే వినియోగించుకోవాలి. అపుడే మన జీవిత పరమ లక్ష్యం నెరవేరుతుంది.

మానవజీవితానికి ఏదో ఒక లక్ష్యం ఉంటుంది. ఇది వాస్తవం. లక్ష్యం లేని జీవితం అసమగ్రము, అసంపూర్ణము, పశుప్రాయమూ అవుతుంది. ఏ లక్ష్యమూ లేనందువల్లే పశువు పశువుగా వుండిపోయింది. లక్ష్యమే లేనపుడు, దాని గురించిన ఆలోచన ఎందుకు 'స్తుంది. ఆలోచనా శక్తియే లేకుంటే అవి ఎక్కడ నుండి పుట్టుకొస్తాయి. ఆలోచనలు లేని జీవితం జడమైనది. కాని దీనిని పోలిన స్థితే ఆధ్యాత్మిక క్షేత్రంలో ఒక గొప్పస్థితికావచ్చు - కాని ఎప్పుడు? జీవితం యొక్క పరమలక్ష్యాన్ని పొందడానికి పిచ్చివానివలె అంతిమసత్యం వైపు మనం నిరంతరం సాగిపోతున్నప్పుడు!

కనుక ప్రతి మానవుడు జీవితానికి ఒకలక్ష్యాన్ని ఏర్పరచుకుంటాడు. ఆ లక్ష్యం భౌతికమైన ఉన్నతికి కావచ్చు. అనగా మానవుని యొక్క ప్రాపంచిక జీవితాన్ని సుఖవంతంగా, సంపన్నవంతంగా చేయడానికి కావచ్చు. ఇది అవసరం కూడా. ఎందుకంటే ఈ జీవితాన్ని మనం గడపాల్సి ఉంది కనుక. దాన్ని సుఖ సంపదలతోనిలుపుకుంటే అదోతృప్తి. కానీ భౌతికజీవితాన్ని సుఖవంతం చేసుకునే ఏలక్ష్యమైనా చాలా పరిమితమైనది. దీని వల్లనే మన

ఆలోచనా పరంపర సంకుచితమై పరిమితమై పోతుంది. ఒక పరిధిలో పరిమితమై పోయినందువల్ల వాటిలో సంకుచితత్వం అనగా స్వార్థమే ఉంటుంది! స్వచ్ఛత, సూక్ష్మదృష్టి విప్పారవు. అలాంటి వారిలో వికాసం ఉండదు. భౌతికంగా ఒక లక్ష్యాన్ని తీసికొని ప్రారంభించినప్పుడు శరపరంపరలుగా ఉండే బాహ్య ఆకర్షణలవలన అనేక ఇతర లక్ష్యాలు మనముందు ప్రత్యక్షమవుతాయి. ఆ లక్ష్యాల వెంట వెళ్లే ఆలోచనలు పలువిధాలుగా మారిపోతాయి. లక్ష్యాన్ని బట్టి ఆలోచనా విధానం మారిపోతుంది. దీని ఫలితంగా మనం సమతుల్యాన్ని కోల్పోతాము - జీవిత లక్ష్యం దూరమవుతుంది. నీటి ప్రవాహపుధార ఒక్కటే అయితే అది శక్తివంతంగా ఉంటుంది. ప్రవాహం చీలి, వేయిధారలుగా విడిపోతే ఆకర్షణలో చిక్కుకుని విభజింపబడ్డప్పుడు ఏపనినీ పూర్ణశక్తితో లేదా ఏకాగ్రతతో చేయలేము. ఇందువల్ల మన మెదడు (బుద్ధి) యొక్క సమతుల్యతకూడా దెబ్బతింటుంది. మనం శ్రద్ధగా పరిశీలిస్తే ప్రతిజీవి అసంతృప్తితోను, అసంపూర్ణంగాను ఉండడానికి ఇదేకారణమని మనకు తెలుస్తుంది. కవులు, గాయకులు, విజ్ఞానవేత్తలు కేవలం తమ లక్ష్యము నందే నిమగ్నమై ఉంటారనీ తమకు సంబంధించిన ఆ జ్ఞానాన్ని పెంచుకోడానికి ప్రయత్నిస్తూంటారనీ చెప్పవచ్చు. కానీ ఆ జ్ఞానంతోపాటుగా దానికి సంబంధించిన పలు విషయాలపై వారి మనసు మరలుట వలన వారికి తృప్తి లభించదు. ఒక శాస్త్రజ్ఞుడు ఏదేని క్రొత్త విషయాన్ని కనిపెట్టినప్పుడు దానికొక బాహ్యరూపాన్ని ఇచ్చి దాన్ని ఆకర్షణీయంగా చేసే ప్రయత్నంలో అతడి ధ్యాస వేరు వేరు రూపాలవైపు లాగబడుతుంది. దాని పరిణామ ఫలితంగా పొందిన జ్ఞానం ద్వారా అతడు తన గూడులోనే వ్యాపించి ఆగూటిలోని బంధనాల్లో చిక్కుకుని కుంచించుకుపోతాడు. చివరికి ఈ ప్రపంచంనుండి తనువు చాలించవలసి వచ్చినప్పుడు ఆ జ్ఞానాన్ని ప్రపంచానికి అర్పించి తను నిష్క్రమిస్తాడు. బాహ్యసాధనవల్ల అంటే బాహ్య పరికరాలవల్ల లభించిన జ్ఞానం కాబట్టి పలురూపాలుగా బాహ్యంలో వ్యాప్తి చెందుతుంది. అతడు ఈ ప్రపంచంలోని ఒక వస్తువుతో రకరకాల వస్తువులను తయారు చేయడానికి ఈ శరీరాన్ని

ఆధారం చేసికొన్నాడు. కాని ఇప్పుడు ఆ శరీరమే అశాశ్వతము అయిందే! అలాకాక అతడికి మరో రకమైన శరీరం లభించినప్పుడు అతడి అభిరుచి (వేరు) వేరైయున్నచో అతడు ఆవైపుగా ఆస్థాయిలో అభివృద్ధి చెందుతూ తన ఇప్పటి ఈజ్ఞానాన్ని ప్రపంచానికి అర్పించి నిష్క్రమిస్తాడు. దాని ఫలితం ఏమిటంటే - కర్తమాత్రం అతడవుతుండగా భోక్త అంటే అనుభవించేవాడు మాత్రం వేరొకరవుతున్నారు. చంద్రలోకయాత్రకై మార్గాన్ని రూపొందించిన వారు భూమిపైననే ఉండి అదంతా నియంత్రిస్తుండగా అక్కడికి వెళ్లేవారికి మాత్రమే ఆ ఆనందానుభవం కలుగుతోంది. ప్రజలు కేవలం విని లేదా చూచి ఆనందం పొందుతారు.

అయితే ఆధ్యాత్మిక ఉన్నతిలో ధ్యానపులోతుకు వెళ్ళగా మనం ఉన్నతి వైపుకు అంటే లక్ష్యము వైపు సాగుతున్న కొద్దీ మన ఆధారం (బేస్) నశించి పోతూ ఉంటుంది. అందువల్ల మనం వెనకకు తిరిగి చూడలేము.

భౌతిక సుఖాలు బాహ్యానికి సంబంధించినవేకాని అంతరంగానికి సంబంధించినవికావు. బుద్ధిపరమైన విషయాలలో మానవుడు చంద్రుని భౌతికపరంగా చేరినా అతనిలో జీవితం క్షణప్రాయమే నన్న భయం ఉంది. అతడి బంధువులకూ అదే భయం. అనగా ఆశ ఉత్కంఠ, భయాల సమ్మిశ్రిత ప్రయత్నములలో అతడి విజయం దాగి ఉంది. ఇదేవిధంగా కవుల, గాయకుల, సంగీతజ్ఞుల లక్ష్యము వారి వారి రంగాలలో ప్రగతిని సాధించడమే. కాని వారి ప్రగతి పలువిధాలుగా విభజింపబడుతుంది. ఒక సంగీతకారుడు అనేకరాగాలను రకరకాలైన ఆరోహణ, అవరోహణలతో ఆలాపిస్తాడు. దానికి వన్నెతేవడానికిగాను ఆ రాగాలలో మునిగి రాగము, తాళము, లయ అను బంధనాలకై అతడు అనేక వాద్యాల సహాయాన్ని లేదా బంధనాలను స్వీకరిస్తాడు. ఈ బంధనాలు లేకుండా శ్రోతల పరిమిత బుద్ధికి గాని లేదా స్వయంగా ఆ సంగీతజ్ఞునికేగాని తన దక్షత బోధపడదు. అనగా ఒకే లక్ష్యము పలు ప్రవాహాలు (ధారలు) గా విభజింపబడుతోంది. అతడు తన ఆలోచనలను ఆరాగభావనకు అనుకూలంగా మారుస్తాడు. ఇలాగే కవులు, రచయితలు తమతమ ఆలోచనలను వివిధరకాలైన శబ్దాలంకారాలతో బంధించి భావాలను

ఆలోచనల గొలుసులతో గ్రుచ్చి కవిత్వాన్ని, పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు. వినిపించే వారికి వినేవారికి ఇద్దరికీ సంతోషం కలుగుతుంది. అదికొంతకాలం గుర్తుంటుంది. ఆ తర్వాత ఇతర కోరికల, వ్యామోహాల ఆవరణలు దీనిని కప్పివేస్తాయి. చెప్పడం, వినడం దీనితోనే జీవితమంతా గడచిపోతుంది.

వీటన్నిటికి బదులుగా మనం మన జీవిత పరమ లక్ష్యాన్వేషణకై ఆధ్యాత్మిక క్షేత్రం వైపు దృష్టి మరలిస్తే పరమాత్మ తత్వ ప్రకాశం స్వయంగా మన ప్రాణములోనే గమనిస్తాము. దీనితో మన ప్రగతి మూడు పూవులు ఆరుకాయలుగా వెల్లి విరిస్తుంది. ఆ పరమతత్వ పవిత్ర చంద్రకాంతివంటి ప్రకాశం ద్వారా శాంతిరూపమైన శీతల తత్వము అంతటా ప్రాప్తిస్తుంది. మనం పావన ఈశ్వరీయ ప్రవాహమనెడి వెన్నెలలో ఓలలాడుతాము. కాని ఇందుకు భిన్నంగా బాహ్యలక్షణాలున్నవారు కోరికల సుడిగుండంలో చిక్కుకోడం నేను చూశాను. దీనితో అంతరంగము ఆరిపోయి సిస్టము అంటే ఈ శరీర వ్యవస్థ అంతా అలసి సొమ్మసిల్లి నిద్రపోతున్నట్లుంటుంది. కాని అలా ఉన్నట్లు మనకు పైకి తెలీదు. ఎవరైనా ప్రాణాహుతి శక్తితో ఆంతరికచేతనాన్ని తట్టి మేల్కొల్పిఅంతిమలక్ష్యం వైపు మళ్లించినప్పుడు మనకు ఆ స్పృహ కలుగుతుంది. మాతృభూమికి మరలిపోవడానికి, వాస్తవిక స్వచ్ఛతారూపాన్ని పొందడానికి అంతిమలక్ష్యాన్ని చేరడానికి మనసు విలవిలలాడిపోతుంది. అప్పుడు, ఆ సమయంలో మన ముందు ఒకే ఒక ధ్యాస ఉంటుంది. మన సమస్త ఆలోచనల ప్రవాహము ఆదృక్పథంలోనే ప్రవేశిస్తుంది. అంటేమన ఆలోచనలు, మన దృక్పథము, ధ్యాస సమస్తమూ ఆ పరమలక్ష్యములోనికి ప్రవేశిస్తాయి. అనేకాలు అన్నీ ఏకత్వంలో ఇమిడిపోతాయి. శక్తి కూడా అన్ని వైపుల నుండి మరల్చబడి ఒకే లక్ష్య ప్రవాహమునందు ప్రవేశిస్తుంది. దీనికొరకు మనమేమీ కష్టపడనక్కర్లేకుండా దానంతటదే జరుగుతుంది. శ్రమగాని, ఆలోచనా ధాటిగాని, క్రొత్తదనంకోసం ఉత్కంఠగాని ఉండదు. మనలో స్వతహాగానే ఉత్పన్నమయ్యే ఆ అద్భుత అలౌకిక జ్ఞానాన్ని, అనంతశక్తిని చూస్తూ లేదా అనుభవిస్తూ సాక్షులుగా ఉంటాం. అంతేగాని దాని కర్తలంకాము. దీనికి భిన్నంగా విభిన్న ప్రాపంచిక

ఆలోచనలతో శక్తి పీల్చివేయబడిన మానవుడు - బుద్ధిహీనత వలన కొన్నిసార్లు పొంగుతూ మరికొన్ని సార్లు క్రుంగుతూంటాడు ప్రపంచాన్ని తారు మారు చేయగలనని (మార్చేయగలనని) భ్రమలతో ధీమాగా ప్రవర్తిస్తాడు. కాని ప్రకృతి నియమాలననుసరించి జరిగే స్థితులు - గర్భంలో ఉన్నప్పటి పిండంయాతన బాల్యంలోని మాటలు రాని అశక్తతా బాధ, కోరికలతో కూడిన యవ్వనం, ఆపై వృద్ధాప్యపు అసమర్థ అవస్థలను యింతవరకు ఎవరూ తప్పించలేదు - మార్చనూ లేకపోయారు. భౌతిక ఆకర్షణీయత వ్యాపించి ఉన్నచోట అంతటా ప్రజలలో ఈజీవన దశలలోని నిస్సహాయతాస్థితి కూడా ఉంది. అంతటా వ్యాపించి సర్వత్రా నిండియున్న ఆ పరమ లక్ష్యపు స్పృహ మాత్రము కుంచించుకు పోయి మరచిపోబడింది.

మానవ జన్మ యొక్క పరమలక్ష్యము మనకు గుర్తులోనికి వచ్చినప్పుడు దాని ప్రాప్తికై ఉబలాటపడి పలువిధాల యత్నిస్తాం. ఈ రకంగా ఆపరమ లక్ష్యాన్ని బాహ్య పద్ధతుల ద్వారా పొందాలనుకుంటాం. దీని వల్ల లక్ష్యసిద్ధి కాకపోగా లక్ష్యం నుంచి ఇంకా దూరంగా నెట్టివేయబడతాం - అంటే లక్ష్యానికి దగ్గరవడానికి బదులు మరింత దూరం అవుతాం. పరమ లక్ష్యసాధనకై ఎవరినైనా అడిగితే ఏదో ఒక బాహ్య పద్ధతిని ఆచరించమని చెప్పి తమతో అనుబంధం అంటిస్తారు. మరికొందరైతే తమ వాక్చాతుర్యంతో ఓడించి ఆకట్టుకుంటారు. పరిణామ ఫలితంగా ఆ పరమలక్ష్యం గుర్తువచ్చినా అది పొందే మార్గం దొరకలేదు. మరి ఆమార్గం ఎవరు చూపుతారు. ప్రేమతో భక్తితో లయావస్థలో మునిగి "వారి" ధ్యానములో అంటే ఆ పరమలక్ష్యముపై ధ్యానములోనే సదామునిగి ఉండేటట్లు మలచుకొని తాను అను స్పృహ కొంచెము కూడా శేషము లేకుండా నశింపు చేసికొని అంటే తన్ను తానే మరచిపోయి (కోల్పోయి) లక్ష్యమును చేరిన 'వారు' మాత్రమే ఆ లక్ష్యమును చేరే మార్గాన్ని చెప్పగలరు - చూపగలరు. వాస్తవంగా పరమలక్ష్యమైన ఈశ్వరునితో యోగము పొందిన "వారి" కి మాత్రమే ఈశ్వరుని పొందచేయుటకు సులువైన మార్గాలు తెలుస్తాయి. వారే అభ్యాసి లక్ష్యమును చేరుటలో జాప్యమునకు కారణమైన అడ్డంకులను తమయోగశక్తితో శాశ్వతంగా

తొలగించి నిర్మలీకరించుతారు. ఇటువంటి సద్గురువే మనకు మార్గదర్శకుడై మనల్ని మన పరమ లక్ష్యానికి చేర్చడానికి సమర్థుడై ఉంటాడు. సహజమార్గ సాధన ద్వారా నా అనుభవాలను బట్టి ఈ విషయాలు చెప్పగలను. సరళమైన సహజ మార్గం మనకు తెలిపేదేమంటే ధ్యానము ప్రాపంచికముగా వ్యాపించిన మన మనోవృత్తులను అంటే ఆలోచనలను ఏకీకృతము చేసి అంతరమును లక్ష్యము వైపుకు తీసుకుని వెళుతుంది. బాబూజీ ఒకసారి ఏమన్నారంటే - "మనం మన హృదయాన్ని ఇతర విషయాలతో ఐక్యంచేసి అసలు దానితో ఐక్యతను కోల్పోయాము" అని. కాన హృదయమందు లక్ష్యము మీదే ధ్యానాన్ని కేంద్రీకరించి ఆ ధ్యానము ద్వారా లక్ష్యముతో ఐక్యతచెంది అక్కడే "వారి"ని పొందవచ్చు. హృదయానికి అంటిన మానసిక వేదన గీకితే పోదు. బుద్ధిచాతుర్యపు గారడితోనూ తొలగిపోదు.

మనసులో మనసుకు ప్రియమైన వాడున్నాడు. కాని చిక్కడం లేదు. (మనసుకు కుదురులేదుకదా) కళ్లల్లో కంటికింపైన వాడున్నాడు. కాని దొరకడం లేదు. (కళ్లు బాహ్యాన్నే చూడ్డం వల్ల అంతర్గత దివ్యసౌందర్యాన్ని దొరకపుచ్చుకోలేవు) ఇదే మరోరకంగా చెప్పాలంటే- మనసులో మనసు యొక్క ప్రేమ ఉంది. కాని ఆ ప్రేమ దానికి లభించదు! కళ్ళల్లో కళ్ళ యొక్క కాంతి ఉంది. కాని ఆ కాంతి కళ్ళకు కనిపించదు. ఎంతటి నిజం ఇది!

సమర్థ సద్గురు శ్రీబాబూజీ మహరాజ్ యొక్క ప్రాణాహుతి శక్తి లభించగానే పరమలక్ష్యపు చెంత చేరాలనే వేదన ఆంతరిక మనసులో రగిలి బాహ్య దృష్టిఅంతా మరలి సమీకృతమై (ఏకమై) ఆపరమలక్ష్యముతో కలసిపోవనారంభిస్తుంది. దానికి సంబంధించినవే అయిన బుద్ధి, ఆలోచనలు అన్నీ కూడా బాహ్యమునుండి మరలి ఆంతరిక లక్ష్యమువైపు చొచ్చుకొని పోతాయి. లక్ష్యముతో ఐక్యమవడానికి సదా ధ్యానములో లయమై ఉండడమే ముఖ్యమని బాబూజీ చెబుతారు. సహజమార్గము ద్వారా తమలక్ష్యాన్ని చేరిన అభ్యాసులే ఇందుకు నిదర్శనం. ఇది అందరికి లభిస్తుంది. మనం దేనినయినా పొందాలనుకుంటే దాని ధ్యానంలో మునిగి ఉండటం కంటే వేరే గొప్ప సాధన అంటూ ఏదీలేదు. అంతిమ సత్యమనే లక్ష్యాన్ని చేరుకోడానికి

ప్రాణాహుతి శక్తి సహాయం ఎల్లప్పుడూ లభిస్తుంది. అటువంటి సాధనే త్వరిత ఫలితాన్ని ఇస్తుంది. నిజమైన సాధనకుగుర్తు అందులో - ధ్యానంలో గాఢంగా నిమగ్నమై ఉండడమే. వాస్తవమైన సాధనను స్వీరించినంతనే అంతరంగంలో కూడుకుని ఉన్న జన్మ జన్మాంతర సంస్కారపు పొరలు పలుచబడి క్రమంగా తొలగిపోనారంభిస్తాయి. వాటినీడ కూడా మన అంతరంగాన్ని మలిన పరచలేదు.మన లక్ష్యము దివ్యమైనదైన కారణంగా ఈశ్వరీయ ప్రకాశ సంయోగము పొంది మన వ్యక్తిత్వము పవిత్రము, సర్వప్రియము, ప్రతిభావంతమూ అవుతుంది. ఇటువంటి అభ్యాసి ఎక్కడికి వెళ్లితే అక్కడ ప్రజలలో పవిత్రత, శాంతి కలిగి పరమలక్ష్యమువైపుకు వెళ్లాలన్న కోరిక జాగృతమవుతుంది. ప్రాణాహుతి శక్తి ద్వారా పరమలక్ష్యమునకై మేల్కొలపబడి దివ్యానుభవాన్ని పొందిన మానవుడు అంతటా దివ్య జాగరణాన్నే (ప్రేరణను) వ్యాపింపచేస్తాడు. ఇది ధృవ సత్యము. పరమ లక్ష్యపు స్వచ్ఛతా భావన కలిగినంతనే మన వ్యక్తిత్వం ఉజ్వలమై ప్రకాశమానమై నిండుతనం సంతరించుకొన్న అనుభూతితో అంతరంగం పులకరిస్తుంది. ఇటువంటి మహానీయుడు ఈ ప్రపంచంలోనే ఉంటూ దానిని దివ్యప్రకాశంతో శోభింపజేస్తూ వుంటాడు. ఈ ప్రపంచంనుండి వెడలిపోవునపుడు పరమలక్ష్యముతో ఐక్యమైన దివ్యత్వాన్ని, పూర్ణత్వాన్ని తనతో తీసికొని వెళతాడు. ఈ ప్రపంచం కొరకు అతడు తన దివ్య ప్రసారాన్ని - దివ్య వ్యాపకత్వాన్ని ఇక్కడే వదలిపెట్టాడు. ఈ దివ్య ప్రసారమే మానవునిలో అతనికి తెలియకనే దివ్యత్వపు జాగృతీ సందేశంగా మారి అతనిలో నిద్రాణమైయున్న వివేకాన్ని యుగయుగాల పర్యంతము జాగృతము చేస్తూనే ఉంటుంది.

ఈ ప్రపంచంలో మానవునికిగల స్నేహ సంబంధాలు, సంయోగ వియోగాలలో అతడికి తెలియకనే ఏదో కొంత స్వార్థం చోటుచేసుకుంటుంది. కాని ఈశ్వరీయత్వములో ఐక్యము నొందాలనెడి లక్ష్యమును స్వీకరించినపుడు ఆస్వార్థం ఎపుడు ఎలా శాశ్వతంగా వెడలిపోతుందోకూడా మనకు తెలియదు.

మనం మన "స్వగృహానికి" తిరిగి వెళతాము. ఎవరికో ఇవ్వాల్సినదిగాని ఎవరి దగ్గరినుండో రావాల్సింది తీసికోవాలనిగాని, మనకిది ప్రాప్తించింది అన్న జ్ఞాపకాలుగాని ఏమీ ఉండవు. జరిగిపోయిన వాటి గుర్తులూ, రాబోయే వాటి గురించిన ఆలోచనలు ఏవీ ఉండవు. పుట్టుట, గిట్టుట అనే భ్రాంతీ లేదు. మన పుట్టుకతో ఏవిధంగా ఏమీలేని ఫకీరుగా వచ్చామో అదే విధంగా వీడ్కోలు తీసుకుంటాము. అంతటావ్యాపించిన సమతుల్యమైన నిరంతర ఈశ్వరీయ ధార తనకు తానుగా మనలో ప్రవహించడం గ్రహిస్తాము. దీనివల్ల చిన్న, పెద్ద - ఉచ్ఛము, నీచము వంటి భేదభావాలు లేని విశ్వబంధుత్వము మనలో జాగృతమవుతుంది. బంగారు, మట్టి రెండూ ఒకలాగే అని పిస్తాయి. ప్రపంచమందలి వస్తువులను లేదా సుఖాలను అనుభవిస్తున్నా అది గురుకృపవల్ల అంతరంగాన్ని తాకదు. బాబూజీ మహారాజ్ ఓసారి నాకిలా వ్రాశారు "ఇట్టి ఫకీరీ స్థితి ముందు కోటి కోటి సామ్రాజ్యాలు కూడా దిగదుడుపే!"అని. ఈ స్థాయికి చెందిన ఫకీరు ద్వారా మనం మానవజీవితానికి పరమలక్ష్యమైన ఈశ్వర ప్రాప్తిని కోరుకున్నా, మానవుని అంతిమసత్యపు స్థితిని స్వచ్ఛంగా తనలోపొందాలనుకున్నా, వారు తమ ప్రాణాహుతి ద్వారా, మన కొరకు వారు లూటీచేయు ఈశ్వరీయ సంపద చాలా అమోఘమైనదిగా వుంటుంది. పరమ లక్ష్యప్రాప్తి కొరకు ఎవరైనా తమ కోర్కెను 'వారి' యొక్క కోరిక లేదా సంకల్పంతో కలిపి ముడిపెట్టి నట్లైతే అప్పుడు మనకు యివ్వాలను 'వారి' కోర్కెకూడా 'వారి'ని వ్యాకులపరచిన స్థితి చూడదగిందిగా వుంటుంది. అటువంటి సందర్భంలో, అభ్యాసి యొక్క ఆంతరికము (అంతరంగం) ఇంకా తీసుకురా ఇంకాతీసుకురా అని ఆలాపిస్తూ వుంటే ఆ 'ఇంకాతీసుకురా' అనేటటువంటి ధ్వని వారి యొక్క ఇంకా యివ్వు, ఇంకా యివ్వు,అనునట్టి దివ్య ఉత్కంఠ 'వారు' గా పొందుతూ వున్నట్లు నేను చూచాను. శ్రీ బాబూజీ చెప్పినట్లుగానే నిజంగా మనమొక మహారాజును రెండు పైసలిమ్మని అడిగితే వారిని అవమాన పరచినట్లవుతుంది. అలాకాకుండా వారి రాజ్యాన్నే కోరితే అది మన స్థితికి మించినదై వుంటుంది. అందువలన ఇటువంటి కోర్కె

మనం మన "స్వగృహానికి" తిరిగి వెళతాము. ఎవరికో ఇవ్వాల్సినదిగాని ఎవరి దగ్గరినుండో రావాల్సింది తీసికోవాలనిగాని, మనకిది ప్రాప్తించింది అన్న జ్ఞాపకాలుగాని ఏమీ ఉండవు. జరిగిపోయిన వాటి గుర్తులూ, రాబోయే వాటి గురించిన ఆలోచనలు ఏవీ ఉండవు. పుట్టుట, గిట్టుట అనే భ్రాంతీ లేదు. మన పుట్టుకతో ఏవిధంగా ఏమీలేని ఫకీరుగా వచ్చామో అదే విధంగా వీడ్కోలు తీసుకుంటాము. అంతటావ్యాపించిన సమతుల్యమైన నిరంతర ఈశ్వరీయ ధార తనకు తానుగా మనలో ప్రవహించడం గ్రహిస్తాము. దీనివల్ల చిన్న, పెద్ద - ఉచ్ఛము, నీచము వంటి భేదభావాలు లేని విశ్వబంధుత్వము మనలో జాగృతమవుతుంది. బంగారు, మట్టి రెండూ ఒకలాగే అని పిస్తాయి. ప్రపంచమందలి వస్తువులను లేదా సుఖాలను అనుభవిస్తున్నా అది గురుకృపవల్ల అంతరంగాన్ని తాకదు. బాబూజీ మహారాజ్ ఓసారి నాకిలా వ్రాశారు "ఇట్టి ఫకీరీ స్థితి ముందు కోటి కోటి సామ్రాజ్యాలు కూడా దిగదుడుపే!"అని. ఈ స్థాయికి చెందిన ఫకీరు ద్వారా మనం మానవజీవితానికి పరమలక్ష్యమైన ఈశ్వర ప్రాప్తిని కోరుకున్నా, మానవుని అంతిమసత్యపు స్థితిని స్వచ్ఛంగా తనలోపొందాలనుకున్నా, వారు తమ ప్రాణాహుతి ద్వారా, మన కొరకు వారు లూటీచేయు ఈశ్వరీయ సంపద చాలా అమోఘమైనదిగా వుంటుంది. పరమ లక్ష్యప్రాప్తి కొరకు ఎవరైనా తమ కోర్కెను 'వారి' యొక్క కోరిక లేదా సంకల్పంతో కలిపి ముడిపెట్టి నట్లైతే అప్పుడు మనకు యివ్వాలను 'వారి' కోర్కెకూడా 'వారి'ని వ్యాకులపరచిన స్థితి చూడదగిందిగా వుంటుంది. అటువంటి సందర్భంలో, అభ్యాసి యొక్క ఆంతరికము (అంతరంగం) ఇంకా తీసుకురా ఇంకాతీసుకురా అని ఆలాపిస్తూ వుంటే ఆ 'ఇంకాతీసుకురా' అనేటటువంటి ధ్వని వారి యొక్క ఇంకా యివ్వు, ఇంకా యివ్వు,అనునట్టి దివ్య ఉత్కంఠ 'వారు' గా పొందుతూ వున్నట్లు నేను చూచాను. శ్రీ బాబూజీ చెప్పినట్లుగానే నిజంగా మనమొక మహారాజును రెండు పైసలిమ్మని అడిగితే వారిని అవమాన పరచినట్లవుతుంది. అలాకాకుండా వారి రాజ్యాన్నే కోరితే అది మన స్థితికి మించినదై వుంటుంది. అందువలన ఇటువంటి కోర్కె

కోరేవారికి ఎవరి నుంచైనా ఏమీ లభించదు. ఆధ్యాత్మిక క్షేత్రంలో ఈదులాడు ఫకీరును ప్రాపంచిక మహిమలు చూపమని అడిగితే, పాపం తన సర్వస్వమూ దోచుకోబడి ఏమీ లేనివాడుగా, దీనికి ఏమని చెప్పగలడు. శ్రీ బాబూజీ నాకొకసారి ఇలా వ్రాశారు. 'బిటియా! మనం మహిమలకు అతీతంగా పైకి ఎదిగి వున్నపుడే ఈశ్వరద్వారం మనకు అందుబాటులో వుంటుంది. అంతిమసత్యంతో యోగం చెందిన ఫకీరు లేదా యోగి ద్వారా దివ్యమహిమలు వాటంతట అవే వెలువడుతూ వుంటాయి. కాని పాపం అతడేమి (చమత్కారములు) మహిమలు చూపగల్గుతాడు!

అందువలన మొట్టమొదట మనం లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి, ఆపిమ్మట దానిని పొందడంకోసం ధ్యానంలో లయలీనం కావలసివుంటుంది. అప్పుడే అది మనకు తప్పని సరిగా లభిస్తుంది. మోసపోయి, చీకూ చింతలతో ప్రతి గుమ్మం ముందూ వున్న బూడిద పులుముకుంటే వచ్చే లాభమేమిటంటాను నేను? మహత్ లక్ష్యం యొక్క అన్వేషణలో దివ్య ఫకీరుగా మారితే మానవజీవితం యొక్క లక్ష్యం నెరవేరుతుంది. అటువంటి ఫకీరు సమస్త ప్రాణులకు దివ్యత్వాన్ని ప్రసాదించుతాడు. ఈ ప్రపంచం నుంచి అతనికి కావలసినదేదీ లేదు. అందులోనే వారి గొప్పదనం ఉంది. కనుక కోరదలచుకుంటే వారినే కోరుకో, అందునా జీవిత పరమ లక్ష్యాన్నే కోరుకో! ఈ విధంగా చేస్తే మానవ జీవితం ధన్యమవుతుంది కూడ.

# 3. లక్ష్య సార్థకత

మనం గడుపుతున్న జీవితానికి రెండు ముఖాలు వుంటాయని నా కనిపిస్తోంది. ఇందులో ఒకటి విషయము అయితే రెండవది లక్ష్యము. విషయమనేది భౌతికత్వానికి సంబంధించిన మనం గడుపుతున్న బాహ్య జీవనమౌతుంది. ప్రపంచంలో సుఖజీవనం గడపాలనే తలంపుతోనే విషయం నిర్ణయించుకోబడుతుంది. అందువలన దానికి కర్త, భోక్త అనగా చేసేది, అనుభవించేదీ కూడా శరీరమే అవుతుంది. విషయాలు అనేకంగా వుంటాయి. వాటికి సమాధానాలు కూడా వాటిననుసరించి రకరకాలుగా వుంటాయి. ఈ రకరకాల విధానాలే నిజానికి మనకు సమస్యలుగా తలెత్తుతాయి. కుమార్తె వివాహం అనేది ఒక విషయమైతే, దానికి సంబంధించిన సమస్యలు, వాటి పరిష్కార పద్ధతులు లేదా మార్గాలు అనేకంగా వుంటాయి. ఇప్పుడొక విషయం ముగిస్తే మరొక విషయం ముందుకొస్తుంది. మన విషయాలతో పాటు అనేకమైన కోర్కెలు జతకూడి మన ఆలోచనా ప్రవాహాన్ని అనేక దిశల్లో చెదరగొట్తాయి. అందువల్ల విషయాలు అశాశ్వతమైనవిగాను, పరిమితమైనవి గాను వుంటాయి. విషయాలు మనస్సు లేదా మెదడు వరకే సంబంధించి, పరిమితంగా వుంటాయి. ఈ కారణం చేతనే ప్రతి ఒక్కరి ఆలోచనా ధోరణి మరొకరి ఆలోచనా సరళితో చాలావరకు ఏకీభవించక పోయినందువల్ల, ఒక విధమైన అవరోధమేర్పడుతుంది. భౌతిక విషయాలలో బుద్ధిపరమైన ఆనందం, వ్యాకులత మన శక్తిని క్షీణింపజేస్తాయని నాకనుభవ మైంది. ఇందువల్ల ఒక విధమైన సంకుచితత్వము, నిలకడలేని తనము అజ్ఞాతంగా మన ఆలోచనల్లో మిళితమై వుంటాయి. ఈ విధంగా ఒక విషయం లో ఇంకొక విషయానికి సంబంధించిన బంధనాలు పెనవేసుకుని వుంటాయి.

మన లక్ష్యం ఈశ్వర ప్రాప్తికి చెందినది కనుక సార్థకమైనదవుతుంది. జీవితానికి శ్రేష్టమైన లక్ష్యాన్ని ఎన్నుకోవటం మీదనే మానవోన్నతి యొక్క ఉన్నత శిఖరం ఆధారపడి వుంటుంది. లక్ష్యమనేది జీవితాన్ని మహిమాన్వితం చేసేదిగా అనగా ఆత్మసాక్షాత్కారం కల్గించేదై వుంటుంది. అందువల్ల అది అంతరికమైనదై అందులో మనం వ్యాపిస్తూ, వికాసం చెందుతూ వుంటాము. పరమానంద ప్రాప్తి కోసం, శాశ్వత శాంతిని పదిలపర్చుకోవటం కోసం, అలాగే అహం యొక్క పరిమిత బంధనాల నుంచి విముక్తి పొందటానికి

మహనీయులు ఏదో విషయాన్ని ఎంచుకోకుండా జీవితం యొక్క పరమ లక్ష్యాన్ని మాత్రమే ఎల్లప్పుడూ ఎంచుకున్నారు. ఈశ్వర ప్రాప్తి అను లక్ష్యము అనంతానికి చెందినది. అందుచేత ఆ లక్ష్యము ఈశ్వర ప్రాప్తిదైనందువల్ల, దాని ఆఖరి హద్దైన అనంతానికి మనం కూడా చేరవలసి వుంది. లక్ష్యం ఈశ్వరునితో సంబంధం కల్గి వుంది, ఆ ఈశ్వరుడు ఒక్కడే. అందువల్ల లక్ష్యం కూడా ఒక్కటే అవుతుంది. శ్రేష్ఠమైన ఒకే పరమ లక్ష్యాన్ని తలపెట్టినందువల్ల మన ఆలోచనకు ఒకే ఒక ప్రవాహం (ధార) వుంటుంది. దీని ఫలితంగా శక్తి క్షీణించడానికి బదులు మనం ఆంతరికంగా శక్తి సంపన్నులమవుతాం. దీనికి కర్తగాని, భోక్తగాని దేహం కాకుండా మన అంతరంగం అనగా ఆత్మ అవుతుంది. అందువల్ల ఇది శాశ్వతమై, హద్దే లేనిదిగా వుంటుంది. అందుచేత మనకు ఏ సమస్య అంటూ ఉండకపోగా ఈశ్వర సాక్షాత్కారమనండి లేదా మన స్వస్థానానికి తిరుగు ప్రయాణం - కాని త్వరగా జరిగిపోతాయి.

నిజానికి, మన హృదయంలో మన జీవిత లక్ష్య సంబంధం ముడిపడివుంటుంది. మరి మన అల్ప హృదయం ఆ మహత్ హృదయంతో సంబంధం కల్గి వుంటుంది. అందుచేత మనమెప్పుడైతే సాక్షాత్కారమను లక్ష్యంతో హృదయంలో ధ్యానం ద్వారా ప్రవేశం పొందుతామో అప్పుడు తప్పనిసరిగా ఒకనాడు ధ్యాన ధార ద్వారా ఆ మహత్ హృదయం అనగా విరాట్ హృదయంలో స్థానం పొందుతాం. అక్కడ నుండే ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తూ లక్ష్యం యొక్క సామీప్యతానుభవం చెందుతూ వుంటాము. విరాట్ హృదయంలో విస్తరిల్లిన మనం, మనకు 'మనము' అని అనుభవిస్తున్న పరిమితి నుంచి ఇప్పుడు ఒక అద్వితీయమైన స్వేచ్ఛలాంటిది పొందుతూ వుంటాము. ధ్యానం ద్వారా లక్ష్యంలో ప్రవేశం పొందినపుడు, అది దృష్టిలోనికి రాగానే మన అంతరంగంలో దివ్యశక్తి చోటు చేసుకుంటూ వుంటుంది. ఇప్పుడు లక్ష్యం పరమాత్మలో చేరి శక్తి సంపన్నమూ, శాశ్వతం కావటమే దీనికి కారణమవుతుంది. మన ఆలోచనా స్రవంతి కేవలం ఆ లక్ష్యంతోనే ఏకత్రితం (ఒక్కటిగా) కావటం వల్ల సమత్వంలో వ్యాపిస్తూ వుంటుంది. దాని ప్రభావం వల్ల మన ఆలోచనా ధార మరి దేనితోనూ ఢీ కొనదు. అన్నింటిలోనూ కలిసిపోతూ వుంటుంది. మన సర్వస్వమూ లక్ష్యానికే సమర్పితమై వుంటుంది. అందువల్ల బాహ్య జీవనంలో కూడా మాటల్లోను, నడవడిలోను మన ఆంతరిక దివ్యత్వం యొక్క ప్రకాశం ఎంతో కొంత పొడసూపుతూనే వుంటుంది.

మన మనోవృత్తి గమ్యం లేదా లక్ష్యం మీద నిలిచి వున్నట్లైతే ఈ ప్రపంచంలో మన జీవితం స్వాభావికంగానే వైరాగ్యవంతమవుతుంది. ఏ లక్ష్యం నుంచి అయితే మానవుడికి పుట్టుక కల్గిందో ఆ లక్ష్యాన్ని పొందటమే మానవ జీవితానికి నిజమైన లక్ష్యం కాగలదు. ఎక్కడ నుండీ అనగా ఏ గమ్యం నుంచీ అయితే మానవ జీవితానికి అంకురార్పణ జరిగిందో అక్కడికి తిరిగి చేరటంలోనే అతని దివ్యత్వము, దివ్యలక్ష్యమూ వున్నాయి.

ఏ భౌతిక సంకల్పాన్ని నెరవేర్చుకోవాలన్నా అందుకు తగిన ఆలోచన గాని, పనిగాని స్వయంగానే చేయవలసి వుంటుంది. పని జరిగిన తర్వాత దానికి ప్రతిక్రియను కూడా మనం ఎదుర్కోవలసి వుంటుంది. కాని మన సంకల్పం ఉత్తమమైనదిగాను, లక్ష్యం (దైవం) యొక్క సాక్షాత్కారం కోసమైనపుడు, మనం చేసిన పనుల వల్ల వాటి గుర్తు లేదా సంస్కారాలు మన అంతరంగంలో మొదట స్వల్పంగా పడినప్పటికీ తర్వాత పోనుపోను అవి ఏర్పడటం ఆగిపోతుంది. ఇలా సంస్కారాలు ఏర్పడటం నిలిచిపోయిన తర్వాత మన అంతరంగంలో వృద్ధి చెందుతూ వున్నటువంటి ధ్యానం యొక్క ప్రతిబింబం వంటి దాని వల్ల జన్మ జన్మాంతరములలో మన సూక్ష్మ శరీరం మీద ఏర్పడిన సంస్కారాలు కూడా నశించిపోనారంభమవుతుంది. ఇది ఎంత త్వరగా జరుగుతుందంటే, మన సంస్కారాలు మనల్ని వీడిపోతున్నట్లూ, దివ్యత్వం మనలో వ్యాపిస్తున్నట్లూ మనం స్వయంగా చూడగల్గుతాం. ఇటువంటి దివ్య - అవస్థ నా కనుభవమైనపుడు నేను బాబూజీకి ఇలా వ్రాసినట్లు బాగా జ్ఞాపకం వుంది - "నా సంస్కారాలు నన్నొదిలి, నేనడ్డు కుంటున్నా కూడా మీ వైపుకే పోతున్నాయి" అని. దానికి వారి సమాధానం ఎంత సాటిలేనిదిగా, మహనీయంగా వుందో చూడండి. - "లయ అవస్థ అధికంగా జరుగుతున్నపుడు, అనగా మాలిక్ (దైవం) సూక్ష్మంలో కూడా వ్యాపిస్తున్నపుడు, సంస్కారాలు శుభ్రపడవలసే వుంటుంది." ప్రకృతి సిద్ధంగా అవి శుద్ధి చెందాలంటే చాలా సమయం పట్టుతుంది. కాని అభ్యాసి యొక్క లయావస్థ క్షణకాలమైనా ఆగి వుండలేదు కనుక సంస్కారాలు అభ్యాసిని వదిలి గురువును చేరతాయి. ఇది ప్రకృతి నియమం కూడా. అభ్యాసిని దివ్యత్వంలో ముంచు భారము గురువుదే. "ఇప్పుడు నీవు చింతించవద్దు. ఈ సంస్కారాలను నా ఇచ్ఛాశక్తితో నాశనం చేస్తాను లేదా నేను (భోగం)

స్వీకరించి వాటిని వెంటనే సమాప్తం చేస్తాను. ఇది నా బాధ్యత.'' అని వ్రాశారు. ఈ స్థాయికి చేరాక మరుజన్మ ఎత్తుటకు గల సంస్కారాలు సమాప్తమవుతాయి. ఇప్పుడింక సద్గురువు ద్వారా లయావస్థ దివ్యం అనగా సూక్ష్మము అగుట ప్రారంభమవుతుంది.

లక్ష్య ప్రాప్తి అనేది మన ఉద్దేశ్యమైనందున మన కర్మల యొక్క ప్రతిక్రియా రూపమైన భోగం ఏర్పడదు. లక్ష్య ప్రాప్తికి అవసరమైన జ్ఞానము, భక్తి, లయ అవస్థ వంటివి వాటికవే మనలో వికసిస్తూ వుంటాయి. మన జీవిత లక్ష్యము శ్రేష్టమైనది కావటం వల్ల మన గతి (నడక) సూక్ష్మత్వం వైపు కొనసాగుతూ వుంటుంది. విరాట్‌లో అనగా బ్రహ్మాండంలో మన వ్యాప్తి జరుగుతూ వుంటుంది. ప్రపంచంలో జరిగే సంఘటనలన్నీ మొట్టమొదట ఈ బ్రహ్మాండంలో జరిగి ఆ తర్వాత మన ప్రపంచంలో జరుగుతాయని నేను ఇక్కడ గ్రహించాను. "శ్రీకృష్ణ భగవానుడు అర్జునునకు ఈ విరాట్ (బ్రహ్మాండము) దశనే చూపించాడు. "కౌరవులు మరణించారు. నీవు మాత్రం నిమిత్తమాత్రుడవు కమ్ము అని శ్రీకృష్ణుడు చెప్పాడు'' అని ఈ దశ గురించి బాబూజీ నాకు వ్రాశారు. ఇక్కడ నాకు అనుభవమైన ఒక విశేషమేమిటంటే, ఏ సూక్ష్మ దశనైతే చూపించవలసి వుందో, అటువంటి సూక్ష్మ దృష్టి లేకుండా అక్కడున్న స్థితిని అనుభవించటం దుర్లభమనిపించింది. అందువల్ల సూక్ష్మము, తదనురూపమైన దృష్టి లేదా దివ్యదృష్టి కల్గి వుండటం అవసరం. ఏ అభ్యాసికైనా అటువంటి దశను లేదా మరేదైనా అలౌకికమైన దివ్యగతిని చూపించటం కోసం, బాబూజీ తమ ఇచ్ఛాశక్తి ద్వారా దానిని వ్యాపింపజేస్తారు. అభ్యాసీలో కూడా తదనురూపమైన దృష్టిని ప్రవేశపెట్టి అపుడు తమ ఇచ్ఛాశక్తి ద్వారా దర్శింపజేస్తారు. అయితే ఆ విరాట్ దృశ్యాన్ని తొలగించిన వెంటనే అభ్యాసికి ఆ గతి మరియు దృష్టి రెండూ కూడా అదృశ్యమైపోతాయి. కాని ఈ విషయానికి సంబంధించిన నా స్వానుభవం ప్రకారం, మనం ఆ దివ్య సద్గురువు యొక్క పవిత్ర ప్రాణాహుతి శక్తి ద్వారా ఆ స్థితిలో ప్రవేశించి మళ్ళీ వ్యాప్తితో పాటు లయం కావటం ప్రారంభించినపుడు ఆ విరాట్ పరమ స్థితి మన స్వంతమైపోయి, మనలో ఒక భాగంగా తయారైపోతుంది. కాని లక్ష్య ప్రాప్తికై మనము వ్యాకులత పడుతున్నందువల్ల మనం దానిని అంటిపెట్టుకునే వీలు లేదు. అందుచేత విరాట్ యొక్క పరమ స్థితిని పొంది యుండి కూడా, మనం వైరాగ్యంతో ముందున్న ఆధ్యాత్మిక క్షేత్రంలోకి సాగిపోతాము.

ఈశ్వరప్రాప్తి అను శ్రేష్ట లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని మననం చేయగానే ధ్యాన స్థితి కల్గుతుంది. అంతేగాని భౌతికమైన ఏ లక్ష్యము మీద మననం చేసినా ధ్యాన స్థితి ఎన్నటికీ కలగదు. ఆ భౌతిక విషయం మీద ఆలోచన మొదలై పరిమిత హద్దు కారణము వల్ల ఆ ఆలోచనలు కూడా తప్పొప్పులుతో కూడిన అనేక ధారలుగా తయారైపోతాయి.

వాస్తవానికి - బంధనానికి గాని విముక్తికి గాని ఆలోచనయే మూలాధారమవుతుంది. అందువల్ల మన ఆలోచనలు మరియు మన (దృష్టి) 'దాని' మీద అనగా ఈశ్వరప్రాప్తి మీద కేంద్రీకరించబడి, హృదయం మాటి మాటికీ దానిని మననం చేయసాగుతుంది. అప్పుడు ప్రతి ఆలోచనా లక్ష్య ప్రాప్తికి తగిన ఆలోచనలను మాత్రమే కల్గించి లక్ష్య సాధనకు సహాయపడుతాయి. ఆలోచనల యొక్క ఆశ్చర్యకరమైన విధానం నేను స్వయంగా చూచినదేమంటే మెదడులో ఏదైనా విషయం స్ఫురించగానే దానికి అనుకూలమైన ఆలోచనలే మొదలవుతాయి. మాట వరుసకి మనకెవరి మీదైనా ఈర్ష్య వుందనుకోండి. అప్పుడు ఆలోచనకు ఆధారం ఈర్ష్య కావడం చేత, ఉత్పన్నమయ్యే ఆలోచనలన్నీ వాటికి ఆధార భూతమైన దానికి తగ్గట్టుగా ఈర్ష్యాపూరితంగానే వుంటాయి. దీనివల్ల కలిగే నష్టం ఎలా వుంటుందంటే ఈర్ష్య అనే ఆధారం ఇంకా దృఢమవుతుంది. ఇప్పుడు దీనికి ప్రతిక్రియగా కల్గే భావనలన్నీ ప్రతీకారమయంగా వుంటాయి. ఇప్పుడు ప్రతీకార భావపు ఆలోచన రాగానే మళ్ళీ ఆలోచనలు దానికి తగ్గట్టుగానే తిరిగి ప్రతీకారపు ఆలోచనలు పుట్టుతూ వుంటాయి. ఇది మనం కల్పించుకున్న ఆధారం కావటం చేత, అశాశ్వతమైనది. ఒక సంస్కారము అనుభవించిన తర్వాత అది మరొక సంస్కారం ఏర్పరస్తుంది.

గట్టిగా చెప్పాలంటే మానవ జీవన లక్ష్యమునకు మూలాధారము ఈశ్వర ప్రాప్తి అనేదే అయి వుండాలి. శ్రేష్ట లక్ష్యం మీద మన దృష్టి స్థిరమైనప్పుడు ఇతర ఆధారాలు ఏర్పడవని నేను చెప్పగలను. ఏర్పడిన మార్గం చెరగిపోదు. ఆలోచనా వైరుధ్యం ఉండదు. ఆ ఆలోచన తలపెట్టినా తలెత్తక పోవటం నేను పరికించాను. గందరగోళం, అశాంతి పూర్తిగా శాంతించి ఒక సామ్యావస్థ వర్ధిల్లి మన అంతటా వ్యాపించసాగుతుంది. ఆలోచనల యొక్క ముఖ్య ఆధారాన్ని మనం సతత స్మరణ ద్వారానే స్పర్శిస్తాం కనుక సతత స్మరణ మహిమాన్వితమైనదని నేను భావిస్తున్నాను. ఇప్పుడింక

ఆలోచనలకు శక్తి సమకూర్చేది మనం కాదు. వాటిని చితగ్గొట్టి చెడగొట్టేదీ మనం కాము. ఆలోచనల ముఖ్య ఆధారము ఆత్మకే సంబంధించి వుంటుంది. అందువలన ఆలోచనలకు అక్కడ నుండియే అదే పావన శక్తి ప్రసారం కావటం ప్రారంభమవుతుంది. అప్పుడు ఆత్మకళ్యాణం (ఆత్మోన్నతి) మార్గంలో ఎదురొచ్చిన బంధనాలు ఖండించబడతాయి.

మనం 'మిషన్' కూ 'మాలిక్' కూ గౌరవ ప్రదమైన వారమని, నిజాయితీ పరులమని చెప్పుకుంటాము. ఇలా చెప్పటంలో, దాని అర్థం మన జీవన విధానంలో ఆ సత్యము లేక నిజాయితీ పరిపూర్ణంగా జాగృతమై వున్నదని కాదు. కాని ఇలా అనటం వల్ల కల్గే మంచి లాభం - ఆలోచనల యొక్క ఆధారం "సత్యము" కావటమే నన్నారు, బాబూజీ. పైన చెప్పిన దానిని బట్టి విశదమయ్యేదేమంటే - హృదయం తన ఆలోచనాధార ద్వారా సత్యత్వం యొక్క ఆ పవిత్ర స్థితితో సంబంధం ఏర్పరచుకుంటుంది. ఆ పవిత్ర స్థితి సత్య ఆత్మ-తత్త్వంతో సంబంధం కల్గి వుంటుంది. ఈ దశలో ప్రవేశించిన మీదట, సత్యత్వం యొక్క స్వచ్ఛతా సారము ముఖవర్చస్సు నుండి స్వయంగా వెల్లడవుతూ వుంటుంది. అందువలన సహజమార్గం ద్వారా ఆత్మిక క్షేత్రం (ఆత్మక్షేత్రం)లో కాలూని, నిరంతరం ముందుకుపోతూ వుండటం వల్ల, ఆధారాలన్నీ వాటికవే స్వయంగా నశింపు కావటం నేను చూచాను. దీని తర్వాత ఎటువంటి ఆధారమూ స్థిరత్వం పొందలేనటువంటి (ఏ ఆలోచనా నిలబడలేని) విశాలమైన మైదానాన్ని చూచాను. దానిమీద ఏ (ఆలోచన)పునాది వేయటానికి సాధ్యం కాదు. అందువల్ల ఈ స్థాయికి చేరాక మనలో ఎటువంటి వ్యర్థ ఆలోచనలు ఎన్నడూ ఉత్పన్నం కానేకావు. ఆలోచనతో గాని, మనతోనైనా గాని ఎట్టి సంబంధమూ లేకుండానే మన ద్వారా పనులన్నీ జరిగిపోతూ వుంటాయి. మన సంబంధం మనతోనే తెగిపోతుంది. అందువల్ల పనులకు ప్రతిక్రియ అనేదే వుండదు. మనద్వారా జరిగేవన్నీ 'వారి' ఇచ్చానుసారంగానే అనగా దివ్యశక్తి ద్వారానే నేరుగా సహజసిద్ధంగా జరిగిపోతూ వుంటాయి. ఈ దశకు చేరినపుడు, భగవద్గీతలో చెప్పబడినట్లు "గుణములు గుణములందు వర్తిల్లును" (వర్తించును - నడచును) అను మాటలు మనలో యదార్థ రూపం దాల్చుతాయి. ఇప్పుడింక మనలో తయారయ్యేదేదీ లేదు, చెడిపోయేదీ వుండదు. మన ఆంతరిక స్థితి ఒకే రీతిగా - సమస్థితి (బాలన్స్‌డ్ స్థితి) నెలకొని వుంటుంది. దీనిని బట్టి,

మనం ఎటువంటి ఆధారాలను కల్పించుకొంటే అటువంటి ఆలోచనలే జనిస్తాయి అనేది ధృవపడుతోంది. అందువలన మొదట, ఆలోచన ద్వారా మనం హృదయంలో ఈశ్వర ప్రాప్తి యొక్క లక్ష్యం అనే ఆధారానికి బలం చేకూర్చి, తర్వాత దానినే ధ్యానంలో వుంచుకునే ప్రయత్నం చేస్తూ వుండటమే మేలు. అని నాకు అనిపిస్తోంది. కనుక ధ్యానాన్ని ఇలా ఇంకా గాఢతరం చేయటమే చాలా ముఖ్యం. మనం సత్య-లక్ష్యమును చేరటానికి ధ్యానమాచరించాము. దానిని సఫలీకృతం చేయటానికి, శ్రీ బాబూజీ యొక్క ప్రాణాహుతి సహాయంతోను, దైవశక్తి వల్లనూ మన ఆంతరికం స్వతహాగానే పరిశుద్ధమవుతూ వుంటుంది. హృదయమెంత స్వచ్ఛంగాను, తేలికైనదిగానూ అవుతూ వుంటుందో, ఉన్నతి నందటానికి రెండింతల శక్తి హృదయంలో సమకూరుతూ వుంటుంది. ఒక దినాన, 'మాలిక్' కృపతో మనం లక్ష్యాధారం (మాలిక్) లోనే లయమవుతూ వుంటే, ఇపుడు ఆధారం లేకపోయినందువల్ల మన లక్ష్యమనే బిందువు మూలాధారంలోనే కలిసిపోవటం నేను ప్రత్యక్షంగా చూచాను. అనగా సింధువులో బిందువు కలిసిపోయినట్లుగా మనమూ కలిసిపోయినట్లు అనుభూతి పొందుతాము. ఇపుడు 'మాలిక్'లో ఆధారము వ్యాపించిపోతూ వుండగా, మాలిక్ పూర్తిగా మనలో లీనమైపోతారు (అనగా మనలో కలిసిపోయి వ్యాప్తి చెందుతూ వుంటారు.) అపుడు ఆ స్థితి బిందువులో సింధువు ఇమిడిపోయినట్లుగా అనిపిస్తుంది. మన అంతటా పరమ లక్ష్యమే వ్యాప్తి చెందుతూ వుంటుంది.

ప్రపంచాన్ని విడిచి అరణ్యంలోకి పారిపోయినంత మాత్రాన జీవిత పరమలక్ష్యం ప్రాప్తించదు. ప్రాపంచిక ఆకర్షణల నుండి విముఖం కావటానికి పూజా పునస్కారాలు, పురాణాలు, గుళ్ళు గోపురాలు వంటి ఆకర్షణలకు గురి అయినందువల్ల కూడా జీవిత పరమ లక్ష్యం సిద్ధించదు. లక్ష్యాన్ని జ్ఞాపకముంచుకొని దాని ధ్యానంలో లయలీనమై యుండుట ద్వారాను, సద్గురు ప్రాణాహుతి శక్తి యొక్క ఆంతరిక సహాయము మరియు ఆంతరిక సత్సంగ ప్రాప్తి ద్వారా మాత్రమే మనం మన జీవిత పరమ లక్ష్యమైన 'ఈశ్వర' సాక్షాత్కారాన్ని పొంది, అందులో లీనమైపోగల్గుతాం. మానవ జీవితపు పరమ లక్ష్యము సర్వులకు పరమానందమును, శాశ్వత శాంతిని చేకూర్చి అనంత శక్తివైపు తీసుకుపోతుంది.

# 4. ధ్యానము

మనం చేసే సాధన ఏదయినా సరే కేవలం ఆ సాధన చేసేంత సేపూ ఈశ్వరుని ధ్యానమునందే లీనమై ఉండాలనీ ఈశ్వరుని యొక్క అస్థిత్వము నందు (భగవంతుడున్నాడన్న) విశ్వాసమును కలిగి ఉండాలనీ యింకా ఆ సమయంలో మన దృష్టిని బాహ్యము నుండి అంతరంగమునకు మరల్చి సాధ్యములో అనగా సాధించవలసిన దానిలో నిమగ్నమవుతాం. అందువలన జీవిత పరమ లక్ష్యమును ధ్యానించుటకు, దానిని గుర్తుంచుకొని స్మరించటానికి తోడ్పడటం కోసమే మనం సాధన చేస్తుంటాము. లక్ష్యంలో నిమగ్నమై వుండటానికి మనం చేసే నిరంతర ధ్యానమే నిజమైన సాధన అవుతుంది. కొంతమంది తమ లక్ష్యమేమిటో తెలుసుకోకుండానే ధ్యానం చేస్తారు. దాని ఫలితమేమిటో గురువుకు గాని, శిష్యునికి గాని తెలియదు.

నేను కొంతమంది అభ్యాసులను ప్రాణాహుతి ద్వారా పూజ (ధ్యానం) చేయించిన తర్వాత "మీరు ధ్యానం శిరస్సుపై చేస్తూ వుంటారా" అని అడిగాను. దానికి బదులుగా వారు 'అవును' అన్నారు. 'అలా మీ అంతట మీరే చేశారా లేక గురువెవరైనా చెప్పారా? అని మళ్ళీ ప్రశ్నించాను. 'గురువు చెప్పారు' అని జవాబిచ్చారు. అపుడు నేను 'మీకెప్పుడైనా శాంతి కల్గిందా' అని అడిగిన దానికి 'లేదు' అని సమాధానమిచ్చారు. అపుడు నేను చెప్పాను - 'మీరు హృదయం మీద ధ్యానం నిలపలేక యారు, నిలపలేరు కూడా. ఎందుకంటే ఏ లక్ష్యము లేకుండా ఏదో ఒక బిందువు మీదగాని, చక్రం మీద గాని ధ్యానాన్ని నిలిపినట్లయితే ఇటువంటి ఫలితమే కల్గుతుంది. ధ్యానం సలపటానికి మీరు ఎంచుకొన్న బిందువో లేక చక్రమో, శక్తి విడుదల స్థానమై వుంటుంది. అందువల్ల మీకు శాంతి అనేది ఎప్పటికీ లభించదు' అని. మరొక కొత్త అభ్యాసితో, ప్రాణాహుతి ద్వారా నేను పూజ ప్రారంభింపజేసినపుడు, అతడు శిరస్సుపై ధ్యానం చేయడం గమనించాను. అప్పుడతని శిరస్సులో అంతటా అత్యంత వెలుగు చూచాను. దానివల్ల ధ్యానంలో కళ్ళుమూసుకు కూర్చోగానే మిరుమిట్లు గొలిపే కాంతి కనబడడంతో కళ్ళు మూసుకొని కూర్చోలేకపోయాడు. తలనొప్పి మొదలైంది. అతడి కళ్ళల్లో అసహనం చూశాను. హృదయం మీద క్షణం కూడా ధ్యానం నిలపలేకపోయాడు. నేను

చెప్పినదంతా నిజమేనని అంగీకరించి - ఆ బాధ నుండి తనను తప్పించమని ప్రార్థించాడు. అసలు విషయం ఏమిటంటే గురువు అతనికి ధ్యానం చేయమని చెప్పాడే కాని - ఆ చక్రము (ఆ స్థానం) శక్తి విడుదల కేంద్రమని అతడికే తెలియదు. అందువల్ల శాంతి లభించుట అసంభవము. ధ్యానము చేస్తూండగా ఆ బిందువు విచ్చుకున్నది. అతనికి దాని ఉపయోగం తెలియదు. అందువలన విడుదలైన తేజస్సును నిగ్రహించుకునే జ్ఞానము అతడికి లేదు. భగవద్గీతలో కృష్ణ భగవానుడు "ఎవరైతే భూతమును పూజిస్తారో వారు భూతమునే పొందుతారు. ఎవరైతే నన్ను పూజిస్తారో వారు నన్ను పొందుతారు' ' - అని చెప్పిన మాటలు బహుశ అతడు మరచిపోయి ఉంటాడు.

ఇలాగే, లక్ష్యం నిర్ణయించుకోకుండా ఏదో బిందువు మీద ధ్యానం చేసే వాళ్ళు శ్రీ బాబూజీ వారి వద్దకు వస్తూ వుంటారు. చాలాసార్లు వారిలో నేను గ్రహించినదేమంటే - వారి చెవుల వినికిడి శక్తి వేణునాదం వినుటకు మాత్రమే పరిమితమై మానసిక స్థిరత్వాన్ని, సంతులనమును వారిలో కోల్పోయి వుండుట చాలాసార్లు నేను చూశాను. ఈశ్వర ప్రాప్తి లక్ష్యములో ఇటువంటి పొరపాటు జరుగుటకు వీలుండదు. హృదయములో ధ్యానము యొక్క శక్తి ఇమిడి వుంది. మనం ఆ శ్రేష్ఠ లక్ష్యము వైపు మన ధ్యానాన్ని మరల్చినపుడు అది మన ఆధ్యాత్మిక వికాసమునకు తోడ్పడుతుంది. సహజ మార్గ సాధనలో మనం మొదట ఉన్నత లక్ష్యాన్ని ఎన్నుకొని దాన్ని పొందడం కోసం హృదయం మీద ధ్యానం చేయటం ప్రారంభిస్తాము. ప్రతి చక్రమునకు హృదయముతో సంబంధం ఉన్నదని నేను అనుభవం ద్వారా తెలుసుకున్నాను. హృదయం మీద ధ్యానం చేస్తూ వుంటే శ్రీ బాబూజీ ద్వారా హృదయానికి ప్రాణాహుతి లభించి అన్ని చక్రములలోను ప్రతి బిందువు మీద వాటిని మేల్కొల్పడానికి స్పందనలు (వైబ్రేషన్స్) ప్రారంభమవుతాయి. ఉన్నత లక్ష్యము ఎదుట ఉన్నందున ఏ శక్తి అయినా కూడా - చక్రాలలో జాగృదావస్థ వచ్చినప్పుడు - వృద్ధి పొందుతూ ఉంటుంది. హృదయం యొక్క శక్తి పూర్తిగా దానంతటదే లక్ష్య ప్రాప్తి వైపుకు తిరిగి ప్రయాణిస్తుంది. ఇందువల్ల మన లక్ష్య ప్రాప్తి మార్గంలో మన ఎదుగుదల దృఢంగాను, శీఘ్రంగాను ఉంటుంది. ఎంతెంతగా జాగృతి అవుతుందో అంతంతగా శక్తి ఒకదాని నుండి మరొకటి రెట్టింపు

అవుతూ ఒక రోజున మన పురోగతి నిరాటంకంగా కొనసాగుతుంది. అంతఃశక్తి అమోఘమవుతుంది. సహజ మార్గ సాధనలో ధ్యానం యొక్క నిగూఢ రహస్యమిదే. ఇది ప్రాణాహుతిలో యోగం పొంది ఈశ్వరుని యొక్క ఆ మహా రహస్యాన్ని మనకు ప్రత్యక్షం గావిస్తూ వుంటుంది. నేను తెలుసుకున్న ఆ ఆంతరిక రహస్యం ఏమంటే ఆ దివ్య రహస్యం దర్శనమై విప్పుకొని మనలో ఇమిడిపోయి మనలను వ్యాపింపచేస్తూ వుంటుంది.

సాధించవలసిన దాని సన్నిధి పొందడానికి శ్రీ బాబూజీ మహరాజ్ ధ్యానముతోనే మన సాధన ప్రారంభింపచేస్తారు. ఇతర సాధనముల ఆసరా - సాయం తీసుకోరు. సాధనములు బాహ్యమైనవి. సాధన హృదయగతమైనది. సాధనములు (బాహ్య వస్తువులు) లక్ష్యం యొక్క ధ్యానము గురించి సంకేతాన్నిస్తాయి. అంటే ఆ వైపు దృష్టి సారింపజేస్తాయి. కాన ధ్యానం మాత్రమే ఆంతరికమైన ఈశ్వరీయ సాధన కాగలదు. సహజ మార్గంలో భగవంతుని పొందుట కొరకు హృదయంలో ఆయన పావన దివ్య ప్రకాశము పై ధ్యానించుట వలన మొదటి రోజు నుండే బాహ్య ప్రపంచం నుండి మరలి అంతర్ముఖుల మగుట ప్రారంభిస్తాము. హృదయంలో ఈశ్వరుని ధ్యానం చేయడంలో ప్రయోజనం కేవలం బాహ్యముఖులమై ఉన్న మనం ఇపుడు అంతర్ ముఖులం కావడమే. దీని వల్ల మనకు వచ్చే అద్భుతమైన ఫలితమేమంటే మన మనోవృత్తులన్నీ అంతర్ముఖమగుట వల్ల మనం బాహ్య ప్రపంచంలో జీవిస్తున్నప్పటికీ, మన లోపల, ధ్యానం ద్వారా అనంతమైన ఈశ్వరీయ ఆనంద రసపానం చేయగలుగుతూనే ఉంటాము. ఈ మనో వృత్తులు అంతర్ముఖం అవడంతో వచ్చే మరో చక్కటి పరిణామం ఏమిటంటే మనం బాహ్య ప్రపంచంలో జీవిస్తూ బాహ్యం యొక్క మలినం లేదా ఆ ఆకర్షణల ముద్రలు అంటే బాహ్య సంస్కారాల నుండి మన హృదయాన్ని కాపాడుకొని నిరంతర ఈశ్వరీయ ప్రవాహంలో ఈదుతూ వుండటం వల్ల ఈశ్వర ప్రాప్తి యొక్క లక్ష్యంలో సఫలీకృతులమవుతాం.

ఇంద్రియాలు, బుద్ధి అన్నిటికీ రాజు మన మనస్సు, మనస్సే ఈశ్వర ప్రాప్తికి మన దగ్గర ఉన్న ఏకైక ఉపకరణం - అంటే సాధనము. మనస్సులో ఈశ్వర ధ్యానం కలిగి వుండటం వల్ల మన కర్మలలో కూడా ఈశ్వరీయ

వికాసం, దివ్యత్వం యొక్క ప్రకాశం, పరిశుద్ధమైన సౌమ్యత కనిపించడం జరుగుతుంది. మనస్సు అనే రాజులో ఇంతటి మార్పు వచ్చినంతనే దేశ ప్రజలలో అనగా (దేహ) ఇంద్రియాలలోను, బుద్ధి యందు కూడా అదే జ్యోతి ప్రకాశిస్తుంది. హృదయం దివ్యతా సారంలో మునిగిపోయిన దానిలా అవుతుంది. మన నిరంతర స్మరణ ఫలితంగా ఆ దివ్యత్వం యొక్క మాధుర్యం అనగా లయావస్థను మన హృదయంలోకి దించుతుంది. ఒక శుభదినాన మనసు బుద్ధి, చిత్తము వీటి అన్నిటి యొక్క వేరు వేరు అస్తిత్వాలు అంతమైపోయి ఒకే ఒక ఈశ్వరీయ పరతత్వ ప్రవాహమొక్కటే మన (శరీరం) అంతటా సంచారం చేస్తుంది. ఈశ్వరప్రాప్తి అనే లక్ష్యమును హృదయంలో ఉంచుకుని కండ్లు మూసుకుని, ఈశ్వరుని స్థూల రూపమైన వారి దివ్య ప్రకాశముపై మన దృష్టిని నిలిపి ధ్యాన నిమగ్నమగుట వల్ల ఒక సుముహూర్తమున ఆ దివ్యత్వంలోనికి మనకు ప్రవేశం లభిస్తుంది. దీని ఫలితముగ ఈశ్వరుని స్థూల రూపమైన దివ్య ప్రకాశము మన కండ్లలో నిండిపోతుంది. మన ధ్యానము ఆ కాంతి స్థూల రూపమును ఛేదించి సూక్ష్మత లోనికి ప్రవేశిస్తుంది. ఇపుడు ధ్యానం వల్ల ఏ సూక్ష్మ స్థితి ప్రాప్తించినదో దానియందే (ధ్యాన) దృష్టి మనలను లయం చేయడం ప్రారంభిస్తుంది. మనం ఒకప్పటి ధ్యానంలో నిమగ్నం కావడానికి మాత్రమే దివ్య ప్రకాశం ఉన్నట్లు చేసిన భావన కూడా ధ్యానములో లయమై పోతుంది. మనము ధ్యానము యొక్క సహాయముతో ధ్యేయము (లక్ష్యము) నందు ప్రవేశించుచుండగా, అనగా ఈశ్వరీయ ప్రకాశము ద్వారా ఈశ్వరుని యందు ప్రవేశమును పొందసాగినపుడు, ఆ దివ్య ప్రకాశము యొక్క గాని, అది ఉన్నదనే భావన యొక్క అవసరము గాని, సమాప్తమవుతుంది. ధ్యానములో మనస్సుకు ఆనందము, లేదా తేలికదనము లేదా ఏదైనా సరే కొద్దిగా అనుభవమైతే ధ్యానములో దాని స్మరణే పలుమార్లు వస్తుంది. ధ్యానములో మనస్సు ఆ అలౌకికమయిన ఆనందపు లోతుల్లోకి స్వయంగానే ప్రవేశిస్తుంది. ఇలా పొందిన ఆనందానుభూతి మూలంగా నిరంతర స్మరణ సులభమై అందువల్ల కలిగే లాభ రహస్యం మనకు తెలిసిపోతుంది. తత్ఫలితంగా మనం లక్ష్యాన్ని సాధించటంతో పాటు ఆ బాటలో ఇంకా సామర్థ్యం కూడా

పొందుతాము. అనగా లక్ష్య ప్రాప్తిలో మనకు సహాయపడిన సతత స్మరణ యొక్క బంధనం (లింక్) స్వయంగానే మన హృదయంలో స్థిరపడుతుంది. ఇది మనలను బాహ్య సాధనముల యొక్క బంధనాల నుండి విముక్తం చేసి లక్ష్యం వైపు పురోగమించడంలో మన సమయం అంతా కాపాడుతుంది. లక్ష్యము యొక్క ధ్యానంలో మునిగిపోయి ఉండడంతో లక్ష్యం యొక్క సామీప్యత, తన్మయత్వము మనకు ప్రాప్తిస్తాయి. దీనివల్ల మొదటి రోజు నుండియే మనకు, మన లక్ష్యమునకూ మధ్య దూరం తరిగిపోతూ వుంటుంది. వారిలో కలసిపోవాలన్న ఆశ, తపన దానంతటదే వృద్ధి చెందుతుంది. అంతరంగంలో ఒక విలక్షణమైన దృఢత్వాన్ని మనం పాదుకొల్పుకుంటాము. ఈ దృఢత్వము ఫలవంతమయినాక దానినే మనం ఆత్మవిశ్వాసం అని వ్యవహరిస్తాము.

తన్మయతతో కూడిన ధ్యానమే ఉత్తమ సాధన. లక్ష్యానికి అనుగుణంగా, పద్ధతిని అవలంబిస్తూ చేసే సాధనతో సహజంగానే లక్ష్యసిద్ధి పొందగలం అన్నది సుస్పష్టం. "సూదిని ఎత్తడానికి మనం క్రేన్‌ని ఉపయోగించితే ఆ క్రేన్ యొక్క భారం మోయడం తప్ప మనకు ఫలితం ఏ మాత్రం దక్కదు," అని బాబూజీ మహారాజ్ అనేవారు. అంచేత సర్వవ్యాపి అయిన ఆ సర్వేశ్వరుని సాక్షాత్కారం కోసం మనకు ఎటువంటి భారమైన, కష్టమైన సాధన క్రియలు అవసరం లేదు. కావలసినదల్లా అన్నిటికంటె సరళమైన, సహజమైన అనుగుణ విధానం - ధ్యానం మాత్రమే! ధ్యానం సహజమైనది. ఎందుకంటే కేవలం ధ్యానం మాత్రమే మనం ఎంత కోరుకుంటే అంతగా స్మరణలోను, ఆలోచనలోను, హృదయంలో సర్దుకుని ఉంచుకోగలం. ఇది భారం మోయవలసిన పనికాదు. ఇది మానవునికి, జీవితము యొక్క పరమ లక్ష్యముతో సంబంధమును అనుసంధానం చేసి మళ్ళీ లక్ష్యముతో కలసిపోతుంది. ధ్యానానికి దానంతట దానికి ప్రత్యేక అస్తిత్వం లేదు. ఇది అవ్యక్తమైన దానిని వ్యక్తం చేయడానికి ఈశ్వరుని సర్వ వ్యాపక శక్తిని పూర్తిగా సంగ్రహించి మనలో లీనం చేయడానికి ఒక ఉపకరణం లేదా సహాయకారి మాత్రమే.

నిజానికి భగవంతుడ్ని ప్రత్యక్షం చేసుకోవడానికి ప్రకృతి సిద్ధమైన ఉపాయం కేవలం ధ్యానం మాత్రమే ! ఈశ్వరునితో యోగాన్ని కలిగించే యోగం ఇదే ! నిరంతర ధ్యానం వల్లనే మన మనోవృత్తులు ఆలోచనలు మొత్తం పరమ లక్ష్యపు (ఈశ్వరుని) సాక్షాత్కారము మనలో ప్రత్యక్షము చేసేందుకు ఊర్ధ్వముఖంగా ఉంటాయి. మనం ధ్యానం ద్వారా సమస్త బంధనాల నుండి విముక్తి పొంది ఆ పరమ స్వేచ్ఛాయుత ఆనందమునందు లీనమై ఈ (భౌతిక) ప్రపంచమునందు కాక ఈశ్వరీయ దేశము నందు నివసించుట ప్రారంభిస్తాము. ఇదే సాలోక్యతా స్థితి. భౌతిక ప్రపంచానికి సంబంధించి మన మానసిక స్థితి ఎలా ఉంటుందంటే, ఈ ప్రపంచంలోనే ఉంటూ కూడా ఇక్కడికి (ఈ ప్రపంచంలోకి) రానట్లుగానే అనిపిస్తుంది. ఈశ్వర సాన్నిధ్యము మనకెంత వరకు లభించునో అంతవరకు దాని ఉజ్వల విశుద్ధ ప్రకాశము మన శరీరమందు ప్రకాశిస్తుంది. దివ్య సాన్నిధ్యము వలన మనకు లభించు పవిత్రశక్తి మనలోని అపవిత్రతను, అనౌచిత్యములను బయటికి నెట్టివేస్తుంది. దాని పరిణామ ఫలితంగా మనకు మనం ఎంతో పవిత్రంగా అనుభూతి చెందుతూ ఉంటాము. దివ్య శక్తి యొక్క ఛాయ మనలో ఎలా పోషణ చెందుతుందంటే ఒక వింతైన దృఢత్వంతో వారితోడి కలయిక యొక్క ఆశ, తపనలతో మన అంతరంగము పులకించిపోవును. ఆ దివ్యసత్యం మనలో సజీవమవుతూ, పావన ఈశ్వరీయ ధారా ప్రవాహము నిరంతరము కొనసాగుతూ ఉంటుంది. నిరంతరం మనం పొందే సాన్నిధ్యత యొక్క అనుభవాన్నే మనం పరమానందం అని పిలుస్తాము. బాహ్య సాధనములలో లీనమయి ఉండే సమయం మనకేదయినా కొంచెం బాగున్నట్లు అనిపిస్తే ఆ ఫలితం, ఆ సాధన, ఆ పూజాదికములు నిర్వర్తించు వరకే పరిమితమై ఉంటుంది. కాని ధ్యానం ద్వారా ప్రాప్తించిన ఆనందం స్వతహాగా ఎప్పుడూ లోపల అంతా వ్యాపించి ఉంటుంది. ఎప్పుడు మన దృష్టి లోపలికి మరలినా ఆ ఆనందం సిద్ధంగా ఉన్న అనుభూతి పొందుతాం. ఎందుకంటే దాని ఆ ఆనందం యొక్క సంబంధం శాశ్వతమైన ఈశ్వరునితో కలి ఉంది. ఈశ్వరుడు శాశ్వతము కాన అనుబంధించి యున్న ఆనందం

కూడా సిద్ధంగా ఉంటుంది. ఈ స్థితి యొక్క ప్రతిబింబం మన బయటి వ్యవహారాలలో కూడా ప్రతిఫలించి, ఎటువంటి పరిస్థితులలోనూ కూడా లోపలి సంయమన స్థితి నిలుపుకోగల సమర్థత వస్తుంది మనకు. ధ్యానము ద్వారా మన హృదయములో ఎప్పుడు నిజమైన ఆధ్యాత్మిక ఆనందం వ్యక్తమవుతుందో అప్పుడు మన దృష్టి బాహ్యంలోకి మరలదు. అప్పుడు మన స్థితి - కొంచెం ఇటు చూచినంత మాత్రాననే హృదయంలో ప్రియుని రూపం కనిపిస్తుంది - అన్నట్లుంటుంది. ఈ విధంగా ధ్యాన జ్వాలను లక్ష్యమునకు అనుసంధిస్తే, ముడిపెడితే యోగం పూర్తవడం మొదలవుతుంది. లక్ష్యాన్ని పూర్ణరూపంలో, మనసారా, ప్రత్యక్షం చేసికోడానికై అణువణువునా తపన, తహతహ ఉప్పొంగుతుంది. మనలోపలి నీచ (నిమ్న) బంధనాలు అనగా మనస్సు, చిత్తము, ప్రపంచము, మోహము, మాయ - అన్నీ సమాప్తమై భగవంతునిలో కలసిపోవడం మొదలవుతుంది. హృదయంలో ఈశ్వరుని సంపూర్ణంగా ఇముడ్చుకోవాలన్న తపన పెరిగిపోయి అతలాకుతలం అయిపోతాము. అత్యంత సామీప్యంలో వారున్నా కలవలేక పోతున్నామని తపిస్తాము.

హృదయంలో హృదయవల్లభుడున్నాడు - కానీ చిక్కడం లేదు.

కంటిలో కంటివెలుగైన వాడున్నాడు - కానీ దొరకడం లేదు.

ఇప్పుడీ మాటలు ఎంత సార్థకమవుతున్నాయో !

ఏ ఆర్ద్రతనైతే మనం మొదట్లో కేవలం మన పరిమితమైన హృదయంలో పొందామో, అదే లోపలి లోతుల్లోకి అంటే సూక్ష్మంలోకి ప్రవేశించి మన ప్రతి కణంలోనూ వ్యాపిస్తుంది. ఇది వరకు కేవలం ఒక గ్లాసు నీటితో ప్రారంభమైన మన దాహార్తి, ఇపుడు బంధనాలు తెంచుకుని ఎంతటికీ తృప్తి చెందదు. ఒకప్పుడు స్వప్నంలో, మరోప్పుడు మెలకువలో - ఈ దప్పిక - ఈ దాహం ఎలా అనిపిస్తుందంటే, "ఓ బాబూజీ ! రాత్రంతా కలలో కూడా ఎంతటి దాహమో - నీరు కుండల కొద్దీ ఖాళీ అయిపోతున్నా ఈ దాహం తీరడం లేదు. ఈ దాహం, ఈ తీరని దాహం నా ప్రాణాన్నే తాగేస్తుందా అనిపిస్తూంది," అని వారికి వ్రాస్తాము. స్వాతి చినుకు కోసం తపించిపోయే

చాతక పక్షి లాగా ప్రియతముడైన ఈశ్వరుని ప్రాప్తికి అణువణువూ - 'ప్రియతముడెక్కడ, ప్రియతముడెక్కడ' అని రోదిస్తున్నట్లు రోదన వినిపిస్తుంది. ఈ స్థితికి చేరాక వారితో ముడిపడ్డ అనుబంధము నవజీవనం ప్రసాదిస్తున్న అనుభవం పొందుతాము. "ప్రియతమా ఎక్కడా" అన్న పిలుపు ఆయనకు చేరి వారు ఆలకిస్తున్నట్లు తోస్తుంది. ఈ దశ పొందినప్పుడు కబీరు చెప్పిన ఈ మాటలు సార్ధకమవుతాయి.

'కబీర్' 'కబీర్' అంటూ హరి నీ వెనకాతలే తిరుగుతాడు !

ఆర్తితో, పరితాపంతో భగవంతుని జాడకై పిచ్చిగా వెదుకులాడే భక్తుని వెంట భగవంతుడు అతన్ని పిలుస్తూ వెనకాలే ఉంటాడు. ఈ అనుభూతి ఉంటం వల్లనే ప్రాణము పోయే దప్పిక కలిగినప్పటికీ మనం జీవించే ఉంటాము. ఎందుకనగా లక్ష్యసిద్ధి కొరకు మనం జీవించే ఉండాలి కనుక.

మన పిలుపు ఈశ్వరునికి అందడం మనకు వరదాన స్వరూపంగా అవుతుందని నా అనుభవం. ఒకవైపు ప్రియతముని ధ్యానము. మరోవైపు వారి నుండి వచ్చు కృపా వాత్సల్యపు పావన ధార యొక్క అనుభవాల అద్భుత సమన్వయము మన హృదయంలోకి అవతరించి, పరచుకుని, వ్యాప్తి చెందుతుంది. ఇప్పుడు దశ, కృప రెండూ ప్రక్క ప్రక్కనే పయనిస్తాయి. దీనివలన మనకు తెలిసేదేమంటే ప్రియతముని పావన దేశము (సాలోక్యము) చేరుకోగానే 'వారి'కి మనను గూర్చిన సమాచారము అందినట్లే! ఈ పరమానంద స్థితిని ఏమని వర్ణించగలం. ఈ దశలో సమన్వయ ధార అంతరంగములో ప్రవేశించి వారు మనకు లభించారన్న అనుభవం కలుగుతుంది. కాని కలయిక, సంయోగ తృష్ణతో (కోరికతో) మండుటెండలో తిరుగు ఉన్మాదివలె ప్రియతముని వైపునకు సాగుతాము. ఈ పిచ్చిలో మన లక్ష్యం కూడా మరచిపోతాము. ప్రియతముని లోకము నందు ప్రవేశం పొందుటకు మనల్ని మనం పోగొట్టుకుని వారిలో లయమైపోతూ సాగిపోడం - ఈ రెండూ కూడా కలసి ఉంటాయి. ఐక్యత చెందిన ఈ మధురమైన సమయంలో మన లోపలి దశ ఎలా అవుతుందంటే మనకు మనమే నమస్కారం చేసుకుంటాము.

'మన' ధ్యానమే చేసుకుంటాము. మనకు మనం వందనం చేసుకోడం తప్ప ఇతరులకు వందనం చేయడం తప్పు, అన్నట్లు అనిపిస్తుంది. మరో మాటలో చెప్పాలంటే వారి స్వరూపము మనలో నిగ్గుతేలి ఉప్పొంగుతుంది. సద్గురుని పవిత్ర రూపము మనలోనే అనుభూతి పొందుతాము. ఈ సేవకుని హీన రూపమును వారు తమలోనికి స్వీకరిస్తారు. "నేను అద్దములో చూసినా మీరే కనిపిస్తున్నారు," అని బాబూజీకి వ్రాసినప్పుడు వారు అందుకు జవాబుగా "నేను గడ్డము చేసుకొనుట లేదు. ఎందుకనగా ఇది నీ ముఖము కనుక,' ' అని వ్రాశారు. ఈ దశలో ఈశ్వరుడు, సద్గురువు ఒక్కలాగే కనిపించడం విశేషానుభవం. సద్గురువును బాబూజీ అన్నప్పటికీ ఈశ్వరుడు అన్నప్పటికీ ఒకేలాగున ఉంటుంది.

ఆధ్యాత్మిక ఉన్నతి మార్గంలో నడుస్తున్నప్పటికీ చాలా చోట్ల ప్రజలు పురోభివృద్ధిని పొందలేకపోవడం నేను గమనించాను. దీనికి నేను గ్రహించిన కారణం ఏమంటే - సాధారణంగా మనం ఈ ప్రపంచంలో ఏ పని చేసినా దాని ఫలితం మీద ఆశ జిజ్ఞాస ఉంటాయి. కాని జీవిత ముఖ్య లక్ష్య ప్రాప్తి కొరకు బైరాగి వలె సాధన చేపట్టుతాము. దీనిలో ఫలితం యొక్క ప్రతీక్ష (నిరీక్షణ) కాని జిజ్ఞాస కాని ఉండదు. సహజ మార్గ సాధనలో ధ్యానమందు నిమగ్నమైన అభ్యాసమందు మనం ప్రవేశించగానే మనలో లక్ష్య ప్రాప్తి కొరకు జిజ్ఞాస మొదలవుతుంది. ఈ జిజ్ఞాస ఫలితంగా లక్ష్య మందు గాఢమైన అనురాగం ఏర్పడుతుంది. శ్రీ బాబూజీ మహరాజ్ ప్రాణాహుతి శక్తితో మన ఆత్మోన్నతి మూడు పూవులు ఆరుకాయలుగా వృద్ధి చెందుతుంది. మొదట వారితో కలయిక కోసం నిరీక్షణ ఉంటుంది. తరువాత ఆ నిరీక్షణ ఆరాటంగా మారిపోతుంది. ఆ ఆరాటం - ప్రాణములను హరించుకుని పోవునటువంటి దప్పికతో మన మనస్సు - శరీరము లందు పెల్లుబికి మనల్ని అశాంతికి గురి చేస్తుంది. కనుక యిటువంటి ధ్యానములో 'వారు' (ఈశ్వరుడు) తన కృపాధార సహితంగా మన మొత్తం (శరీర) వ్యవస్థయందు తప్పక ప్రవేశించవలసిందే ! ఇదే ధ్యానమహిమ !

## 5. ధ్యానమహిమ

ధ్యానం యొక్క మహిమ నిస్సందేహంగా అనంతమైనది. ధ్యానంలో లయమయిపోయి ఉండటంతో మన యొక్క ప్రళయం అనగా మన సంస్కారాల నశింపు, ధ్యేయం అనగా లక్ష్యం యొక్క పరిశుద్ధ స్వరూపం మనలో అంతటా నిండి ప్రవహిస్తూ వుంటుంది. ప్రతి ఒక సాధన త్రిగుణాలతో అనగా సత్వ, రజో మరియు తమో గుణములందు అంతర్గతమై ఉన్నట్లు అందరికి తెలిసిన విషయమే. పూజలు, పారాయణం, జపతపాదులు మొదలగు బాహ్య సాధనాలు త్రిగుణములతో కూడినవే. కాని భగవంతుని యొక్క ధ్యానంలో లయలీనమై ఉండుట త్రిగుణాలకు అవల త్రిగుణాతీతమైన సాధన అవుతుంది. అందుచేతనే యిది ఈశ్వరునితో సన్నిహితమైనది. ఈ కారణము వలననే మనలను భగవంతునితో యోగము కలిగించు సమర్ధవంతమైన సంపూర్ణ సాధనం ధ్యానమే ! ధ్యానంలో కొద్దిగా తన్మయత పొందడం ప్రారంభించినప్పటి నుండీ హృదయంలో ఒక ధారా ప్రవాహాన్ని పొందసాగడం నా ప్రత్యక్షానుభవం. ఇదే పావనమైన ఈశ్వరీయ ధారా ప్రవాహం. దీన్ని మనం ఎన్నో రకాలుగా వ్యక్తం చేస్తాము. ఒకసారి బాబూజీ మహరాజ్‌కు "నాలో అనుక్షణం కృపాధార ప్రవహిస్తున్నట్లుగా ఉంది," అని వ్రాశాను. ధ్యానం ద్వారా మనం లక్ష్యంతో కలుపబడుట ప్రారంభమైందని, దీనివల్ల మనకు తెలుస్తుంది. ఆయన యొక్క పావనధార మనలో ప్రవహించడం మొదలయింది. సద్గురువు నుండి ప్రాప్తించిన యోగిక ప్రాణశక్తి సహాయంతో ధ్యానం వెంటనే ఫలదాయకమవుతుంది. "ఈ చేత్తో ఇచ్చి ఆ చేతితో పుచ్చుకో" అనే సామెత! అనగా ఈ చేతితో పనిచేసి ఆ చేతితో దాని 'ఫలితం' అందుకో - అన్నది సార్ధకమవుతుంది. పూర్ణంతో పూర్ణమైన దాని ప్రాప్తి అంటే పూర్ణ సాధనా ధ్యానంతో పూర్ణతత్వ (ఈశ్వరుని) ప్రాప్తి పొందుదుమని అంటారు. ఇందువల్లనే 'వారి' ధ్యానము మాత్రమే లక్ష్యముతో యోగము కలిగించు స్వయం పూర్ణమైన సాధనము (అనగా పనిముట్టు). ధ్యానము అనే సాధన ద్వారా లక్ష్యప్రాప్తి కొరకు తపన ఎక్కువగుటకు బదులుగా సాధనా పద్ధతులతో మాత్రమే అయినట్లయితే ఆ సాధనములలోనే

చిక్కుబడిపోయి - ఇంతసేపు స్తోత్రాలు చేశాను, ఇంత రామాయణ పారాయణం చేశాను, అనే ఇటువంటి జ్ఞానమే పెరుగుతుంది. అనగా మనం 'నేను' అనే సంకుచిత వలయములో ఇంకా ఇంకా బందీలుగా ఉండిపోతాము. "నేను" అనే అహంకార వలయాన్ని ఛేదించి పరమ ప్రియుడైన ఈశ్వర ధ్యానంలో లీనం చేసి నిరంతరం అనంతము వైపుకు తీసికొని పోవునదే నిజమైన సాధన. పూజ, పారాయణము, జపతపాదులు మొదలగు సాధనముల ద్వారా భక్తి, ప్రేమ లభిస్తాయని చెబుతారు. కాని ధ్యానము ఒక సంపూర్ణ సాధన. దానిలోనే భక్తి, ప్రేమ లీనమై ఉండుటతో - అన్నీ అందులోనే ఇమిడిపోయి లేదా మిళితమై ఉన్నాయన్నమాట. భగవత్ ధ్యానంలో అంటే మన లక్ష్యం యొక్క ధ్యానంలో లయమై ఉండుటతో మన అంతరంగంలో అవన్నీ స్వచ్ఛత నందుతాయి. మనకు పూజ, స్తోత్రాల యొక్క సహాయం, అవసరం ఉండదు. మన అంతరంగంలో ఈశ్వరుని ఎడ ప్రేమ తరంగాలు ఉప్పొంగుతూంటాయి. మనం ఆ మహా ప్రేమ సాగరంలో మునకలు వేస్తూ ఈదుతూ ఆనందంలో ఓలలాడతాము.

అయితే దానితో పాటు ధ్యానం లక్ష్యంలో మునిగిపోయి ఉండి ముందుకు పురోగమించిన కొలదీ మనకు బాహ్య విషయాలు ఏమీ అంటనట్లుగా అనగా తామరాకు నీటిలో ఉన్నా ఆ ఆకుపై నీరంటనట్లుగా ఉంటుంది. అట్లే ఆధ్యాత్మికత యందు సాధించిన స్థితుల యొక్క ఆనందమును పూర్తిగా పొందుతూ ముందుకు సాగి - తనివి తీరని స్థితిగా, ఆరిపోయినట్లుగా డ్రైగా అనుభవమవుతుంది. ఈ స్థితి మొదలుకాగానే తేలిక స్థితి (లైట్‌నెస్), తపన రెట్టింపుగా అవుతూ వస్తుంది. అనంతమైన భౌతిక పూజా విధానాలన్నిటినీ తనలో కలుపుకుని కేవలం లక్ష్యాన్నే మన ముందు పరచగల (నిలపగల) శక్తి వంతమైన ప్రియసాధన ఈ ధ్యానం. ఈశ్వర ప్రాప్తి పొందాలన్న లక్ష్యము ధ్యానములో ఉండుట వలన ధ్యానము నెమ్మది నెమ్మదిగా సూక్ష్మం అవుతూ వస్తుంది. ప్రియతముని సామీప్యత పొందడం ప్రారంభమై ధ్యానం స్వతహాగానే అటువంటి సూక్ష్మత్వాన్నే పొందుతుంది. తపన స్వయంగానే లక్ష్యము వద్దకు మార్గాన్ని వెదుక్కుంటూ వస్తుంది.

ధ్యానములో నిమగ్నమై యుండుట వలన ధ్యానము యొక్క స్థూలత్వము అనగా ధ్యానము చేయుట అనునది సమాప్తమవుతూ వాస్తవికత (రియాలిటీ) సహజంగానే వ్యాపిస్తుంది. సద్గురువు శ్రీ బాబూజీ మహరాజ్ నిరంతర పర్యవేక్షణలో మన ధ్యానం వికాసం పొందుతుంది.

సహజ మార్గ సాధన యందు శ్రీ బాబూజీ యొక్క పావన ప్రాణశక్తి ద్వారా ఆత్మ సాక్షాత్కారం కలిగి ఒకానొక రోజున ఆ దివ్యత్వం మనలోపల బయట అంటే అంతరంగంలోనూ, బాహ్యంలోనూ నిజంగానే ప్రత్యక్షమవుతుంది. "ద్వారం, గోడ - అద్దంలో, ఎక్కడ చూచినా, నీవే! కంకర రాళ్ళు రప్పలు అన్నీ నిన్ను చూపే అద్దాలే నాకు" అన్న కబీరు వాక్కులు నిజమై కనిపిస్తాయి. సహజ మార్గ సాధనలో ధ్యానం యొక్క వాస్తవికత, సఫలత యొక్క రహస్యం కూడా ప్రత్యక్షమవుతుంది. కాన కేవలం ధ్యానమే సత్యసాధనమై ఉన్నది. ఇందులో ఏ సాధనము యొక్క ఆలంబన అంటే ఆధారం లేదు. దేనిమీదా ఆధారపడకుండా ఉన్న స్వయం శ్రేష్ఠ లక్ష్యముతో యోగము పొందిన అభౌతిక సాధన ధ్యానం. ఎందువల్లనంటే భగవంతుడు భౌతికత లేనివాడు. గుణరహితుడు. కాబట్టి ఆయన ధ్యానం కూడా భౌతికతలేనిదై ఉండాలి. ధ్యానంలో మనకు భౌతిక సాధనముల యొక్క సాయం తీసుకోవలసిన అవసరం రాదు. ఆ సాధనములు ఉపయోగపడవు. కాబట్టి ఎప్పుడైతే ధ్యేయం అంటే లక్ష్యం యొక్క ధ్యానంలో తన్మయమవుతూ అంతరంగ పూజ ప్రారంభిస్తామో (ధ్యాన ఫలితంగా) అప్పటి నుండే మనం ఈ భౌతికత కంటే అతీతంగా లేచి ఉంటాము. మనం ఏ రోజునుండైతే ధ్యానం ప్రారంభిస్తామో అప్పటి నుండి ధ్యానంలో మునిగి ధ్యానంలో ప్రాప్తించిన వారి కృపలో లయలీనమై ఉండడం అలవరచుకోవాలి. ఆనాటి నుండే మనం భౌతికత్వాన్ని అధిగమించి దివ్యత్వంలో నివసిస్తాము.

ధ్యానం యొక్క విశేషత ఏమిటనగా మనం ప్రారంభించిన రోజు నుండి అది తనంత తానే ఉండాలని వాంఛిస్తుంది. దివ్యత్వము ఉత్పన్నము అగుట వలన మనలో ఉన్న మనలో పేరుకొని ఉన్న ప్రతిబంధకాలైన విషయాలను, అపవిత్రతలను అది బయటకు విసిరేయడం ప్రారంభిస్తుంది.

లక్ష్యప్రాప్తి లేదా ఈశ్వర ప్రాప్తితో పూర్ణ యోగమును కలిగించగల విధానం (టెక్నిక్) ఇదే. అందువల్ల అంతటి శక్తి కలిగి ఉంటుంది. మనసు మొదలైన అన్ని మానసిక వృత్తులను ఊర్ధ్వంగానే ఉంచాలని ధ్యానం అనుకుంటుంది. కాబట్టి అల్ప విషయాలు అంతరంగములోకి చొరకుండా నిరోధించుటలో సహకారిగా ఉంటుంది. ధ్యానం ద్వారా అంతరంగంలో విశుద్ధత వ్యాపిస్తుంది. విశుద్ధత పెరుగుతున్న కొలది శక్తివంతము కూడా అవుతూ మనలో ఉండకూడని మాలిన్యాదులను స్వయంగా బయటకు నెట్టి వేయడంలో అది మనకు సాయపడుతుంది. దీనివల్ల మన అంతరంగము పవిత్రవంతము, ప్రకాశవంతము అవుతున్న అనుభవం పొందుతాము. మన శరీర వ్యవస్థ స్వతహాగానే ఈశ్వర ప్రాప్తికి యోగ్యవంతము కానారంభిస్తుంది.

రెండు విభిన్న పరిస్థితులు, రెండు విభిన్న ఆలోచనలు ఒక మనసులో ఇమడలేవని అంటారు. స్థూల బాహ్య క్రియల నుండి ముక్తమైనది అనగా అది క్రియారహితమైనది కనుక ధ్యానము సూక్ష్మమైనది. అనగా సూక్ష్మత్వం ముందు స్థూల ఆలోచనలు శోభించవు కూడా. అంచేత ధ్యానం ద్వారా మనం మనసుకు ఏ ఔన్నత్యం కల్పించామో దానిని అల్పమైన ఆలోచనల ద్వారా అధోముఖం కాకుండా దిగజారకుండా జాగ్రత్త వహించాలి. ధ్యానం వల్ల మన ఉనికి - మన జీవన విధానం కూడా సూక్ష్మమవుతూ ఉంటుంది. ఆలోచనలకు ఆట విడుపు - క్రీడాస్థలం హృదయమే. ఎప్పుడైతే హృదయక్షేత్రంలో (హృదయభూమిలో) ఈశ్వర ప్రాప్తికై ధ్యానాభ్యాసము పటుతరమవుతుందో అపుడు దివ్య లక్ష్యం అనే విత్తనం నాటి మంచి ఆలోచనల ద్వారా అలాటి రుచికరమైన నీరు, ఆహారం (ఎరువు) చేకూర్చడానికి ప్రయత్నించాలి అపుడు సతత ధ్యానం ద్వారా లక్ష్యం అనే చంద్రుడు ఉదయిస్తాడు. సాధనలో నిష్ఠ కుదురుతుంది. మన ప్రగతి కూడా శృంఖలాలను తెంచుకోడం మొదలు పెడుతుంది. అది స్వయంగా లక్ష్యంలోనే మునిగి పరిపూర్ణంగా ఉండడమే ధ్యానం గొప్పదనం. దీని సౌందర్యం పవిత్రమైన రూపు దాలుస్తుంది. అపుడే - భౌతికత లేని దీనికన్నా అతీతమైన - రాత్రి పగలు, చీకటి - వెలుగు అన్నిటి జ్ఞానాన్ని పోగొట్టుకొని లక్ష్యం వైపు వేగంగా

పరిగెట్టడం మొదలుపెడతాము. మన లోపల ఎంత దివ్య శక్తిని అనుభవిస్తామంటే ఏదైనా పర్వతం మన మార్గంలో అడ్డు వచ్చినా కూడా అది మన మార్గాన్ని నిరోధించలేదు - అనిపిస్తుంది. ఇలాంటి ఒక విశేష స్థితిలో సూర్య చంద్రాదులు కూడా మన సమక్షంలో తేజో విహీనంగా కనిపిస్తారు. ఈ దశ యొక్క అనుభవాన్ని వ్రాస్తే బాబూజీ "ఇది హిరణ్యగర్భ స్థానం యొక్క స్థితి" అని అన్నారు. మన అంతరంగం అద్భుతమైన దివ్యత్వంతో తేజోవంతమై పోతుంది. ధ్యానంలో లయమై ఉండుట అంటే భగవంతునికి అత్యంత సామీప్యంగా ఉండడమే అని అర్థం. అంచేత ధ్యానం మొదలు పెడుతూనే మనం ముక్తి (లిబరేషన్) వైపు అడుగులు వేస్తాము. ఎంచేతంటే అది అన్ని బంధనాల నుండి విముక్తిని కలిగించే సాధనే కాక ఒక బంధన రహిత పద్ధతి. ఈ పద్ధతిని ఆచరించడం ద్వారా మన అడుగు ముక్తి వైపే పడుతుంది. ధ్యానంలో మన హృదయంలోని పరిశుద్ధ స్థితి భౌతికతకు, బంధనాలకు అతీతంగా దివ్యత్వం యొక్క అనుభూతిని ఇస్తుంది. బాహ్యమైన పూజలు, జపతపాదులు మొదలగు క్రియలలో నిమగ్నమైతే మనలో బంధనాలే వృద్ధి అవుతాయి. కాని ధ్యానం వల్ల, ఈశ్వరప్రాప్తి కొరకు అసలైన తపన మాత్రమే ఎక్కువవుతుంది. ఈ రెంటిలో ఎంతటి అంతరమో! తేడానో ! ఒకటి బంధనాలు పెంచేది - రెండోది బంధనాలు త్రుంచేది. అంటే లక్ష్యం యొక్క రూపముగా మారిన సాధనను అనుసరించి ధ్యానమును మన దానినిగా చేసుకున్నచో పూజా, పారాయణాదులగు క్రియల ఎడ ఆసక్తి పోతుంది. యోగిక ప్రాణశక్తి ద్వారా మన ధ్యానమును వాస్తవిక రూపంలోనికి తీర్చిదిద్దగల సమర్థ శిక్షకుడైన సద్గురువు అవసరం చాలా ముఖ్యం. మన లక్ష్యం సరియైనదైనప్పుడు ఇది సిద్ధిస్తుంది. మాతృ హృదయం బిడ్డ కోసం ఎదురు చూస్తూండునట్లుగా సద్గురువు మనకై ఎదురు చూస్తూనే ఉంటారు.

స్వతహాగానే ధ్యానం ఒక పరిపూర్ణమైన సాధన. సృష్టి చేద్దామన్న 'ధ్యానం' రావడం వల్లనే - ఆరంభంలో 'క్షోభ' పుట్టి ఉంటుంది. అనగా సృష్టి ప్రారంభం ధ్యానంతోనే ఆరంభమైంది. ధ్యానంలో మన 'అంతిమ సత్యం' లేదా లక్ష్యప్రాప్తి యొక్క యాత్రను ప్రారంభించగానే మనకు ధ్యానము

యొక్క ఆ ఈశ్వరీయ ధారయే ఈ సృష్టియందు బీజరూపములో నాటబడినట్లు అనిపిస్తుంది. అనగా ధ్యానమే ఈ సృష్టి యొక్క ప్రాణము. ఆత్మోన్నతి పొందుతూన్న కొలదీ దీనికి ప్రమాణం కూడా మనకు లభిస్తూంటుంది. సాధారణంగా మనం ఏ పని చేస్తున్నా దాని ప్రారంభం మనకు తెలీకుండానే ధ్యానంతో మొదలవుతుంది. ధ్యానంతో పనిచేస్తే ఆ పని శ్రేష్ఠంగా, సుఖదాయకంగా ఉండి ఉత్తమ ఫలితాన్ని ప్రసాదిస్తుంది. పిల్లలతో మనం 'ధ్యానం పెట్టి చదువు' అని చెప్తుతూంటాము. అంతెందుకు - దొంగ, దొంగతనం చేసేప్పుడు కూడా, 'అది ఎలా దొరుకుతుంది ? తిరిగి ఎలా తప్పించుకోవాలి' అనే ధ్యానంతోనే ఉంటాడు. సమస్తమునకూ ప్రారంభం ధ్యానముతోనే మొదలవుతుంది - అంతమూ ధ్యానంతోనే అనిపిస్తుంది. మరణం ఆసన్నమైన వానిని "భగవంతునిపై ధ్యానం ఉంచు", అని చెబుతారు. ఎందుకంటే స్వగృహానికి వెనుదిరిగి - చేరుకోడానికి అదే ద్వారం. ఇలా మనకు తెలీకుండానే సత్యం మన ముఖం నుండి వెలువడుతూనే ఉంటుంది. కాన ధ్యానమే అన్నిటికీ మొదలు అని చెప్పవచ్చు.

ధ్యానమునకు రెండవ సూత్రం లేక ఆధారం స్మరణ. మధ్యన వ్యాపించి ఉన్నది సృష్టి రచన. ఆ కారణం చేతనే - సాక్షాత్కారం కొరకు ధ్యానం యొక్క సహాయం తీసుకొనుట ప్రారంభించి సద్గురువు యొక్క యోగప్రాణశక్తి ద్వారా పైకి ఎక్కడం ప్రారంభించినప్పుడు ఒక కొస నుండి రెండవ కొసకు కలుపుతున్న - స్మరణ అను సూక్ష్మమైన (సూత్రం అనగా) మన ధ్యానాన్ని మూల (ఆది - ఆరిజన్) ధ్యానంతో కలిపి మన అందుబాటులోకి తెస్తుంది. ఈశ్వరునితో యోగమును కలిగించుటకు మరియు దారి తప్పిన మన స్మరణను సరిగా చేసి లక్ష్యము యొక్క ధ్యానము నందు ప్రవేశము కల్పించుటకు సద్గురువు శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క ప్రాణశక్తి అత్యంత ఆవశ్యకమైనది. అందువల్లనే, సాక్షాత్కారమునకు ధ్యానమార్గమే సహజమైన, స్వాభావికమైన మార్గమని చెప్పగలం. ఇటువంటి సహజమైన మరియు స్వాభావికమైన పద్ధతినే సవరించి, సహజత్వం యొక్క రూపమిచ్చి శ్రీ బాబూజీ మహరాజ్ మనకు పరిచయం చేశారు. "సృష్టి సృజింపబడాలి" అనే

ధ్యానం కలగడంతోనే - ప్రవహించనారంభించిన శక్తి ఏదో అది ప్రాణాహుతి శక్తే అని అనుకోవచ్చు. అంటే ధ్యానముతోనే ఆ 'పరమశక్తి సమూహము' నందు సజీవము మరియు చైతన్యము కలిగి, ఆ శక్తి ప్రవాహము కూడా స్వయంగా ప్రవహింపసాగింది. బాబూజీ మహరాజ్ ధ్యానమును 'ఆది సంకల్పము' తో పరిశుద్ధ మొనర్చిమనకు ప్రసాదించారు. ఇదే యోగిక ప్రాణశక్తి. ప్రాణశక్తి ప్రాణులలో నిద్రాణమై యున్న ఆ దైవచైతన్యాన్ని మేల్కొలుపుతుంది. దీనివల్ల మనం మన స్వగృహానికి అంటే మాతృ స్థానానికి తిరిగి వెళ్ళుటకు, మన నిజమైన ప్రియతముని 'కలియుటకు తహతహలాడుతాము. ఆయన పట్ల వియోగపు పరితాపము మనలో ఎంత గాఢంగా నిద్రాణమై ఉన్నదోనన్న విషయం - ప్రాణశక్తి యొక్క మేల్కొలుపు వల్లనే మనకు తెలుస్తోంది. అంటే ప్రాణశక్తి ఇపుడు స్వగృహానికి మరలుటతో - తిరోగమనమవుతుంది. ఆ మహా చైతన్యము సృష్టిని ఏర్పరచుట కొరకుగాను 'మూలము' నుండి క్రిందికి ప్రవహించ నారంభించింది. అలాకాగా ఈ ప్రాణశక్తి వలన మేల్కొల్పబడిన ఈ అంతర్ చైతన్యము మనల్ని ఇప్పుడు ఊర్ధ్వముఖం గావించి తిరిగి మూలస్థానం - అల్టిమేట్ - అనగా భూమా వైపు తీసుకువెడుతుంది. ధ్యానము యొక్క ప్రారంభాన్ని 'అంతిమము' తో యోగం కలిగించుటకుగాను మధ్యలో ఏర్పడ్డ చెడును లేదా జడత్వాన్ని సద్గురు శ్రీ బాబూజీగారు తమ ఇచ్ఛాశక్తితో పరిశుద్ధం చేసి వాస్తవికతను అంటే రియాలిటీని సహజంగానే మన హృదయంలో ప్రవేశపెడతారు. ఇక మనకు ఆలస్యమెందుకవుతుంది. మనం ధ్యానం ప్రారంభించగానే మన కాలొకటి దివ్య దేశంలో ప్రవేశించిందనీ రెండవది నడచుచున్నదనీ అంటే సాగుతోందని తరచు నాకు అనిపించేది. దీనర్థం ఏమంటే ధ్యానం అనే తాడు యొక్క క్రింది కొన మన చేతుల్లో వుంటే దాని పై కొన (దారం) మన స్వస్థానము. (స్వగృహం) నకు తగిలి వుండి మన గురించిన కబురు అందుతూ వుంటుంది.

అసలైన వాస్తవ విషయం ఏమిటంటే, బాబూజీ మహరాజ్ మనలను 'నిరంతర స్మరణ' లో యుండుమని చెప్పుట ఎందుకంటే - నిరంతరం

లక్ష్యం యొక్క ధ్యానముండటం కోసమే. స్మరణ అనే సూత్రము చేత మనం లక్ష్యాన్ని పట్టుకుని ఉండుట చేత మనలోని 'నేను' లేక 'అహం' భూమాతో బంధింపబడినదవుతుంది. స్మరణ అనునది ధ్యానం యొక్క అసలైన ఏ 'ఈశ్వరీయ ప్రతిబింబము' నయితే మన హృదయమునందు దింపుతుందో ఆ విశుద్ధ సామీప్యతయే విభిన్న దశల రూపములో ప్రత్యక్షమవుతూ వుంటుంది. ఒకప్పుడు పిచ్చివాడివలె పరుగిడుతూ, మరొకప్పుడు ఏదో కోల్పోయిన వానిలా దిగాలుగా ఉంటాము. బాహ్యతత్వాలపై ఉదాసీనతతో 'బాబూజీ' 'బాబూజీ' అనే నిశ్శబ్ద స్మరణలో మునిగిపోతాము. కారణ కార్యములు అనగా కారణ స్థితులు ఒకదానినొకటి అనుసరించి నడుస్తాయి. అన్న బాబూజీ మాటలు నాకిప్పుడు స్పష్టమవుతున్నాయి. మన ధ్యానము ప్రాణాహుతిలో స్నానమాడి నిర్మలమై సూక్ష్మత నొందుతూంటే మన జ్ఞాపక స్వరూపం కూడా సూక్ష్మం అవుతూ ఉంటుంది. ఒక్కోసారి మాలిక్ యొక్క స్మరణయే కలుగదు, తదుపరి జ్ఞాపకం చేసుకోవాలనే జ్ఞాపకం ఉంచుకోలేని అసమర్థులం అవుతాం. మనలోని 'మనము', ప్రియతముడైన భగవానుని జ్ఞప్తిలో ఏ విధంగా కలిసిపోతుందంటే - ఆ సూక్ష్మ దశయే మన స్వరూపం అయిపోతుంది. దీనిని మనం రకరకాలుగా వ్యక్తపరుస్తాం. ఒక్కోసారి "స్పృహ లేకుండా పోయింది" అంటాము. ఎవరైనా "వా " గురించి మాట్లాడుతుంటే స్పృహలోకి వచ్చినట్లు అనిపిస్తుంది. మరి అప్ప వరకు ఎక్కడికి పోయామో తెలీదు. అనగా ధ్యానమందు మునిగి పోవుట చేత హద్దులు లేక ప్రియతముడైన ఈశ్వరునితో కలిసి 'నేను' అనే బంధం నుండి విడిపోయి విరాట్‌లోనే వ్యాపించి పోతాము. ఎప్పుడైనా ఒక రోజున ఏదైనా హృదయఘాతం (దెబ్బ లేక కష్టం) కలిగినప్పుడు ఓ క్షణకాలం సంకోచం అయి ఇటు వచ్చి మరల అటువైపు మాయమైనట్లుగా అందులో లీనమైపోతాం. నెమ్మదిగా కొంతకాలానికి 'నేను' అనేది ఈశ్వరునిలో లయమైపోయి బాహ్యంలోనికి రానే రాని స్థితి ఏర్పడుతుంది. ఇపుడు ధ్యానం కూడా మనపై ప్రభావం చూపేశక్తి ఏమీలేనట్లుగా ఉంటుంది. ప్రేమ, భక్తి మొదలైన భావాలన్నీ కూడా మనలో నుండి అదృశ్యమవుతాయి. లయావస్థ కూడా లక్ష్యంలో కలిసి

పోతుంది. బాబూజీ వారు అన్నట్లు - కారణం, కార్యం పరిస్థితి ఒకటే అయిపోతాయి. అపుడు అదే సతత ధారా ప్రవాహము ద్వారా వాస్తవికత యొక్క నిర్గుణత్వము అనగా యధార్థత్వం (రియాలిటీ) ఏ రకమైన గుణమూ లేని అసలైన స్వచ్ఛత మనలో విలసిల్లుతుంది. ఇక మిగిలేదేముంది ! వాస్తవికత - ఏది ఉన్నదో అది ! మనలోని "నేను" (అహం) తొలగిపోయినప్పుడు వాస్తవికత మనలో స్వచ్ఛరూపంలో అవతరిస్తుంది. దేనికై ధ్యానం మొదలుపెట్టామో ఆ ధ్యాన వాస్తవికత లేక దాని మూలము నందు ప్రవేశించుటకు ఆ తెరను లేదా ముసుగును శ్రీ బాబూజీ మహరాజ్ వారే తీసి తొలగించాలి. ఈ సమయంలో మనం ఇంకా జీవించి ఉండడానికి గాను తమ వంతుగా బాబూజీ మనకొక స్థితిని కల్పిస్తారు. మనం ఎప్పుడూ ఉండే స్పృహలేని స్థితిలో ఉన్నా కూడా ఒక జాగ్రదా స్థితిని 'వారి' సృష్టియైన ఈ జగత్తులో 'వారి' పనులను మన ద్వారా చక్కగా నిర్వహించుటకు గాను ఈ స్థితినిస్తారు. మనల్ని ఎవరైనా - పిచ్చివాడని అనకుండానూ, ఏదో పోగొట్టుకున్నామని ఇతరులు అపార్థం చేసుకోకుండానూ మనలో ఏర్పడిన విస్మృతిలో కూడా స్మృతిని స్వల్పంగా ఇస్తారు. ఇచ్చటనే వాస్తావిక ఔన్నత్యతా దశ పూర్తయి - ఈశ్వర సాక్షాత్కారం అవుతుంది.

ఇపుడు ఈశ్వర సాక్షాత్కారమైంది. మన బాబూజీ ఈ వాస్తవికతకు వెనుకనున్న విశాలంగా వ్యాపించిన - విస్తృత వ్యాపకతలోనికి దింపుతారు. నిశ్చేష్టులమై నిర్ఘాంతపోతాం ఇక్కడ. ఏదీ ఏమీ తెలీని స్థితి. 'వారి' భావన, 'మన' గురించిన స్పృహ, ఏదీ ఉండదు. ఏదీ అవగాహన కాదు. ఈ మాయాజాలం, అంటే ఈ ఏమీ తెలీని, ఏదీ అంతు దొరకని స్థితిని ప్రసారం చేసినదెవరు ? మనసు బుద్ధి, చిత్తము దేని జ్ఞానము ఉండదు. ఈ మూడూ కొంతవరకు - ఒక హద్దు వరకూ మనతో వచ్చి మూలము (కేంద్రం)లో లయమైపోయాయి. ఇక ఇక్కడ నడచుట కాదు - ఈదుట - స్విమ్మింగ్! నీరు లేకుండానే ఈదుట! ఎంత గొప్ప అద్భుతం! ఎక్కడి నుండి వ్యాప్తి మొదలైనదో అది 'మాలిక్' యొక్క అంతిమ విరాట్ అనీ అనిపిస్తుంది. సర్వవ్యాపియైన భగవంతుని విరాట్ ఇదేనని ఇచట నుండే సర్వసృష్టి వ్యాపించినదని నాకు

అనిపించింది. దీనిని బ్రహ్మగతి కంటే కూడా అతీతమైన స్థితి అనవచ్చును. ఎందుకంటే ఎక్కడి వరకైతే బ్రహ్మగతి, అని అంటామో అక్కడి వరకు మననము చేయు శక్తి మరియు వ్యాప్తి చెందే శక్తి సిద్ధంగా ఉన్నట్లు నాకు తోచింది. ఈ విషయంలో బాబూజీ చెప్పిన ఒక వాక్యం ప్రమాణంగా ఉంది. "బ్రహ్మ గతిలో వ్యాపించుటకూ, మననము చేయుటకూ ఈ రెండింటికి శక్తి సిద్ధముగా ఉన్నది" అని. 'భూమా'ను దర్శించి ఆ 'భూమా' శక్తిపై అధిపత్యం వహించిన సద్గురువు శ్రీ బాబూజీ వారి పావన చరణాలను పట్టుకోడంవల్ల ఆ అనంత విరాట్ యొక్క పరమానందమైన అద్భుతాన్ని దర్శించే పరమ సౌభాగ్యం మనకుకూడా లభిస్తుందని చెప్పగలను.

ఇక్కడ నేను గ్రహించినదేమంటే ఈ దశలో లయమైనాక ఊహలేని (నిరూహ్యావస్థ) స్థితి ప్రారంభమవుతుంది. ఎదుట భావన చేయలేని ఒక స్థితి వ్యాపించి ఉన్నట్లుంటుంది. దృష్టికి ఏమీ కనబడదు కాని ఏదేదో ఉందనిపిస్తూన్నపుడు అది భ్రమా ? ఊహా ? ఎటువంటిదిది? ఇది ఒక శూన్య స్థితి. ఈ భ్రాంతి కూడా ఏమిటో ఎవరూ చెప్పలేరు. కేవలం ప్రేక్షకునిగా నిలిచి ఆ భ్రమనే చూస్తూంటాము. భోక్త అంటే అనుభవించే వారు. చూసే వారు ఎవరూ లేరు. 'ఏదో ఉన్నది' అంటే 'భోక్త' అనేవారు ఉండొచ్చు కాని ఎక్కడా ఏమీ లేనప్పుడు దానిని అనుభవించే వారు మాత్రం ఎవరుంటారు? నా మనసుకు తట్టినదేమంటే - నేను ఆ భ్రమను గురించి చెపుతున్నానంటే దాని హద్దు వరకు భోక్తను నేనే - అనిపించింది. కాని తిరిగి నేను నిర్ధారించుకున్నదేమంటే మనమేదైనా చూస్తున్నా, వ్రాస్తున్నా మనం కేవలం ద్రష్టలం అవుతామే కాని, భోక్తలం కాము. మనలోపలా బయటా కూడా భోక్త యొక్క లక్షణాలు లేవు కాన ఎట్టి పరిస్థితుల్లోనూ భోక్తల మనిపించుకోము. మరోటి ఏమంటే ఆ భ్రమ యందు లయమై దాని అట్టడుగుకు చేరాక - అది పూర్తిగా శూన్యమని నాకు అర్థమైంది. ఈ శూన్యతలోని లోతులకు తరచి తరచి చూచాక - ఆ ఆది సమావస్థ అదే అనీ, అచ్చటనే క్షోభ్ ఆరంభమై యుండి యుండవచ్చుననీ నాకు అనిపించింది.

బాబూజీ చెప్పినట్లు, యోగుల యొక్క సమాధి స్థితి, మరపు స్థితి (ఫర్‌గెట్‌ఫుల్‌నెస్) తోనే ప్రారంభమవుతుంది. ఈ స్థితి కూడా ఆది సమావస్థలో

చేరుకోగానే సమాప్త మవుతుంది. అనగా యోగి ఆది సమస్థితిని అందుకున్న తర్వాతనే పూర్ణ సమాధి సిద్ధిస్తుంది. ఇప్పుడు కూడా నా ఎదుట ఏదో ఉన్నట్లుంటుంది. కాని మాటల్లో చెప్పటానికి అలవికానిదది. అనగా మూలములో - ఆది (సమా) అవస్థతో మనము అంటిపెట్టుకొని (లేదా దానికి తగిలి) ఉంటామని అర్థమవుతుంది. వాస్తవ సమాధి స్థితియందు అడుగు పెడుతున్నాము. ఈ స్థితి తగ్గడంగాని పెరగడంగాని వుండదు. అలాగే దశ అనేది రావడంగాని, పోవడంగాని ఉండదు. ఇవ్వడంకాని, పొందుటగాని ఉండదు. ఇది ఎటువంటి సమస్థితి (బాలెన్స్) అంటే అక్కడ ప్రతి రాగము, తాళము కూడా లయమైపోతాయి. ధ్యానము, ఆలోచన లేక ఏ సూత్రం మన వశంలో ఉండదు. ఏ కొంచెమైనా తెలుసుకోడానికి ఏ సాయమూ ఉండదు. 'మాలిక్' - ఆ ప్రభువు స్వయంగా ఆ తెరను - ఆ మేలి ముసుగును తొలగించిన కాలంలో ఏమేమి నాగ్రహింపుకు వచ్చిందో దానినే చెప్పాను. దాని వెనక ఇంకేమున్నదో ఏమో! మరల బాబూజీ మహరాజ్ ఆ తెర తీసినపుడు వ్రాయగలను.

పూజ అంటే ఏమిటి ? మనని మనం లేకుండా చేసుకోడమే. 'నేను' అనగా 'అహం' ను సమాప్తం చేసుకోవడమే. ఎవరైతే ఆ స్థితిని పొందారో వారు ఒక్కరిపైనే ఆధారపడి ఒక్కరికే అర్పితమై - దానిని ఆ స్థితిని పొందారు. ఒక్కరికే - ఆ సద్గురునికే ఆత్మార్పణ చేసికొని లక్ష్యమును పొందారు. పది మంది గురువులను చేరినవాడు వ్యర్థుడౌతాడు. ఒక్కదానినే పట్టుకోడంవల్ల మనం శూన్యమైపోతూ ఉంటాము. మన అభ్యాసం ఎలా ఉండాలంటే మాట్లాడినా, ఏ పనిలో ఉన్నా ప్రతి పనిలో ప్రతిక్షణం పట్టుదలగా మనలను ఆ శూన్య స్థితికి తేగల 'లక్ష్యము'ను విడువక అభ్యాసము చేయాలి. 'మనము' (అహం) శూన్య మవుతూ ఉండుటవలన లక్ష్యము యొక్క శక్తి సద్గురువు ద్వారా మనలో ప్రస్ఫుటమై మన శక్తిని వందల రెట్లు అధికంగా చేస్తుంది. 'వారి'ని చేరుకోవాలనే తీవ్ర గమనం యొక్క స్పృహ కూడా మనకు ఉండదు. మనము 'గమ్యము' వైపుకు నడుస్తున్నామా లేక ఆగమ్యమే మనవైపు పరుగెత్తుకొస్తున్నదీ కూడ తెలీదు. మన దృష్టిని, మన హృదయాన్ని ఒకరిపైనే అనగా ధ్యానంలో 'మాలిక్' పైనే ఉంచడం వల్ల మన వ్యాపక శక్తి

అమితమై ఎన్నెన్నో రెట్లు పెరిగిపోతుంది. దీనితో శ్రీ బాబూజీ మహరాజ్‌కు, "మరణం తర్వాతనే లభించే - స్థితి, ఆనందం ఈ జీవిత కాలంలోనే మేము పొందగలుగుతున్నాం" అని వ్రాస్తాము. శూన్యతకు చేరువైన కొలదీ లేదా మనలో శూన్యత ఇమిడిపోవుచున్న కొలదీ ఉన్నతి గతియందు మన దృఢత్వం, ఆత్మ విశ్వాసాల యొక్క అస్తిత్వం కూడా లయమై పోతున్నట్లుంటుంది. అంటే ఎల్లలుపోయి బంధనాలు తెగిపోతాయి. ఉదయాస్తమయాదులు లేని శూన్య సమాధిస్థితి యందు మనం ప్రవేశించినట్లు చెప్పవచ్చు. అనగా ఈశ్వరీయ గతి యందు వ్యాప్తి చెందుతుంటాము. మనం 'మూలము' వైపు అనగా శూన్యము వైపు పురోగమించినప్పుడు మన 'నేను' (అస్తిత్వం) కూడ శూన్యము అనగా అంతిమ సత్యమందే కలసిపోతుంది. ధ్యాన ప్రవాహం ద్వారా మూలము యొక్క శక్తి మనలోనికి ప్రవహిస్తూంటుంది. సింధువులో బిందువు కలసిపోయే సమయం అపుడు వస్తుంది. అలాంటి దశ యొక్క ఆనందానుభవంలో మనం లీనమైపోతాం. ఆపై బిందువులో సింధువు ఇమిడిపోతుంది. అనగా నిమిత్త మాత్రమైన ఈ శరీరమందు సాగరమే ప్రవహించును. పరిమితమైన అస్తిత్వమునకు లోతు తెలీని అగాధములోనికి ప్రవేశం లభిస్తుంది. అపుడు ఆశ్చర్య కరమైన ఒక వింత దృఢత్వం మనలో సమీకరించబడటమూ, దానికి అంతము లేకపోవడమూ గ్రహిస్తాం. అందువల్ల ఆ దృఢత్వాన్ని మన ఈ శరీరంలో ఉంచుకోలేము. అయితే 'మాలిక్' పని నిర్వహించవలసి వచ్చినప్పుడు సాటిలేని శక్తి, విశ్వాసము ఎక్కడి నుండియో వచ్చి మనతో సహకరించి, ఆ పని పూర్తికాగానే మరల మనం ఎప్పటిలా ఖాళీగా అయిపోతాం.

## 6. ధ్యానావశ్యకత

ధ్యానంలోనే సృష్టి కార్యము ప్రారంభమైనదని వ్రాశాను. ఫలితంగా ఈ సృష్టి రచన వ్యాపించి ఉన్నంత వరకూ దానిలో ధ్యానమే ప్రాణంగా ఇమిడి ఉంది. ఆధ్యాత్మిక క్షేత్రంలో కూడా ఈశ్వరప్రాప్తినే లక్ష్యంగా ఎంచుకొని సాగితే ధ్యాన సాధనమే మనల్ని లక్ష్యమునకు అనుసంధానం చేస్తుంది. ఈశ్వరీయ శక్తి మరియు చైతన్యములో ప్రవేశం పొందాలన్న ఈశ్వర ధ్యానము వల్లనే సాధ్యమవుతుంది. కాన ఏ కార్యం సఫలత పొందాలన్నా - అది ప్రాపంచికమైనదైనా ఈశ్వర ప్రాప్తికైనదైనా సరే ధ్యానమే ఆవశ్యక సాధనం. కేవలం లక్ష్యం యొక్క ధ్యానంలో మనం మునిగి తన్మయులం అయిపోయి ఉంటే ఆ ఆదిశక్తి యొక్క ప్రవాహం మన హృదయంలో ఎక్కువగా అనుభవమవుతూ ఉంటుంది. ఈ అనుభవాన్నే మనం స్థితులను బట్టి రకరకాలుగా వ్యక్తం చేస్తాము. ఒక్కోసారి - ఎక్కడో పూర్తిగా మనం మునిగి పోయినట్లు, మరోప్పుడు ఎక్కడో పూర్తిగా కోల్పోయినట్లున్నదని, ఆ స్థితిని గురించి వ్రాస్తూంటాము. అసలు విషయం ఏమంటే - మన ధ్యానము లక్ష్యము ఇపుడు హత్తుకుపోయాయి. ఇపుడు ఇక ఏ మాత్రం ధ్యానం యొక్క దృష్టి కొంచమయినా చెదరిపోతే మన అస్తిత్వం నుండి వేరయినట్లు మనసులో వ్యథ పీడిస్తూంటుంది. అందుకనే మనకు మనమే, మనకు తెలీకుండానే పిచ్చెక్కినట్లుగా దానిలో మునిగే ఉండడానికి ప్రయత్నిస్తాం. మరో అద్భుతమైన విషయం ఏమంటే సద్గురువు శక్తి మన ధ్యానాన్ని జాగృతం చేసి లక్ష్యం వైపు త్రిప్పుతుంది. అప్పుడు మనోవృత్తులు, ఇంద్రియాలు అన్నీ బాహ్య ప్రపంచం నుండి సంకోచించుకుని ఊర్ధ్వముఖమై - అంతర్ముఖులమవుతాం. ఈ లోకంలో స్పృహలో ఉండి కూడా సుషుప్తిలో ఉంటున్నట్లుగా అవుతుంది. ఈ సుషుప్తి స్థితిలో కూడా లక్ష్య ధ్యానం యొక్క చైతన్యం ద్వారా జాగ్రదావస్థ చెంది మనకు తెలియకుండానే మన ప్రియతమునితో కలయికకై ముందుకు సాగిపోతున్నాము. మనం సుషుప్తిలో ఉన్నా మాలిక్ ధ్యానాన్ని మేల్కొలిపి సత్యమైన, సహజమైన లక్ష్యప్రాప్తి వైపు మరలించారు. అంచేత ఆ ధ్యానం మనల్ని విశ్రాంతిగ, శాంతంగా

ఉండనీయదు. మన ఆ సుషుప్తి నిద్రలో కూడా ముందుకే సాగుతాం. మేల్కొని ఉన్నప్పుడు కూడా సుషుప్తిలోనే ఉన్నట్లుంది. ఎంచేత అనగా - మెలకువలో ఉండే ఈ ప్రాపంచిక కార్యాలు పూర్తి చేసుకుంటున్నా అంతరంగంలో ఈశ్వర యోగం కోసం ధ్యానం జరుగుతూనే ఉండడం వల్ల, శరీరం మాత్రమే ప్రాపంచిక కార్యాల్లో లీనమై ఉన్నట్లనిపిస్తుంది. ధ్యానం హృదయంలోకి లోతుగా అవుతూ సహజంగానే తన మార్గం ఏర్పరచుకుంటూ ఉంటుంది. ఒక అంధుడు కేవలం లక్ష్యం మాత్రమే తన ధ్యానంలో ఉంచుకుని చేతికర్ర సాయంతో తన నిర్దేశిత స్థానానికి చేరుకున్నట్లు - మన ధ్యానాన్ని లక్ష్యం మీద నిలిపి సద్గురువు శ్రీ బాబూజీ మహరాజ్ చేయి ఆసరాగా పట్టుకుని ఈ ప్రపంచంలో జీవిస్తూ నిద్రలో, మెలకువలో ఎక్కడున్నా నిర్భయంగా 'మాలిక్' ను చేరుకుంటాం. అలా ఈ లోకంలో వ్యాపించి ఉన్న భౌతిక సౌందర్యాదుల ఆకర్షణలు గ్రుడ్డివానిపై ఏ ప్రభావాన్నీ చూపని విధంగా - మనపై కూడా ప్రభావం పడదు. అందుకనే మాలిక్‌తో 'కళ్ళు ఉండే చోట రాళ్ళు అమర్చినట్లుగా ఉంది. బాహ్య ప్రపంచం ఏమీ కనబడ్డం లేదు. కళ్ళు మూసుకున్నా కూడా అంతరంగంలో బహు దూర దృశ్యాలు కనిపిస్తున్న అనుభవం అవుతూంది.'' అని అంటాం. లక్ష్యంలో మన ధ్యానం లగ్నమై ఉంటం వల్లనే సహజంగా యిలా జరుగుతుంది.

అసలు మన ధ్యానం ఎందుకు విచలితమైంది ? (పెడదారిపట్టింది) ఆదిలో ధ్యానం ఉంది. అంతంలో (చివరలో) కూడా ధ్యానమే ఉన్నప్పటికీ మధ్యలో త్రోవ తప్పింది. ధ్యానము కేవలం ఒకే ధారగా ఉంది. ఈ ధ్యానధార ఆధారంగానే ఈ ప్రపంచంలోకి వచ్చాము. ఈ ధ్యానధారను విడువక ఆదితో అనగా ఊర్ధ్వముతో యోగం పొంది ఉన్నాము. కాని మన ధ్యానం త్రోవ తప్పి వంకర తిరిగింది. (వచ్చింది హరి భజనకు. అందుకే ప్రత్తిలో ప్రత్తి గింజలు తీస్తూ కూడా 'హరి', 'హరి' అంటూ ఉంటూ - వంకర తిరిగిన బుద్ధి 'ప్రత్తి' , 'ప్రత్తి' అన్నట్లు భగవత్ ధ్యానం బదులు ప్రాపంచిక విషయాల ధ్యాసలో పడిపోయి ధ్యానం విచలితమైంది.)

వచ్చింది హరిభజనకు చేసేది మాత్రం ఉదర పోషణకు - అనే సామెత యదార్థమైంది ఇక్కడ. జీవిత పరమ లక్ష్యము ముఖ్య కేంద్ర బిందువు (అంతిమం) మీద స్థిరంగా ఉండవలసిన ధ్యానము ఈశ్వరుని మరగు పరచుకొని ఈ ప్రపంచంలో పలు ధారలుగా చీలిపోయింది. అనగా ఈశ్వర ధ్యానానికి బదులు ప్రాపంచిక ఆలోచనల్లోకి మళ్లింది. అనగా ఒకే ధ్యానము నందుండవలసిన ఆకర్షణ అనేక ధారలుగా విడిపోయింది. ఒక ధార మమతను ఇంకో ధార మోహమును మరోటి ప్రపంచంలోని సుఖదుఃఖాలను స్వీకరించి హృదయాన్ని మలిన పరచుకుని ఇచ్ఛాశక్తిని దుర్బలం చేసింది. ధ్యానం యొక్క ముఖ్య బిందువు లక్ష్యం నుండి మరింతగా దూరమైంది. ఇప్పుడు ఈ మధ్య భాగంలో అనగా ఈ ప్రపంచంలో చిక్కుకుపోయి దాని రంగులో (భౌతికత్వము) కలిసిపోయాము. మన అసలు రంగైన దైవత్వం అసలు తత్వమైన ఈశ్వరతత్వం - మన ధ్యానం నుండి పోయాయి. ధ్యానము ద్వారా శాశ్వత ఆనందం, శాశ్వతశాంతి, శాశ్వత సమత్వంతో ఉండాల్సిన మన సంబంధం ఇప్పుడు - మమకారం, మోహం, అజ్ఞానం మరియు భౌతిక సుఖ దుఃఖాలలో మునిగి పోయింది. వాస్తవ విషయం ఏమంటే సరియైన మధ్యేమార్గం - సమభావన. క్రింద, పైన రెంటి స్థితులను సమన్వయ పరచు సంతులిత సంబంధం మన "నేను" లోనే ఉంటుంది. అనగా ధ్యానాన్ని అసలైన దానిమీద నిలుపుకోవడం, నిలుపుకోలేకపోవడం మన పట్టుదల, బలహీనతల మీద ఆధారపడి ఉంటుంది. మన ధ్యానము అనేక ధారలుగా విడిపోడం వల్ల మనలోని "నేను" మన 'ఆది' స్థానముతో సంబంధము కోల్పోతుంది. అప్పుడు మధ్యస్థంగా ఉన్న అంటే మధ్యన చిక్కుకున్న "నేను' పరమ లక్ష్యముతో సంబంధము లేకుండుట వలన (ధ్యానము) క్రమక్రమంగా క్షీణిస్తూ చివరకు పూర్తిగా లోపించినట్లవుతుంది. అపుడు ఈ సంసారము ఒక మహా సాగరము వలె దుస్సాధ్యముగా కనిపిస్తుంది. ప్రాపంచిక సమస్యలు క్రూరజంతువుల వలె మనకు దుఃఖ భాజనమవుతాయి.

మధ్యస్థమైన స్థితి "నేను" ఎలా చెడిపోతుందో గ్రహించడానికి సాధారణమైన ఉదాహరణగా దీన్ని తీసుకోండి. ఇంగ్లీషులో సన్ (SUN) మరియు సిన్ (SIN) అను రెండు పదాలున్నాయి. రెండింటా మొదలు, ఎస్ (S) చివర ఎన్ (N) ఉన్నాయి. అనగా ప్రారంభంలో ఎస్ (YES యస్) (అవును) ఉన్నది - అనీ, చివరలో ఎన్ (N = NO - నో) లేదు (వద్దు) - అనీ ఉన్నాయి కదా. అంటే ఈ ప్రపంచం 'ఉన్నది' (అవును) అనే దానితో మొదలై "లేదు" (వద్దు) అనే దానితో సమాప్తమైంది. అయితే మధ్యలో సంతులనం (బాలన్స్ - సమస్థితి) ఉంటేనే మనకు అలా అనిపిస్తుంది. కాని జరిగింది వేరు. పై ఆంగ్ల పదాలు రెండింటిలో ఆద్యంతమైన రెండక్షరాలు ఒక్కటే. కాని సన్ - SUN అనే పదములో మధ్య అక్షరం యు - U అనగా నీవు (YOU) అవడం వల్ల (అంతా నీవే అన్నట్లుయి) ధ్యానం చెదరకుండా ఉండి సమత్వం మరియు విశుద్ధ రూపంలో ఉండిపోయింది. కాని ఇక రెండో మాట SIN లో మధ్యలో ఉన్న అక్షరం I(ఐ) అనగా "నేను" (అహం) అగుట వలన ('అహం' ఉండుట వల్ల) 'అదిస్థానము' యొక్క కేంద్రాన్ని విడిచి, 'అహం' యొక్క రూపంలో విడిగా వేరొక కేంద్రాన్ని ఏర్పరచుకొంటుంది. అందువల్ల దాని యొక్క సంబంధం 'అంతముతో' అనగా 'భూమా' నుండి విడిపోయింది. ఇప్పుడు ఈ మధ్యస్థ కేంద్రం 'అహం' యొక్క ప్రభావం ఎంతవరకు వ్యాప్తి చెందుతుందో అంతవరకూ లెక్కలేనన్ని కేంద్రాలను ఏర్పరచుకోడం వల్ల ఈ అహం (నేను) మరియు 'ఆదిస్థానము' ల మధ్యదూరము, మనం అధోగతి చెందుతున్న కొలదీ - పెరిగిపోతూనే ఉంది. అంటే మనం అధోముఖంగా ప్రయాణిస్తున్నామన్న మాట.

ఇది ఎంతటి హాస్యాస్పద విషయమో కదా! సృష్టికర్తయైన ఈశ్వరుడు ఒక పాత్రను నిర్వహించమని తన సృష్టిలోనికి మనల్ని పంపితే ఆ పాత్రను నిర్వహిస్తూనే మనం మనమే కర్తగా భావించి స్వయంగానే అనేక పాత్రలను సృష్టించసాగాము. దీని ఫలితం ఏమంటే అరిషడ్వర్గాలైన ఈర్ష్య, ద్వేషం, మదమాత్సర్యాలు, క్రోధం అన్నీ మనలో ఏర్పడ్డాయి. మనం అహం యొక్క అంధకారంలో పడిపోయాము. ఇలా ఎన్నెన్నో జన్మ పరంపరలు

గడచిపోయాయి. అయినా మన పుట్టిన మాతృభూమి ధ్యాస లేదు - ఆ ధ్యానం రావడం లేదు. ఎప్పుడైనా వచ్చినా ఎంతోకాలం గడచిపోడంతో ఇంటికి తిరిగి పోవడానికి సరైన మార్గం కూడా దొరకడం లేదు. ఎవర్ని అడుగుదామన్నా వాళ్ళూ దారి తప్పి తిరుగుతున్నవాళ్ళే. ఇక వారేం చెప్పగలరు. ఎవరైనా సద్గురువు లేక మహా పురుషుడు విశిష్ట వ్యక్తిత్వంతో ప్రజలను సరైన త్రోవన నడపు కారణ జన్ముడు, పావన ఆధ్యాత్మికతా ప్రసార శీలి, ఈశ్వరీయ శక్తిని గైకొని మరల ఈ ప్రపంచంలోకి దిగి వచ్చి తన పవిత్ర ప్రాణశక్తి ద్వారా త్రోవతప్పిన మనలను చరచి, లేపి మన గమ్యాన్ని గుర్తు చేస్తే మన మాతృభూమికి అనగా ఈశ్వరుని వద్దకు తిరిగి పోడానికి వ్యాకుల పడతాము. మన అసలైన లక్ష్యం యొక్క ధ్యాన సహాయాన్ని ఆది స్థానం నుండి ప్రవహిస్తున్న ఆ పవిత్ర ధారలో మనం తిరిగి ప్రవేశిస్తాం. మనం సృష్టించుకున్న కేంద్రాలు నశించడం మొదలవుతుంది. వాటిలో వ్యాపించిన 'నేను' కుంచించుకుని ధ్యానము ద్వారా తిరిగి ఏకత్వం పొందడం ప్రారంభిస్తుంది. మధ్యస్థ కర్త 'నేను' (I ఐ) కు బదులు 'నీవు' (యు - YOU) గా మారుట మొదలవుతుంది. అపుడు మన గమనం అధోముఖం నుండి లాగబడి ఊర్ధ్వములో వ్యాపించడం ప్రారంభమవుతుంది. అప్పుడు లక్ష్యంలోని ధ్యాన సహాయంతో, మనలోని అరిషడ్వర్గాలు అన్నీ నశించిపోతుండడం మనకు అనుభవమవుతుంది. మరోవైపు సద్గురు శ్రీ బాబూజీ మహరాజ్ శక్తి మనల్ని ముందుకు తోస్తూ లక్ష్యం వైపు లాక్కొని పోవుచున్నట్లు మనకు అనిపిస్తుంది. అలా తీర్చి సరిదిద్దువారే సద్గురువు! ఈశ్వరుడు ప్రాణి మాత్రులను ఉద్ధరించడానికి అవతరింపజేసిన వారిది విశిష్ట వ్యక్తిత్వంగా ఉంటుంది. మనం సృష్టించుకొన్న కేంద్రాలు మనలో నశించడం మొదలైనప్పుడు మనం ఆంతరికంగా దివ్యత్వంలో వ్యాపించుచున్నట్లు అనుభూతి పొందుతాం. బాహ్య ప్రపంచంలో వ్యాపించబడినదంతా ఇప్పుడు వెనక్కి లాగబడి 'సత్యతత్వము' వైపునకు తిరిగి పురోగమిస్తాము. మనం పైకి వెళ్ళిన కొద్దీ ఈశ్వరుని సామీప్యత పొందినకొద్దీ - మనలో సూక్ష్మత, పవిత్రత, ఈశ్వరీయ శక్తి అంతకంతా ప్రవహిస్తూంటుంది. మనకు ఆత్మోన్నతి కలుగుచున్నదా

లేదా - అనే విషయం స్థూలత్వం నుండి సూక్ష్మత్వం వైపు పురోగమించడాన్ని బట్టి తెలుసుకోవచ్చు. ఇంతేకాక మన ధ్యానంలో స్థూలత యొక్క ఆవరణ తొలగిపోయి ధ్యానం సూక్ష్మంగా లోతుగా అగుట మొదలవుతుంది. దీనివల్లనే ఆత్మోన్నతిని గురించి అంచనా వేసుకోవచ్చు. ధ్యానం ఏకాగ్రతలో తన ఎల్లలను సమీపించినప్పుడు సూక్ష్మతలోని అంతర్దశలను కూడా గ్రహించగలము.

ఈ ప్రాణులందరూ దుఃఖంతో, దారిద్ర్యంతో చింత, అశాంతులతో ఎందుకుండిపోతున్నారు ? దీనికి కారణం ఏమిటి ? ఇది మంచి ప్రశ్నే ! ధ్యానం చేసి వెదికితే కాని దీనికి సమాధానం దొరకదు. అసలు మన ధ్యానమే భిన్న ఆకర్షణలకు చిక్కి, పలు ధారలుగా ఛిద్రమైనప్పుడు ఇది ఎలా సాధ్యమవుతుంది? ఇది సాధ్యం కావాలంటే ఈ భౌతిక ప్రపంచంలో చెల్లా చెదురైన మన ధ్యాన ధారలను కలిపివేయగలిగే ఈశ్వరీయ శక్తి గల వేరొక 'ధ్యానము' మనకు అవసరం. అటువంటి 'ధ్యానము' ఎప్పుడు ఏ విధంగా మనల్ని (మన ధ్యానాన్ని) తన వైపుకు ఆకర్షిస్తుంది ? ఆ 'ధ్యానము' మూల కారణమైన ఆ లక్ష్యము మనకు ఇష్టమైనదై మనసుకు నచ్చినదైనప్పుడు మాత్రమే ఇది సంభవమవుతుంది.

కాని ప్రాణులకు (వ్యా) మోహం యొక్క ఆకర్షణ కల్గియున్నదే మనకు ప్రియమైనదై వుంటుంది. ఈ వ్యామోహాన్ని మనం విస్తృతం చేసి అందులో చీలిపోతున్నాం. మన ధ్యానం, సమస్తమందు వ్యాపించి యున్న ఈశ్వరీయతను అలక్ష్యం చేసి మిగిలిన వాటిలో (భౌతికాకర్షణల్లో) విస్తరిల్లి పోయింది. మన ధ్యానాన్ని (దృష్టిని) భగ్నపరుస్తున్నటువంటి వాటిలో వాస్తవమేమైనా వుందా లేదా అనేటటువంటి జ్ఞానం కూడా మనకు లేకపోతోంది. మన ధ్యానం వ్యాపించి ఉన్న బాహ్య ప్రపంచం నుండి మనమేదైనా వాస్తవమైన లబ్ధి పొందుతున్నామా లేదా అని కూడా అర్థం చేసుకోలేకపోతున్నాం. బహుశః ఈ విషయానికి సమాధానం ఇవ్వడానికి ఇప్పుడు సిద్ధంగా లేమేమో ! ఎంచేతనంటే దీని జవాబు నన్వేషించటానికి మనం మరల ధ్యానం యొక్క సాయం తీసికొని సర్వత్రా - సర్వంలోనూ వ్యాపించి ఉన్న ఆ ఈశ్వరీయ

ధారయందే ప్రవేశించాలి. మరి ఈ ఈశ్వరీయ ధారలో ఎవరు ప్రవేశపెట్టగలరు? ఎందుకంటే మనం మన దుఃఖాలను, దారిద్ర్యాన్ని అనుభవిస్తూ కూడా ఇంకా వాటినే అంటి పెట్టుకుని ఉన్నాం. మరి మనల్ని ఆ ఈశ్వరీయ పవిత్ర ధారలో ప్రవేశపెట్టగలవారెవరు ?

బాబూజీ మహరాజ్ లాంటి సద్గురువులు ఎవరో ఏదో మహత్తర శక్తిని తీసికొని వచ్చి మన ధ్యానాభిరుచిని తన ప్రాణశక్తితో మేల్కొల్పి మన ధ్యాన ధారను సర్వ వ్యాపితమైన ఈశ్వరీయ ధారలో ప్రవహింప చేయుటకు గాను మనల్ని యోగ్యులుగా తయారు చేసి, మనలో పేరుకున్న నిరాశ, నిస్పృహ, సోమరితనం, అపవిత్రతలనే మేఘాలను చెల్లా చెదురు చేసి ప్రేమమూర్తియైన తల్లివలె మన సమస్తంలో వ్యాపించిన ధ్యానాన్ని ప్రోగుచేసి కేవలం అంతిమ లక్ష్యం వైపు త్రిప్పగలిగేటటువంటి జోలపాట వినిపించగల వ్యక్తి కావాలి. సమర్థ సద్గురు శ్రీ బాబూజీ మహరాజ్ మన ధ్యానాన్ని అంతిమ లక్ష్యం వైపు మరల్చుట వల్ల ఈ మన ధ్యానము నందు ఈశ్వరీయ మహత్ చైతన్యము సర్వదా ప్రవహించుట ఆరంభమవుతుంది.

కాని బాబూజీ అనేక సార్లు చెప్పినట్లు "సూదిని ఎత్తడానికి క్రేన్‌ను మనం ఉపయోగిస్తే కేవలం క్రేన్ భారాన్ని మోయవలసి వచ్చే విధం," గా మన ధ్యానం తన ధ్యేయం వైపు తిరిగి దానితో యోగం చెందడంలో విజయవంతం కాలేదు! ధ్యానం అంటే బరువు మోసే ఏ రకమైన క్రియ కాదు. సర్వవ్యాపియైన ఈశ్వరుని ప్రత్యక్షం చేసుకోడానికి ఏ ప్రక్రియా అవసరం లేదు. అందుకై అన్నిటా సరళమూ సహజమూ అయిన మరియు అందుకు అనుగుణమైనది "ధ్యానం" మాత్రమే ! ధ్యానం సహజమైనది. ఎంచేతనంటే దైవ ధ్యానాన్ని స్మరణలో గాని, హృదయంలో గాని, ఆలోచనల్లో గాని మనకు కావలసినంత అనగా ఎంత సేపు అంటే అంతసేపు ఇష్టమైనంతగా ఉంచుకోగలం. మరల మరల మననం లేదా స్మరణలో ఉండుట వల్ల లక్ష్యం ఎడల ఆసక్తి, అనుబంధం ఏర్పడుతుంది. దీనివల్ల ఏదో ఒక రోజున ధ్యాన ముద్ర మనలో పొందుతాము. ధ్యాన ధారయందు ప్రవేశం పొందగానే యోగం ఏదో ఒక రోజున పరిపూర్ణమవుతుంది. నిరంతర స్మరణ ద్వారా

అంతిమ లక్ష్యాన్ని ధ్యానంలో ఉంచుకోగలగడం అనేది నిజమవుతుంది. ధ్యానం - లక్ష్యాన్ని మనతో కలిపే గొలుసు. కాన లక్ష్యముతో అనగా ఈశ్వరునితో మనల్ని తిరిగి కలిపిన ధ్యానము కూడా అందులో కలిసిపోతుంది. ధ్యానానికి తనదంటూ ప్రత్యేకమైన అస్తిత్వం లేదు. అవ్యక్తమైన దానిని వ్యక్తం చేయడానికీ, - అంతిమ లక్ష్యంతో సంబంధంకల ధారా ప్రవాహములోనికి ప్రవేశింప చేయుటకు ఒక ఆధారమవుతుంది. సర్వ వ్యాపకమైన ఈశ్వరీయ శక్తి యందు తిరిగి సంబంధం ఏర్పరచుటకు ఈ ధ్యానము ఒక యోగము వంటిది. ఈశ్వర ప్రాప్తిని పొందుటకు ధ్యానము ఒక ఉపాయము. ఆయనతో యోగాన్ని కలిగించే ఒక సూత్రము అనగా విధానము. బాబూజీ మహరాజ్ ఈ సహజ యోగాన్ని అనగా ధ్యానమును సహజ మార్గ్‌కు ఆధారముగా ప్రసాదించారు. తక్షణ ఫలితం ప్రసాదించే ఈ ధ్యానమే - మానవ మాత్రుల కొరకు 'సహజ మార్గము' ఇచ్చిన విశేషమైన వరం. అంతేకాక ఈ యోగంలో శీఘ్రంగా లక్ష్య సిద్ధిని ప్రసాదించడానికై సహజ మార్గ్‌లో బాబూజీ ద్వారా ప్రాప్తించిన యోగిక ప్రాణశక్తి కూడా నిండి ఉంది. "ఈశ్వరుని పొందాలంటే ఈశ్వర ధ్యానమే సర్వోన్నతమైన సాధన," అని బాబూజీ అంటారు. ఈశ్వర ప్రాప్తి, ఈశ్వర దర్శనం యొక్క స్థితులు కూడా ధ్యానం ద్వారానే మన ఎదుట ప్రత్యక్షమవుతాయి. మనం ఆయన (ఈశ్వర్) ధ్యానంలో తన్మయత్వం పొందుతూన్నపుడు సద్గురు శ్రీ బాబూజీ మహరాజ్ వారి ప్రాణాహుతి శక్తి వల్ల ఈశ్వరుని గురించి తెలుసుకోవాలనే ప్రేరణ ఆయనతో కలసి పోవాలనే తపన మనలో ఉత్పన్నమవుతాయి. అప్పుడే భగవంతుని గురించి చెప్పబడ్డ ఆ దివ్య గుణాలన్నీ మన ఎదుట ప్రత్యక్షమగుట మొదలవుతుంది. బాబూజీ యొక్క ప్రాణశక్తి వల్లనూ మరియూ 'వారి' ధ్యానము వల్లనూ మన అంతస్సు అనగా మన అంతరంగం విశుద్ధమై సమస్త ఈశ్వరీయ స్థితులూ మనలో సహజంగానే అవతరిస్తాయి. ఈశ్వరుడు సర్వ వ్యాపి అనీ, సర్వం రామమయం అనీ అందరూ చెప్పారు. ఇది సత్యం. కాని ధ్యానం ద్వారా ఆయనలో ప్రవేశించిన మన దృష్టి ఏ రోజైతే భగవన్మయమయిపోతుందో ఆ రోజే ఆ సత్యం మనకు ప్రత్యక్షమై ఆ స్థితిని పొందుతాము. అపుడే మన అంతస్సు ఇలా గానం చేస్తుంది.

ద్వారం, గోడా అన్నీ అద్దాలే అయి దేన్ని చూసినా
అందులో నీవే కనిపిస్తున్నావ్

కంకర రాళ్ళు, రాయి, రప్పలు కూడా అద్దాలై నీవే కనిపిస్తున్నావు.

దర్శనమందలి విశేష స్థితి ఏమనగా ఈశ్వరుడు ఘట, ఘట వాసి - అనగా సర్వంలో ఉన్నాడు. ప్రతి ఘటంలో - ప్రతి పాత్రలో - ప్రతి యొక్క రూపంలో ఉన్నాడు. ఆ స్థితియే ధ్యానం ద్వారా మన అంతరంగంలో కలుగుతుంది. ఈశ్వరుడు సర్వశక్తియుతుడని అందరూ ఒప్పుకుంటారు. కాని దీనిని ఎవరు దర్శించారు ? ఎవరైతే పూజ్య శ్రీ బాబూజీ యొక్క పరమ పావన ప్రాణాహుతి శక్తి ద్వారా ధ్యానంలో తన్మయులై పోయి - మునిగిపోయి ఈశ్వరుని యొక్క పూర్ణ దర్శనము అను 'లయావస్థ'ను చేరుకొన్నారో అట్టి అభ్యాసులే ఈశ్వరుని (సర్వశక్తివంతుని) స్థితిని దర్శించగలరు. ధ్యానము యొక్క ఈ స్థితిని చేరుకొన్న తర్వాత బాబూజీ గారికి వ్రాసిన నా ఈ మాటలు ఇంకా గుర్తున్నాయి. "సూర్య చంద్రాదులను నేనే సృష్టించానన్నట్లు, ఈ సృష్టి అంతా నా శక్తితోనే నడుస్తున్నట్లుగా అనిపిస్తోంది." అని. ధ్యానము ద్వారా ఈశ్వరుని విశేషతలోని రెండవ సత్యం అనగా దర్శనం యొక్క మరో స్థితి మన ఎదుట ఇపుడు ప్రత్యక్షం అవుతుంది. యదార్థానికి ఇది దర్శనం మాత్రమే కాదు. మీదు మిక్కిలి ఈశ్వరుడు ఏ విధంగా ఉన్నాడో ఆ విధంగా - స్వస్వరూపంతో ప్రత్యక్షం అవుతాడు. ఎందుకంటే ధ్యానం ద్వారా ఎంతెంత ఆయనలో ప్రవేశం పొందుతూ ఉంటామో ఆ దర్శనం యొక్క స్థితులన్నీ ప్రత్యక్షమై మనలో ఇమిడిపోతాయి. ఈ మనః స్థితి నుండి ఇంకొంచెం పైకి వెడితే ధ్యానం ద్వారా ఈశ్వరునికి మరింతగా సమీపం అయితే అప్పుడు ఒకే వ్యక్తి సర్వవ్యాప్తమై ఉన్నట్లుగా కనబడుతుంది. దానినే ఈశ్వరుడు (భగవంతుడు) అని అంటాం. అపుడు మనం ఏ వస్తువుని తాకినా లేదా మనల్ని మనం తాకినా మన ప్రియతముని తాకినట్లే అనిపిస్తుంది. అలా ఎందుకు అనిపిస్తుందంటే - మన అంతస్సు - మన హృదయం ఈశ్వరునితో అంతగా లయమైనదన్న మాట. ఆయన మన హృదయంలో నిండి, మనలోని తన ప్రతిబింబమును బాహ్యమునందు ప్రకాశింప చేస్తున్నాడన్న మాట.

ఇంతేకాక సర్వత్ర ఈశ్వరుని సాక్షాత్కారం అవుతుంది. ఏ రూపమూ ఉండదు. ధ్యాన తన్మయత మరియు సద్గురువు యొక్క పవిత్ర ప్రాణశక్తి సహాయం వల్ల "వారి" ఈ సర్వ వ్యాపకత మన ముందు ప్రత్యక్షం అవుతుంది. ఈ స్థితిలో - ఏ పరమ ఈశ్వరుని కోసమైతే ధ్యానం చేస్తున్నామో, ఆ ధ్యానం ఇప్పుడు 'వారి' లోనే లయమవుతూ ఉంటుంది. అనగా ధ్యానం మన నుండి దూరమవుతూ ఉంటుంది. మనం ధ్యానం చేయాలి అనే భావన కూడా ఉండనంతగా, మన నుండి అహం అనే బీజం తొలగిపోతుంది. ధ్యానంలో తన్మయత్వం ఏర్పడినప్పటి నుండి మనలోని 'అహం' అనే బీజం మాడిపోడం జరుగుతుంది. మన దృష్టి అన్నిటినుండి వెనకకు లాగబడి లక్ష్యమునే అంటిపెట్టుకుని దానియందే లయమగుటకు ప్రయత్నిస్తుంది.

ఈ దశ మనలో ఏ విధంగా మొదలవుతుంది ? ఎలాగంటే సద్గురువు శ్రీ బాబూజీ కృప వలన మొదట సౌందర్య తేజం ఎంతో ఆకర్షణీయంగా అనిపించి మన మనసు, హృదయము నందు ఆ దివ్య రమణీయత వ్యాపించి మనం పూర్తిగా ఈశ్వరుని లోపలే ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఇది ధ్యానం ఆరంభించినప్పటి తొలి స్థితి. ఆ తరువాత నేను పైన పేర్కొన్నట్లు - ధ్యానం ద్వారా ఆ సౌందర్యాన్ని త్రాగుతుంటాము - రసాస్వాదనం చేస్తాము. మనం దివ్యత్వాన్ని గ్రోలుతున్న కొలదీ - ధ్యానం యొక్క రెండవ స్థితి అనగా ఈశ్వరుని అత్యంత సామీప్యత స్థితి లేదా ఘటఘటవాసి అయి వుండటం అనగా సర్వవ్యాపితతత్వము అనుభవిస్తాం.

ఈశ్వరుడు ఎలా ఉంటాడు అన్నది మనకు తెలీనప్పుడు ఈశ్వర ధ్యానం ఎలా చేయగలం ? అని ప్రజలు అడుగుతారు. మనం ఈశ్వరుని చూడాలన్న కోరికతో ధ్యానం మొదలుపెట్టగానే స్వయంగా ఆయనే తానెలా ఉన్నదీ అప్పుడే మనకు దర్శనమిస్తాడు - ఇది నా ప్రత్యక్షానుభవం. ధ్యాన విశిష్టత ఏమంటే - ఏ స్థాయిలో 'వారి' దర్శనభాగ్యం పొందగలమో ఆ స్థాయిలో వరకు 'వారి' లో లీనమై యున్నట్లు గమనిస్తాం. "నిన్ను నేనెరుగుదును, నీ రూపమే దాల్చెదను" అనేది యదార్థం అవుతుంది. 'నిన్ను తెలుసుకున్నవాడు 'నీవే' అవుతాడు' అనుకోవచ్చు. భగవంతుణ్ణి తెలుసుకోడం అంటే ఆయన స్థితిని అందుకుని అందు లయమైనవాడు - అంటే ఇతడూ

అతడైపోయినట్లే కదా ! ఈశ్వరుని ఈ విశేషత మనకు మనదిగానే అనిపించి - మనమే ఘట ఘటవాసి అయినట్లుగా తోస్తుంది. దర్శనము యొక్క స్థితిలో మనం ఎంతెంతగా వ్యాపిస్తూ పోతామో 'ఆయన' అంతగానూ మనలో వ్యక్తమవుతూ అదే స్థాయిలో మనల్ని తనలో లయం చేసుకుంటారు. ఇది ఈశ్వరుని గొప్పతనమే ! దానితోనే వారు అదే దశ, అదే దర్శన స్థితి చూపించిననూ - ఆ దశ, స్థితి మనదే అని అనిపించేట్టు చేయడం 'వారి' మహిమ. అది మన సద్గురువు శ్రీ బాబూజీ మహరాజ్ వారి గొప్ప కృపా రహస్యం. ఆయన మనకు కేవలం ఈశ్వరుని దర్శనం చేయించుటే కాక ఆయన కృపాశక్తి ద్వారా మనల్ని అందులో ఎలా లీనం చేస్తారంటే ఆ ప్రత్యేకమైన గొప్పదనం ఈశ్వరునిదో మనదో కూడా మనం మరచిపోతాం. ఈశ్వరుని ఈ పరమ కృపా విశేష రహస్యం ఇలా వెల్లడవుతుంది. ఈశ్వరుని ప్రేమ రూపమైన మాతృమూర్తి ఇప్పుడు మనల్ని తన ఒడిలోకి తీసుకోడానికి ఆతృత పడుతోందనే రహస్యం ఈ విధంగా బహిర్గతమవుతోంది. ఈశ్వరుడు మనలను తన ఒడిలోనికి - తన అత్యంత సామీప్యంలోకి తీసుకుని మనల్ని మన అస్తిత్వం (నేను) నుండి వేరు చేసి తన దివ్య అస్తిత్వంలో (మూలస్థానంలో) కలుపుకుంటారు. ఎందుకంటే 'మాతృమూర్తి' అనే ఈశ్వరుడు తన బిడ్డను ఏ విధంగా స్వచ్ఛమైన రీతిలో సృష్టించాడో అదే రీతిలో తన బిడ్డను చూడాలని కోరుకుంటాడు.

ఇప్పుడు ధ్యానం యొక్క ఆ ప్రక్రియ పూర్తయి పోయింది. ఎలాగంటే - ఎవరిని కోరి ధ్యానం చేస్తున్నామో - వారిలోనే ధ్యానం లయమైపోయింద. 'ఈశ్వర దర్శనము' ప్రత్యక్షమై వ్యాప్తి చెందింది. దీనికి అతీతంగా ఉన్న, ఈశ్వర దర్శనం తర్వాత గల ఆ 'అంతిమ - సత్యము'ను ఎవరో చాలా అరుదుగా మాత్రమే చూడగలరు. ఆ స్థితిని మనకు ప్రసాదించగల సామర్థ్యము, ఆ వ్యాప్తిలోనికి ప్రవేశాన్ని కల్పించగల శక్తి కేవలము శ్రీ బాబూజీ మహరాజ్‌కు మాత్రమే కలదు - అని ఈ రోజున నేను ఘంటాపదంగా చెప్పగలను. ఇచట వారిని సద్గురువు అని అనడం కూడా చాలా చిన్న మాటే అవుతుంది. ఎందుకంటే మనకు ఈశ్వర దర్శనం ప్రసాదించుటతోనే సద్గురువు యొక్క కార్యం పూర్తయిపోయింది. భగవత్ భక్తుల్ని తనకు హత్తుకుని - తల్లి బిడ్డను

చేరదీసి, చేయందించి వెంట నడిపించుకుని పోయినట్లుగా - ఈశ్వర ప్రాప్తికి అవల లేదా పైన ఉన్నటువంటి అంతిమ సత్యము యొక్క ఆ అద్భుత దృశ్యమును మన కొరకు ప్రత్యక్షం చేయగల్గునది కేవలం విశిష్ట వ్యక్తిత్వము (స్పెషల్ పర్సనాలిటి) కలవారు అనగా శ్రీ బాబూజీ మహరాజ్ గారు మాత్రమే అనే సత్యం ఇపుడు నిజమనిపిస్తోంది. ఆ ఆశ్చర్య కరమైన దృశ్యాన్ని వేదాలు 'నేతి - నేతి' (ఇది కాదు - ఇది కాదు) అని నిర్వచించాయి. దానినే మహాత్ములు 'అనంతము' అని అన్నారు. దానినే కబీర్, హద్ - మరియు అన్‌హద్‌నకు (ఈశ్వర సాక్షాత్కారము మరియు అనంతమునకు) మధ్యన గల స్థితి అని అన్నారు. ఆ దివ్య పురుషుడు శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క ఈ శక్తి ఎలాంటిదంటే దానిలో 'శక్తి' అనే ఊహ (ఎఱుక) కూడా లేదు. శ్రీ బాబూజీ మహరాజ్ వారి ఈ శక్తి వల్లనే కాబోలు ఒక రోజున నా కలము ఈ విధంగా వ్రాసింది. "ఖుదాహో, యానహో యే బాబూజీ జానే, హమారే దిలోం మేం సమాయే వో తుమ్ హో"'

"ఈశ్వరుడున్నాడో లేడో అనే విషయం బాబూజీకే తెలియాలి !
మా హృదయంలో పదిలమై ఉన్న "వారు" మీరు మాత్రమే"

శ్రీ బాబూజీ మహరాజ్ మనకు ఈశ్వర సాక్షాత్కారం చేయించిన రోజునే మన యాత్ర పూర్తి అయిపోయింది. సాక్షాత్కారమే గాదు ఈశ్వర రూపంలోని మాతృమూర్తి యందు శ్రీ బాబూజీ మనలను ఎలా లయం చేస్తారంటే - ఈశ్వరుని విశిష్టత మన విశిష్టతగానే అనిపించునట్లుగా - లయం చేస్తారు.

ఈశ్వరీయ గతి యొక్క యాత్ర ఈ విధంగా పూర్తి కాగానే దానికంటే ముందుకు తీసుకువెళ్ళగలిగేది ఎవరు ? వారు ఎవరంటే దానిని దాటిపోయి కూడా ఇంకా చాలా పొందగల్గినవారు, ఈశ్వర దర్శన స్థితి తర్వాత కూడా ఇంకా ఏదో చూడగల్గినవారు మాత్రమే ! అటువంటి దివ్య పురుషుణ్ని కేవలం 'జోహై సోహై' అనగా 'ఎంతటి వారంటే 'అంతటి' వారు' అని మాత్రమే కీర్తించగలం. అంటే ఈ అంతిమ స్థితిని చేరి దానిని దర్శించి, అనుభవించిన వారే "ఆ స్థితి 'అంతటి' వారు". అంటాం. వారికి ఏ నామధేయమూ సరితూగదు. ఈ ఈశ్వర దర్శన స్థితికి అవల ఉన్నటువంటి

- అంతిమ స్థితికి చేర్చటమనేది బాబూజీ మహరాజ్ మాత్రమే ప్రసాదించగల్గిన ఒక దివ్యమైన వరం. ఎలాగంటే మనం ఈశ్వరీయ మార్గమును కూడా దాటి ఇంకా ఆవలకు వెళ్ళుట కొరకు వారు ఒక అతి సూక్ష్మము, సహజము లేక స్వాభావికమైన 'సహజ మార్గము'ను మన కొరకు ప్రసాదించారు. బాబూజీ మహరాజ్ వంటి దివ్యపురుషులు 'నభూతో నభవిష్యతి' అని చెప్పవచ్చు. ఇటువంటి అద్భుత, విశిష్ట వ్యక్తిత్వం యొక్క ఉదాహరణ మరొకటి ఇంతకు ముందు లేదు. ఇక ముందు రాదు. నేను చాలా జాగ్రత్తగా సునిశితంగా గమనించినదేమంటే ఈశ్వర సాక్షాత్కారం తర్వాత మనం ఈశ్వరుని యొక్క సామీప్యతను పొందాలంటే అది కేవలం శ్రీ బాబూజీ గారి వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. మరో విధంగా చెప్పాలంటే మనం 'వారి'లోనే లయమై ఉండి 'వారి' దృష్టితోనే ఈశ్వరుని యొక్క వ్యాప్తిని చూస్తూ పోతాం. దీనితో పాటుగా, 'వారు' దివ్య అంతిమ సత్యం యొక్క వ్యాప్తిని కూడా మన ఎదుట ప్రత్యక్షం చేస్తారు. మనకు వారు కేవలం ఈశ్వర దర్శనం లేదా సాక్షాత్కారం మాత్రమే ప్రసాదించుటయే కాకుండా ఈశ్వరుని యందు లయం చేసి, మనలను విస్మృతావస్థలో అనగా మరపు స్థితిలో ఉంచి - అసలు ఇది పెద్ద విశేషమైనదేమీ కానట్లుగా చేస్తారు. శ్రీ బాబూజీ గారు చెప్పినట్లుగా 'ఈశ్వరునికి కూడా ఒక వేళ తాను ఈశ్వరుణ్ణి అని తెలిసినట్లయితే అతడు ఈశ్వరుడు కానేకాదు' అనే మాటలు ఈ దశలో నిజమనిపిస్తుంది. ఇప్పుడు ఇక్కడి శ్వాసతోనే జీవిస్తున్నామా? మన శరీరములో ప్రాణమున్నదా లేక ఇది నిర్జీవమై ఉన్నదా ? ఇది ఏ విధంగా పని చేయుచున్నది ? - అనే ఈ విషయాలు చెప్పడం చాలా కష్టమవుతుంది. ఇవన్నీ మనల్ని ఆ అద్భుతమైన విరాట్ మరియు (మహా) మహత్ వ్యాప్తి యందు కూడా లయం చేసి సశరీరంతో ఉండునట్లుగా చేయు శ్రీ బాబూజీ మహరాజ్ వారికే తెలుస్తుంది. అప్పుడప్పుడు మనకు కూడా ఎటువంటి అనుమానం కలుగునంటే అసలు ఈ శరీరం జీవించి ఉన్నదా లేక నిర్జీవమై యున్నదా అని, అనిపిస్తుంది. ఎందుకంటే శరీరాన్ని ముట్టుకొన్నప్పటికీ మనకు దాని స్పర్శ కూడా తెలీదు. కాని ఎక్కడికైతే 'వారు' మనల్ని తీసికొని పోతారో ఆ స్థితిలో ఇవన్నీ కూడా

చాలా అల్పమైనవిగా తోస్తాయి. ఇప్పుడు మనకు ఏ విధంగా అనిపిస్తుందంటే మన ఉనికి కొరకు ఏవయితే అవసరమో ఆ ప్రాపంచికమైన విషయాలన్నింటితో కూడా మన సంబంధం పూర్తిగా తెగిపోయినట్లనిపిస్తుంది. నేను తరచుగా శ్రీ బాబూజీగారికి ఈ విధంగా వ్రాసేదానిని "సిగ్గు, మర్యాద, గౌరవం, సంకోచం - ఇవన్నీ అవసరమైనప్పుడు వాటంతటవే నాలో ప్రవేశించి వాటి పనిని అవి చేసుకుని మళ్ళీ వెళ్ళిపోయేవి" అని. ఎక్కడికంటే ఎవరికి తెలుసు ? నాకు ఏ విధంగా అనిపిస్తోందంటే ఈశ్వర దర్శనం వరకు కూడా ఇవన్నీ ఏదో ఒక రూపంలో నాలో ఉండేవి. ఎప్పుడైతే బాబూజీ మహరాజ్ వాటికంటే కూడా సూక్ష్మమైన దానియందు నా వ్యాప్తిని వ్యాపింపజేయుట ప్రారంభించారో, అవి ఇక నాలో మిగిలి ఉండడానికి స్థానం ఎక్కడ ఉంది ? ఆత్మోన్నతి యొక్క యాత్రలో ఈశ్వర దర్శనం (భగవత్ సాక్షాత్కారం) 'అనంతయాత్ర' యందు చిట్టచివరి మజిలీ - స్థానం అని నాకు అనిపిస్తోంది. దీనిని ఇప్పుడు 'అనంతం' అని అనాలా లేక ఏమని అనాలి ? నాకేమీ అర్థం కావడం లేదు. ఏది అనడానికి కూడా అంతుబట్టనిదిగా వుంటోంది. వారు దర్శనం చేయించిన ఆ దివ్య స్థితికి నేను సాక్షిని, అని ఒక్కోసారి అనిపిస్తుంది. కాని వారు అందులో లీనం చేసిన తర్వాత, నేను సాక్షిని అని చెప్పటం కూడా కష్టంగా అయిపోయింది. సాక్షిగా ఉన్నప్పటికి - ఎప్పటి వరకు ఏ స్థితికి నేను సాక్షిగా ఉన్నానో, ఆ స్థితి యొక్క ఆనందం అనుభవించుటలోని సూక్ష్మ స్థితి ఎక్కడో అక్కడ ఏదో ఒక దశలో ఉండి ఉంటే - దాని గురించి కొంచెమైనా ఆనవాలు ఇవ్వగలను. కాని అలా జరగడం లేదు. ఎందుకనగా సాక్షియే తన అంతిమ లక్ష్యంలో లయమైపోయినప్పుడు ఆ అంతిమంలో ఏముందో ఎలాగుందో ఇంక ఎవరు చెప్పగలరు ? ఆ దశయే తానేమిటో, ఎలాగుందో స్వయంగా చెబుతూ పోతోందని తెలిసింది.

శ్రీ బాబూజీ మహరాజ్ ఈశ్వరీయ స్థితులకు ఆవల ఉన్నతమైన దివ్య వ్యాపనం యొక్క దర్శనం చేయించుచున్నారో లేక నా ముందు ప్రత్యక్ష పరుస్తున్నారో ఆ అపురూపమైన అంతిమ సత్యదశను, ఆ అలౌకిక

ఆశ్చర్యాన్ని నేను ఇప్పుడు చెప్పలేకపోయినా 'వారి' కృపతో ఏ కొంచెమైనా వ్రాయగలుగుట లేక సూచనగా ఇవ్వగలుగుట భవిష్యత్తులో ఎప్పుడైనా సంభవిస్తే అప్పుడు తప్పక చెప్పగలను. ఇప్పటి వరకు "ముందుగా నేనే చూస్తున్నాను. నేనే వ్రాస్తున్నాను." అని అనిపించేది. తర్వాత - కలం ఆయన పట్టుకున్నారు. వారే ప్రత్యక్షతను ప్రసాదించారని అనిపిస్తూంది ఇప్పుడు. ఆపై శబ్దాలు, భాష కూడా ఆయనే ఇవ్వసాగేరు. 'వారి' వరదానం వల్లనే వారి దైవిక భాషలో చదివి కలం ద్వారా వ్రాయగల సాహసం నాకు కలుగుతోంది.

మార్గం అయితే సమాప్తమైంది. 'సహజము' సహజంలోనే ప్రవహిస్తోంది. ముందు ముందు ఏమేమి జరుగుతాయో ఎవరికి తెలుసు? ముందు ముందు ఇంకా మనలో ఏ ఏ స్థితులు ప్రత్యక్షమవుతాయో? ఈ ప్రపంచంలోని ప్రాణులందరి కోసం ఒక అల్పజీవియైన వారి ఈ బిడ్డ యొక్క కలం ద్వారా శ్రీ బాబూజీ ఏమేమి వ్రాయిస్తారో ఎవరికి తెలుసు? ఈశ్వరుని యొక్క దివ్య రహస్యాన్ని ఎవరూ విప్పకూడదేమో. ఎందుకని అంటే ఈశ్వర దర్శనం యొక్క స్థితికి వచ్చిన తర్వాత తన భక్తుణ్ణి ఆ స్థితి యందు వ్యాపింపజేసి అందులో లయలీనం చేయడం వల్ల, లయమవుతూన్న దశలో కూడా అతడు దానిని వ్యక్తం చేయలేకపోతాడు. సద్గురు శ్రీ బాబూజీ మహరాజ్ అభ్యాసులను ఈశ్వరీయ పరమగతికి అతీతంగా ఎప్పుడు తీసుకువెళతారో అపుడు 'వారు' మరింత జాగ్రత్త తీసుకుంటారు. అది ఎలాగంటే ఎవరైతే ఇప్పటి వరకు వారి రహస్యాలను వారు ప్రసాదించిన స్థితుల ద్వారా సాక్షిగా నిలిచి - వెల్లడి చేస్తూ యున్నారో, వారినిపుడు శ్రీ బాబూజీ మహరాజ్ అలా సాక్షిగా ఉండే ఆ దశ నుండి వేరు చేసేస్తారు. కాని సమస్త దివ్య రహస్యాలు వెల్లడి అయినప్పటికినీ ఇంకా ఎక్కడో ఆ అద్భుత రహస్యం యొక్క ఏదో బిందువు మరుగై ఉందని నాకనిపిస్తోంది. ఇంకా చెప్పవలసిన రహస్యం ఏదో మిగిలి ఉందని నేను చెప్పక తప్పటం లేదు.

# 7. ప్రాణాహుతి

శ్రీ పూజ్య బాబూజీ మహరాజ్ వారిచే ప్రవేశపెట్టబడిన సహజమార్గ్‌లో ప్రాణాహుతికి విశేష ప్రాధాన్యత ఉంది. వాస్తవానికి సాధనకు ప్రాణాహుతి ప్రాణం వంటిది. ప్రాణాహుతి అనగా - 'యోగం యొక్క పూర్ణ ఆహుతి' అని సంపూర్ణార్థము. అనగా ఈశ్వరునిలో కలిసిపోవుటకు మన అహంను ఆహుతి చేయుట. ఈశ్వరునితో యోగము కలుగుటలో ఈశ్వరీయ శక్తి మనలో ప్రవేశించుటే కాక దానిపై అధికారం కూడా లభిస్తుంది. మనలో ఈశ్వరుని (ప్రియతముని) తో అనుబంధం పెనవేసుకుంటున్న కొలదీ మనలో మేల్కొల్పబడిన చైతన్యశక్తి స్వయంగా తన ఆత్మ వికాసం కోసం ప్రయత్నిస్తూంటుంది. ఈశ్వరునితో యోగం పొందే దిశలో మన వేగం కూడా పుంజుకుంటూంటుంది. మరికొంత పురోగమించి పరమ శక్తితో ఒక హద్దు వరకు మన యోగము జరిగినపుడు ఇదే పావన శక్తిని మనం, మానవ మాత్రుల ఆత్మ వికాసం కొరకు ప్రయోగించడంలో సఫలీకృతమవుతాము. అనగా లక్ష్యములో మన యోగము పూర్తియైనపుడు మనం నిశ్చింతులమైపోగా ఈశ్వరీయ శక్తి దానంతటదే నిరవధికంగా ప్రవహిస్తూనే ఉన్నట్లు నేను చూశాను. మనం ఎవరితోనైనా ఆత్మ సాక్షాత్కారానికి సంబంధించి ఏకాగ్రతతో మాట్లాడుతూ ఉంటే ఆ పవిత్ర ధార స్వయంగానే ఆ యితరులలో చోటు చేసుకోడం మొదలవుతుంది. ప్రాణాహుతి యొక్క పావన శక్తి ఇదే !

బాబూజీ మహరాజ్ స్వయంగానే అభ్యాసీని శక్తితో యోగం చేయుట కూడా నేను చూశాను. ఆ పరమ శక్తి మీద పూర్ణాధికారం కలిగిన వారికి ఆ శక్తితో అభ్యాసికి సంబంధం ఏర్పరచడం అనేది సుసాధ్యమవుతుంది. ఆ ప్రకారంగా వారి నుండి శక్తి పొందబడిన అభ్యాసీలను శ్రీరామచంద్ర మిషన్‌లో "ప్రిసెప్టర్" అని అంటారు. వీరు ఉన్నతిని పొందుతూ స్వయంగా సద్గురువుతో పూర్తిగా విలీనమగుచుండునపుడు ఆ నిరంతర పావనధార వారి ద్వారా అంతటా వెదజల్లబడుచూ ఉంటుంది. ఇదే ప్రాణాహుతి యొక్క నిజమైన శక్తి. మనలో స్వతహాగా 'ప్రియతముని' యొక్క యోగం ద్వారా ఉత్పన్నమైన స్థితియే నిజమైన స్థితి. యోగి ప్రాణాహుతినిస్తాడు. ఇంతలో ప్రాణాహుతి కూడా దానంతటదే ప్రసరిస్తూ వ్యాపిస్తూ ఉంటుంది. యోగం

అంటే అర్థం "మనను" లేకుండా చేసుకోడమే, "నేను" అనేది సమాప్తమగుట అని యిప్పుడు నాకు తెలుస్తోంది. ఎందుకంటే సంయోగం ఎక్కడయితే ఉందో వియోగం యొక్క భావన కూడా అక్కడే ఉంటుంది. సంయోగ వియోగములున్నంత వరకు అనగా లయమవుతూ మళ్ళీ 'నేను' అనే భావంతో విడివడుతున్నంత వరకు మనం ఆ 'యోగి' అనిపించుకోలేము. 'నేను' అనేది పూర్తిగా నశించిపోయే వరకు, అలాంటి స్థితిని చేరుకునేవరకు మనను యోగి అని అనరు. యోగమునకు ప్రామాణికమైన అర్థం 'నేను' ను (మనలను మనం) ఆహుతి లేదా త్యాగం చేసుకోవడమే. జీవుడు పరమాత్మతో ఐక్యమగుటయే యోగము అని అనుభవ పూర్వకముగా తెలుస్తుంది. జీవుడు జీవునిగా ఉన్నంత వరకు (అతనిలో 'నేను' జీవించి ఉన్నంత వరకు) ఈశ్వరునిలో లయము కాలేడు. ఈశ్వరుని యందు లయం చెందడం లేదా యోగం పొందడం ప్రారంభమవగానే అప్పుడు జీవుడు యోగి అని పిలువబడతాడు. జీవుడు ఈశ్వరునిలో లయమవగానే అక్కడ ఒక్కరే (ఈశ్వరుడే) మిగులుతారు. జీవి ఈశ్వరునిలో కలిసిపోయింది. యోగమునకు వాస్తవమైన అర్థం మనలోని 'నేను' అనేది పూర్తిగా కరగిపోవుటయే. ప్రాణాహుతి యొక్క నిజమైన యోగిక శక్తి (అంటే మనలో తనకు తానే స్వతఃసిద్ధంగా ఉత్పన్నమయ్యేది) మనం ఈశ్వరునితో యోగం చెందినందువల్ల కల్గిన ఆంతరిక పవిత్ర స్థితి వల్ల ఏర్పడగలదు. ఆ విధంగా ఎవరినైతే బాబూజీ ప్రిసెప్టరుగా తయారు చేస్తారో, ఎవరినైతే ఇతరుల ఆత్మ కళ్యాణం కొరకు సహాయార్థంగా శక్తినిచ్చి సిద్ధ పరుస్తారో అటువంటి వారు ప్రిసెప్టరు అనదగి వుండి ప్రాణాహుతి నివ్వగల సమర్థులవుతారు. మాలిక్ ఇలా ప్రాణాహుతి శక్తి ఎందుకిస్తున్నారంటే, తాము ఇచ్చిన శక్తిలో మొట్టమొదట ప్రిసెప్టర్లు, తమకు తాము ఈశ్వరునితో యోగం చెంది, తిరిగి దానిని యితరులకు కూడా అందించగలరని ! ఇందువలన మనసులోకోరిక జనించినంతనే ప్రాణాహుతి ప్రసార కార్యం ఆరంభమైపోతుంది. వాస్తవ పరివర్తన స్థితి (రియల్ ట్రాన్స్‌ఫర్మేషన్) లేదా యోగి - స్థితిని పొందిన వ్యక్తి నుండి ఈ ప్రాణాహుతి దానంతటదే ప్రవహిస్తూ ఉంటుంది. సద్గురువు నుండి పొందిన శక్తి వల్ల యిటువంటి వ్యక్తి మొట్టమొదటగా అభ్యాసుల హృదయాలలోని అపవిత్రతను

తొలగిస్తూ పోతుంటే దాని వలన ఈశ్వరీయ స్థితి ఉత్పన్నమగుటకు గాను యోగ్యమైన క్షేత్రం (స్థానం) ఏర్పడుతూ వుంటుంది. అప్పుడు అభ్యాసుల అంతరంగం, హృదయము నందు మార్పు లేదా పరివర్తన లేదా విశుద్ధమైన నిర్మాణం జరిగి ఒక సుముహూర్తమున ఈశ్వర అంకురార్పణ జరిగి వారు తన్మయతను (ఆనంద పారవశ్యాన్ని) పొందుతారు. ఇటువంటి వ్యక్తుల ద్వారా ఆంతరికమైన ఏ స్థితి నుండి ప్రాణాహుతి దానికదే ప్రవహిస్తూ ఉంటుందో, అక్కడ కలిగే ఒక లాభం ఏమిటంటే వారి కార్యంలో, వారి నిర్వహణలో ఏదైనా లోపం వస్తే అది కూడా అప్రయత్నంగానే సవరించబడుతుంది. దానితో పాటుగా అభ్యాసీ హృదయ పవిత్రత కూడా పెంపొందుతూ ఉంటుంది.

ప్రాణాహుతి పొందేటపుడు అభ్యాసీని ఆ ఈశ్వరునిలో లయావస్థను కలుగజేసేదే నిజమైన ప్రాణాహుతి ప్రవాహంగా నేను భావిస్తాను. అప్పుడు ఆ ప్రిసెప్టర్ ద్వారా జరిగే ప్రతి కార్యము నందు కూడా వారి మహత్ ప్రాణశక్తి నెలకొని ఉంటుంది. ఇటువంటి మహత్ ప్రాణాహుతి శక్తి వలన రెండు లాభాలుంటాయి. మొదటిది మానవుని ఉద్ధరణ లేదా ఆత్మ వికాసము యొక్క కార్యము, చక్కని క్రమబద్ధమైన రూపంలో ప్రారంభమవుతుంది. రెండవది అభ్యాసీకి తెలియకుండానే ఈ పావన ధార అప్రయత్నంగా అతనిలో పనిచేస్తూ ఉంటుంది. ఎందుకంటే ఈ పావన ధార అంతరంగాన్ని పవిత్రం చేస్తూనే అభ్యాసీని, ఈశ్వర సాన్నిధ్యంలోకి తీసుకు వెళుతుంది. ప్రిసెప్టరు ప్రాణాహుతినిచ్చేప్పుడు - అభ్యాసీ హృదయంలోని మలినములు, అపవిత్రత తొలగి పోతున్నాయని, అతని అంతరంగం ఈశ్వర ప్రాప్తికి యోగ్యంగా తయారవుతోంది - అన్న ఆలోచన, భావన మాత్రమే కలిగి ఉంటాడు. ప్రిసెప్టరు ఆలోచనలోని ఆత్మ ప్రేరణ (సజెషన్) అభ్యాసి యొక్క స్థితిని స్వచ్ఛంగా సహజంగా మరియు ఈశ్వర ప్రాప్తికి అనుగుణంగా తీర్చిదిద్దడం ప్రారంభిస్తుంది. అభ్యాసీని ఆ ఈశ్వరీయ ప్రాణశక్తి ఎలా తయారు చేస్తుందంటే - సిద్ధం చేస్తుందంటే ఒక రోజున అతడు మహత్ తత్వమైన పరమేశ్వరునిలో లయమగుటకు కావలసిన యోగ్యతను పొందుతాడు. ఇది ఇలా తప్పకుండా జరుగుతుంది. ఎంచేతంటే ఈశ్వరీయ

విషయములందు శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క సంకల్పశక్తి పరిపూర్ణంగా ఉంది. బాబూజీ మహరాజ్ నాకు తరచుగా వ్రాసేవారు "రెండు స్థితులు కలిసి, తోడుగా కొనసాగుతాయి" అని. మొదటిది: ఇపుడు మనమున్న దశ - దీనిని సామ్యత అని గాని ఆనందము అని గాని అనవచ్చు. ఈ మొదటి స్థితిని అంటిపెట్టుకునియే ఈ రెండవ స్థితియైన ఆంతరిక స్వచ్ఛత అనుభవమవుతూ ఉంటుంది. అనగా అంతరంగంలో ఉదయించిన ఈశ్వరీయ గతి (స్థితి) మరియు దానికి మూలము అంటే కారణము (మన యొక్క ఆత్మ) తోడుగా నడుస్తాయి. ఇక్కడ ఇది కూడా చెప్పగలను - ఏమంటే ఈ కారణమే - మన ఆత్మయే - ప్రాణాహుతి ద్వారా, స్వచ్ఛత నందుతూ - అభ్యాసీలో శక్తి ప్రవహింపచేస్తుంది. దానివల్ల అభ్యాసి యొక్క యోగము దాని మూలాధారమైన దానితో - ఈశ్వరునితో జరుగుతుంది. ఇలా సానురూపమవుతూ పోతూ ఒకానొక సమయాన అంతర దశ కారణంలో - అంటే ఆత్మలో నెలకొని యుండ సాగుతుంది. అపుడు కేవలం ఈశ్వరుడే మన ఎదుట ఉండుట ప్రారంభం అవుతుంది. పర్యవసానంగా అభ్యాసీ నుండి యోగిక మహత్ ప్రాణాహుతి దానంతటదే వ్యాపింపనారంభిస్తుంది. ఇక అప్పుడు అతడు ప్రిసెప్టర్ ఎదుట ధ్యానంలో అనగా సిటింగ్‌లో కూర్చోవలసిన అవసరం గాని, ప్రాణాహుతి యొక్క అవసరం కాని వుండదు. ఇలా ఎందుకంటే ప్రిసెప్టర్ ద్వారా ఇవ్వబడిన ప్రాణాహుతి అభ్యాసి అంతరంగాన్ని ఆ మహత్ ఈశ్వరీయ గతిలోనే కలపడానికి సహాయపడి ఉంటుంది. దానివల్ల అభ్యాసి ఇప్పుడు చాలా వరకు ఏకత్వాన్ని (కలయికను) సిద్ధింపచేసుకుని ఉంటాడు.

డాక్టర్ వరదాచారి గారు నాకు ఒక ప్రశ్న వేశారు. "నీవు కేంద్రమండలం (సెంట్రల్ రీజియన్) లో లేకుండానే ఆ ఉన్నత స్థితులకు చేరుకున్న వారి స్థితిని ఎలా తెలుసుకోగలుగుతున్నావు", అని. ఆ ప్రశ్న ఈ స్థాయిలో పరిష్కారమవుతుంది. మన లయావస్థ మహత్‌తత్వంలో కలిసిపోవుట ప్రారంభించినపుడు తనకంటే కూడా ఉన్నత స్థితిలో ఉన్నవారికి ధ్యానం అంటే సిటింగ్ ఇస్తున్నప్పుడు ఆ అభ్యాసికి ప్రాణాహుతి ఎక్కడి నుండి కావాలో ఆ స్థానం వరకు మనలను తీసికొని వెళ్ళుతుంది - అక్కడి వరకు

మనకు తెలియకుండానే వ్యాప్తి జరుగుతుంది. ఎదురుగా ధ్యానంలో కూర్చున్న అభ్యాసి యొక్క ఆవశ్యకతను బట్టి అంతే సూక్ష్మ ప్రాణాహుతి ప్రసారం మన ద్వారా జరగుతుంది. అంతేకాక ఆ దశ యొక్క స్థితిని చదవగలిగే శక్తి కూడా మన ద్వారా పని చేస్తుంది. ఇది అంతా సమర్థ సద్గురు శ్రీ బాబూజీ మహరాజ్‌లో లయావస్థ పొందడము యొక్క మహత్వమే కాని వేరేమీ కాదు. ఈ విధంగా మనం ఉన్నత స్థాయిలోని స్థితిని కూడా తెలుసుకొనగల్గుతాము. ఆ సమయంలో ఆ అనుభూతిలో మునిగిపోయిన మన దృష్టి 'వారి' ఆ ఉన్నత ఆత్మిక దశను (స్థితిని) చూస్తూ వుంటుంది. కాని ఆ స్థితికి దూరంలోనే ఉన్నట్లే అనిపిస్తుంది. ఈ నేల మీద నిలబడే దుర్భిణి (బైనాక్యులర్) సాయంతో పర్వతం మీది దృశ్యం ఎలా చూస్తామో అలాగే సద్గురువు (ఈశ్వరుని) యందు విశుద్ధ లయావస్థ వ్యాప్తి వలన మన దృష్టి కూడా ఉన్నతి స్థితి అనబడే ఆ పర్వత శిఖరానికి చేరుకోగలదు. ఆ ఉన్నత హద్దుకు (అనంతపు సరిహద్దుకు) చేరుకొని వారి ప్రాణశక్తిలో మిళితమై, లీనమై అక్కడి స్థితిని గ్రహించగలదు.

ప్రాణాహుతి శక్తి యొక్క ఈ గొప్పదనము మనం దానిలో కొంత అనుభవం గడించాక సహజంగానే అర్థమవడం మొదలవుతుంది. యోగిక ప్రాణశక్తిని మన అంతరంగములో పొందిన తర్వాత కొంచెం అనుభవం గడించాకనే తెలిసేదేమంటే వాస్తవంగా రెండుగా విడిపోయినటువంటి రెండు సామ్య (ఒకే రకం) వస్తువులను మరల పునః సంధానము చేయుటయే 'యోగం' అని తెలుసుకుంటాము. సృష్టి రచన యొక్క కేంద్రము లేదా మూలము అనునది నిశ్చలముగా, స్థిరంగా ఉన్నది. దానికి సంయోగ వియోగములంటూ ఉండవు. ఏదయితే (జీవుడు) దాని నుండి విడిపోయినదో అదే - దానితో యోగము అనగా కలయిక చెందును. జీవుడు అంతిమము నందు అనగా కేంద్రము నందు లయము కావడం తప్పనిసరి. జీవుడు ఎప్పటి వరకైతే తన సమరూపమైన (నిజ-రూపమైన) అస్తిత్వము నుండి విడిపోయి వేరుగా ఉండునో అప్పటి వరకు కూడా అతడు దారితప్పి కొట్టుమిట్టాడుతూ - భ్రమణం చేస్తూ అశాంతితో ఉండడం జరుగుతుంది. సంయోగము, వియోగముల మధ్యన గల స్థితియందు 'మూలము' నుండి

పావన శక్తి ప్రవాహము లభించుతూ ఉంటుంది. ఎప్పుడైతే మనం 'అంతిమం' నుండి విడిపోయి దూరమవుతూ పోతామో ఒక స్థితిలో మూలంతో శీఘ్రంగా యోగం చెందే అవకాశమున్నా కూడా దానిని కూడా విస్మరించి మనం అధోముఖంగా పడిపోవుట ప్రారంభమవుతుంది. ఆ పరిస్థితి వల్లే ఇప్పుడు మరల మనకు ఆ 'అంతిమము' తో యోగమును పొందటానికి ఆ 'మూలము' నుండి ప్రవహిస్తున్న శక్తియే అత్యవసరమవుతున్నది. ఏ స్థితి నుండి అయితే మనం అధోముఖమై, చిక్కుల్లో పడిపోయామో అక్కడి నుండే తిరిగి ఊర్ధ్వముఖం కావడానికి అనువైన ఆ శక్తియే - మన దురాలోచనల ద్వారా వేలాది తుంపరులుగా మారి అధోగతిలోనికి అంటే బాహ్య ప్రపంచంలోకి ప్రయాణింపజేస్తుంది. అనగా పైకి - ఉన్నతికి తీసుకువెళ్ళగలిగే శక్తి కూడా మన దురాలోచనలు - దారి తప్పిన ఆలోచనల వల్ల పలు బలహీన శక్తి ధారలుగా - తుంపరులుగా అయి క్రిందికి, బాహ్య ప్రపంచంలోకి మనం జారి పడిపోయేట్టు చేస్తుంది. అప్పటి నుండి మన పరిశుద్ధమైన మనస్సు చంచలమయి పోతుంది. దీనివల్ల మన అంతరంగం బలహీనమై భయానికి గురవుతూ ఉంటుంది. చెల్లా చెదురైన తుంపరల వెంట ప్రవహించిపోతూ మూలము లేదా అంతిమంతో యోగము కలిగి ఉన్న ముఖ్యశక్తి ప్రవాహము నుండి దూరమైపోతూ ఎంతగా పతనమై పోతున్నామో తెలీదు. అదుపు తప్పిన విమానం ఎప్పుడు ఏ విధంగా భూమిని ఢీ కొంటుందో చెప్పలేని పరిస్థితితోనే మన పరిస్థితి పోలి ఉంటుంది. కాలం గడచిన కొలది మనం వెడలి వచ్చిన 'మూలం' (ఉద్గమం) నే మరచిపోతాం. ఆడపిల్లకు వివాహమై అత్తవారింటికి వెళ్ళిన తర్వాత, ప్రారంభంలో ఆమెకు తన ఇంటిని గురించి లేదా తలిదండ్రులను గురించిన జ్ఞాపకము ఎక్కువగా ఉంటుంది. ఆ జ్ఞాపకాలతో ఆమె అశాంతికి గురై త్వరగా తన పుట్టిన యింటికి వెళ్ళాలని ఆలోచిస్తూ ఉంటుంది. కాని కాలం గడచిన కొలది, నెమ్మది నెమ్మదిగా ఆమెకు అత్తవారిల్లే పుట్టిన ఇల్లుగా అనిపిస్తుంది. తన పుట్టింటినే మరచి ఉంటుంది. ఎవరైనా పుట్టింటి నుండి ఆమెకు కబురు తీసుకొని వెడితే మళ్ళీ ఆమెకు పుట్టింటి జ్ఞాపకాలు వస్తాయి. మళ్ళీ గతం లాగే ఆమె హృదయంలో దిగులు ఏర్పడి ఎలాగైనా సరే పుట్టింటికి వెళ్ళాలనుకుంటుంది. ఇదే విధంగా

ఎప్పుడో ఒకప్పుడు ఎవరైనా సద్గురువు ఆ మహత్తత్త్వం లేక మూలముతో అనగా అంతిమంతో యోగం చెందినటువంటి వారు, జనులందరినీ ఆత్మ కళ్యాణమైన ముఖ్యధారలో ప్రవేశింపచేయాలనే గట్టి తలంపుతో వచ్చినప్పుడు అటువంటి వారి శ్రేష్ఠమైన తలంపులో ఆ పరమశక్తి (మూలశక్తి) వ్యాపిస్తూ ఉంటుంది. అలా వ్యాపించే పరమశక్తికి మహత్ అంటే ఆది (మాతృ) స్థానంతో యోగం కూర్చగల శక్తి సామర్థ్యం ఉంటుంది. అప్పుడే ఆ ఇచ్ఛాశక్తి అనగా సంకల్ప శక్తి ద్వారా ఆ మూలములో పునః ప్రవేశము చేయటానికి ప్రాణులకు సామర్థ్యం కల్గుతుంది. ఆ ముఖ్య యోగధార నుండి బాగా వేరుపడి చాలా దూరమైపోయిన ప్రాణులను ఆ సద్గురువు తన ఇచ్ఛాశక్తి అనగా సంకల్ప బలం అనే సహాయం అందించి మూలం లేదా అంతిమం వైపు వెళ్ళడానికి పురికొల్పుతాడు. ప్రపంచం అనే జలాశయంలో పలురకాల సంస్కారాలు అనే మాలిన్యాలతో రంగరించబడిన మానవ ఆంతరికమును తన ఇచ్ఛాశక్తితో ప్రాణాహుతి అనబడు యోగశక్తితో పరిశుద్ధం కావించుతాడు. ఇటువంటి పవిత్ర ప్రాణశక్తిని ఊతంగా ఇస్తూ ఒక రోజున మనం మన ఆది ధారలో మళ్ళీ ఐక్యం అనగా యోగం పొంది ప్రవహించగలుగునట్లుగాను, ఆ పిమ్మట మన మూలస్థానం వైపు తేలియాడిపోవునట్లుగాను మనల్ని తయారు చేస్తారు.

తరువాత దారి తప్పిన మనలను తిరిగి ముఖ్య ధారలోనికి ప్రవేశ పెట్టుటకు సద్గురువు ఎంతటి మెలకువ, సూక్ష్మశక్తి, దృఢశక్తులతో కూడిన దివ్య దృష్టితో పని చేయవలసి వుంటుందో అదంతా 'వారి' కే తెలుస్తుంది. కాని అలుపెరుగని నిరంతర కృషి ద్వారా ఆ సత్యము నందు ఎవరినైతే ముంచి తీస్తారో దాని వల్ల వారు తిరిగి తమ అసలైన పరిశుద్ధ స్థితిని పొంది ఆయన పవిత్రమైన ప్రాణశక్తి ద్వారా ఈశ్వరునితో యోగం పొంది యోగ్యుడై యోగిగా అయిన వారు కూడా - కొద్దిగా తెలుసుకోగలుగుతారు. ఆ స్థితిని పొందిన వారు గురువు నుండి పొందిన ప్రాణాహుతి శక్తితో తమ ఆత్మ కళ్యాణముతో పాటు 'వారి' కృప వలన ఇతరులను కూడా ఈశ్వరునిలో ఐక్యమొందించుటకు సమర్థ సహాయకారు లవుతారు. అయినా 'మాలిక్' 'మాలిక్' యే. ఈ విధంగా గురువు యజమానిగా తమ బాధ్యతలు

నిర్వర్తించుచున్నారు. వారు (మాలిక్) తమ ఇచ్ఛాశక్తితో ఆ పరమశక్తితో మన హృదయాన్ని కొంచెమైనా యోగం చేసి - మనలో నుండి ఎవరినైనా సరే ప్రాణశక్తి ద్వారా ఇతరుల అంతఃకరణాన్ని పరిశుద్ధం చేసే పని అప్పచెప్పగలరు. అనగా ప్రిసెప్టరుగా తయారు చేస్తారు. తమ దృఢభక్తితో ఆ పావన ఈశ్వరీయ ధారా సంబంధిత ప్రవాహమును పొంది సద్గురువు యొక్క ప్రేమ ద్వారా ఉద్గమం (మూలం) ముఖ దర్శనం పొంది వారి (బాబూజీ) బాధను గుర్తించినవారై, ప్రేరణతో తమ ప్రాణశక్తి ప్రవాహం ద్వారా అందరికీ ఉద్గమం (మూలం) తో సంబంధం (యోగం) కలుపుటకు తహతహ లాడుతూ ఉండేటటు వంటి అభ్యాసీలను ప్రిసెప్టర్లుగ చేస్తే వారిలో నిబ్బరము, పరిపూర్ణ ఆత్మ విశ్వాసము నెలకొంటాయి. ఇలాంటి వారిని ప్రిసెప్టరుగా తయారు చేయుట దివ్య కార్యము. అలా కాక ఏ అభ్యాసినైనా ప్రిసెప్టరుగా చేసినా కూడా అతని ద్వారా ప్రాణాహుతి కార్యం జరుగుతూనే ఉంటుంది. కాని అతనిలో ఆ దృఢత్వం ఆత్మ విశ్వాసం ఉండదు. అతడు అభ్యాసీల హృదయాల్ని ప్రాణాహుతి శక్తి ద్వారా పరిశుద్ధంగానైతే చేస్తాడు. అపుడు ఆ పరిశుద్ధత ద్వారా అభ్యాసీలలో లక్ష్య ప్రాప్తికి ఆతురత, అనుబంధం కల్గి ఉండి వారు సద్గురువుతో అనుబంధం ద్వారా అంటిపెట్టుకుని ఉంటే అప్పుడు వారిలో ఈశ్వరుని పొందడానికి ఏయే విషయాలు అవసరమో - ప్రేమ, భక్తి, దృఢత్వం, లయావస్థ - ఇవి స్వయంగానే జనిస్తాయి. కాని ఆ అనుబంధం, ప్రేమ లేకపోయినచో ఆ అభ్యాసికి లోపల - ఈశ్వరునితో కలవాలనే తపన, అనుబంధం, ప్రేమ, భక్తి మొదలైనవి సమకూరవు. సరిగ్గా ఆలోచిస్తే ప్రిసెప్టర్ అనగా గురువు తప్ప వేరే కానేకాదు - అన్న బాబూజీ మాటలను యదార్థం కావించడానికి యోగ్యమైన దివ్య గుణాలు అట్టి వారిలో పొడసూపవు.

మానవుడు ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలనధిరోహించినప్పటికి సదాచారము అనగా సత్ప్రవర్తన, సౌశీల్యము లోపించినట్లైతే గురుదేవులకు ప్రీతిపాత్రుడు కానేరడు, అని పూజ్యులు లాలాజీ గారు (శ్రీరామచంద్రజీ - ఫతేగఢ్) చెప్పారు. ఇది నిత్య సత్యము. మన హృదయం ఆ విరాట్ హృదయంతో యోగాన్ని పొంది దివ్యత్వం చెందుతూ పోవడమే సౌశీల్యానికి

నిజార్థము. ఏ సద్గుణములయితే మనం దివ్యత్వము పొందుటకవసరమో ఆ దివ్య గుణాలు మనలో ప్రత్యక్షమౌతాయి. ఆ అనుభవం కూడా మనకు కలుగుతుంది. ఎత్తయిన పర్వతం మీద వేపచెట్టు నాటితే దాన్ని వేపచెట్టు అనే పిలుస్తాం. ఎందుచేత నంటే దాని గుణంలో మార్పు లేదు కాబట్టి. ఆ విధంగానే ఒకవేళ మన అంతరంగం మన ప్రియతమునితో యోగం పొందీ మనలో ఆ పరిశుద్ధత - ఆ ఈశ్వరీయ గుణములు వికసించకపోతే ఆ కలయిక కలయికే కాదు. అటువంటి యోగం ఏదో ముసుగులోనిదే. అటువంటి యోగశక్తి యొక్క సహాయాన్ని పొందిన తరువాత కూడా ఆ ముసుగు ప్రియతముని వల్ల తొలగించబడక మనలో ఆ ఈశ్వరీయ వికాసం కలుగకపోతే యదార్థానికి మనం ప్రియతముని యందు పూర్తిగా కలిసిపోలేదని మనం అర్థం చేసుకోవాలి. ఆ కలసిన స్థితిలో "నిన్ను తెలుసుకోవాలనుకుంటూ నేనే నీవుగా అయ్యాను," అన్న మాటలు పూర్తిగా సార్థకమౌతాయి. సద్గురువు ఇచ్ఛాశక్తితో యోగం పొంది యోగశక్తితో స్వయంగా కలయిక యొక్క పూర్ణలాభం మనమూ పొందుతాము. అందరి ఆత్మోన్నతికి కూడా తత్పరత, దృఢమైన, ఆత్మ విశ్వాసంతో పనిచేయగల సామర్థ్యం పొందుతాము. ఎందుకంటే - ఆయన యొక్క యోగం మనలో పరిశుద్ధతను ఏర్పరస్తుంది. జన్మ భూమికి తిరిగి వెళ్ళవలెనని చెప్పటం చాలా సులభము. కాని మన లక్ష్య ప్రాప్తికి సహజ మార్గమును వెదకి తెచ్చినవారే జన్మభూమికి తిన్నగా వెళ్ళగల మార్గములో మనలను నిలబెట్టగలరు. సంకల్పము, శక్తి - పూర్ణ రూపములో కలిగిన వారే అందరిని ఆ మూలములో కలుపుటకు గల మార్గములన్ని తెలిసినవారై ఉంటారు. అప్పుడే పరమాత్మలో ఇమిడి ఉన్న యోగిక ప్రాణశక్తి ధార ప్రాణి మాత్రుల ఆత్మోన్నతికి తనంతట తానుగ ప్రవహిస్తూంది. ఇటువంటి మహాత్ములు ఎప్పుడో ఎవరో ఈ ప్రపంచంలోకి అరుదుగా వస్తారు లేదా పంపబడతారు. అసలైన ప్రాణాహుతి అంటే అదే. అలాంటి విశిష్ట వ్యక్తిత్వం ద్వారానే ప్రాణాహుతిని పొందగలం.

ఎవరికైనా తన వస్తువు నిచ్చివేయుట చాలా సులభమే. ఎందుకంటే కేవలం వస్తురూపంలో అనగా స్థూలరూపంలో అది మనల్ని వదలి వెళ్ళిపోతుంది కనక. కాని ఎవరికైనా ఆది శక్తితో (మూలశక్తితో) యోగమందించుట ఎప్పుడు

సంభవించునంటే వారు ఈ ప్రపంచము యొక్క ఆధ్యాత్మికోద్ధరణ కొరకు అవతరించి వచ్చినప్పుడు మాత్రమే. అట్టి వ్యక్తి మాత్రమే అక్కడి వరకు అనగా 'అంతిమ సత్యము' వరకు స్వయంగా ప్రయాణించి మనల్ని కూడా అక్కడి వరకు అనగా భూమాకు చేర్చుటకు గాను సహజ మార్గమును రూపొందించగలిగినవారై ఉండాలి. శక్తి ప్రసారం కూడా చేయగల్గిన వారై ఉండాలి. ఇక అప్పుడు వారికి దారి తప్పి తిరుగుతున్న మనల్ని అంతా మిరుమిట్లు గొలిపే సందు గొందుల నుండి సమీకరించి, మరల్చి సహజ మార్గమందు ప్రవేశపెట్టడమే మిగిలి ఉంటుంది. అందువల్లనే స్వాభావికంగానే ఇది 'సహజ మార్గం' అయింది. వారి ప్రాణశక్తి ద్వారా లక్ష్యంతో యోగము నందగల శక్తి మనలోకి వస్తుంది. ఎందుకంటే ఆయన అటువంటి సామర్థ్యం ఉన్న వారే ! అభ్యాసి అంతరంగాన్ని శుద్ధపరచి దివ్యత్వంతో వికసింపజేయు దక్షత వారిలో ఉంది. వారు ఎంతటి అమాయకత్వంగా ఉంటారంటే అసలు ఆ అమాయకత్వం ఆయనకే తెలియనట్లు ఉంటారు. అభ్యాసిని 'అంతిమం' తో సంబంధం ఏర్పరచి తన ఇచ్ఛాశక్తితో సద్గుణాలను వికసింప చేయుటకు పూర్తి సహాయం ఇచ్చి లక్ష్యం వరకు చేర్చటానికి ఆయన సమర్థులు. దీనిని నేను స్వయంగా చూశాను. కాలముతో పాటు అనేక మార్గాలు అంటే సాధనలు ఏర్పడ్డాయి. కాని ఆ సాధనలు - ఆ మార్గాలు లక్ష్యముతో అనుసంధానం కాని కారణాన అవి కేవలం అపమార్గాలుగానే మిగిలిపోయాయి. ఈ అపమార్గాలు లేకున్నా ప్రాపంచిక బంధనాలలో చిక్కుకుపోయిన మానవులందరిని రక్షించి వారి శక్తితో 'సహజ మార్గము' నకు తెచ్చుట అంత సులభమైన పని కాదు.

శ్రీ బాబూజీ మహరాజ్ ద్వారా 'ఈశ్వరీయ దేశం' వైపు ముందుకు సాగుటలో 'సహజమార్గము' ఇందువల్లనే మనకు చాలా సహజమైనదిగా అనిపిస్తుంది. ఎందుకంటే ఈ సహజ మార్గమును ఎవరూ నిర్మించలేదు. ఇది సాక్షాత్కారానికి సహజమైన మార్గం - స్వాభావికమైన మార్గం. ఇది ఎప్పటి నుండో అనగా సృష్ట్యాది నుండి ఏర్పడి ఉంది. ఒకవైపు దారి తప్పి ఈ ప్రపంచంలో తిరుగుటకు పలు ఆకర్షణీయ మార్గాలుండగా, మరోవైపు ఆ ప్రక్కనే 'అంతిమం' వద్దకు చేర్చగల తిన్నని సహజమార్గం కూడా మనకు

లభిస్తుంది. కాని దాని గురించి మనకు ఎప్పుడు తెలుస్తుందంటే - మూలము నుండి ప్రవహిస్తున్న ఆ పవిత్ర ధారలో శ్రీ బాబూజీ వారి ప్రాణాహుతి శక్తి ద్వారా ప్రవేశించగలిగినపుడే తెలుస్తుంది. "ఏ విధమైన అడ్డంకులు లేకుండా మేము ఈశ్వరుని వైపు ప్రవహిస్తూ వెళుతున్నాం" అని, అప్పుడు బాబూజీకి వ్రాస్తాము. మేము సహజమార్గ సాధన స్వీకరించామని, మేము సహజ మార్గ అభ్యాసీలమని - మొదటి రోజునుండే చెప్పుకుంటాము. కాని యదార్థానికి సద్గురువు ఆ ధారలో మనను ప్రవేశపెట్టి సరియైన విధానంలోకి మరల్చినప్పుడు అసలైనది మనకు అర్థమవుతుంది. ఇప్పుడు మన ప్రయాణం లక్ష్య ప్రాప్తి వైపు సూటిగా సాగుతుంది. మనం ప్రయాణించిన కొద్దీ మనం మాతృభూమికి సమీపమవుతూంటాము. మాతృభూమి దగ్గరవుతున్న కొలది దాని శక్తి కూడా మనలోనికి ప్రవహిస్తుంది. ఆ శక్తి మనలను సూక్ష్మము మరియు అనంతము వైపు తీసుకొని పోతుంది. మాతృభూమి దగ్గరవుతున్న కొలదీ దాన్ని చేరాలన్న తపన పెరిగిపోతూ ఉంటుంది. అసలు మనం ప్రయాణిస్తున్నట్లు అనగా యాత్రలో ఉన్న స్పృహయే ఉండదు. ఏదో శక్తి ఎక్కడికో లాక్కొని పోతున్నట్లు అనిపిస్తుంది. కనీసం వెనక్కి కూడా చూడలేము. ఎందుకంటే మనల్ని ముందుకు నడిపించి లక్ష్యంతో యోగం చేయుటకు ఉంటున్న సద్గురువు యొక్క ఇచ్ఛాశక్తి విరాట్ రూపం దాల్చి మనలను ముందుకు తోస్తూ వుంటుంది. ఇంతేకాదు మనకు మన గమనం యొక్క జ్ఞానం కూడా ఉండదు. ఈశ్వరునితో యోగం పొందాలి అనే కోరిక విశాలమై ఆ కోరిక మనలో ఉందో లేదో కూడా మనకు తెలీదు. మన సంబంధము మనతోనే విడిపోతూ నెమ్మది నెమ్మదిగా మనము సమస్తము నందు వ్యాపించుట ఆరంభమవుతుంది.

ఈ విధంగా ఎందుకు జరుగుతుంది ? సమస్త విశ్వము నందు శక్తితో కూడ, బీజరూపంలో ఆయనే స్వయంగా వ్యాపించి ఉన్నారు. అందువల్ల మనము కూడా లక్ష్యము వలె (ఈశ్వరుని వలె) అదే విధంగా అయి ఈశ్వరుని యందు లయమవుతాము. అనగా ఈశ్వరుడు ఏకము నుండి అనేకముగా ఐనప్పటికినీ అనేకము నందు కూడా కేవలము ఈశ్వరుడే సూక్ష్మరూపమున వ్యాపించి ఉంటాడు. బహుశః ఈ స్థితిని పొందిన మీదట

"ఒక్క రాముడే సకలమందు వ్యాపించి ఉన్నాడు" అన్న కబీరు మాటలు మనకు గుర్తుకు వస్తాయి. నిజం కూడా ఏమిటంటే - అనేకత్వం నుండి ఏకత్వం వైపు మనం వెళ్ళాలనుకుంటే, సమస్తము (అనేకత్వము) నుండి సంకోచించుకుని ఏకత్వము (ఈశ్వరుని) నందే ప్రవేశమును పొందుచున్నట్లుగా మొదట మనకు అనిపిస్తుంది. ఈశ్వరునిలో ఎంతగా ప్రవేశం పొందుతూ ఉంటామో అంతగానే అనేకత్వంలో వ్యాపిస్తుంటాము. ఇంకా పురోగమించిన తర్వాత ఈ వ్యాప్తి కూడా మన దృష్టి నుండి అదృశ్యమౌతూంటుంది. అప్పుడు మనం కేవలం సాక్షిగా ఈ వ్యాప్తిని "మేము చూచాం"అని మాత్రమే చెప్పగలం. ఒక మార్గంలో నడుస్తున్న బాటసారి వలె ఈ వ్యాప్తిని మొదట మనలో పొంది, తిరిగి విరాగివలె ముందుకు సాగిపోతూంటాము. ఇంత వరకూ మనం చూసినదంతా భ్రమయేనా, మరేమన్నానా అనే సందేహం కలుగుతుంది. అప్పుడు మధురమైన భ్రమ, ఆ భ్రమ యొక్క స్థితిని త్రాగేసిందేమో అనిపించి ప్రేమ సముద్రములో మునిగి ఉన్న మనకు ఎటు చూసినా ఆశ్చర్యము మాత్రమే వ్యాపించి ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఆశ్చర్యం ఎందుకంటే సృష్టి యొక్క రచన ఈశ్వరుని (బీజం) వల్ల జరిగింది. తిరిగి బీజం వల్లనే ఈ సమస్తము వ్యాప్తి జరిగింది. ఈ వ్యాప్తి నుండి సాధన లేక ధ్యానం ద్వారా బీజస్థితికి (సూక్ష్మస్థితికి) మార్పు జరిగితే ఆశ్చర్యము - అద్భుతమే మిగుల్తుంది. ఈ ఆశ్చర్య అద్భుతాలకు కారణం కూడా తెలియదు. అంచేత దీని ప్రభావం మనకు అంతగా ఉండదు. ఇపుడు సాధారణంగా మాతృదేశం (జన్మభూమి) యొక్క ప్రవేశద్వారం ఎదురుగా తెరచుకున్నట్లు, వ్యాపించినట్లు అనిపిస్తుంది. ఇంతకు పూర్వం మాతృభూమికి దూరమై చాలా కాలం గడచిపోడం వల్ల మనకంతా మరచిపోయినట్లవుతుంది. అంచేత అది మళ్ళా కళ్ళెదుటకు రావడంతో ఆశ్చర్యం కలుగక మానదు. అక్కడ ఆ స్థితిలో అదా ఇదా అన్న డోలాయమాన స్థితి ఉండదు. దానిని ఈదులాడుట అనుట కూడా సరికాదు. మరేది అన్నా, అది సరికాదు. స్థిరత్వం, సమత్వం కూడా సమసిపోతాయి.

ఈ ప్రాణాహుతి శక్తి యొక్క యోగిక మహిమ మనలో ఎలా పరచుకుంటుందంటే - ఈశ్వరుడు పూర్ణ రూపంలో మనలోపల ప్రకాశిస్తాడు.

నా అనుభవ ఆధారంగా నే చెప్పగలిగేదేమంటే, దివ్యత్వం యొక్క ఈ సజీవ శక్తే యోగిక ప్రాణాహుతి రూపంలో మనలో కూడా వికసిస్తూంటుందని. ఆ ప్రాణాహుతి ప్రవాహము మనలో దివ్యత్వాన్ని నింపుతుంది. దీనితో మనం చూస్తుండగానే మనోవృత్తులు - మనస్సు, బుద్ధి, చిత్తము అన్నీ దివ్యమవుతాయి. ఈశ్వరీయ అంశగల జీవి నశించదన్న నిత్య సత్యం నిరూపింపబడుతుంది. మన ప్రతి పనిలో, సంభాషణలో - మొత్తం జీవనంలో దాని తేజస్సు ప్రతిఫలిస్తుంది. ఆ ఈశ్వరీయ శక్తియే ఈ ప్రాణాహుతి శక్తి అనీ దాని ఫలితంగానే మన బాహ్యాంతరాలు సత్యంతో, దివ్య ప్రకాశంతో వెలుగుతాయి అని నా అనుభవం చెబుతోంది. మానవునిలోని సత్యమును ఈశ్వరుడు మహదానందంతో వికసింపచేస్తాడు. దివ్య సౌందర్యం మనలో ప్రస్ఫుటమై వికసిస్తుంది. భగవత్ కార్యంలో వారి సంకల్ప శక్తి అమోఘమైనది. ఈశ్వరీయ విషయమై వారి మనసులో కలుగు ప్రతి ఆలోచన అభ్యాసి అంతరంగములో క్రియగా ప్రతిబింబిస్తుంది. నాకు అటువంటి స్థితి మాటిమాటికీ వచ్చేది. యోగి యొక్క ప్రతి ఆలోచన, ఆలోచనలా ఉండకుండా శక్తివంతం, కార్యాన్వితంగా ఉంటుందని అనేకసార్లు గ్రహించాను. ఇంతేకాక అంతరంగ మందలి విషయాలు (ఆలోచనలు) 'వారి'తో, ఎలా ఇచ్చి పుచ్చుకుంటాయో చూసి నేను చకితురాలనయ్యేదాన్ని. నిరంతరం లయావస్థలో లయమై ఉన్న మీదట ఆ విషయాలు (ఆలోచనలు) మనలో కూడా స్వచ్ఛతను, శక్తిని పొందనారంభిస్తాయని నాకు తెలిసింది. ఒకసారి ఆ పరమ పూజ్యులు లోపల విశ్రాంతిగా పడుకున్నారు. నేను బయట చావడిలో కూర్చున్నాను. నాకు మనసులో అనిపించింది గదా - అందరూ ఆయన పాదాలు స్పృశిస్తున్నారు, కాని ఆడపిల్లలు పాదాలు తాకడం ఆయనకు ఇష్టం ఉండదు. అంచేత నేనెప్పుడూ వారి పాదాలను తాకలేక పోయాను గదా అనిపించింది. హఠాత్తుగా ఆయన పాదాలు తాకాలనే ఆలోచన నన్ను వివశురాలిని చేసింది. నేను చావడిలో కూర్చునే మనసులోపలే, గదిలో పడుకున్న వారి పావన చరణాలను స్పృశించాను. రెండు నిమిషాల తర్వాత ఆయన పిలిచారు, "బేటీ, ఇక్కడకు రా," అని. నేను లోపలికి వెళ్ళగా "పాదాలు పట్టుకోకపోయినా కూడా నీకు ఈశ్వరీయ కృపను ఇస్తున్నాను" అన్నారు. సంతోషం పట్టలేకపోయాను. ఇలాంటి విషయాలు రోజూ ఎంతగానో అలవాటయిపోయాయి.

వాస్తవంలో శ్రీ బాబూజీ ద్వారా పొందిన ప్రాణాహుతి మొదటి రోజు నుండే మన అంతరంగము నందు ఏదో దివ్య సత్యం యొక్క ప్రతిబింబపు మెరుపును ఇస్తుంది. ఆ తర్వాత మన శరీరమంతటా వ్యాపిస్తుంది. వారి ప్రాణాహుతి శక్తి అంతరంగమున నిద్రాణమై యున్న దివ్య చేతనా శక్తిని మేల్కొలుపుతుంది. దీని పర్యవసానంగా మనలో వికసించుచున్న ఈశ్వరీయ స్థితుల యొక్క అనుభవైక పరమానందమును పొంది వాటిని గురించి వ్రాస్తూంటాము. మన అంతరంగపు సంబంధము నెమ్మదిగా సద్గురువుతో స్థిరపడి మనలోని మానవత్వం క్రమేణా దైవత్వముగా మార్పు చెందుతుంది. ఈశ్వరధ్యానంలో ఉన్నంత సేపు మనలో నుండి మనం ఖాళీ (శూన్యం) అవగా ఆ ఖాళీలో ఈశ్వరత్వం పూరింపబడుతుంది. ఈశ్వరత్వంతో నిండి వ్యాప్తి చెంది ఇప్పుడు గాని మరెప్పుడో గాని మానవులమనే విషయం మరచిపోతాం. ఈశ్వరునితో మన సంబంధం ఎప్పటినుండో, అతి పురాతనమైనదిగా అనిపిస్తుంది. వాస్తవానికి సద్గురువు యొక్క పావన ప్రాణశక్తి ద్వారా తెలియకుండానే మనం మననుండి ఖాళీ అయి ఈశ్వరునితో నిండిపోవుట జరిగిపోతూ ఉంటుంది.

వాస్తవానికి ప్రాణాహుతి ఎంతటి సూక్ష్మమైన ఈశ్వరీయ శక్తి అంటే, మొదటి సిటింగ్‌లోనే బాబూజీగారు మన స్థూలత్వాన్ని కరగించి పావన సూక్ష్మత్వాన్ని నింపనారంభిస్తారు. 'నా అంతరంగమే కరగి - కరగి బయటికి ప్రవహిస్తున్నట్లున్నది,' అని బాబూజీకి పలుమార్లు వ్రాశాను. సూక్ష్మాతి సూక్ష్మం అవుతూ అవుతూన్న కొలదీ మన సంబంధం ఈశ్వరునితో ఏ విధంగా అవుతుందంటే ఆయనతో యోగాన్ని కలిగించిన ఈ ప్రాణశక్తి జాడ కూడా మనలో దొరకనట్లు ఈశ్వరునితో యోగం (ఐక్యం) చెందిపోతాము. వేరైపోయిన మన అసలైన స్వరూపంలోకి చేరి ఒకటైపోయాక ఈ శక్తి యొక్క జాడ మనకు ఎలా కనిపిస్తుంది ? అవసరాన్ని బట్టి దాని సూక్ష్మ వ్యాపకం జరుగుతూనే ఉంటుంది. అప్పుడది యోగ శక్తి లేదా అనుబంధం కల్గించునటు వంటి శక్తి అని ధృవపడుతుంది. అనగా ఈశ్వరునితో మానవునికి యోగాన్ని ప్రసాదించేటటువంటి ఈ శక్తి కూడా ఈశ్వరుని యందే లయమైపోయి మనలో శాశ్వతంగా ఇమిడిపోతుంది. ఇది శ్రీ బాబూజీ వంటి సద్గురు

మహాత్ముల హృదయం నుండి అభ్యాసి హృదయములోనికి ప్రవహిస్తుంది. అంచేత ఇది - ఈ ప్రాణాహుతి ఆ పవిత్రమైన ప్రాణాల యొక్క ఆహుతే. వాస్తవానికి ప్రాణాహుతి యొక్క కార్యక్రమం ఈశ్వర సాక్షాత్కారం కలిగించుటతోనే పూర్తికాదు. 'విశ్వ' అంతరాళంలో మన యోగం అవుతూ అవుతూ ఒకానొక రోజున ఈశ్వరునిలోనే మన వ్యాప్తి అయిపోతుంది. మనం 'నేను' అనే పరిధి నుండి బయటపడి అనంతములో విలీనమగుట మొదలవుతుంది. శ్రీ బాబూజీ మహరాజ్ వారి ద్వారా లభించిన ఈ ప్రాణాహుతి అనునది మనలను ఈశ్వరుని లేదా లక్ష్యముతో కలుపునటువంటి ఒక లింక్ మాత్రమే. ఇది అనుసంధానమే కాని కలయిక కాదు. ఇది వారి గొప్పదనము. సద్గురువు ద్వారా లభించే ఈ యోగిక శక్తి కార్యరంగం ఎంతవరకు వ్యాపించి ఉంటుందో చెప్పడం చాలా కష్టం. ఇది చెప్పతరము కానిది. అది శ్రీ బాబూజీ ద్వారా ఒక హద్దు దగ్గర మనల్ని 'నేను' అను పరిమితి నుండి దాటించి అనంతం వైపుకు తీసుక వెళ్ళుట ప్రారంభిస్తుంది. ఇది - ఈ ప్రాణాహుతి శక్తి త్రిగుణములకు, మాయకు కూడా అతీతముగా నుండు ఆధ్యాత్మిక క్షేత్రం వైపు, మలుపు త్రిప్పుట ప్రారంభిస్తుంది. అప్పుడే ఈ స్థితిని గురించి ఇలా వ్రాయకుండా ఉండలేక పోయాను. "వారిలో ఐక్యమయ్యే ప్రయత్నంలో ఉండగా త్రిగుణాలు వీడ్కోలు చెబుతూనూ, మాయ రోదిస్తూనూ పోయాయి.

ఇప్పుడు మాయ అంటే ఏమిటి అనే ప్రశ్న తలెత్తుతుంది. విద్వాంసులు, మహాత్ములు రకరకాలుగా వివరించారు. కాని నేను నా అనుభవ దృష్టిలో అనుభవమైన భాషలో ఈ మాత్రమే చెప్పగలను. కళ్ళు తెరచుకుని చూసినప్పుడు ఏదైతే బాగుందని అనిపిస్తూ ఆకర్షణీయంగా ఉండి, ఈ బాహ్యావరణంలో బంధింపచేసేదే "మాయ". మాయ యొక్క పరిధిలోనే త్రిగుణాల (సత్వ, రజ, తమము) ప్రభావం కూడా ఉంటుంది. ప్రియతముడు ఈశ్వరుని ధ్యానంలో మునిగిపోయి కళ్ళు మూసుకున్నప్పుడు ఏదైతే బాగనిపించి ఆకర్షిస్తుందో అదే ఆత్మతో సంబంధం ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రం. కావున ఆధ్యాత్మికత వైపు ప్రవేశించినపుడు మన అసలైన వ్యాప్తి, స్థితి అనంతమగుచూ పురోగమిస్తుంది. స్థూలమైన మాయా బంధనాలు శిథిలమై తెగిపోవుట

మొదలవుతుంది. బాహ్య వృత్తులయందు అణగిన ప్రవృత్తి మరలి అంతర్ముఖమవుతుంది. బాహ్యంలో అనగా భౌతిక జీవితంలో పరచుకున్న మనో వృత్తులన్నీ ఇప్పుడు సంకోచించి అంతరంగమునకు మరలుతాయి. బాహ్య బంధనాల శృంఖలముల నుండి మన సంబంధము తెగిపోయిందనవచ్చు. మన దృష్టి కూడా అంతర్ముఖమై ఏకాగ్రత చెందుతుంది. దీనివల్ల సంస్కారాల (కర్మల) బంధనాలు మనల్ని బంధించలేవు. ధ్యానం అంతరంగంలోని పూర్వ సంస్కారాల బంధనాన్ని కూడా తొలగించి పవిత్రం చేయ నారంభిస్తుంది. వాస్తవానికి ప్రాణాహుతి ద్వారా మన అల్ప హృదయం (ప్రాణం) ఆ విరాట్ హృదయంతో క్రమంగా లయం కావడం స్వయంగా మనం చూస్తాము. విరాట్ హృదయంలో మన ప్రవాహయాత్ర ఒక స్థాయికి చేరాక ఒకటైపోతాము. ఇపుడు, ప్రాణాహుతి లభిస్తుండడం, లభించక పోడం అనే తేడా ఉండక ఒకటిగానే ఉంటుంది. ఇలా ప్రాణాహుతితో కలిసి మెలిసి పోయిన మన ఆంతరిక దశ, అసలు మన హృదయంలోనికి ప్రాణాహుతి ప్రవహిస్తోందా లేదా అనే విషయాన్ని కూడా పసికట్టలేనట్లుగా ఉంటుంది. అయితే మన హృదయంలోకి ప్రాణాహుతి ఎప్పటి నుండి ప్రవహిస్తుంటుందో ఆ సమయం నుండియే మన అంతరంగం నందలి బరువు, వత్తిడి తగ్గిపోవునట్లు చేయుట కూడా ప్రాణాహుతి చేసే పనుల్లో ఒకటిగా గ్రహించాను. మరోలా చెప్పాలంటే మనం మన అహం యొక్క వత్తిడి నుండి తేలికవుతున్నట్లుగా అనుభూతి చెందుతాము. ఇది ఎంత గొప్పగా నంటే మనం లక్ష్యంలో లయమౌతూ అహం యొక్క మొత్తం వత్తిడి నుండి పూర్తిగా బయటపడిపోయేటంత ఘనంగా వుంటుంది. సంపూర్ణంగా శూన్యంగా అయిపోతాము. మహర్షులు దీనినే "శూన్యసమాధి" అన్నారు. "తేలిక అయితేనే మనం పైకి వెళతాం" అనేది అనుభవ సిద్ధం అవుతుంది.

ప్రాణశక్తి పొందినప్పుడు ప్రాణాయామం కూడా జరుగుతూండడం నేను చూశాను. సాధారణ ప్రాణాయామానికి, ఈ ప్రాణశక్తి వల్ల సిద్ధించే ప్రాణాయామానికి చాలా తేడా ఉంది. సాధారణ ప్రాణాయామమందు మనం శ్వాసను బిగబట్టి - బంధించి దానిని మన వశంలోనికి తెచ్చుకుంటాము. దీని వల్ల అప్పుడప్పుడు ఈ స్థూల శరీరం తేలికై భూమి నుండి కొంచెం పైకి

లేస్తుందని జనం చెబుతారు. ఇదే ప్రాణాయామ ప్రక్రియ యొక్క గొప్పతనం - విశిష్టత. కాని ప్రాణాహుతి యొక్క పవిత్రశక్తి మనలను మన 'అహం' యొక్క వత్తిడి నుండి అతీతముగా తీసికొని పోయినప్పుడు ఈ శరీరపు జ్ఞానం - భారం యొక్క ఎరుక ఉండనే ఉండదు. ఈ శరీరాన్ని విడచి పెట్టి మనం తెలీని చోటుకు పోతున్నట్లు అనిపిస్తుంది. 'ఆనంద విషాదాలే నన్ను తాకలేకపోయాయి. నీవెప్పుడైనా నన్ను (హృదయాన్ని) స్పృశించావో లేదో నాకెలా తెలుస్తుంది?' - అన్న ఒక కవి యొక్క భావన మనకూ అనుభవమౌతుంది. దీని యొక్క మరో విశేషత ఏమంటే, ఎక్కడి దాకా మనం వ్యాప్తి చెందుతామో, ఎంత వరకైతే అహం యొక్క ప్రభావానికి (వత్తిడికి) గురి కాకుండా ఉంటామో - దాని దిగువన ఉన్న దాని ఆధారమే నశించిపోతుంది. ఇందువల్ల అక్కడ నుండి తిరిగి మనం ఎన్నటికీ క్రిందికి పడిపోము - దిగజారం. అంతేకాక సమాప్తమైపోయిన అహం యొక్క బంధనాలలో మరల ఎప్పుడూ చిక్కుకోలేము. తద్విరుద్ధంగా ప్రాణాయామ క్రియను విడచి పెట్టగానే మనం మరల యధాస్థితికి వచ్చేస్తాము. అనగా ప్రాణాయామ క్రియ వదలిన తర్వాత దాని ఫలితంతో కూడ మన సంబంధం తెగిపోతుంది. ప్రాణాహుతి ద్వారా పొందిన ఆ దశ, స్థితి మన స్వంతమే అయి - అదే మన స్వరూపమైపోతుంది. ఆ స్థితి నుండి తప్పుకోలేము - దిగజారలేము. 'అహం' నుండి దాటి అతీతంగా ఎదిగిన తర్వాత పరిణామం చెంది సూక్ష్మతనందుతూ అధిక శక్తివంతుల మగుచూ తీవ్రగతిలో లక్ష్యప్రాప్తికై వెళతాము. ప్రియతమునితో లయమవుతూన్నందు వల్ల వారి ఆ సూక్ష్మశక్తి కూడా మన ఆత్మోన్నతికి సహాయపడుతూంటుంది. మన ఉన్నతిలో వెన్నెలలు పండిస్తుంది. మొదట బాహ్య ప్రపంచం నుండి కుంచించుకుని విశ్వాంతరాళం లోనికి వ్యాపిస్తూంటాము. తర్వాత దివ్య అనంత లక్ష్యంపై నిలిపిన దృష్టి ద్వారా 'విశ్వ' అంతరాళ పరిమితులను గూడా ఛేదించుకుని స్వతహాగానే విరాట్‌నందు వ్యాప్తి జరుగుతుంది.

'విరాట్' అనగా దివ్యవ్యాప్తి - ఈశ్వర దర్శనము యొక్క ఒక అంగము అని చెప్పవచ్చు. ఇది సూక్ష్మమైనది. దీనిలో రంగు, రూపముల ఆనవాలు ఉండదు. కాని విరాట్‌లోనే ఇమిడి పోతున్నామన్నట్లుగా ఉంటుంది.

ఇక్కడున్న ఒక విశేష స్థితి గురించి - "ఈ ప్రపంచంలో జరగబోవు ప్రతి సంఘటన నాకు ముందుగానే కనిపించుచున్నది" అని శ్రీ బాబూజీకి వ్రాసినప్పుడు వారు ఇలా వ్రాశారు : అది నిజమే! శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి దివ్యదృష్టి నిచ్చి, ఈ విరాట్ స్థితిని చూపించి - చూడు అర్జునా, కౌరవులు ముందే చనిపోయారు. నీవు నిమిత్తమాత్రుడవు కమ్ము. అని చెప్పాడు - విరాట్ స్థితిని పొందిన వారికందరికి ఇదే అనుభవము కలుగుతుంది, - అని బాబూజీ వ్రాసిన దానిని అనుభవపూర్వకంగా గ్రహించాను. ఈ స్థితి దాటి ఉన్నతికి ఎదిగినప్పుడు మరల మనకు ఇటువంటి అనుభవం దొరకదు. ప్రాణాహుతి శక్తి వల్ల శ్రీ బాబూజీయే ఈశ్వరుని విరాట్ యందు వ్యాపించి ఉన్నట్లుగా మనం చూస్తాము. ఆ తర్వాత వారినే అంటిపెట్టుకుని, వారి యందే లయలీనమై యుండుట వల్ల బాబూజీ గారితో పాటుగా విరాట్ యందు మన వ్యాప్తి కూడా జరుగుతుంది. ఇలాంటి దివ్య వ్యక్తిత్వాన్ని అంటిపెట్టుకుని ఉంటం వల్ల లభించే ఘనత ఇదే ! దీనితో పాటు - ఎక్కడి వరకైతే శ్రీ బాబూజీ మహరాజ్ దివ్యత్వం నందు వ్యాపించి ఉన్నారో అక్కడి వరకు అత్యంత సులభంగా వ్యాప్తిని పొందే, పావన ప్రసాదం మనకు లభిస్తుంది. ఈ లయావస్థలో ఒక స్థాయిని చేరుకొన్న తర్వాత ఇంతవరకు ఆసరాగా ఉన్న వారి ఈ విరాట్ వ్యాపకశక్తి ఇప్పుడు దానికి మిన్నగాయై ఈశ్వరుని యొక్క సర్వశక్తిమాన్ రూపము నందు మనలను కుదిపినట్లుగా చేసి దానిలో సంయోగమును కల్గించుచున్నట్లుగా మనకు అనుభవమౌతుంది. సద్గురువు మన చేయి పట్టుకునే ఉంటారు. వారి విరాట్ ఒడిలోనే మనం నిర్భయంగా ఉంటూ ఇంతకు ముందటి పూర్వానుభవ స్థితికంటే కూడా సూక్ష్మ - విరాట్ అయినటువంటి ఈశ్వరుని యొక్క సర్వశక్తిమాన్ దశయందు మనం ప్రవేశం పొందుతాము. ఇక ఈ దశయందు ప్రవేశం పొందాక ఈశ్వరీయ శక్తి భాండాగారమే మన నివాస స్థానం అవుతుంది. ఇంతేకాక వారి పావన ప్రాణమునందు లయమైయున్న మనం ఆ దివ్య దేశంలో విహరించడం ప్రారంభిస్తాం. ఈశ్వర శక్తి యొక్క ఆ దివ్యవ్యాప్తి మనదే అయిన మన స్వంత స్వరూపంగా అనిపించడం ఎంత బాగుంటుందో ? ఈ మొత్తం ప్రపంచం - సూర్యుడు, చంద్రుడు అన్నీ ఈ సమస్తమూ మన నుండియే పుట్టినట్లు

అనిపిస్తుంది. ఈ అనుభవాన్ని శ్రీ బాబూజీకి వ్రాస్తే వారు "నీ యాత్ర ఈశ్వరుని యొక్క సర్వశక్తిమాన్ దశ యందు ప్రారంభమైంది. ఈ దర్శనము గొప్పదనమే కాదు, నిన్ను తెలుసుకుని నేనే నీవుగా అయిపోయానన్న స్థితి సత్యము ఎదుట నిలుస్తుంది" అని వ్రాశారు. ఈ స్థానము నందలి దశ యందు మన పర్యటన ముగిసిపోయినట్లు అనగా మనం దివ్యవ్యాప్తిలో మిళితమైపోయినట్లు శ్రీ బాబూజీ గమనించి, అప్పుడు వారు తమ ప్రాణశక్తి ద్వారా క్రమక్రమంగా మనలను ఈశ్వరీయ దివ్యవ్యాప్తి స్థితియందు ప్రవేశపెట్టగా నెమ్మది నెమ్మదిగా అక్కడ కూడా మన విహారం ప్రారంభమౌతుంది. అంతటా నిండిపోగా తిరిగి ఒక హద్దు వరకు యాత్ర పూర్తి చేసి, ఆవల ఒక అపూర్వ స్థితిని పొందుతాము. ఈశ్వరుడు తన సంపూర్ణ కృపను ఇప్పుడు అప్పగించాడు, అన్నట్లుంటుంది. అప్పుడు మనం విరాగపు చరమ సీమను కూడా దాటివేసి ఈశ్వరీయ దేశంలో కూడా సంతోషం పొందలేకపోవుటతో సద్గురువు శ్రీ బాబూజీ యొక్క చేయూతతో ఎక్కడికో శ్రేష్టమైన ఆ 'అనంతము' వైపు మన యాత్ర కొనసాగిస్తాము. దీనిని గురించి ఎవ్వరూ చెప్పలేరు. తెలిసికోలేరు. మనలో అంతిమ సత్యము ప్రత్యక్షమైనా దీని ఛాయను కూడా ఎవరూ గ్రహించలేరు.

'వారు' నాకిచ్చిన అనుభవ దృష్టి ద్వారా దానిని గురించి నేను తప్పక చెప్పగలను. ఇక్కడ ప్రాణాహుతి శక్తి పని మారుతుంది. ఆ విషయం మనకు తెలియదు. స్వయంగా సాధన చేసినా, ఇతరులచే చేయించినా కూడా ప్రాణాహుతి శక్తిని వేరుగా అంచనా వేయలేము. సద్గురువే ఈ రహస్యాన్ని విప్పి చెప్పాలి. ఈ యోగిక శక్తి ఇప్పుడు యోగమందించు లింకుగా కాక ఆ అనంత స్థితిలో కలసిపోతుంది. అందులో కలిసిపోయిన తర్వాత ఆ లింకుతో అవసరమే ఉండదు. ఈ స్థితిలో ఇక్కడితో ప్రాణాహుతి యొక్క అవసరం తీరిపోయింది. అయితే బాబూజీ మరల దయతో ఇలా వ్రాశారు "యాత్ర ఇంకా ముగింపు కాలేదు. ఇపుడు అనంతయాత్ర ప్రారంభమైంది" అని. ఇప్పుడు ఇక్కడ ఈశ్వరీయ కృప పని చేయదు. సద్గురువు సాహసమే తోడ్పడుతుంది. వారు వారి అనంతయాత్రను పూర్తిచేసి అనంతమందు కలిసిపోయి మనలను అనంతము లోనికి వారి శక్తి ద్వారా ప్రవేశపెట్టుతారు. ఈ స్థితిని పొందినప్పుడే సంత్ కబీరు 'హద్దు కలదానికి, హద్దులేని అనంతానికి

మధ్య స్థబ్దత (నిద్ర) లో ఉండిపోయానని చెప్పారు. ఈశ్వరీయ దేశం యొక్క చిట్టచివరి హద్దు వరకు, ఈశ్వరీయ కృప మనకు సహాయముగా ఉండి నడిపిస్తుంది. కాని దీని తర్వాత మనలను ఆ అనంతము నందు ప్రవేశపెట్టి అందులో ఈదులాడించుతూ మన బాగోగులు చూస్తూ ఇహపరాల్లో గాని, మరే పనిలో గాని ఈషన్మాత్రంగా, లేశమైనా లోపం రాకుండా చూడ్డానికి ఎవరో ఒక సద్గురువు యొక్క దివ్య హస్త సాయం అవసరం ఉంటుంది. అటువంటి మహాశక్తి సమన్వితుడు, దివ్య వ్యక్తిత్వమునకు ఆలవాలమైన వారు నేడు ఒక్క శ్రీ బాబూజీ మహరాజ్ తప్ప వేరెవ్వరూ కానరావడం లేదు. "అద్దములో అందరూ తమను చూసుకోగలరు. కాని అద్దం మాత్రం తనలో తన్ను చూసుకోలేదు." - ఈ సందర్భంలో బాబూజీ అన్న మాటలు ఇలా గుర్తువస్తాయి. లాలాజీ సాహెబ్ బాబూజీని "నీవెవ్వరివో నీవు చూసుకోలేకపోతున్నావు - గుర్తుంచుకోలేక పోతున్నావు" అన్న మాటలూ స్మరణకు తెచ్చుకోవచ్చు. "అప్పుడే ఏమైంది ! ఇంకా చాలా నడవాలి," అని బాబూజీ వ్రాశారు. ఇంకా ప్రయాణం ! ఏమిటై ఉంటుంది ? బాటలేదు. బాటసారి లేడు. శక్తి లేదు, సామర్థ్యమూ లేదు. లక్ష్యప్రాప్తికి ఎలాంటి అనుబంధం ఉందో అలాంటి అనుబంధంతోటే ఆయన కార్యం మన ద్వారా జరుగుతుంది. వారి త్యాగనిరతికి తగినట్లుగానే మనలో కూడా ఆత్మ సమర్పణ భావం ఉత్పన్నమవుతూంటుంది. దానిని స్వయంగా గ్రహించగల్గుతున్నాను. భక్తిలో మునిగిపోయిన అతని స్థితి లక్ష్యం వైపు సాగుతున్నట్లు అభ్యాసికి కూడా అనుభవమవుతుంది. 'అనంతము' అంటే ఆ భూమా సామ్రాజ్యము ఎంతటి విస్తారమైనదో, ఎంత అనంతంగా ఎంతగా వ్యాపించియున్నదో ! ఆ ఆనందకర విరాట్‌లో సముద్రము లేకనే మన 'ఈత' మొదలవుతుంది. ఈత - ఈదుట - అనేది కూడా ఒక ఊహా సంకేతము మాత్రమే. 'యాత్ర' ను వ్యక్తీకరించడానికి దానిని ఆ విధంగా అంటాము. స్వ, పర అనేది ఉండదు. ఏదయినా పొందడం లేదా కోల్పోడం అనేది ఉండదు. ఇవ్వడం, పుచ్చుకోడం అనేదీ పూర్తయిపోతుంది. ఏదైనా ఏర్పడ్డంగాని, నశించిపోవడం గాని ఉండదు. ఎందుకంటే - నిశ్చలత, ప్రశాంతత మన స్వరూపం అయిపోయింది కాబట్టి.

వెలుతురు వెనకే చీకటి ఉంటుంది. అందరకూ ఇది తెలుసు. ఈశ్వర దర్శనమైంది. ఎదురుగా 'వారి' సాక్షాత్కారం పొంది పరవశించి సంతుష్టులమయ్యాము. మన ఈ మానవ జీవితం ధన్యమైంది. ఇప్పుడు దీని తర్వాత - వెనకాతల ఏముంది. దీన్ని చూడాలంటే శ్రీ బాబూజీ మహరాజ్ కొంగు పట్టుకుని సాగాలి. దానిలో యాత్ర ఉండదు. విహారం ఉండదు. బాబూజీ వారి మాటల్లో 'బకా హీ బకా' - అంటే పరిపక్వతా స్థితి మాత్రమే వ్యాపించి ఉంటుంది. కాని మారిపోతున్న సూక్ష్మ సంకేతం లేక స్థితి లక్ష్యంలో మనం ఎక్కడి వరకు చేరుకున్నామో చెబుతుంది. లక్ష్యమే మనకు స్వయంగా అది ఎంత వరకు వ్యాపించి ఉందో తన గురించి తెలుపుతుంది. మన ఆధ్యాత్మిక మార్గంలో ప్రాణాహుతి పని పూర్తయినా బాబూజీ వారి పని మన పట్ల మరింతగా పెరుగుతుంది. సద్గురువు ఇచ్ఛాశక్తి మనల్ని ఎక్కడికంటే అక్కడికి, ఎలా కావాలంటే అలా తీసుకవెళుతుంది. వారిచ్చిన ఆధ్యాత్మిక స్థితులకు మనం సాక్షీభూతంగా ఉండిపోతాము. మానవుని దివ్యునిగా చేయుట ఈశ్వరునితో యోగమందించుట ఈశ్వరీయ శక్తి అనగా ప్రాణాహుతి కార్యమై ఉంటుంది. మనకు ఆ అదృష్టం లభించగానే దాని అవసరము అని, అనవసరమూ అనీ వుండదు. ఈ అన్నీ కలసి ఒకటై పోయాయి. (ఈశ్వరీయ శక్తి - ఈశ్వర దర్శనం - ఈశ్వరయోగం - ఈ అన్నీ ఒకటైపోయాయన్న మాట) శ్రీ బాబూజీ మహరాజ్ అభ్యాసీలను ఏయే క్షేత్రాలను దాటించారో వాటి గురించి తమ గ్రంథాలలో వివరించారు. హృదయక్షేత్రం, మనోక్షేత్రం, కేంద్రీయ క్షేత్రం - ఈ క్షేత్రాలన్నీ ఏకమై పోవడం చూశాను. అవి వేరువేరుగా ఉండడం మనకెక్కడా కనిపించదు. మన స్థితి 'పాలది పాలు, నీటిది నీరు' అన్నట్లుంటుంది. ఇప్పుడు మనం గమనించినా, గమనించకపోయినా సరే కేవలం దివ్యత్వం మాత్రమే మన దృష్టిలో ఇమిడి ఉంటుంది. అంటే కండ్లు మూసుకొనినా దివ్యత్వమే ! కండ్లు తెరచి చూచినా దివ్యత్వమే - ఎటు చూచినా దివ్యత్వమే ఇమిడిపోయినట్లుగా కనపడుతుంది.

# 8. ప్రాణాహుతి యొక్క కార్యదక్షత

ప్రాణాహుతి యొక్క మాహాత్మ్యం తర్వాత దాని కార్య సామర్థ్యం గురించి తెలియచెప్పాల్సిన అవసరం వుంది. మొదటగా పావన దివ్య ఈశ్వరీయ స్థితుల అనుభవాలు, ఆ తర్వాత శ్రీ బాబూజీ మహరాజ్ ప్రసాదించిన దివ్యదృష్టి నాకు ప్రాణాహుతి అనేది అమోఘమైన యోగశక్తి అనే సత్యాన్ని తెలియజేశాయి. వేరే మాటల్లో చెప్పాలంటే కేవలం ఈశ్వరీయ శక్తి యొక్క పావనధార మన హృదయంలో పొందగానే ఆధ్యాత్మిక క్షేత్రంలో పురోగమించటానికి యోగ్యులం అవుతాం. వెనువెంటనే మనం లక్ష్యప్రాప్తికి అనుగుణంగా మలచబడతాము. ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రాణశక్తి యొక్క కార్యదక్షత అత్యద్భుతమైనది. ఇది ఎప్పుడు, ఏ విధంగా, ఎంత త్వరగా - అనేది మనం తెలుసుకోవాలి. మనం మన లక్ష్యం వైపు మనకు తెలియకుండానే ముందుకు సాగిపోతాం. ప్రాణాహుతి పని మూలంగా - సంస్కారాలతో నిండిన మన అంతస్సు ఖాళీ అవడం మొదలవగా, ఎవరో జన్మజన్మాంతరముల భారాన్ని మన హృదయం నుండి దించివేసి ఖాళీ చేశారా అన్నట్లు మనం ఎంతో తేలికదనమూ, పవిత్రతా అనుభూతి చెందుతాము. అప్పుడు సందేహాలకు సమాధానం లభిస్తుంది. "మార్గం సుగమంగా ఉన్నప్పుడు దాని ఆలోచనలతో బుర్ర చెడగొట్టుకోవడం ఎందుకు ?" అని కబీరు చెప్పిన ఈ మాటలు మన అంతర్ దశలలో మనకు అనుభవానికి వస్తాయి. సంస్కార భారాన్ని తొలగించి హృదయాన్ని ఖాళీ చేస్తుండగా వాటిని గురించి నెమరు వేసుకోడం ఎందుకు ? - అనే అర్థం ఇందులో స్ఫురిస్తుంది). శ్రీ బాబూజీ మహరాజ్ వారి ద్వారా ప్రసాదించబడ్డ ఈ ప్రాణశక్తి ద్వారా మొట్టమొదటగా మన అంతస్సు తేలికై పరిశుద్ధమవుతుంది. తరువాత సద్గురువు ఆజ్ఞ లభించిన ప్రిసెప్టర్లు, ధ్యానములో లీనమైయున్న అభ్యాసీ సోదరుల హృదయాలను కూడా ఈశ్వరీయ ప్రకాశంతో ప్రకాశింపజేసి ఈశ్వర ప్రాప్తిని పొందడానికి అభ్యాసీలలో అర్హతను పెంపొందజేస్తారు. ఈ విధంగా జనుల యొక్క ఆత్మ కళ్యాణం కోసం శ్రీ బాబూజీ చేసే ఈ మహా కార్యము నందు ప్రశిక్షకులు కొద్దో గొప్పో తమ వంతుగా సహకరిస్తూంటారు. శ్రీ బాబూజీ

ద్వారా ప్రశిక్షకులకు ప్రసాదించబడ్డ ఈ దివ్యశక్తి యొక్క అలౌకికమైన విషయం ఏమంటే ప్రాణశక్తి ఈ విధంగా ప్రిసెప్టరులకు ఇతరుల ఆత్మిక స్థితిని పెంపొందించుటకే కాక స్వయంగా వారు కూడా శీఘ్రంగా, అమోఘమైన ఉన్నతి పొందడానికి సహాయకారి అవుతుంది. అనగా ఒకటి ప్రక్కన ఒకటి చేరితే పదకొండు (11) అయినట్లు ప్రయోజనం ద్వివిధంగా ఉంటుంది.

"ఈ సమీకరించిన శక్తికి సంకల్పం లేదా ఇచ్ఛ యొక్క సూచననిచ్చి పిమ్మట కలుగు పరిణామాన్ని జాగ్రత్తగా చూడు," అని బాబూజీ నాతో చాలాసార్లు అన్నారు. ప్రాణాహుతి శక్తి ఒక మంత్రములా అయి శిరస్సును అధిరోహించి - అనగా తలపై ఎక్కి మొత్తి శాసించగలదనీ - ఇది నిజమని గ్రహించాను. సంకల్పం ఎంత దృఢంగా ఉండి నిస్వార్థంగా ఉంటుందో ప్రాణశక్తి యొక్క పనితనము కూడా అంతే సామర్థ్యం (దక్షత) కలిగి త్వరితగతిని తప్పనిసరిగా ఫలప్రదం అవుతుంది. ఇంతే కాకుండా, ఎప్పుడు మాలిక్‌లో మన లయావస్థ సూక్ష్మమవుతూ అవుతూ లయమవుతున్న సంగతి కూడా మనకు స్పృహ లేకుండా పోతుందో, అప్పటి నుంచే ఇచ్ఛాశక్తి గురి తప్పకుండాను, పటిష్టంగాను ఉండడం మొదలవుతుంది. దివ్యత్వంలో మునిగి ఈదుతూ పురోగమించిన తర్వాత మన ఆలోచనలు అన్నీ శక్తివంతమై, ప్రతి ఆలోచన ఇచ్ఛాశక్తిగా లేదా శక్తి రూపంగా తయారవుతున్నాయా అని అనిపిస్తుంది. పిమ్మట, ఏమైనా గాని మనం ఏది తలచుకుంటే అది, ఆధ్యాత్మిక క్షేత్రములో ప్రకృతి కూడా మన ఇచ్ఛాశక్తి ముందు తలవంచవలసి వస్తుంది. నాకు ఆనాటి ఓ సంఘటన గుర్తు వస్తోంది. అదేమిటంటే ఒకసారి బాబూజీ మహరాజ్ వారు నాతో "బిడ్డా నీ వీపు మీద ఒక గ్రుద్దు వేయాలనిపిస్తోంది", అన్నారు. వెంటనే నేను "బాబూజీ ! అయితే తప్పకుండా అలానే చేయండి అది కూడా నాకు మిక్కిలి ఆనందకరమైందే," అని జవాబిచ్చాను. అప్పుడు వారు "వద్దులే ! నీవు బలహీనంగా ఉన్నావు కదా,' ' అని అన్నారు. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే - 'బాబూజీ ! మీ గ్రుద్దు నా వీపు మీద తగలనే తగిలింది. ఇంకా దాని ఫలితంగా వెన్ను అంతటా దివ్య స్పందనము దివ్య ప్రకాశమూ ఉత్పన్నమయ్యాయి," అని

వెంటనే నేను అనటమూ జరిగింది. ఈ గ్రుద్దు యొక్క అనుభవం షుమారు ఆరునెలల వరకూ వుండిపోయింది. కేవలం సంకల్ప మాత్రంగానే అనగా ఆలోచన జనించినంతనే ఏఏ సాధనలతో శక్తి కార్యరూపం దాల్చి వెన్ను భాగంలోని బిందువులలో స్పర్శ కల్గించిందో నేను చెప్పజాలను. అభ్యాసులలో ఏ బిందువులనైనా వెంటనే జాగృత స్థితిలోకి తీసుకురావటానికి బాబూజీ స్పర్శ తక్షణ ఫలితాన్నిస్తుందని నేను ఎరుగుదును. దాని ప్రభావాన్ని అభ్యాసులు వెంటనే గుర్తించగల్గుతారు.

జన సామాన్యంలో చాలా మందికి ఈ ఆలోచన కల్గుతుంది. శ్రీ బాబూజీ యింత గొప్పవారైతే వారివల్ల మన ప్రాపంచిక జీవితంలోని పనులు, యిష్ట కామ్యాలు మన కోర్కె ప్రకారం జరిగి తీరాలి కదా - అని. ఇటువంటి అపోహలతో 'వారి' గొప్పతనం ఏ దిశలో ఏ విషయానికి సంబంధించి వున్నదో గ్రహించలేని దురభిప్రాయం కల్గివుంటారు. వారు ఈ విశిష్టతను ఏ విషయమై కల్గివున్నారు అనేది ఆలోచించాలి. ఒక వైజ్ఞానికుణ్ని హిందీ భాష విషయంలో సూక్ష్మ పరిశీలన చేయమని మనం అడిగినట్లయితే అతనేమి చేయగలడు ? అతని ప్రజ్ఞ దానిలోనిది కాదు కనుక అతడేమీ చేయబోడు. అలాగే బాబూజీ దృక్పథం ఆధ్యాత్మికోన్నతి గురించేకాని ప్రాపంచిక విషయాలకోసం కాదు. ప్రపంచము, సృష్టికి అతీతంగా పైకి ఎదిగినప్పుడే రచయిత అనగా సృష్టి రచన చేసిన ఈశ్వరునిలో కలయిక జరుగుతుంది. కాని వారిని తిరిగి ఇటువంటి అల్పమైన కోర్కెలు తీర్చమనటం సబబుకాగలదా? అది ఉచితమైనదేనా? ఏ కారణం చేతనైనా వారి మదిలో మనపట్ల దయ కల్గినపుడు, అవి ప్రాపంచిక విషయాలైనా సరే, అనగా మన అవసరాలు వారికి కూడా యుక్తమైనవిగానే తోచినపుడు, వెంటనే అవి నెరవేరటం కూడా నేనెరుగుదును. ఈ ప్రాపంచిక విషయాల్లో సిద్ధహస్తులమని చెప్పుకొనే వారి వద్దకు వెళ్ళి మనలో దివ్యత్వం నెలకొల్పమని ఒకవేళ మనం కోరితే వారి కది సాధ్యపడుతుందా? బాబూజీ చెప్పిన ఈ మాటలు ఎంత యదార్థమో చూడండి - "ఈశ్వరుని ఈశ్వరునిగానే తలచి అదే భావంలో వుంటూ

తదనురూపమైన సాధన ద్వారానే 'వారి'ని పొందగలం. కాని ఈశ్వరుని మానవ మాత్రునిగా వూహించుకొని పొందటం అసాధ్యం. అది 'వారి'ని అవమానించి నట్లవుతుంది" - అన్నారు. మనల్ని ఈశ్వరునికే సమర్పితం చేసుకొని వారివలె అయితేనే వారిని పొందగలం. 'వారి'ని (ఈశ్వరుని) మనలాగే (స్థూలతగా) తయారుచేసి పూజించ నారంభించితే వారికి మనం దూరమవుతాం. ఈ సందర్భంగా నేను వ్రాసిన పంక్తి ఒకటి నాకు జ్ఞాపకమొస్తోంది. - "వారిని మనమున్న పరిమితుల్లోకి తెచ్చుట కష్టం, ఎల్లలు లేని అనంతత్వం లోకి నన్ను చేర్చి దర్శనమిచ్చారు" అని. అనగా మనం వారిని పొందగల్గే విధంగా మనల్ని మనం మలచుకొని సాధన చేస్తే, ఒకానొక రోజున పైన చెప్పిన మాటలు యదార్థమని నిరూపించబడతాయి.

ఇలా మన పరిమితుల్లో వుండటం వారికి ఇబ్బందికర పరిస్థితి అవుతుంది. ఎందుకంటే ఈ భౌతిక ప్రపంచంలో జీవించియుండటం మరియు మానవాళి మధ్యలో సంచరించటంలో వారి సంకల్పం అందరికీ ఆత్మకళ్యాణం లేదా ఆత్మ వికాసం చేకూర్చటమే అవుతుంది కనుక. వారి ఆలోచనలోకి ఇది రాగానే, ఆలోచనయే ఇచ్ఛాశక్తిగా రూపాంతరం చెందుతుంది. అలా సంకల్పం కల్గగానే మనలో తదనుగుణంగా ప్రాణహుతి యొక్క కార్యదక్షత ప్రారంభమవుతుంది. "బిటియాకు దెబ్బ తగలకూడదు, నేను తలపెట్టినది జరగాలి, నేను ఆమెను తయారు చేయదలచినట్లు పని పూర్తికావాలి" అని వారు చేసిన సంకల్పం తలచు కుంటూంటే నాకు ఒక్కసారి గాదు, అనేకసార్లు నా కళ్ళు అశ్రుపూరితమై, హృదయం గగుర్పాటు చెందింది.

ఒకసారి బహుశః 'z' బిందువు యొక్క అత్యంత ఆనంద స్థితిని దాటి వెళ్ళిన తర్వాత ఆ స్థితి యొక్క రసానుభూతిని మరికొద్ది రోజులు నాలో నిలిపి ఉంచమని వారిని ప్రార్థించాను. అపుడు వారు నాకు ఇలా వ్రాశారు. "శిష్యుని ఉన్నత దశకు తీసుకొని వెళుతూండడం గురువు ధర్మమూ, కర్తవ్యం కూడ. కాని నీవు దాటి వచ్చిన బిందువు ఆనంద స్థితిని మరల

కోరావు. బిడ్డ, ఏదైనా కోరితే తల్లి మనసు దానిని ఇచ్చేందుకే ఉప్పొంగుతుంది. కాని నీ ఈ కోరిక మాత్రం నన్ను సందిగ్ధంలో పడవేసింది. సరే! ఇప్పుడు నేనొక ఉపాయాన్ని ఆలోచించాను. దానివల్ల గురు ధర్మమూ నెరవేరుతుంది. దానితోపాటు నీ కోరికా తీరుతుంది. ఆ ఉపాయం ఏమిటంటే - నేను నీ మనస్సు యొక్క ఊర్ధ్వ వృత్తిని (తరువాత స్థితిని) z1 యొక్క దశయందు (ప్రవేశపెట్టి) ప్రయాణింప చేశాను, మరియు చాల వరకు పవిత్రమైనట్టి మనసు యొక్క అధో స్థితిని క్రింది z బిందువు (అధో బిందువు) స్థితిలో ప్రవేశపెట్టాను. అందుచేత నీకు ఈ రెండు బిందువుల వద్దగల స్థితుల యొక్క అనుభూతి కలుగుతుంది" అని. తమ దివ్యక్షేత్రమునందు వారికి గల దూరదృష్టి అద్భుతం. వారి పావన ప్రాణాహుతి ద్వార మనలో మేల్కొల్పబడిన ఆ దివ్య చైతన్యం యొక్క కార్యం విశిష్టమైనది.

పరిశోధనా దృష్టితో వారు నాలో ఉన్నతిని పొందే అనేక బిందువులకు లేదా క్షేత్రాలకు ఎ, బి, సి, డి (A, B, C, D)మొదలగు పేర్లు పెట్టి ఈశ్వర ప్రాప్తి అంటే అత్యున్నతమైన స్థితికి చేరుకొనేసరికి ఎన్ని ముఖ్యమైన బిందువుల దాటి ప్రయాణం చేసి వాటిని దాటవలసి ఉంటుంది - అనే విషయాలను వారు పరీక్షించి చూశారు. అక్కడకు చేరినప్పుడు మన అంతిమ సత్యము యొక్క దివ్యదశ జాడ తెలుస్తుంది. ఈ ఆధ్యాత్మిక పరిశోధనలో వారు ఈ బిందువులను విభిన్న దశల తర్వాత అనగా పిండదేశ్, బ్రహ్మాండ మండలం, పరబ్రహ్మ మండలం, ప్రపన్న, ప్రభు ప్రపన్న ఇత్యాది దశల తర్వాత 52 ముఖ్య బిందువులను తమ పరిశోధనలో కనుగొన్నారు. ఎప్పుడైతే షట్ చక్రములను జాగ్రదావస్థలోనికి తీసికొని వచ్చి వాటిలో ప్రయాణము గావించి, సహస్ర దళ కమల చక్రమునందు నన్ను విహరింపజేశారో అప్పుడు నేను పొందిన అనుభూతి ఏమిటంటే సహస్రదళ కమలము నుండి మన సంబంధము (లింకు) శ్రేష్ఠ లక్ష్యము (ఈశ్వరుని)తోనే అనుసంధానమై ఉన్నట్లుగా అనిపించింది. దీని తరువాత వారు తమ పావన ప్రాణశక్తితో మనలను బ్రహ్మరంధ్రము యొక్క బిందువు వద్దకు తీసికొని వెళ్లారు. జుట్టు పిలక ఉండే ప్రదేశమే ఈ బిందువు యొక్క స్థానము.

"ఈ స్థానం నుండే మాతృ గృహంలోకి వెంటనే ప్రవేశం పొందడానికి ఆత్మ సిద్ధపడుతుంది. ఎప్పుడైతే ఆత్మ తన ఎదుట ద్వారం తెరచి ఉన్నట్లు చూస్తుందో అప్పుడు ఆ స్థానం నుండి బయటపడి వెంటనే ప్రాణం వదలి 'ఇల్లు' చేరాలని తపిస్తుంది", అని బాబూజీ వ్రాశారు. బహుశ ఇందువల్లే యోగులయొక్క ప్రాణం ఇక్కడి నుండే బయట పడుతుంది. "ఈ స్థానం వద్ద సద్గురువు స్వయంగా ఆత్మను తనలో ఇముడ్చుకొని - కొంచెం కూడా ఆలస్యం లేకుండా బ్రహ్మ రంధ్ర బిందువు నుండి దుమికి ఆవలకు తీసికొని వెళ్ళాల్సి ఉంటుంది," అని కూడా వ్రాశారు. ఇదే సద్గురుని యొక్క కార్యసామర్థ్యము. పిమ్మట, తరువాత దశయగు కేంద్రీయ క్షేత్రం (సెంట్రల్ రీజియన్)లో మనల్ని ఉంచుతారు. ఇపుడు గురువు బాధ్యత కొంత తేలికవుతుంది. సద్గురువు యొక్క ఈ కృపను ఏవిధంగా వర్ణించగలం? ఎవరూ దీనిని వర్ణించి యుండలేదు. వర్ణించజాలరు!

వారి ప్రాణశక్తి ద్వారా ఆధ్యాత్మికోన్నతి యందలి అనేక బిందువులను దాటుచున్నప్పుడు నా స్వవిషయంలో గమనించినదేమిటంటే - శ్రీ బాబూజీ వారి మనసులో - ఈమెను ఈ బిందువును దాటించాలి, ఆ బిందువును దాటించాలి - అనే భావన కల్గుతుండగానే ఆ బిందువు నుండి నేను దాటిపోవుట జరిగి మరియు ఆ తరువాతిదియగు మరో బిందువు యొక్క విశాలమైన క్షేత్రం నా ముందు కనబడేది. పిమ్మట ఈ క్రొత్త క్షేత్రంలో యాత్ర చేయించవలెనన్న ఆలోచన వచ్చినంత మాత్రాననే అక్కడి నుండి వారి సంకల్పము యొక్క ఒక తేలికైన సూక్ష్మమైన క్షణమాత్రపు కుదుపు కలగటము, పిమ్మట ఆ క్షేత్రములో కూడ యాత్ర మొదలవ్వటమూ జరిగేది.

బ్రహ్మవిద్యా క్షేత్రమునందు వారి ప్రాణాహుతి శక్తి యొక్క కార్యదక్షత మరియు పటుత్వము అమోఘమైనదిగానే, సత్వర ఫలదాయకమైనదిగా నేను గ్రహింపు పొందాను. శ్రీ బాబూజీ పావన ఇచ్ఛా శక్తి యొక్క ఇంద్రజాలం లాంటి అద్భుతాన్ని నేను ఎన్నోసార్లు నాలోను, అభ్యాసుల లోను కూడ గమనించాను. ఇంకనూ గమనిస్తూనే ఉన్నాను. నాకు బాగా జ్ఞాపకం ఉన్న

విషయం ఏమంటే ఒకసారి వారు చాల సహజ ధోరణిలో "బిటియా! కొంతమంది నన్ను - 'మీరు ఒకేసారి ఈ ప్రపంచంలోని మొత్తం మానవులందర్నీ కూడా లక్ష్యం (ఈశ్వరుని) వద్దకు చేర్చవచ్చును కదా', అని అడుగుతారు. ఇలా చేయడం సాధ్యమే. కాని బిటియా! నీవే ఆలోచించు! నేను ఈ ప్రపంచాన్ని ఒక్కసారిగా మార్చడానికి అనగా ఈశ్వరుణ్ణి విలువలేకుండా చేయడానికిగాని, అవమానించడానికి గాని రాలేదు. ఈశ్వరుని స్వంతం చేసుకుని ఆయన యొక్క భగవత్ శక్తి ద్వారా కాలాన్ని, మానవ హృదయాలను అత్యుత్తమంగా (పవిత్రంగా) మార్చడానికి నేను వచ్చాను. అందువల్ల విశ్వమునందలి ప్రస్తుత వాతావరణమును మార్చుట అత్యవసరమై యున్నది. ఈ నా ప్రయత్నం తప్పకుండా విజయవంతమవుతుంది. ఆ విషయాన్ని నీవైనా లేదా ఎవరైనా కూడా - కొద్దిగా దివ్యత్వాన్ని పొందిన వారు ఈ విషయాన్ని పరీక్షించి చూడగలరు. నీవు నీ అనుభవం ద్వారా ఈ విషయాన్ని నాకు తెలుపుతూనే వున్నావు కదా!" అని నాతో అన్నారు. నేను వారికి ఈ విషయం వ్రాసే ఉన్నాను కూడా. కొన్ని సంవత్సరాల క్రితం "సహజ మార్గము' ' పద్ధతి, దాని ద్వారా ఈశ్వర ప్రాప్తికి ఉన్న తేలికైన ఉపాయాలు మరియు సాధన - ధ్యానములను గురించి ప్రజలకు తెలియజేయునప్పుడు వారు వినీ విననట్లున్నారు. కాని నేడు ఎక్కడైనా ఈ విషయం గూర్చి మాట్లాడుతూంటే ముగ్ధులై వింటున్నారు. అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్నారు. ఇంకా అనేక మంది ప్రజలు ధ్యానం చేయడం కూడా ప్రారంభించుచున్నారు, అని గట్టిగా ఆత్మ విశ్వాసంతో చెప్పగలను.

నేడు ఈ ప్రాణాహుతి శక్తి యొక్క ప్రయోజనం, దాని పవిత్రమైన, సార్థకమైన దక్షత - సాధన ప్రారంభించినా ప్రారంభించక పోయినా సరే గుర్తించబడుతున్నాయి. మన మాటలను అందరి హృదయాలు స్వయంగా అంగీకరిస్తున్నాయి. ఇంకా ముస్ముందు ఏమి జరుగనున్నదో? దివ్యత్వం ఎంతగా ప్రసారం కాగలదో ఎవరు చెప్పగలరు ? మనలో దీనిని ఎవరు చూడగలరో వారే చూస్తారు. మరో సంతోషకరమైన విషయం ఏమిటంటే మనం ఎంతెంతగా మార్పు చెందుతూ స్వచ్ఛమైన దివ్యత్వాన్ని పొందుతూ

ఉంటామో అంతగానూ 'వారి' పనిలో అనగా మనల్ని ఉద్ధరించే వారి పనిలో - మన సహకారం కూడా పెరుగుతూ ఉంటుంది. మనం పది మంది అభ్యాసులం ఉన్నప్పుడు వాతావరణం లేదా ప్రకృతిలో దాని ప్రభావం అందుకు తగిన పరిమాణంలోనే ఉంటుంది. అదే వందలు, వేల కొలదీ సంఖ్యలో అభ్యాసులం ఈశ్వరీయ ధారతో ప్రకృతిని పవిత్ర పరచడానికి పూనుకుంటే దాని ప్రభావం ఎంత ఉంటుందో ఊహించవచ్చు. నేడు సహజ మార్గము యొక్క దివ్య సందేశము మరియు శ్రీ బాబూజీ నుండి లభించిన ప్రాణాహుతి శక్తి యొక్క పనిచేయు సామర్థ్యము, దక్షత దేశ విదేశాలలో వ్యాపించి వాతావరణమును పరిశుద్ధం చేస్తూ ఉన్నాయి. దీనితోపాటుగా మానవ హృదయాలను ఈశ్వర ప్రాప్తి మరియు వాస్తవిక శాంతిని అనగా ఆత్మశాంతి పొందుటకై యోగ్యం చేస్తూ ఉన్నాయి. దీని సత్ఫలితం మన ఎదుటనే చూస్తున్నాము. దీనికి ప్రకృతికూడ సహకరిస్తోంది. శ్రీ బాబూజీ మహరాజ్ వారి యొక్క దివ్య కృప ఇప్పుడీ ప్రపంచానికి ఎలాంటి దివ్యప్రసాదాన్ని అనుగ్రహించ నున్నదోనని కుతూహలముతో ఎదురుతెన్నులు చూడడమవుతోంది. ఇది ఇప్పుడే ఎవరు చెప్పగలరు? కాని మానవ హృదయాలు దివ్యత్వం అనుగ్రహించే ప్రసాదాన్ని పొందడానికి యోగ్యత పొంది తీరుతాయి. ఈ దివ్య ప్రసాదాన్ని స్వీకరించగలగటమే మనమా యోగి పుంగవునికి (బాబూజీకి) చేయగల్గిన సత్కారం. అతి సరళము, సూక్ష్మము అయిన అనుభవ దృష్టితో నేనీ విధంగా చెప్పుతూనే ఉంటాను. వారి సమక్షంలో దిగుతున్నటువంటి దివ్యత్వాన్ని దాచి ఉంచలేం. ఈ దివ్యత్వం యొక్క ప్రమాణాన్ని - ఋజువును, కనబడకుండా చేయలేము. ఎంతో కొంత చెప్పితీరాల్సిందే! అభ్యాసీ సోదరులందరికీ బాబూజీ మహరాజ్ దివ్యత్వము యొక్క అనుభవ దృష్టిని సరిసమానంగా ప్రసాదిస్తున్నారని నేను ఇప్పుడు ఖచ్చితంగా చెప్పగలను. అసలు విషయం ఏమంటే మార్పు - పరివర్తనం అనేది యదార్థం చెప్పుతూ ఉంటే, అనుభవం దివ్యదృష్టిని పొందుట ద్వారా హృదయంగమౌతుంది. నేడు ఈ పావన ఈశ్వరీయ ధారను శ్రీ బాబూజీ మహరాజ్ తన ప్రాణాల ద్వారా మనలోపల ప్రవేశపెట్టి, అందులో స్థిరత్వాన్ని

నింపి మనము లక్ష్యమును తప్పక చేరుకోగలం అనే అచంచల విశ్వాసాన్ని కలిగిస్తున్నారు.

ఒక విశేషమైన ఆధ్యాత్మిక స్థితిని పొందినప్పుడు అభ్యాసీలు 'అసలు మేమిక ఈ ప్రపంచంలోకి రావడమే ఉండదు', అనే మాటలను నేను స్వయంగా విన్నాను. ఎంత సహజంగా వైరాగ్యంతో వాళ్ళు అలా అంటున్నారంటే వాళ్ళకే దాని గురించిన స్పృహ లేదు. నిజానికి ఆ 'స్థితి'లో చెపుతున్నది వారు కాదు. ఆ స్థితి శ్రీ బాబూజీ వారి యొక్క ఇచ్ఛాశక్తి మాత్రమే - 'వారి' ప్రాణాహుతి శక్తి ద్వారా అది అభ్యాసుల హృదయాలలో నిండిపోయింది. మానవ హృధయాలను దివ్యత్వంతో పరిపుష్టం (పరిపూర్ణం) కావించడంలో ప్రాణాహుతి శక్తి యొక్క కార్య సామర్థ్యం ఎంత బాగా పని చేస్తుందో ఎవరూ అంచనా వేయలేరు. వాస్తవంగా ప్రాణాహుతి యొక్క కార్యదక్షత అనేది బాబూజీ వారి ఇచ్ఛా సంకల్పం యొక్క సంకేతంతోనే, సూచనతోనే జరిగి పోయింది. ప్రాణాహుతి ప్రభావంతో నా హృదయాంతరంలో కురిసిన దివ్యతా వర్షం తడుపు (దివ్యానందపు చెమ్మ) ఎన్నడూ ఆరనిదిగా ఉన్న అనుభూతిని పొందాను. అపుడు సజలమైన నా నేత్రద్వయం వారి పాదపద్మముల మీద, "ప్రాణాహుతి చేత సంరక్షింపబడుతున్న ఈ సర్వ విశ్వంలో మీ ప్రతి రూపమే ఉండాలి - మీ రే ఉండాలి," అని స్మరిస్తూ వాలిపోతున్నది.

## 9. దివ్య చైతన్యము - అనుభవము

సమస్త విశ్వమునందు ఒక అగోచరమైన సూక్ష్మశక్తి, మనకు తెలియనటువంటి ఒక ప్రాణశక్తి ప్రవహించుతోంది. ప్రాణులన్నింటా తెలియకనే ఈ ప్రాణశక్తి ప్రవహిస్తోంది. సృష్టి జరిగినప్పుడు శక్తి ప్రవాహముతో పాటు ఈశ్వరీయశక్తి ప్రవాహము కూడా ప్రాణులందరిలో వ్యాపించింది. సృష్టియందు ఈ సూక్ష్మ ప్రవాహము లేనిది ఏదీలేదు. సృష్టిలో బీజ రూపంలో ఈశ్వరుడున్నాడు. శక్తిరూపంలో ఆయన చైతన్యవంతమైన విశుద్ధ ప్రాణశక్తి సమస్తమునందూ ప్రవహిస్తూంటుంది. దీనికి నిదర్శనము ఏమంటే - మన ముఖ్య లక్ష్యమైన ఈశ్వరుని విస్మరించినప్పుడు, బుద్ధి, తెలివి, స్పృహ ఉండి కూడా ఈ భౌతిక ప్రపంచంలో మునిగి, మైమరచి 'వారి' సూక్ష్మ (చైతన్య) జీవ శక్తితో పాటుగా అంతరంగమున వ్యాపించి యున్న 'వారి' కి సంబంధించిన దివ్య చైతన్యము నుండి కూడా దూరమై పోతాము. నిజానికి ఆ చైతన్యమే మనకు సదా శాంతి సంకేతమునిస్తూ వుంటుంది. జీవిత పరమ లక్ష్యాన్ని మరచిపోవడం ద్వారా స్వయంగా మనల్నే కోల్పోతున్నాము - అనడానికి ఇంతకన్నా రుజువేమి కావాలి? ఈశ్వర స్మరణను జ్ఞాపకము చేయు ఆ దివ్య జీవశక్తి, ఆ దివ్య చైతన్యము ప్రయత్నించి ప్రయత్నించి చివరకు అలసిపోయి మన అంతరంగములోనే సమసిపోతాయి. ఇందువలన అంతరంగము నందు అశాంతి, భయము, బలహీనత మొదలైనవి పుట్టి పెరిగిపోతాయి. భగవద్గీతలో 'నీవు నిర్భయముగా ఉండుము' అని చెప్పబడింది. కాని ఎలా ఉంటాము ?

ఎవరైనా సద్గురువు శ్రీ బాబూజీ మహరాజ్ లాంటి వారు దివ్యమైన ఈశ్వరీయ మహాశక్తితో ఈ ప్రపంచంలో అవతరించి తమ సంకల్ప శక్తిని ప్రాణాహుతి ప్రవాహము ద్వారా మన అంతరంగములో ప్రవేశపెట్టినప్పుడు మరోసారి మనకు ఆత్మోన్నతి కలిగే అవకాశము వస్తుంది. అంతరంగంలో లక్ష్య ప్రాప్తికై చైతన్యం మేల్కొని దప్పిక గొన్న చాతక పక్షివలె ప్రియతముని (ఈశ్వరుని) ఆర్తితో అన్వేషించసాగుతుంది. ఈశ్వరుని పొందాలనే పట్టుదల ప్రబలమవుతుంది. ఈ వికలమైన దశతోనే మన సాధన అనునది

ఆరంభమవుతుంది. లక్ష్య ప్రాప్తి కొరకు సాధనలో మునిగిపోయి ఉన్న ఆంతరిక చైతన్యమునకు, ఆధ్యాత్మిక దశల యొక్క అనుభవాల మధ్య ఒక సామరస్య పూర్వకమైన సోదర భావము ఏర్పడుతుంది. అంతరంగము చైతన్యము చెందినప్పటి నుండే మనకు ప్రియతముని సామీప్యతానుభవాలు కలుగుతాయి. అనుభవములు కలిగినప్పుడు వానిని ఏదో విధంగా వ్యక్తపరచడానికి ప్రయత్నిస్తాం. మానవుని మనస్సు దివ్యత్వపు సాధనలో లగ్నమైతే అనుభవాలు కూడా వచ్చి తీరాల్సిందే. ఈశ్వరీయ ధారయందు మునిగిపోయిన హృదయం తన రంగును అనగా భౌతికతను విడిచి దివ్యత్వం యొక్క రంగు వేసుకొంటుంది. ఏ రంగైనా వెలిసిపోకుండా ఉండటానికి మనం దానిలో కొన్ని రసాయనాలను కలుపుతాం. అదే విధంగా మానవ హృదయంలోని దివ్యత్వానికి పక్కారంగు వేసే ముందు దానిలోనే దాగి ఉన్న ఈశ్వరీయ ధార అనే రంగులో దాన్ని ముంచి ఉంచడానికి ప్రయత్నిస్తాం. క్రమక్రమంగా సద్గురువులు శ్రీ బాబూజీ మహరాజ్ వారి ప్రాణాహుతి శక్తి అనెడి రసాయనం కలుస్తూండడం వల్ల ఒకనాడు మన అంతరంగం చెక్కు చెదరని నిర్మలమైన దివ్యత్వపు రంగును సంతరించుకోడం నేను చూశాను. నల్లని కంబళిపై మరో రంగు అద్దినా కనిపించదన్న సూరదాసు సూక్తి నిజమనిపిస్తుంది. మన అంతర బాహ్యముల సంబంధము మారిపోయి బాహ్యపు సంస్కారములు అంతరంగంలోనికి ప్రవేశించుట సమాప్తమవుతుంది. ఇపుడు మన జీవనం బాహ్యం నందు కాక అంతరంగంనందు వ్యాప్తమై ఉన్నట్లు అనుభవమవుతుంది. స్థూలత్వం నుండి సూక్ష్మత్వంలోకి ప్రవేశిస్తాము. అంతరంగం లోపలే ఇచ్చి పుచ్చుకునే వ్యవహారం జరగనారంభమవుతుంది. అమ్మేవారు కొనేవారు ఒకరే అవుతారు. సద్గురువు బాబూజీ మహరాజ్ యొక్క మనోహరమైన దివ్యానుగ్రహ కృపా రసపానం యొక్క రుచి మీద దృష్టి కేంద్రీకరింపబడ్డం వల్ల ప్రాపంచిక దృష్టి తొలగిపోతుంది. అంతరంగపు దివ్యత్వం ఉన్నతి పొందుతూ విస్తారమవుతుంది. ఇపుడు ఆంతరిక చైతన్యపు అనుభవాల ద్వారా ఆంతరిక చేతనత్వం దృఢత్వం పొందడం మొదలవుతుంది. ఇలా పరిణతి చెంది అంతరంగంలో ఆత్మవిశ్వాసం అంకురించి అభివృద్ధి చెందుతుంది.

ఎవరైతే 'లక్ష్యము'తో సంపూర్ణ లయావస్థను పొంది 'అంతిమ సత్యము' ను కూడా దర్శించి యుంటారో కేవలం అటువంటి నిష్కామయోగి (లేదా ఫకీరు) మాత్రమే ఇతరులను 'అంతిమము' (మాతృభూమి) వరకు తీసికొని వెళ్ళగలిగే యోగ్యతను కలిగి ఉంటారు. అట్టి మహాత్ముల యొక్క పరమ లక్ష్యము విశిష్టమైనదిగా ఉంటుంది. వారు తమ ఇచ్ఛాశక్తి ద్వారా మరచిపోయిన మాతృభూమిని మనకు గుర్తు చేసి తమ ఈశ్వరీయ ప్రాణాహుతి శక్తిని సాయముగ నిచ్చి దూరంగా వున్న ఈశ్వరుని దివ్యదేశములోనికి వెళ్ళుటకు మనకు యోగ్యత కల్పిస్తారు. మానవుల ఆత్మోద్ధరణ కార్యమే వారి పరమ లక్ష్యమై దానిలోనే నిమగ్నమై ఉంటారు. వారి కృషి ఫలితం వెంటనే మార్పు చెందుతున్న అనుభవముల ద్వారా మనం గ్రహిస్తాము. ఇటువంటి నిజమైన మార్గదర్శకుని అడుగు జాడల్లో ఆధ్యాత్మిక క్షేత్రంలో మనం అడుగిడినది మొదలు మార్పు చెందుతున్న మనో స్థితుల అనుభవము, ఆ ఆనందము మనకు స్వానుభవమవుతుంది. దీనితో పాటుగా పవిత్రత నందిన మన ద్వారా వ్యాపించుచున్న పవిత్రత వాతావరణము నందు దాని మహత్తును వెదజల్లుతుంది. తత్ఫలితంగా ఈ అశాశ్వతమైన ప్రపంచంలో ఉరుకులు పరుగులతో అలసి సొలసిన జనులు తమ బడలికను తీర్చుకుని కొంతలో కొంతైనా శాంతిని అనుభూతి చెందుతారు. అందరికీ ఎంతటి అలౌకిక లాభమో ! మన ఆత్మోన్నతి కొరకు మనం సావధానంగా ఉండడం వల్ల స్వయంగా పారమార్థిక లాభాన్ని పొందడమే కాక మన ద్వారా ఇతరులకు అదే పావన ధార లభ్యమవుతోంది. అందుచేత ఆధ్యాత్మిక మార్గము అనగా యోగమార్గము స్వార్థపూరితము కాకపోగా మన ద్వారా (సృష్టి) వాతావరణం కూడా పవిత్రమవుతుంది. దీనివల్ల మన ఆత్మోన్నతితో పాటుగా ఆ ఆనందము లేదా పవిత్రత మన ద్వారా వాతావరణము నందు కూడా వ్యాపిస్తూ ఉంటుంది. యోగమనగా ఎక్కడి నుంచి మనం ప్రయాణించి వచ్చామో అక్కడికి - ఆ మాతృభూమి 'భూమా' కు తిరిగి వెళ్ళి చేరిపోవడమే ! అనగా గడచిన యుగంలో మనం వదలిపెట్టి వచ్చిన 'మూలము' అయిన మాతృభూమి 'భూమా'ను తిరిగి చేరుకోడమే యోగము. ఆ మాతృభూమిని వీడి ఎంతో కాలం గడచిపోయింది. 'ప్రభూ! నిన్ను వీడినది మొదలు నాకు

సుఖశాంతులు లేవు. నీ దర్శన భాగ్యం నోచుకోని నా కళ్ళకు దుఃఖమే దక్కినది'అన్న మీరాబాయి ఆంతరిక వేదన మనకూ అనుభవమవుతుంది.

జగత్తు ప్రియతముని (ఈశ్వరుని) సౌందర్యం వైపు దృష్టి మళ్ళించలేకపోతోంది. ఆ దివ్య సౌందర్యం మీద మన దృష్టి మళ్ళితే, ఈ ప్రాపంచిక విలువ నశించిపోతుంది. దుఃఖిస్తున్న నేత్రాలకు 'వారి' దర్శనమే పరమౌషధం ! మన యింటికి తిరిగి వెళ్ళడం స్వార్థం కాదు, ప్రతి ఒక్కరి కర్తవ్యం ప్రాణిమాత్రుల జీవిత పరమలక్ష్యం ఇదే ! 'ఇంటి' ని అనగా మాతృభూమిని మరచి దారితప్పి పోయిన వారు ఇతరులకు ఏ విధంగా దాని మార్గం చూపగలరు. తన సొంత ఇంటి యొక్క సుఖ సౌఖ్యాలు, శాంతి, స్వాతంత్ర్యం లేదా స్వేచ్ఛ ఇవన్నీ కూడా చాలా ప్రత్యేకంగా ఉంటాయి. పోల్చడానికి వీల్లేనివి. వాస్తవానికి మానవుడు ఈ కారణం వల్లనే ఏదో ఒక దశలో దుఃఖానికి అశాంతికి గురి అవుతున్నాడు. ఈశ్వరప్రాప్తి అనే పరమ లక్ష్యపు మార్గాన్ని పట్టుకున్నప్పుడే వాస్తవంగా మనం ఆ పరమ సుఖశాంతి వైపు పురోగమించి మన స్వేచ్ఛను పొందగలం. కష్టాలలో ఈ ఆలస్యం ఎంతయిందంటే - కలవాలనే కోరిక కూడా మనలో నశించిపోయింది. పెడదారి పట్టేసింది. కాని శ్రీ బాబూజీ యొక్క పవిత్ర ప్రాణాహుతి - మనలో ఆ ప్రియతమునితో సంబంధమును ఏర్పరచుకొనాలనే చైతన్యమును మేల్కొలిపి నప్పటినుండీ - ఆ ప్రియతమునితో అనుసంధానమును పొంది యున్న సహజ మార్గపు జాడ మనకు తెలుస్తుంది. సమర్థ సద్గురువు శ్రీ బాబూజీ వారి ఈ ఋణము ఎన్నటికీ తీర్చలేము. 'సహజమార్గం' నేడు ప్రాణికోటిని ఈశ్వర ద్వారం వద్దకు చేర్చుటకు సులభసాధ్యంగా ఉంది. మనల్ని ఈ దివ్య మార్గంలో ప్రవేశపెట్టడానికి బాబూజీ మహరాజ్ యొక్క ప్రాణాహుతి శక్తి సిద్ధంగా ఉంది. మన మనసులోని ఆంతర్యాన్ని గ్రహించి దానిని దివ్యత్వంతో పరిశుద్ధం చేస్తూ, లక్ష్యం పట్ల సావధానపరస్తూ మనల్ని అంతిమ సత్యం వైపునకు తీసికొని వెళ్ళగల సమర్థ శక్తి నేడు మన సమక్షంలోనే ప్రకాశిస్తూ ఉంది. దీనిని మించిన పరోపకారం మరేదీ ఉండజాలదు. దారి తప్పిన మనలను సతత స్మరణలో మలచి సహజ మార్గము తెలియజెప్పి తమ పవిత్ర ప్రాణశక్తి ద్వారా మాతృభూమికి

మరలిపోవాలనే తలపు నిచ్చి, తల్లివెంట నడిచే బిడ్డ అలుపూ సొలుపూ లేకుండా, దారి తప్పకుండా, మిరుమిట్లు గొలిపే నక్షత్ర కాంతికి సంభ్రమం చెందకుండా ముందుకు ఎలా సాగిపోతాడో, అదే విధంగా వారు మనల్ని వెంట బెట్టుకుని వెళ్ళడం - నేను చూశాను. ఇది బాబూజీ మహరాజ్ కృప. వారి గొప్పదనం వర్ణింపనలవి కానిది. వారు ప్రసాదించే దాని పట్ల సావధానంగా ఉంటూ ఆ అనుభవాల సారాన్ని ఆస్వాదిస్తూ మనఃపూర్వకంగా వినమ్రులమై 'వారి' పాద పద్మాలపై వాలిపోతాము.

ఈశ్వరప్రాప్తి కొరకు అన్వేషిస్తున్న అభ్యాసీల హృదయంలో వారు తమ ప్రాణాహుతి శక్తిని ప్రవహింపజేసినప్పుడు అనగా తమ ప్రాణాల ద్వారా అభ్యాసి ప్రాణము నందు ఆ పావన ఈశ్వరీయ శక్తిని ఆహుతి ఇచ్చినప్పుడు 'వారి' యొక్క ఆ మహా చైతన్య శక్తి అభ్యాసుల హృదయాలలో నిద్రాణమై యున్న ఆ పరమశక్తిని తట్టి మేల్కొలిపి దానిని జాగ్రదావస్థలోనికి తీసుకుని వెళ్ళుతుంది. దీనిని లక్ష్యప్రాప్తి పట్ల సచేతనం లేదా మేల్కొలుపు అనడం సమంజసంగా ఉంటుంది. మనం ఈశ్వర ప్రాప్తికై తల్లడిల్లుతాము. ఈ దివ్య చైతన్యం జాగృతం కావించబడిన తర్వాత అభ్యాసీ నిద్రలో కూడా లక్ష్య ప్రాప్తి ఎడల మేల్కొని జాగృతిలో ఉన్న అనుభూతి చెందుతాడు. మెళకువ, సుషుప్తి ఈ రెండూ కూడా ఒకటిగానే ఉంటాయి. ఈ చైతన్యమే సమర్థ సద్గురు శ్రీ బాబూజీ మహరాజ్ వారి ప్రాణాహుతి శక్తి ద్వారా జాగృతమై ఊర్ధ్వంగా ప్రయాణించుటకు సిద్ధం అవుతుంది. దివ్య చైతన్యం (డివైన్ కాన్షస్‌నెస్) దివ్యత్వాన్నే (ఈశ్వరునే) స్మరిస్తుంది. దీనివల్ల లక్ష్య ప్రాప్తికై మన కోరిక మరియు మన పురోభివృద్ధి తీవ్రమై తపనగా రూపుదిద్దు కొంటుంది. ఈ చైతన్యంతోనే దివ్యానుభవాలు మనలో జన్మించి పెరిగి విస్తరిస్తాయి. ఈ అనుభవాల వల్ల దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. ఎన్ని పనులున్నా, ఎన్ని సమస్యల్లో చిక్కి ఉన్నామనిపించినా ఆ ఆంతరిక చైతన్యం మనలో సజీవంగా అప్రమత్తంగా ఉండి ఒక జాగరూకుడైన కావలి వానిలా బాహ్య విషయాలను బాహ్యము నందే నిలిపి వేసి, లోపలికి రానీకుండా మన అంతరంగిక పవిత్రతా స్థితిని సురక్షితముగా ఉంచుతుంది.

ఇలాంటి దివ్య చైతన్యాన్ని మేల్కొలిపే సద్గురువు శ్రీ బాబూజీ మహరాజ్‌తో మన అంతరంగమునకు క్రమక్రమంగా సంబంధం ఏర్పడుతూ జాగృతమవుతున్న మన సమస్త చైతన్యంలో 'వారి' స్వరూపమే నిండిపోతుంది. మనం మన అంతరంగంలోని వారి దివ్య స్వరూపము నందే నివసించుచున్నట్లుగా మన శరీరం ఒక యంత్రం వలె తన పని తాను చేసుకుపోతున్నట్లుగా మనకనిపిస్తుంది. మనం ఎవరితోనైనా మాట్లాడుతున్నా ఏదైనా ఉత్సవంలో పాల్గొన్నా ఒక స్వప్నంలో ఉన్నట్లు ఉంటుంది. కాని స్వప్నంలో నుండి లేవగానే కల అంతా కరగిపోయినట్లు మనం ఆ వాతావరణం నుండి బయటికి రాగానే ఆ దివ్యచైతన్యం మరల మనల్ని మెల్లగా 'మాలిక్' లో ప్రవేశపెడుతుంది. మనం కేవలం మాలిక్‌నకు చెందిన వాళ్ళమే అనిపిస్తుంది. కాలాంతరమున బాహ్యమును అంతరమును కలవనీకుండా మధ్యలో ఏదో చైతన్యం అడ్డు నిలిచినట్లుగా మనకు తోస్తుంది. మాలిక్ యొక్క దివ్య స్వరూపం ఆ చైతన్యంలో ఇమిడిపోయి ఉన్న కారణంగాను, మన 'అంతిమ సత్యం' యొక్క స్మరణ తీవ్రమైన కారణంగానూ ఆయన మనలో నిండిపోయినట్లుగా అనుభవమవుతుంది.

ఒక విధంగా ఈ పావన చైతన్యం సావధానంతో (ఎలర్ట్‌గా) ఉండి ప్రాపంచిక విషయాలు మన హృదయాన్ని అపవిత్రం చేయకుండా సుఖదుఃఖాలకు అతీతంగా ఉండగలిగేట్టు చేస్తుంది. మరో విధంగా పవిత్ర ఈశ్వరీయ స్థితుల యొక్క వికాసము సంతరించుకున్న మన ఆంతరిక అనుభవము తన పవిత్ర స్థితి ద్వారా త్వరగా లక్ష్యాన్ని చేరాలి అనెడి జ్ఞాపకాన్ని మరింతగా ప్రేరేపిస్తుంది. అప్పుడు మనం మన అంతిమ సత్యంలో లయం కావాలని తపించిపోతాం. 'తపన తన మార్గాన్ని తానే ఏర్పరచుకుంటుంది', అను శ్రీ బాబూజీ వారి మాటలు యదార్థమవుతాయి.

సద్గురువు శక్తి నుండి పొందిన ఈ చైతన్య శక్తి ద్వారా సతత స్మరణ మన హృదయంలో నాటుకుపోయి ఆ స్మరణ కలిగినప్పుడల్లా దేనితోనో అనుసంధానం కలిగి ఉన్నట్లనిపిస్తుంది. ఆ భావనలో మునుగుచూ, లీనమగుచూ [illegible] అనగా మన

ఉనికిని మర్చిపోతాం. 'మనం' అనే ధ్యాస లేకపోవడంతో పాటు మనం జీవనం కొనసాగిస్తూనే - దానికి అతీతంగా ఎవరి స్మరణలో మగ్నమై ఉన్నామో 'వారి' లోనే ఉండిపోతాము - ఈ ప్రపంచంలోకి, ఈ ఆలోచనల్లోకి ఎన్నటికీ రానేరాము. ఒక్క క్షణం కూడా (విడిచి) తాళలేని స్థితి ఏర్పడుతుంది. ఇటువంటి స్థితిలో "ఒక్క క్షణం ఆగడానికి కూడా నాకు సమయం లేదు. అటూ ఇటూ చూడ్డానికి కూడా సావకాశం లేదు. రేయి, పగలు నా కన్నుల్లోకి రావడం లేదు. ఇహ పరాల గొడవలు లేవు. ఏ విషయమూ బయటి నుండి లోపలికి, లోపలి నుండి బయటికి రావడం పోవడం లేదు. ఇప్పుడు కేవలం ముందుకు వెళ్ళాలి. ఎంత దూరం వెళ్ళాలో తెలీదు. తపన - ఎంతగా ఉందంటే ఎంతకూ దప్పిక తీరడం లేదు. గమ్యం ఏ దిశలో ఉందో కూడా తెలీదు. కాని గమ్యమే తనకు తానుగా నా వైపు తరలివస్తోంది. దీనితో మరింత త్వరగా ఐక్యమవ్వాలనే కోరిక ఇంకా ఇంకా ఎక్కువైపోతోంది. ప్రతి అడుగూ ఆ వైపే పడుతోంది," అని బాబూజీ మహరాజ్‌కు వ్రాశాను. ఈ అనుభవాన్నే ఎన్నో రకాలుగా బాబూజీ వారికి వ్రాశాను. అందులో ఒకటేమిటనగా - స్వప్నంలో కూడా వేదనా భరితమైన దప్పిక కలిగేది. స్వయంగా మాలిక్‌యే ఎంతగానో పట్టి పట్టి త్రాగించినా అది కొద్దిగా కూడా శాంతించేది కాదు. నీరు ఇంకా తీసుకురా, ఇంకా తీసుకురా, అనే ఆర్తి తీరకపోగా చల్లదనాన్ని కూడా పొందలేకపోతున్నా - అనీ, సముద్రాలకు సముద్రాలే త్రాగినప్పటికీ కూడా ఈ దప్పిక తీరటం లేదు సరికదా ఇంకా అధికమవుతోంది అనీ వ్రాశాను. ఇప్పుడు నా పరిస్థితి ఎలా ఉందంటే నీటి నుండి విడివడ్డ చేపవలె, ప్రియతముని నుండి వేరుపడిన నేను జీవన్మరణాల మధ్య కొట్టు మిట్టాడుతున్నట్లుగా ఉంది. అని కూడా బాబూజీ వారికి వ్రాశాను. ఈ అనుభవం నాకు ఒక విషయం స్పష్టం చేస్తోంది. ఈ దశలన్నీ కూడా మాలిక్ చే మేల్కొల్పబడ్డ చైతన్యశక్తి ద్వారా లక్ష్యమును నాలో నిలుపుటకై నా యందు ప్రవేశపెట్టబడుతున్నట్లూ, దానికి సంబంధించిన అనుభూతులను ఇచ్చి ఆ చైతన్య శక్తి కూడా అందులోనే లయం అవడం ప్రారంభమవుతున్నట్లూ తోచింది.

తన అంతిమ సత్యములో యోగము చెంది యుండవలసిన ఆ శుద్ధ చైతన్యం అభ్యాసిలో మేల్కొంచనంత వరకు అభ్యాసి సతత స్మరణ సూత్రాన్ని భక్తి శ్రద్ధలతో పాటించాలి. ఈ సతత స్మరణ సద్గురువు ప్రాణాహుతి శక్తిని లేదా ఈశ్వరీయ ధారా ప్రవాహాన్ని మనలోనికి లాగుతుంది. ఇది ఒక నాటికి ఏ స్థితికి మనల్ని చేర్చునంటే ఇచ్చే వారి దర్శనంతో పాటు మన పరమ లక్ష్యపు జ్ఞాన పరిచయం కూడా కల్గుతూ వుంటుంది. "దుఃఖ భూయిష్టమైన ఈ ప్రపంచంలో ఆదమరచి ఉన్న మనల్ని సద్గురు శక్తే తన ప్రాణాహుతిని మన అంతరంగము నందు ప్రవేశపెట్టి లక్ష్య ప్రాప్తి పట్ల తపనను తట్టి లేపుతుంది." బాబూజీ వారి ఈ మాటలు మన ఎదుట ప్రత్యక్షమవుతాయి. సెల్ఫిష్‌నెస్ (స్వార్థము - స్వ + అర్థము) నుండి ష్‌నెస్ (అర్థము) అనునది తొలగిపోతే (అనగా స్వ + అర్థము నుండి అర్థము తొలగిపోతే) అల్పమైన మన 'స్వ' (సెల్ఫ్) మహత్ 'స్వ' లో లయమగుట ప్రారంభమవుతుంది. అనగా మన 'ఆత్మ' విశ్వాత్మలో లయమగుట ప్రారంభమవుతుంది. 'వారి' పావన ప్రాణాహుతి శక్తి వలన మన అల్పమైన 'స్వ' (సెల్ఫ్) అనగా పరిమిత చైతన్యము ఆ మహత్తర 'స్వ' అనగా మహత్ చైతన్యము నందు కలిసిపోడానికి - లయం కావడానికి తహతహలాడిపోతుంది. సావధానం (ఎలర్ట్‌నెస్) మనకు అనుభూతులను ప్రదానం చేస్తూంటుంది. మనం 'స్వ' ద్వారా ఆ దివ్య ఈశ్వరీయ స్థితుల యొక్క అనుభూతుల రసాస్వాదన చేస్తూంటాము.

ఇక ఇప్పుడు చేయవలసిందేమీ మిగలలేదు. మనలో 'నేను' అనేది ఆ మహత్ 'స్వ' లో (- ఈశ్వరుని యందు) ఒక స్థాయి వరకు లయమందినప్పుడు దివ్య చైతన్యమే మనల్ని లక్ష్యానికి ఎలా చేర్చాలి అనే విషయమై అప్రమత్తతతో (మెళకువతో) ఉంటుంది. లక్ష్యముతోడి ఈ కలయికకు కూడా అతీత స్థితిలో అభ్యాసి తనను తాను గుర్తించలేని స్థితిలో ఎక్కడో కోల్పోతాడు. ఆ స్థితిలో తన జాడ తనకే తెలీదు. దీనికి మనకు ప్రమాణం కూడా లభిస్తుంది. ఈ ప్రాపంచిక జీవితానికి, ఆధ్యాత్మిక స్థితులకు సాక్షీభూతముగా మాత్రమే తాను ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ దివ్య స్థితులను మనం దర్శిస్తూ ఉన్నంత వరకు వాటి ఆనందాన్ని మనం అనుభవం ద్వారా

పొందుతుంటామన్న రహస్యం మనకు తెలుస్తుంది. మన లోపల ఈశ్వర ప్రాప్తి యొక్క చైతన్యం - సద్గురువు శ్రీ బాబూజీ వారి కృప మరియు శక్తి చేత మేలుకొని ఉన్నంత వరకు పరమానందపు స్థితి యొక్క అనుభవం మనకు వస్తుంది. సమస్తము నందు వ్యాపించి యున్న ఆ పరమ శక్తి యగు ఈశ్వరునిలో లయమవుతూ అవుతూ మనం కూడా వ్యాప్తిని పొందనారంభించినప్పుడు, ఇక మనకు అనుభవాలు ఏమి ఉంటాయి - ఎలా ఉంటాయి ? మరో వైపు మాలిక్ (సద్గురువు) తన ప్రాణాహుతి శక్తి ద్వారా మనకు తనలో అంటే విరాట్‌లో 'ఐక్యత'ను ప్రసాదించునప్పుడు ఆ ప్రాణాహుతి రాకపోకల అనుభవం కూడా లేకుండా పోతుంది. సమస్త శక్తితో - ఒకటి ఒకటి (1 & 1) జతయై పదునొకటైనట్లుగా - సంపన్నులమై మనము లక్ష్య ప్రాప్తి కొరకు ముందుకు సాగుతాము. ఉదాహరణకు - మంచు ముక్క నీటిలో కరగుతూ, ఐక్యమగుచూ చివరకు ఆ నీటి యొక్క సంపూర్ణ శక్తితో సంపన్నమవుతుంది. లక్ష్యము మనలో ఇమిడిపోతుంది - మరి ఆ వైపు చూసుకోవాల్సిన అవసరం కాని ఆలోచించాల్సిన సందర్భం గాని మనకు కలగనే కలగవు. మొత్తానికి చూస్తే కేవలం విరాట్ భావమే మనకు కనిపిస్తుంది. ఒకనాటికి అట్టి ఈ చైతన్యమూ లయమగు స్థితి వస్తుంది. ఈ చైతన్యము లయమగు స్థితి గురించి కబీరు చెప్పిన ఈ మాటలు మనకు యదార్థమనిపిస్తాయి.

సహజము, సహజము - అని చెపుతారందరూ
అసలు 'సహజము' ఈశ్వరుని గుర్తించలేదెవరూ
సహజ భావంతో హరిని చేరినవారే
అవుతారు 'సహజ సాధకులు'.

'సహజము - సహజము' అని అంటున్నా కూడా వాస్తవానికి దాని జ్ఞానమెవ్వరికీ లేదు. ఎవరైతే సహజ భావంతో, స్వాభావికంగా వుంటూనే జీవితంలో భగవత్సాక్షాత్కారం పొందుతారో వారు సహజత్వాన్ని అర్థం చేసుకుంటారు. 'సహజ' తత్త్వంలో హరిని దర్శించటము సాధనను భక్తిమయం చేసుకోవటంలో శక్తివంతమైనదిగా వుంటుంది.

ఈ స్థితిలోనే మనం లయ లీనమై రమిస్తూ ఉంటే ఈశ్వరుడు ఎల్లప్పుడూ మన ఎదుటనే ప్రత్యక్షంగా ఉంటాడు. ఆ దృశ్యం ప్రత్యక్షంగా పొందిన 'అనుభవం' ఆనంద పారవశ్యం అవుతుంది. మనం ఎక్కడకు వెళ్ళినా దివ్య అలౌకికత్వం, అంతరంగంలో పులకితమగుచున్న ఆనందం అందరి అనుభవంలోనికి వస్తుంది. దానిని వారు వ్యక్తీకరించలేకపోవచ్చు. కాని వాతావరణము నందు ఆ సౌరభం వ్యాపిస్తుంది. ఇంతే కాక ఆ సమయంలో మన సమీపంగా వచ్చిన వారు ఇలా మాట్లాడుకోడం విన్నాను - "వీరు రావడం వల్ల ఎంతో ఆహ్లాదంగా ఉంది. చాలా ప్రశాంతంగా ఉంది. అంతరంగంలో దానంతటదే సంతోషం, ఆనందం వస్తున్నట్లుగా ఉంది."

చెప్పే పద్ధతిలో తేడా ఉండొచ్చు. కాని అనుభవం ఒకటే. నాకో విషయం ఇప్పటికీ బాగా గుర్తు. ప్రశ్న అంటే ఏమిటి ? అని ఎవరో అడిగారు. అప్పుడు నేను చెప్పాను.

"నేను" అనేది ప్రశ్న.

"నీవు" అనేది జవాబు, అని. అంటే ఇపుడు శ్రీ బాబూజీ కృప వలన ఈ ప్రశ్నకు సమాధానం ఎప్పటికీ కూడా ఒక స్థితి రూపంలో వ్యాపించి మనకు లభ్యమవుతోంది. మన లోపల బయట ఈశ్వరుని దర్శనం ఒకే రకంగా వ్యాపించి నెమ్మది నెమ్మదిగా పరిపక్వమవుతుంది. ఫలితంగా ప్రాపంచిక స్పందనలు మనల్ని చేరనే చేరవు. మన యొక్క ప్రతిస్పందన, గుండెచప్పుడు దివ్యమవుతాయి. అప్పుడు మనం స్వయంగా సహజ మార్గము యొక్క ఈ ప్రత్యక్షతను చూస్తాము. ధ్యానంలో మునిగి ఉండి బాబూజీ వారి పావన ప్రాణాహుతి శక్తి ద్వారా ఉద్గమస్థానము (మూలము) నుండి ప్రవహిస్తున్న ఆ ఈశ్వరీయ ప్రవాహము నందు మనం ప్రవేశిస్తాం. ఈశ్వరీయ ప్రవాహము నందు లయమై అంతిమ సత్యములో లయమగుటకు గాను ఎట్టి ఆధ్యాత్మిక స్థితులపై ఆధారపడకుండా ప్రాణాహుతి శక్తి స్థితికి ఆవల మనం 'సహజం' గానే ముందుకు సాగిపోతాము. ఇప్పటి ఈ స్థితి ఎంతో సహజంగా ఉంటుంది. ఆ యాత్ర అనంతమైనదనే విషయం కూడా తెలీకుండానే సాగిపోతుంది. విమానం ఒక ఎత్తుకు ఎగిరి ప్రయాణిస్తున్నప్పుడు విమానంలోని యాత్రికుడు

తానొక గదిలో కూర్చొన్నట్లు భావిస్తాడు. అది ఎగురుతున్నట్లు గాని వేగంగా ముందుకు సాగిపోతున్నట్లు గాని అతనికి అనిపించదు. కొద్దిగా కుదుపు కలిగినప్పుడు మాత్రమే అతనికి అది అవగతమవుతుంది. ఇదే రకంగా శ్రేష్టమైన గతిలో మన గమనం సహజంగా సాగుతూ, స్థితిలో ఏదైనా మార్పు కలిగినప్పుడే ఆ విషయం కొద్దిగా తెలుస్తుంది. ఇంకోరకంగా చెప్పాలంటే సూక్ష్మ స్థితిలో కూడా ఇంకా సూక్ష్మము నందు ప్రవేశించినప్పుడే మన అంతరంగ స్థితిలో కొంత మార్పు వచ్చినట్లుగా మనకు తెలుస్తుంది. కాని ఇప్పుడు ఆ సూక్ష్మమైన మార్పు మాలిక్ ప్రసాదించిన జాగృతి వలన కాక దానికి సమానమైన దివ్యదృష్టి ద్వారా మనం వెంటనే లక్ష్యాన్ని చేరగలం. ఇప్పుడు ఈ దశలను గురించి వ్రాసేప్పుడు 'సూక్ష్మ' శబ్దము కూడా సరైనదిగా అతకడం లేదని తరచుగా నాకు అనిపించేది. దానికి 'సహజ' అనే పద శబ్దమే ఆ దశ యొక్క అర్థం కొద్దిగా వెల్లడిస్తుంది. లక్ష్యమును గుర్తుంచుకొను జాగృతి మనలో కనిపించదు. అనుభవపూర్వకంగా సహజ (దశ) స్థితి యొక్క ఆనందం రసాస్వాదన చేయడానికి, అనుభవానికి మనలో స్థానం కల్పించడానికి మనకు ఉనికి (అస్థిత్వం) ఉండదు. కబీరు వర్ణించిన ఆ 'దశ' యొక్క స్థితి ఈ రూపంగా మన ఎదుట నిలుస్తుంది.

ప్రియుడు, ప్రియురాలు - అంతా ఒకరే (ఒకటే) అయి వలపు అంతా ఒకటే అవగా హృదయంలో 'రెండవ' అనేది దూరం అవుతుంది. ప్రియునితో కలిసే మార్గము సూక్ష్మము, సున్నితము అయి ఉండగా వృధా ఆలోచన (సంస్కారాల బరువు) ఎందుకు ?

స్పృహను (ఎరుకను) కోల్పోయినటువంటి మనకు 'వారు' తమ కృపతో సహజగతి యందు మనకు ప్రసాదించిన స్పృహ (గ్రహణశక్తి) ద్వారా సహజంగానే అంతిమ సత్యము యొక్క దశ యందు లయం చేయుచూ, మనకు ఆ స్థితి యొక్క స్థితిని తెలియపరచడానికై స్పృహలోనికి తీసికొని వచ్చుటకై దివ్య సద్గురువు బాబూజీ మహరాజ్ నుండి సహజమైన "కుదుపు" వస్తుంది. అయినప్పటికీ ఆ దశలో లయమవడానికి ప్రయత్నించే ఆ శక్తి మనలో ఇప్పుడు ఎక్కడ ఉంది? ఆ స్థితిని ఇలా వర్ణించవచ్చు !

మా ప్రాణం మీరే అయి ఉండగా యింకా
మా ప్రాణం ఎక్కడ ఉంది !

ప్రాణాహుతి ఇప్పుడు ప్రాణంలో ప్రవహిస్తోందని తెలుస్తోంది మాకు. సహజధారలో మనం నిద్రించినట్లు, పోగొట్టుకొనుచూ స్పృహలేనట్లు ప్రయాణిస్తాము. నెమ్మదిగా 'అనంతము' యొక్క సంకేతము పొందాక దాన్ని వెదకటంలో పోగొట్టుకున్న స్పృహ ఎన్నటికీ తిరిగి రానేరాదు. మరో రకంగా చెప్పాలంటే మనం ఆ సహజ ధారలో వెళుతున్నామన్న స్పృహ లేదా ఎరుక యొక్క అనుభూతి భారం కూడా మనలో ఉండడానికి 'మాలిక్' కు యిష్టం ఉండదు. ఎప్పుడైతే మన స్థితి ధ్యానంలో ఉండడానికి చేయు అభ్యాసం కంటే కూడా తేలికగా, సూక్ష్మంగా అవుతుందో అప్పుడు మనకు అభ్యాసం చేస్తున్నట్లుగా కూడా అనిపించదు, అని బాబూజీ గారు నాకు వ్రాసినట్లు జ్ఞాపకం ఉంది. నిజం చెప్పాలంటే మనకు 'మూలము' తో యోగాన్ని కల్గించే సహజమైన మార్గం (సాధన) లభించినప్పుడు అభ్యాసం అనునది తొలగిపోతుంది. ప్రయాణం లేదా గమనం యొక్క ఎఱుక అనే భారం కూడా మన స్పృహలో ఎందుకుండాలి ? మన ఖైదు నుండి విడుదలైన స్పృహ ఇప్పుడు వారిదే అయింది. అది ఎలా తిరిగి వస్తుంది ? స్వయంగా సద్గురువే, మన మార్గము మరియు గమ్యము అయి మన ఎదుట నిలుస్తారు. తల్లి భుజమెక్కి ప్రయాణిస్తున్న పసిబిడ్డకు బరువు తెలీనట్లు మనము సద్గురుని నీడలో ముందంజ వేస్తూంటాము. నిజంగా తల్లికి కూడా తన బిడ్డ తనపై ఎక్కి ప్రయాణిస్తున్నాడన్న ఊహే ఉండదు. ఈ స్థితిని గురించి బాబూజీకి - "మార్గమంతా పూలు పరచినట్లున్నది. ఇంక దూరమెంత ఉందిలే. రానే వచ్చేశాం", అని వ్రాశాను. ఈశ్వరుని మహిమ, ఈశ్వరీయ శక్తి యొక్క పని మన కొరకు పరిపూర్ణమై ఒక దరికి చేరగానే సద్గురువులు శ్రీ బాబూజీ మహరాజ్ వారి కృపా హస్తాలు మన ఎదుట చాపి ఉంటాయి. లయావస్థ యొక్క దుర్లభమైన ఈ స్థితికి బాబూజీ మనల్ని తీసుకుని వచ్చాక ఇంకా మనం కోరవలసినదేముంటుంది ? వేరుగా ఉన్నప్పుడే స్మరణ ఉంటుంది. అదీ ఇదీ ఏకమైపోయినప్పుడు ఏ ఆలోచనా, స్మరణ ఉండదు, అన్న కబీరు చెప్పిన స్థితికి చేరుతాము.

దివ్య చైతన్యం అనునది అనుభవానికి ప్రాణం. అనుభవం సత్యమునకు సాక్షీభూతముగా ఉండు ఒక గుర్తు. అసలు ఈ దివ్య చైతన్యం యొక్క గొప్పదనం ఏమిటి ? అది ఎందుకు ? అని ప్రతిప్రాణి తర్కించుకుంటూనే జాగృతిలో ఉంటాడు కదా. ఇది నిజం. నేనూ ఆ విధంగానే భావించేదాన్ని. కాని సహజ మార్గ సాధనలో శ్రీ బాబూజీ గారి ప్రాణ శక్తి ద్వారా అంతరంగంలోని దివ్య చైతన్యం మేల్కొల్పబడి, ధ్యానం యొక్క స్థితి నాలో ప్రగాఢమైనప్పుడు - అప్పటి వరకు నిజంగానే నేను నిద్రపోతున్నాను, అని గ్రహించాను. ఇంతే కాక సాధనలో ఇంకా ఉన్నతిని పొందుతూ శరీరంలోని కణకణమునందూ రోమరోమమునా దివ్య చైతన్యం యొక్క చైతన్య స్పృహ ధాగి ఉన్నట్లు అనిపించింది. ఒక శాశ్వత సహజత్వం పరచుకుని ఉంది. కాని దానిని "గుర్తించలేని మగత" ఆవరించి యున్నందున గ్రహించలేక మనం జాగృతిలోనే ఉన్నామని అనుకొంటాము. వాస్తవానికి శ్రీ బాబూజీ గారి ప్రాణాహుతి శక్తి ద్వారా ధ్యానావస్థలో ఒక సాటిలేని జాగృతి పొందిన తర్వాత మనం ఎంతో కాలంగా నిర్లక్ష్యంగా నిద్రిస్తూ ఉన్నామనిపించింది. మనం జాగృతిలో ఉన్నామని, భావించుతూ ఉన్నది అన్నివిధాలా అసత్యమే కాని సత్యము కాదు. ఆ రూపమునకు ఎటువంటి స్థానమూ లేదు. కాని దాని ఆకర్షణ మన బాహ్యం మీద పై చేయిగా ఉండి మన ముందు పరచుకున్నదంతా క్షణికమని, అశాశ్వతమైనదని, భ్రమ పూరితమనీ - అంతరంగంలో వ్యాపించి యున్నదే సత్యం యొక్క జాగరూకమైన వ్యాప్తి అనీ తెలుసుకోలేకపోతున్నాము. భౌతికంగా మనం మేల్కొని ఉండి కూడా నిజానికి నిద్రావస్థలోనే ఉన్నాము. జాగృతి, లోపలే ఇమిడిపోయింది. బాహ్యంలో ఉన్న మనం అనుకుంటున్న జాగృతి - ఆకర్షణ ఒకానొక సత్యతత్వం యొక్క ప్రతిబింబాలు మాత్రమే. ఈ ఆకర్షణ జాగృతరూపమని అనుకుంటానికి కారణం, మనం సంపూర్ణంగా దానిలో మిళితమై పోయి అశాశ్వతపు నిద్రలో మునిగిపోయి వున్న మనకు అది సత్యమూ, చైతన్యవంతముగా అనిపించటమే.

సహజమార్గ సాధనలో ధ్యానములో లీనమైన కొలది దృష్టి అంతర్యం లోపల నిలకడగా ఉండుట మొదలవగానే అనుభవము మాత్రము ఇటు నుండి అటు (లోపలికి) తిరుగుతుంది. అనుభవము ఎప్పుడు మేల్కొన్నది ? శ్రీ బాబూజీ మహరాజ్ వారి ప్రాణశక్తి వల్ల అంతరంగంలో జాగృతి గలిగి, సత్యానికి అసత్యానికి మధ్య ఉన్న - నిర్లక్ష్యంతో నిండిన (అజ్ఞానంతో కూడిన) మన గాఢనిద్ర ముగిసే దశ వచ్చి - అనుభవం మేల్కొంది. అంతరంగము సద్గురువు బాబూజీ వారి నుండి యోగిక ప్రాణశక్తి పొందుటతో అంతిమ సత్యమనే లక్ష్యము యొక్క 'ధ్యానము' మన అంతరంగమున మెలకువను, గహనతను (లోతును) పొందుతుంది. మొదట స్థూల ధ్యానంలో లీనమై ఉన్న మనం మన సద్గురువు బాబూజీ మహరాజ్ గారి వెంట సూక్ష్మములో ప్రవేశించి మనల్ను గురించిన ఆలోచన కూడా మాయమైపోయిన అనుభవమైంది. ఇప్పుడు మన చైతన్యము నందు జాగృతి కలిగి ఇలాంటి అనుభవాన్ని ప్రసాదించింది. మేల్కొన్న ప్రాణి ఏదయినా చేయాలి. సద్గురువు అంతిమ సత్యము అనే లక్ష్యము గురించి తెలిపి దానితో పాటు దాని పవిత్రమైన దృశ్యాన్ని చూపించారు. ఇక ఆలస్యం లేకుండా - ఒకప్పుడు నెమ్మదిగా, మరోప్పుడు తీవ్ర వేగంతో గమ్యం యొక్క యాత్ర మొదలైంది. ఇప్పుడు అశ్రద్ధ ఉండదు - రాదు. ఎందుచేతనంటే మనం ఈశ్వరీయ ప్రకాశము నందు మునిగి వుంటం వల్ల అశ్రద్ధ, అజ్ఞానపు పొర మన సిస్టమ్ నుండి పూర్తిగా లాగివేసి విసరి వేయబడింది. ఈ అజ్ఞానం నిర్లక్ష్యపు పొర తొలగిపోతే కేవలం సజగతే (చైతన్యం) మన సిస్టమ్‌లో వ్యాప్తి చెందినట్లు నేను గమనించాను. అటువంటి అలౌకికమైన జాగృతి (మేల్కొలుపు) ముందు ముందు మనకు అలౌకికమైన విస్మృతి దశ (మరపు) యొక్క అనుభవాన్ని మనకు ప్రసాదించనారంభిస్తుంది. దానివల్ల ఇంతకు పూర్వము భౌతిక ప్రపంచానికి సంబంధించిన గత స్మృతితో పాటు ఈశ్వరీయ దేశములోనికి చేరుకుని దాని అన్వేషణలో లీనమైనట్లు గ్రహించాను. ఇపుడు ఆ అనుభవము ఏమై ఉన్నది ? రెండు స్థితులను బేరీజు వేస్తూ వాటిని స్మృతి పథంలో నిల్పి ఉంచటమే మనం అనుభవం అంటాం. ఈ అనుభవం తెలిపే తీక్ష్ణతయే (తీవ్రతయే) ఆత్మిక దశ అవుతుంది.

విస్మృతి అనగా ప్రపంచంలో ఉంటూనే, అన్ని పనులు చేసుకుంటూనే దైవ స్పృహ వల్ల మధ్య మధ్యలో మనం ఎక్కడికో అంటే ప్రియతముని (ఈశ్వరుని) యొక్క దేశంలోనికి వెళ్ళిపోతున్న అనుభవం మన అంతరంగలో అంకురిస్తుంది. అదే ఇంకా ముందుకు వెళ్ళిన తర్వాత - పరిణతి చెంది మనకు ఈశ్వరీయ సూక్ష్మ స్థితుల యొక్క అనుభవాన్ని, వాటిని అంచనా వేయగల జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. అనగా ఈశ్వర భక్తి, తద్వారా లభించినటువంటి ఈశ్వరీయ స్థితుల యొక్క పరిజ్ఞానము రెండూ జతగా కొనసాగుతాయి. భక్తి, జ్ఞానం - ఈ రెండూ వేరు వేరు మార్గాలు అనడం సరైనది కాదనిపిస్తుంది. చైతన్యము లేక విశ్లేషణ సూక్ష్మరూపంలో మనముందుండి స్థితి గతులను అంచాన వేస్తాయని ఒక్కోసారి నాకనిపిస్తుంది. మనము వ్రాసినప్పుడు ఎలా ఉన్నదో అలానే అయిపోతుంది. అనగా చైతన్యం అనుభవాన్ని దృఢం చేయుటకు గాను (వికసింపజేయడానికి గాను) ఒకప్పుడు స్థూలంగా మరొకప్పుడు సూక్ష్మంగా ఉండి మనకు తెలుస్తూనే ఉంటుంది. వాస్తవానికి దివ్య చైతన్యం ఎప్పుడైతే సంపూర్ణ అర్థంతో మన అంతరంగంలో జాగృతమవుతుందో అప్పుడు మనకు సహజ మార్గం యొక్క ప్రత్యక్షత, అధ్యాత్మిక స్థితుల యొక్క సూక్ష్మత్వం - దాని గురించి అంచనా, అనుభవం మనకు లభిస్తాయి. ఎలాగ ? అంతరంగంలోని దివ్య చైతన్యం రకరకాలుగా మార్పు చెంది మన స్థితులను మన ఎదుట ప్రత్యక్షం చేస్తూ ఉంటే మనం ఆ అనుభవాలను వ్రాసుకుంటూ ఉంటాము. మొదట మనం సద్గురువు శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క పావన రూపం మీద ధ్యానం చేయుట వల్ల అహం వీడిపోయే స్థూలదశ ఆరంభమై క్రమంగా ఆ వీడిపోవడం సూక్ష్మమై పోతూ ఉంటుంది. దీనికి అనుగుణంగా సూక్ష్మత చెందిన అనుభవం కూడా దాన్ని వెన్నంటే ఉంటుంది. ఇంకా పురోగమించి మన సద్గురువు శ్రీ బాబూజీ మనకు ప్రసాదించే శ్రేష్ట స్థితుల యొక్క ప్రత్యక్షతానందాన్ని మనం నిరంతర విశ్లేషణ జ్ఞానం మనకు లభింపచేస్తుంది. వాటిని గుర్తించగలగ్గానే అవి స్వానుభవ రూపంలో వ్యక్తమైపోతూంటాయి.

# 10. సంకల్పము మరియు చైతన్యము (జాగృతి)

జీవిత పరమ లక్ష్యాన్ని పొందాలనే సంకల్పం చేసుకున్నప్పటి నుండి, దానికి అనురూపమైన సాధనలో మనల్ని మలచుకోడం ప్రారంభిస్తాము. ఎంతో కాలం నుండి ఎడబాటులో ఉన్న ఆ పరమ సూక్ష్మమైన మన 'మూలము' ను తిరిగి చేరుటకు మనం మన స్థూలత్వం నుండి సూక్ష్మత్వాన్ని పొందాల్సిన అవసరం ఉంది. మనం స్థూలత్వం నుండి సూక్ష్మత్వం పొందగలిగే ఉపాయమే సాధన అవగలుగుతుంది. దీని కోసం నేను స్వయంగా ఆచరించినదేమంటే పరమ సద్గురు శ్రీ బాబూజీ మహరాజ్ ఆకారంలో లీనమై - మునిగి ఉండే అభ్యాసం చేశాను. దీని వల్ల మనలో సహజంగా ఈశ్వర ప్రవేశం అవుతుంది. దీనివల్ల కలిగే మరో లాభం ఏమంటే మనం శ్రీ బాబూజీ ధ్యానములోనే లీనమై ఉన్నందు వల్ల క్రమంగా మన ఆకారం కూడా మరచిపోగా కనుమరుగైపోయి మన అసలైన సూక్ష్మత్వం లోనికి ప్రవేశం పొందుతాము. ఎవరైనా దివ్య పురుషుని ధ్యానము నందు లీనమై ఉండే అభ్యాసము ద్వారానే మన అస్థిత్వం నుండి వేరైపోయే అవకాశం కల్గుతుంది. అలా నేను స్వయంగా చేసి అనుభవం పొందాను. సాధనములు (ఉపకరణములు) ఎన్నో ఉండొచ్చు. కాని సాధన కేవలం ఒక్క ధ్యానం మాత్రమే అవుతుంది.

ఒకటేయైన 'దానిని' సాధిస్తే అన్ని సిద్ధిస్తాయి. అన్నిటినీ సాధించాలనుకుంటే దేన్నీ పొందలేం, అన్న కబీరు మాటలు అక్షరాలా నిజం.

సాధన ద్వారా మనం దివ్యత్వానికి అనుగుణంగా మార్పు చెందుతుంటే దాని అనుభవం మనకు కల్గుతుంది. ఎందుచేతనంటే లక్ష్యం యొక్క అన్వేషణలో మనం సంకల్పం పట్ల జాగరూకతతో ఉంటాం. మనం జాగరూకులమై ఉండాల్సిందే. శ్రీ బాబూజీ వారి ప్రాణాహుతి మనలో ఖాళీని (శూన్యతను) ఏర్పరస్తుంది. అలా ఎందుకంటే దాని వలన 'మనము' తొలగిన ఆ ఖాళీ 'ప్రియతముడు' (ఈశ్వరుడు) ఆక్రమించటానికి. మనము మెళకువగా ఉన్నప్పుడు మన అంతరంగములో మార్పు చెందుతున్న సూక్ష్మ స్థితులను వ్యక్తం చేయడానికి ఆ ప్రమాణంలోనే మన అనుభవానికి

దివ్యదృష్టి కూడా జోడించబడుతుంది. ఇది మనం సావధానంగా ఉంటే గ్రహిస్తాము. ఆ దివ్య దృష్టి మన అంతరంగంలో ఉండనే ఉంది. మనం జీవితం యొక్క లక్ష్య ప్రాప్తి కొరకు నిర్ణయం తీసుకున్నప్పుడు ఈ దివ్య దృష్టి అవసరం అవుతుంది. పరమ లక్ష్య ప్రాప్తికై మనం లక్ష్యమునకు అనుగుణమైన సాధననే అవలంబిస్తాం. సాధన (ధ్యానం) యందు మునిగి ఉండుట వల్ల మనకు దివ్యానుభవాలు కలుగనారంభిస్తాయి. భగవద్గీతలో కూడా భగవాన్ శ్రీకృష్ణుడు అర్జునునికి తన విరాట్ రూపమును చూపించడానికై అతనికి 'దివ్య దృష్టి' నే ప్రసాదించినట్లుగా చెప్పబడింది. ఇదే విధంగా దివ్యలక్ష్యం కొరకు మనం ధ్యానం చేయుచున్నప్పుడు కలిగే అనుభవాల అనుభూతి పొందటానికి మనకూ అదే స్థాయికి చెందిన దివ్యదృష్టి ప్రదానం చేయబడుతుంది. మనకు లభించే అనుభవాల స్థాయిని బట్టి ఈ దృష్టి కూడా సూక్ష్మత నందుతూంటుంది. బహుశః అందుకేనేమో, అనుభవం దృష్టి నుండి ఏమీ దాచలేము - అనే మాట నిజం. సమర్థ సద్గురువు తన పావన ఈశ్వరీయ శక్తితో మన అంతరంగము నందు నిద్రాణమై యున్న చైతన్యమును మేల్కొలిపినప్పుడే యిది మనలో స్పష్టమవుతుంది. అప్పుడిక స్వయంగానే అనుభవము, దివ్యదృష్టి రెండూ కూడా తమ పనిలో లీనమైపోతాయి. మనం పావన ఈశ్వరీయ ధారలో మునిగి కరుగుతున్న మంచుముక్క స్థూలత్వం నుండి సూక్ష్మత చెందునట్లే, మనం కూడా సూక్ష్మత చెందుతూండగా ఈ శుభ పరిణామాన్ని మన అనుభవైక దృష్టి బహిర్గతం చేస్తుంది.

ఏదయినా సంకల్పమును పట్టుదలతో చేపట్టినప్పుడు దానిపట్ల మెళకువతనం చైతన్యవంతం అవుతుంది. అందుకేనేమో భగవద్గీతలో "నిశ్చయాత్మిక బుద్ధిః" అని చెప్పబడింది. అనగా బుద్ధితో నిర్ణయం తీసుకోవడం ప్రథమ కర్తవ్యం, దృఢ నిశ్చయం చేసుకుంటేనే సాఫల్య ప్రసాదం చేకూరుతుంది. ఇప్పుడు మనం శ్రేష్టమైన మన జీవిత పరమ లక్ష్యాన్ని సాధించడానికి సంకల్పించాలా, లేదా ప్రాపంచిక కోరికలతో అందులోనే చిక్కుకుని ఉండాలా ? మనం ఇది నిర్ణయించుకోవాల్సి ఉంది. సంకల్పానుగుణంగానే మనం అనుకున్న దాన్ని సాధించుకోడానికి మార్గాలు అన్వేషిస్తాము. దానికి

అనుకూలంగా మనల్ని మలచుకోడం ఆరంభిస్తాము. కాబట్టి మనం లక్ష్యం ఎటువంటిదో, దాని ప్రాప్తి కోసం దానితోనే కలిసిపోయే ఉపాయాలను అనుసరించుట చాలా ముఖ్యం. ఒకవేళ సంకల్పం అనుచితమైనది కాకుండా పరమలక్ష్య (ఈశ్వర) ప్రాప్తికే నిర్దేశించబడితే మనమింక దాని ఆలోచనలోనే పూర్తిగా నిమగ్నులమై దానినే మననం చేసుకుంటూ, స్మరిస్తూ ఉండాలి. ఇలా ఆచరించడం వల్ల దానిని పొందడానికి అనుగుణమైన ఆలోచనలే మనలో కలుగుతూ (పుట్టుతూ) ఉంటాయి. అందుకు తగ్గట్టుగానే మనం లక్ష్యం పట్ల ఎంత దృఢ దీక్షతో ఉంటామో సద్గురుని అవసరం కూడా అంతగానూ ఉంటుంది. అదే విధంగా ఈశ్వరుడే మనల్ని సద్గురువు సమక్షానికి చేర్చుతాడు. మనకు లక్ష్యం పట్ల ధ్యానం ఉండి సద్గురువు ఛత్రఛాయ కూడా లభిస్తే ఈశ్వర ప్రాప్తి సంకల్ప సిద్ధి కొరకు గట్టిగా ముందంజ వేయుటలో - లోభి ధనం విషయంలో అత్యంత మెళకువ (అలర్ట్‌నెస్) తో ఉన్నట్లు ఈ మెళకువ (జాగరూకత) మన కొంగును అదిమి పట్టుకుని ఉంటుంది.

ఈ దివ్య చైతన్యాన్ని మనం అన్వేషించినట్లయితే అది సదా మన అంతరంగంలోనే ఉన్నట్లు కనుగొంటాం. ఇది క్రొత్తగా ఉద్భవించే వస్తువు కాదు. సృష్టి యొక్క రచనతో పాటే దాని వ్యాపనంలోనే దివ్య చైతన్యం కూడా వెదజల్లబడినట్లుగా నాకు అర్థమవుతోంది. సహజమార్గ ధ్యాన సాధనలో మనం ప్రవేశించగానే శ్రీ బాబూజీ మహరాజ్ వారు తమ పావన దివ్య ప్రాణాహుతి శక్తితో మన అంతర్ మనస్సును మన లక్ష్యానికి అనుగుణంగా తీర్చిదిద్దుతారు. అంతరంగము దివ్యత్వముతో చక్కదిద్దుట ప్రారంభం అవగానే వారు, మనలో ఇదివరకే ఉన్నటువంటి దివ్య చైతన్యాన్ని వికసింపజేసి సమస్తంలో వ్యాపించి యున్న ఈశ్వరీయ ధారలో యోగాన్ని కల్గించి విస్తరింప చేయడం మొదలుపెడతారు. దీని ఫలితంగా మన గమనం యొక్క పరిధి మరియు ధ్యానం యొక్క వ్యాప్తి పరిమితంగా ఉండక - అవధి లేని విరాట్ యందు కలిసిపోతూ ఉంటాయి. మనం ఈ ప్రాపంచిక జీవితంలో సంచరిస్తూ అన్ని పనులను సక్రమంగా నిర్వర్తించుకుంటూనే ఈ దివ్య చైతన్యం ద్వారా

మన దృష్టిని లక్ష్యానికి అంటిపెట్టుకుని ఉంచడంలో సామర్థ్యం కలిగి ఉంటూ మన ప్రియతముని ధ్యానము నందే లీనమై ఉంటాము. ఇదే కాక ఈ చైతన్యం ఇంకా పవిత్రము మరియు సూక్ష్మము అవుతున్న కొలదీ మనం స్థూలం నుండి సూక్ష్మ స్థితిలోనికి ప్రవేశించినప్పుడు అక్కడి సూక్ష్మాతి సూక్ష్మ స్థాయిలోని దివ్యానుభవాలను మనకు ప్రత్యక్షం చేస్తూ పోతుంది. ఇది ఒక రకంగా హంస పాలను, నీటిని వేరు చేసినట్లుగా ఉంటుంది.

ఈ చైతన్యము ద్వారా పావనము, సూక్ష్మము అయిన ఈశ్వరీయ స్థితుల ఆనందాన్ని ఆస్వాదిస్తూ శ్రేష్ఠ స్థాయిలో కొనసాగుతూ పురోగమిస్తున్నట్లు యిపుడు మన అంతరంగంలో స్వచ్ఛంగా - స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. ఈ చైతన్యం ఎంతెంత ఉత్తమ స్థాయికి ఎదుగుతూ ఉంటుందో భౌతికంగా జీవితం గడుపుతూనే అనుక్షణం అంతరంగంలో ధ్యానంలో మునిగి లక్ష్యంతోనే అంత గాఢంగా యోగం చెంది ఉన్నట్లుగా ఉంటుంది. స్థూల దశ నుండి సూక్ష్మమగుచున్న ఈ దివ్య చైతన్యము వల్ల కేవలం పగలంతానే కాదు - రాత్రి నిద్రిస్తూ కూడా మనం జాగ్రదావస్థలో ఉన్నట్లనిపిస్తుంది. నిద్ర ఛాయగాని, అలసట గాని ఉండవు. స్థూలత్వం యొక్క స్థూల హద్దు నుంచి మనం తప్పించుకుపోతున్నట్లుంటుంది. మన శారీరక అవసరాలు అప్రయత్నంగా వాటంతటవే జరిగిపోతాయి. తరచుగ బాబూజీకి ఇలా వ్రాసేదాన్ని - "నేను నిద్రపోయినప్పుడు ఎవరైనా నా గదిలో మాట్లాడితే, - ఆ మాటలన్నీ నాకు వినిపిస్తూ ఉండేవి. నేను నిద్రపోతూనే ఉన్నాను" అని ఒకసారి - మరోసారి "రాత్రి నేను నిద్రపోతున్నాను. ఎవడో దొంగ చెట్టు మీద ఎక్కి గదిలోకి టార్చి లైటు వేస్తున్నాడు. నిద్రలోనే నాకు టార్చ్‌లైట్ వెలుతురు పడుతున్నట్లు తెలిసింది. లేచి చూస్తే నిజంగానే టార్చిలైట్ కాంతి పడుతోంది." అనీ వ్రాశాను. అటువంటప్పుడు అలసత్వం (బద్ధకం) పనికిరాదు. ఆ సమయంలో అలసత్వంతో మేలుకోకపోతే కొద్దిసేపటిలోనే జాగృతి (మెళకువ) యొక్క ఆ చైతన్య (మెరుపు) కాంతి మందగించేది. కాని మాలిక్ (యజమాని) మన జాగృతిలో పూర్తిగా నిండిపోయి ఉన్నప్పుడు ఏ పరిస్థితిలోనూ మనం బద్ధకించి (అలసత్వంతో) ఉండలేము. 'వారి' ప్రాణాహుతి యొక్క యోగం

సదా అనుసంధానమై ఉంటున్నట్లు ఉంటుంది. అంటే ఎప్పుడూ, మనం ఆ పావన ఈశ్వరీయ ధారలో మునిగిపోయి ఉన్నట్లుగా తెలుస్తూ ఉంటుంది.

ఈ విధంగా పరమ లక్ష్య ప్రాప్తి సంకల్పాన్ని నెరవేర్చుకొనుటకు ఈ దివ్య చైతన్యము (డివైన్ ఎలర్ట్‌నెస్) ఈశ్వరీయ వరదానంగా (కటాక్షంగా) మనకు లభిస్తుంది. ఇక్కడ వివరించాల్సిన ఇంకో విషయం ఏమిటంటే బహుశః జనులు ఈ దివ్య చైతన్యం ద్వారా, వారికి ఈ దొంగల జాడ ఎల్లప్పుడూ తెలుస్తుందని ఎవరైనా అనుకోవచ్చు. కాని అది సంభవం కాదు. ఎందుకనంటే చైతన్యము (మెళకువ) ఏ స్థాయికి చెంది ఉంటుందో ఆ సమయంలో మనకు అటువంటిదే తెలుస్తూ ఉంటుంది. మన చైతన్యము సూక్ష్మము మరియు దివ్యత్వమును పొందిన కొలదీ ఇలాంటి అల్ప విషయాలు అనుభవంలోకి రావు. మన అంతర సంబంధం సర్వదా మాలిక్‌తో ఉంచుకొన్నందున ఇటువంటి అల్ప అనుభూతుల పట్ల అలసత్వం ఏర్పడుతుంది. ఈశ్వర ప్రాప్తికై మనలో దృఢ సంకల్పమున్నప్పుడే నిరంతరం ధ్యానంలో నిమగ్నమై ఉండే మనః స్థితి వికసిస్తుంది. సంకల్పంతో యోగం చెందిన ధ్యానం, మాలిక్ యొక్క దివ్య తేజస్సుతో ప్రభావితమైన పవిత్రత - మన అంతరంగంలో సర్వదా దివ్యత్వాన్ని వికసింపజేస్తూ ఉంటాయి. దాని పరిణామం ఎలా ఉంటుందంటే మన బాహ్య జీవిత వ్యవహారాల్లో కూడా అనగా సంభాషణలోనూ, చూచుట, వినుట - విషయాల్లో ఎల్లప్పుడూ పవిత్రత, ప్రీతి, ప్రియత్వం, సరళత్వం ప్రకటితమవుతాయి. దీని వల్ల యితరులు కూడా ప్రభావితం కాకుండా ఉండలేరు. దీనిని నేను స్వయంగా గమనించాను. దీని అర్థమేమంటే - దివ్య ప్రాప్తి యొక్క సంకల్పంతో మనలో ఒక శక్తి స్థానం ఏర్పరచుకుంటుంది. మనమూ దానితో - ఆ శక్తితో సంబంధం ఏర్పరచుకొన్న కారణంగా యితరులలో కూడా దివ్య చైతన్యాన్ని ఉత్పన్నం చేయగల్గిన సామర్థ్యం మనలో ఇమిడి ఉంటుంది. మరో విధంగా చెప్పాలంటే మనలోని దివ్యత్వం, పవిత్రతా స్థితుల యొక్క ప్రతిబింబం మన బాహ్యంలో కూడా కన్పించసాగుతూ యితరులను కూడా చైతన్య పరుస్తుంది. మన బాహ్యంలో అన్ని పనుల్లోనూ సచేతనంగా ఉంటాము. కాని ఆ పనుల్లో మన

అంతరంగానికి ఏ సంబంధమూ ఉండదు. శ్రీ బాబూజీ ప్రాణాహుతి శక్తి వల్ల మనలో వికసించిన దివ్య చైతన్యం మన బాహ్యాన్ని కూడా ప్రభావితం చేయటం అంటే ఇదే ! చైతన్యంతో గంభీరమైన స్థితి మనలో కల్గినప్పుడు మన ద్వారా స్వతఃసిద్ధంగా అన్ని పనులూ నిర్వర్తించబడుతూ ఉంటాయి. కాని మనం వాటికి అంటనట్లుగా ఉన్న అనుభూతిని అర్థం చేసుకుంటాము. ఈ నిరంతర దివ్య చైతన్యమే తపన (ఉద్వేగం) చెంది మనల్ని 'వారి' ధ్యానంలో లయం (నిమగ్నం) చేసి ఉంచుతుంది.

జీవితంలో పరమ లక్ష్య ప్రాప్తికి దృఢ సంకల్పంతో మనం ఉన్నప్పుడే, మన అంతరంగము నందు ఇటువంటి జాగృతి (దివ్య చైతన్యం) కలుగ సాగుతుంది. ఎందుకంటే మన ఆలోచనా విధానం కూడా లక్ష్యానికి సంబంధించినదిగానే ఉంటుంది కాబట్టి. 'మాలిక్' యే మన ద్వారా అన్ని పనులు నిర్వహిస్తున్నట్లుగా అనిపిస్తుంది. జాగృతి (దివ్య చైతన్యం - డివైన్ కాన్షస్) యొక్క బాహ్య రూపపు స్వచ్ఛత ఇదే ! దీనిని ఇంకో విధంగా చెప్పాలంటే మన జీవన పరమ లక్ష్యమైన శ్రీ బాబూజీ మహరాజ్, మన అంతరంగంలోని మాలిక్(ప్రభువు) యే అయి మనలో ఉండి నడిపించునపుడు ఈశ్వరీయ స్థితులకు అనుగుణమైన చైతన్యం (జాగృతి) కూడా 'వారి' నుండి మనకు వారసత్వంగా లభిస్తూ ఉంటుంది. ఈ ఈశ్వరీయ దివ్య చైతన్యము ద్వారానే మనం సూక్ష్మాతి సూక్ష్మ దివ్య మనః స్థితుల అనుభవాన్ని పొందుచూ ఆ దివ్యామృతాన్ని గ్రోలుచుండుట వల్ల పరమ దివ్య లాభం పొందుతాము. లక్ష్య ప్రాప్తి యొక్క సంకల్పము ఇంకను తీవ్రమై దృఢమై, శీఘ్రంగా లయమై పోవాలనే తపన పుట్టిస్తుంది. అదీకాక మహత్తర స్థితులతో లయావస్థను పొంది వాటితో లయలీనమై వాటి ప్రాప్తి పట్ల అప్రమత్తతతో (జాగృతితో) ఉంటాం. ఈ జాగృతి యొక్క అనుభవం వల్ల నేను గమనించింది ఏమంటే ఇంకా పురోగమించిన తర్వాత ఈ అనుభూతి నిరంతరము అంటే నిద్రపోతున్నా, మేల్కొని ఉన్నా - ఒకే విధమైన స్థితి ఉండునట్లనిపించింది. అంతరంగము స్వయంగా జాగృతి యొక్క (చైతన్యం యొక్క) స్వరూపంగా మారిపోతుంది. నిద్రలో కూడా మన దశలో ఏదైనా మార్పు కలిగితే అనుభవాల విశ్లేషణా

సామర్థ్యంతో మనకు తెలిసిపోతుంది. ఈ సందర్భాలలో తరచుగా నేను నిద్రలో నుండి లేచి, వెంటనే నా డైరీలో ఆ దశను గురించి వ్రాసి, బాబూజీ వారికి కూడా లేఖ వ్రాశాను. "ఇప్పుడు నాకు ముభావంగాని, అలసటగాని కలగడం లేదు. ఎందుకంటే ఈ శరీరమనే యంత్రం ద్వారా ఆ 'దివ్యశక్తి' ప్రవాహంతో నడిపించబడుతోంది," అని. మొదట మనలో మనం లేనట్లుగా అనిపించుతూ బాహ్యాంతరముల మధ్య స్వల్ప తేడా కనిపిస్తుంది. ఆ తర్వాత మన వెనుక ఆధారం నశించిపోవుటతో మనం మనలోనికి ఎప్పటికీ తిరిగి వచ్చుట అనేదే ఉండదన్నట్లు అనిపిస్తుంది. అప్పుడు బాహ్యాంతరాలు రెండూ ఒకటైపోతాయి. ఈ స్థితిని గురించియే శ్రీ బాబూజీ ఒకసారి "నీ దశ ఎలా ఉందంటే అంతర్ బాహ్యాలు రెండూ కూడా సమానంగా అంటే ఒకేలాగ ఉన్నాయి," అని వ్రాశారు. వివరంగా చెప్పాలంటే - మన ధ్యానము హృదయ బంధనాలను త్రెంచుకుని ఈశ్వరీయ విరాట్‌నందు వ్యాపిస్తుంది. 'మనము' అనునది మనలో నుండి విడుదలై పోయి ఈశ్వరీయ - విరాట్ యందు లయమగుట ప్రారంభమవుతుంది. ఇప్పుడు దివ్య చైతన్యము, జాగరణ కూడా మన బంధనమును త్యజించి విరాట్ యందు వ్యాపించిన స్థితి కలుగుతుంది. ఇప్పుడది (ఈ దివ్య చైతన్యమే) స్వతహాగానే మారుచున్నటువంటి పరమగతిని (దివ్యస్థితిని) ధ్యానం ద్వారా సమీకరించి మనలో ప్రవేశింప చేయుట ఆరంభిస్తుంది. ఈ జాగరణే (చైతన్యమే) మన బాహ్య క్రియలకు అతీతమైనందున భౌతికంగా మనం ఏమి చేస్తున్నామో, ఎలా చేస్తున్నామోనను స్పృహ మనకు ఉండదు.

ఈశ్వరప్రాప్తి అనే పరమ లక్ష్యానికి ఉద్దేశించిన సంకల్పం కూడా 'మన' అనే పరిమిత బంధనం నుంచి విముక్తమై ఈశ్వరీయ విరాట్ నందు వ్యాపిస్తుంది. ఇప్పుడు దానిని పట్టుకోవాలన్నా మన వశం కాదు. మనం చేసుకున్న సంకల్పం, ఆ విశిష్ట సంకల్పంలో (అనగా ఆది సంకల్పం లేదా సృష్టి సంకల్పంలో) లయమవుతున్న దివ్య దృశ్యాన్ని నేను దివ్యదృష్టి ద్వారా తిలకించాను. తత్ఫలితంగా మన లక్ష్యం వైపు పురోగతి మరియు గాఢత్వం యొక్క, అడ్డుకట్ట కూడా వశం తప్పి అగాధ ప్రవాహంలో కొట్టుకుపోతుంది.

ఈ స్థితిలో మన సంకల్పమేమిటో కూడా మరచిపోతున్నట్లవుతుంది. 'ఏకత్వము నుండి భిన్నత్వము', కల్గును అను ముఖ్య సంకల్పం లేదా విశిష్ట సంకల్పం (దైవ సంకల్పం) ద్వారా సృష్టించబడిన ఆ పావన ఈశ్వరీయ - ధార యందు మన ధ్యానము ప్రవేశించుట వలన ఇప్పుడు మనము మన సంకల్పమును కూడా మరచిపోయినవారమవుతాము. అందువల్ల ధ్యానము ద్వారా అనేకము నుండి మరల ఏకము (అంతిమము) నందు లయమగుట కొరకు, ఎప్పుడైతే మనకు శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క ప్రాణశక్తి ఆధారము లభిస్తుందో అప్పుడు మనకు అంతిమంతో - మూలంతో సూటిగా సంబంధం కలిగియున్న ఆ ముఖ్య మూలధార యందు ప్రవేశం పొందుతాం. వాస్తవానికి ఈ ధారా ప్రవాహంలో ప్రవేశం పొందినంతనే అంతిమంతో మన నిజమైన యోగం (కలయిక) ఆరంభమవుతుంది. ఇపుడు మాతృభూమికి మనల్ని గురించిన కబురు చేరడం మొదలవుతుంది. ఇది మనకు అనుభవమవుతుంది. ఈ దశకు చేరిన తర్వాత మన సాధన సౌభాగ్యవంతమవుతుంది. ఈ స్థితికి చేరుకున్న తర్వాత మాతృస్థానం లేదా మూలము వైపునకు పురోగమించాలి అనే కోరికకు బదులు మనలో అంతా శూన్యత ఏర్పడినట్లు అపుడు నా అనుభవం యొక్క దివ్యదృష్టి తెలిపింది. ప్రేమ, భక్తి, జ్ఞానం - ఇవన్నీ తమ హద్దుకు చేరుకుని లయమైపోతాయి. శీఘ్రంగా లక్ష్యంలో లయమైపోవాలనే తపన స్వయంగా పరితపిస్తున్నట్లుంటుంది. శ్రీ బాబూజీ వారికి ఇలా వ్రాసిన జ్ఞాపకం ఉంది. "నాలో రోజంతా హా! హా! అంటూ గుండె బాదుకుంటూ తిరగాలనే మానసిక విహ్వలస్థితి ఏర్పడింది. కారణం ఏమో తెలీదు." దానికి జవాబుగా వారు "హద్దు తొలగినప్పుడు స్థితి వశం తప్పుతుంది. నీవు నీ పూజగదిలోనే ఎక్కువ సమయం కూర్చుని ఉండు" అని వ్రాశారు. అపుడు నేను గత్యంతరం లేక అలాగే పూజా మందిరంలో కూర్చుండిపోయాను. దానికి గల కారణం ఇప్పుడు నేను గ్రహించిందేమంటే ప్రప్రథమంగా ఈశ్వరప్రాప్తి అనే సంకల్ప రూప బీజానికి బాబూజీ ప్రాణాహుతి రూప పావన ధార యొక్క తడి తగిలింది. దానితో చైతన్యము మరియు లక్ష్యం ఎడల జాగరూకత అంటే సావధానం మూలంగా భగవదైక్యం చెందాలనే తపన

ఆరంభమైంది. తిరిగి దాని ప్రాప్తి కొరకు అంతస్సు (అంతరంగం) తానే జపించి - ఒకనాటికి దానిలోనే సమాధి పొందుతూన్నట్లు అయింది. లయావస్థను పొందినట్లు అయింది.

ఈ లయావస్థ అనే వరం మనకు మాలిక్ నుండే లభిస్తుంది. లయావస్థ దశలో, మన అంతరంగమంతా ప్రియతముని విరాట్‌లో లయమై సామీప్యతా వెచ్చదనంలో కరగిపోతూ దాని స్థానంలో దివ్యత్వం నిండిపోవుట ప్రారంభమైనట్లు తెలిసింది. ఈ దశలోనే బాబూజీ వారి ఈ వాక్యాలు - 'నేను జనావళిని దివ్యులుగా చేస్తున్నాను. కేవలం ఈశ్వర దర్శనమే పొందుట నా దృష్టిలో అంత గొప్పది కాదు.' అని మనకు యదార్థాన్ని చెపుతాయి. ఈ స్థితిలోనే ఒక రోజున నా కలం ఇలా వ్రాసింది. "నిజ మూల తత్వాన్ని పొందటానికి మనం స్వేచ్ఛగా బయలుదేరాం. తత్వములో తత్వము కలిసిపోయినప్పుడు సాక్షిగా అనుభూతికి తావెక్కడ ?" (సాక్షిగా అనుభూతియే వెన్నంటి ఉండీ లేనట్లే కదా!) ప్రాణాహుతే ప్రాణం అయి మనలో ప్రవహించుట మొదలుపెట్టినప్పుడు ఆ మహా సంకల్పం నుండి వేరుపడిన మన లఘు సంకల్పం దానిలోనే కలియుట మొదలు పెడుతుంది. వాస్తవికత కూడా మన సమక్షంలో విస్తారంగా వ్యాపించి ఇప్పుడు అంతమగుట ప్రారంభిస్తుంది. 'వాస్తవికతకు కూడా ముగింపు ఉంటుంది,' అని శ్రీ బాబూజీ చెప్పిన విషయం మన ఎదుట ప్రత్యక్షమవుతుంది. సంకల్పం కూడా మనలో ఇమిడి ఉండక అది ఈశ్వరీయ విరాట్ నందు వ్యాపిస్తూ ఉంటుంది. మనం ముందుకు సాగడానికి భక్తి, ప్రేమల సహకారం కూడా అవసరం లేదనిపిస్తుంది. నెమ్మది నెమ్మదిగా సర్వమూ, లమయమైపోతూ ఉంటాయి. కేవలం మిగిలి ఉన్నది లఘు సంకల్పము, విశిష్ట సంకల్పము నందు లయమగుట మాత్రమే !

ఇప్పుడు మనం ఆ ఈశ్వరీయ ధారలో ఎంతగా మునుగుతూ ఉన్నా దివ్యతా సాగరం తిరగబడినట్టు లోతే లేనట్టుంటుంది. లయావస్థ కూడా లయమైపోతుంది. ప్రియతమునిలో కలసి పోవాలనే తపన తీవ్రాతితీవ్రమై ఆ ప్రియతమునే మరచిపోయే స్థాయికి చేరుతుంది. ఎప్పుడైనా ఎవరైనా

గుర్తు చేస్తే కొంచెం సేపు ఆ స్ఫురణ ఉండి మరల ఆ స్థితికే చేరుతున్నట్లుంటుంది. అన్ని వైపుల నుండి కేవలం ఒకటే - 'ఇంకా కావాలి, ఇంకా కావాలి' అనే ధ్వని మాత్రం వినిపిస్తుంది. స్వప్నంలో కూడా ఈ తపన మనలను సుఖంగా ఉండనీదు - దప్పికా తీరదు. మేలుకుని ఉన్నప్పుడూ - కూర్చున్నా, నిలుచున్నా సరిగా, శాంతంగా ఉండనీయదు. "కూర్చున్నా, పడుకున్నా, లేచినా - నా మనసు ఎప్పుడూ అక్కడనే ఉంటుంది", అను కబీరు మాటలు అర్థం అవుతాయి ఇక్కడ. నేను ఒకసారి బాబూజీకి వ్రాసిన దానికి జవాబుగా వారు వ్రాసినది నాకు ఇంకా జ్ఞాపకం ఉంది. అభ్యాసి గొప్పదనము ఏమంటే - వేలకొలది సముద్రాల ఈశ్వర జ్ఞానం అనగా ఆధ్యాత్మికతను త్రాగినప్పటికీ అతడి నోటి నుండి 'ఇంకా కావాలి, ఇంకా కావాలి' అనే వస్తుంది, అని. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే 'ఇంకా కావాలి' అనే ఈ మాటలు మన దేహ సంబంధమైన నోటి నుండి వెలువడుతున్నట్లు తెలియదు - స్పృహ ఉండదు. ఏదో విరాట్ హృదయం యొక్క విరాట్ పిలుపే నలు దిక్కుల నుండి 'ఇంకా కావాలి, ఇంకా కావాలి' అనే ధ్వనితో మన అంతరంగం నిండిపోతుంది. ఈ విధంగా మన అంతరంగము నందు నిండిపోవుట అనేది శ్రీ బాబూజీ మహరాజ్‌తో పాటుగా ఈశ్వరుని యొక్క సూక్ష్మత యందు - విరాట్ నందు వ్యాపించుచున్నట్లుగా వ్యక్తమవుతుంది. మనం దేని ధ్యానములోఉన్నామో ఆ ధ్యానం కూడా ఒక సందర్భంలో వ్యాపించి సర్వ వ్యాపకమై పోతున్నట్లనిపిస్తుంది! కళ్ళు మూసుకుంటే చాలు మనలోనే మనం బందీ అయినట్లుగా మన మనసు గాబరా చెందుతుంది. తర్వాత పానకంలో బెల్లపు నీరు కలిసిపోయినట్లుగా మనం బాబూజీలో కలిసి పోయినట్లనిపిస్తుంది.

అటువంటి స్థితిలో 'వారు' ప్రసాదించిన ఈ దివ్య చైతన్యము నైనా పరిశీలించగల్గిన స్పృహ, స్మృతి కూడా మనలో ఉండవు. మరి ఏమవుతుంది. అప్పుడు స్థితియే మన ఎదుట ప్రత్యక్షమై తానే స్వయంగా ఇది ఫలానా స్థితి అని తెలుపుతుంది. మనం ఆ స్థితికి కూడా కేవలం సాక్షిగానే మిగిలిపోతాము. మనం ఆ స్థితిని దర్శిస్తాం గాని దాని యొక్క ఆనందం గాని అనుభవం గాని

పొందలేము. మన అస్థిత్వం అనేది ఏ మాత్రం మిగలదు సరి కదా మనం వ్యాపించి యున్న మాలిక్‌లో (సద్గురువులో) ఒక బిందువు రూపంలో ఉన్నామని ఊహామాత్రంగానైనా అనిపించదు. ఎప్పుడైనా ఆ ఊహా బిందువులో ఒక్క క్షణమాత్రమైనా మనం ఇమిడి ఉన్నట్లనిపించినా అపుడు మనం సాక్షిగా ఉండగలమే గాని వేరే ఏమీ కాదు. సాక్షిగా ఉన్న ఆ స్థితికి ఆ క్షణంలో ఆనందం లేదా అనుభవం మనకు కలగవచ్చు. కాని ఇలా చెప్పడం కూడా సబబు కాదేమో ! అందుకే బాబూజీకి ఇలా వ్రాశాను. "నేను నా దశను వివరించడం లేదు. కాని ఆ దశ యొక్క దశను వర్ణిస్తున్నాను," అని. నేను దశ అని వ్రాస్తున్నది నిజమే కాని భ్రాంతి కల్గుతోంది - ఇది దశయా లేక భ్రమయా అని ! కాని కలం మాత్రం దశ అనే వ్రాస్తున్నది. ఇందువల్ల మనం చదివేది కూడా దశ అనియే. మనం భ్రమ (ఊహా) మాత్రంగా ఉన్నప్పటికీ అప్పటి ఆనందాన్ని, అనుభవాన్ని ఆ హద్దుకే అంచనా వేయగలం. ఒక్కోసారి ఈ భ్రాంతి నచ్చదు. మన సమక్షంలో ఆ దశ ఉజ్వల రూపంలో వ్యాపించి ఉండగా భ్రమ అనే ఈ తేలికైన గుర్తు ఎందుకుండాలి - అని అనిపించింది. దానికి జవాబు ఏమంటే - అదే ఆ బాధ యొక్క ఉనికిని తెలియజేస్తుంది. దానినే బాబూజీ ఇలా వివరించారు. "బాధ కలుగుచుండుట వలన అది దానికి స్థానము హృదయమే అని చెప్పుచున్న పరిస్థితి" - అని.

ఇంకా కొంచెం ముందుకు ఈదితే - పురోగమిస్తే ఈ భ్రాంతి కూడా తొలగిపోతూ ఉంటుంది. అంచేత "భ్రమకు కూడా భ్రమ ఉంటుందా ? ఉండదా," అని శ్రీ బాబూజీకి వ్రాశాను. ఇది ఎక్కడ ఎందులో ఉంటుందో మనకు తెలీదు. ఇక్కడ నేను గమనించిందేమంటే - ఇప్పుడు పరమ సూక్ష్మము మరియు సమస్తమూ త్యజించిన వారిగా పూర్తిగా లయము చేయుట కొరకు మాలిక్ మన తపన అనే ఈ బిందువును తనలో గాని, మన వ్యాపకమై ఉన్న రూపంలో గాని మెళకువలో (చైతన్యంలో) ఉంచుతారు. కాని ఇది ఎక్కడ ఉన్నదీ జాడ తెలీదు. ఉనికీ తెలియదు. ఎప్పుడైతే జన్మభూమికి కూడా మన ప్రియతముని ద్వారా మన ఎడబాటు యొక్క సమాచారము అందించబడునో, వ్యాపకమైన దివ్యత్వమే మనలను తనలో

లయము చేసికొనుట ప్రారంభించగానే - అప్పుడు అంతటా ఒక ఆశ్చర్యము నెలకొని ఉన్నట్లు నేను చూశాను. ఏ శక్తి సృష్టి ఆరంభం కొరకు అంతిమం నుండి క్రిందికి ప్రవహించిందో ఆ స్థితిని (సంఘటనని) మాలిక్ శ్రీ బాబూజీ మహరాజ్ మనకు దర్శింపజేసినప్పుడు ఆ ధారలో ఉన్న శక్తిని చూచి మనం చకితులమై నిశ్చేష్టులమై పోతాము. అందువలన ఇటువంటి మహత్తరమైన లయావస్థ యొక్క స్థితిని పొందిన తరువాత మన సమక్షంలో వ్యాపించి యున్న దాని అద్భుతాన్ని మనలో జీర్ణించుకోడానికి ప్రయత్నించినప్పుడు మన దృష్టి కూడా ఆశ్చర్యంలోనే వ్యాపిస్తుంది. నడవకుండానే ఉన్న నడకతో, వినకుండా ఉన్న వినికిడితో, దృష్టికి రాని దృశ్య వీక్షణంతో అనుభవాలు అంటకుండా ఉన్నా - ఆ 'అనంత చైతన్యం' ద్వారా లిఖింపబడుతున్న 'అనంతయాత్ర' యొక్క ఈ దృశ్యాన్ని, దీనురాలినైన నాకు తమ దివ్యత్వాన్ని సంతరింపజేసి తమ దివ్య దృష్టితో తిలకింపజేసిన శ్రీ బాబూజీ గారికే దీనిని సవినయంగా సమర్పిస్తున్నాను. నేను భద్రపరచి ఉంచడానికి నాకు స్థానమెక్కడ ఉంది ? భవిష్యత్తులో కూడా వారు తమ ఈ కృపతో దర్శింపజేసిన దానిని కూడా లిఖించి వారికే సమర్పించాలన్న కోరిక, సాహసం కూడా కృపతో బాబూజీయే అనుగ్రహిస్తారు.

ఇప్పుడు ఇంకా ఏమున్నది ? అసలీయత్ (వాస్తవికత) యొక్క పూర్ణ దృశ్యము - తెరచి ఉంచిన పుస్తకము వలె ఎదురుగా ఉంది. భాష, భావం అనేది అవసరం లేకనే ఒక వాస్తవికత అనగా మూలతత్వసారము మన ఎదుట పరచబడి ఉంది. కాని దానిని మనలో ఇముడ్చుకోవాలి అనే స్పృహ గాని ఆలోచన గాని ఇప్పుడు మనలో ఎక్కడ ఉంది ? దీనినే మరో విధంగా చెప్పాలంటే - ముత్యాలు మన ఎదుటే వెదజల్లబడి ఉన్నాయి. వాటిని ప్రోగుచేసి దాచుకునే స్పృహ కొంగుకు అంటే మనకు లేదు, అని. ఇక్కడి వరకు మనల్ని ఎలా తీసుకువచ్చారో మున్ముందు 'అనంతం' వైపుకు, ఎక్కడకు తీసుకువెళ్తారో అదంతా బాబూజీ కృపయే ! ఇప్పటి వరకు ఏది జరిగిందో, ఏది ఎదుట జరుగుతూ ఉన్నదో ఏది జరగబోతోందో - అంతా బాబూజీ వారి మాహాత్మ్యమే ! 'వారు' మన ఎదుట ఉండగా మరి వేరే

ఆధారమూ అవుసరం లేదు. వారు తోడుండగా యింకా అనుభవాలు ఎక్కడ పదిలం చేయాలి. వారిలో లయం కావలసినంత వరకు అయ్యాక ఇంకా చైతన్యం (జాగరూకత) యొక్క పని కూడా పూర్తయినట్లే ! ఇక దాని అవసరమే ఉండదు. ఆధ్యాత్మిక క్షేత్ర ప్రవేశానికి కావలసిన అవసరాలన్నీ తీరిపోయాక ఈ చైతన్యం యొక్క పనేం ఉంటుంది ? మనం సంకల్పం చేసిన కార్యం పూర్తయిన కారణంగా (లయావస్థ పొందిన కారణంగా ఎలర్ట్‌నెస్ - చైతన్యం యొక్క పని కూడా పూర్తి కావడంతో) దీని అవుసరం తీరిపోయినట్లే. ఇప్పుడు ఈ స్థితిలేని స్థితిని ఎవరు అర్థం చేసుకోగలరు. ఇట్టి స్థితిని పొందిన అభ్యాసి మాత్రమే దీనిని ఋజువు చేసుకోగల్గినవాడవుతాడు. దీనిని గుర్తించిన వారూ స్వయంగా అదే స్థితికి లోనవుతారు. ఆ స్థితి స్థితిగా ఉండదు. అది స్థితిలేని స్థితి.

బాబూజీ ! నీ వవతరించిన వేళ
ఆ క్షణం సృష్టి ధన్యాతి ధన్యం !
నయనాలలో మీ సౌందర్య తేజం నిండగా
త్యాగమయి సంధ్య మీ కర్పితమౌతోంది.

(బాబూజీ ! భూమా యొక్క శక్తి సమేతంగా మీరు భూమి మీద అవతరించినపుడు, సృష్టి యొక్క ఆ శుభవేళను ధన్యాతిధన్యంగా నేను భావిస్తున్నాను. అంతేకాదు, మీ ముఖారవిందం యొక్క దివ్య సౌందర్యానికి ఈ 'సంధ్య' అర్పితమైపోతోంది. నా కన్నుల ముందు మళ్ళీ మళ్ళీ మెలిగే మీ దివ్య సౌందర్యం - రూప, గుణాలకు అతీతమైనది. నా ఈ అనుభూతి సగుణపూజ, నిర్గుణపూజలకు చెందినదిగాదని, ద్వైత అద్వైత వాదాన్ని ప్రతిఫలింప జేస్తున్నదిగాదని మీరు తప్పక గుర్తించాలి. ఇది వీటన్నిటికి అతీతమై అనంత యాత్ర యొక్క యాత్రలో మార్పు చెందుతున్న అసంఖ్యాకమైన దశల యొక్క దర్శనంతోనే నిండి ఉన్నదని 'సంధ్య' విన్నవించుకుంటోంది.)

## 11. అహం

సమస్త ఆధ్యాత్మిక స్థితుల యొక్క వ్యాప్తి అహం యొక్క రెండు స్థితుల మధ్యన విస్తరించి ఉంటుంది. మొదటిది స్థూల చైతన్యం లేదా దేహ చైతన్యం. దీనిని దాటిన తర్వాత లోకం నిస్సారంగా కనిపిస్తుంది. రెండవది సూక్ష్మచైతన్యం లేదా ఆత్మచైతన్యం (సోల్ కాన్షస్‌నెస్). దీనిని పొందినపుడు అభ్యాసి అనంతము నందు తనను తాను కోల్పోతాడు. అహం యొక్క ఈ రెండు స్థితుల మధ్యన అనేక ఆధ్యాత్మిక స్థితులు వ్యాపించి ఉంటాయి. వాటి విషయంలో అనుభూతిని ఆధారం చేసుకుని కొన్నిటి గురించి చెప్పగలం. మరికొన్నింటిని గురించి చెప్పలేము కూడా. 'అహం' అంటే 'నేను ఉన్నాను' అని వాడుకలో అంటాము. ఇది అహం యొక్క చీకటి భాగం. అహం యొక్క రెండవవైపు అనగా దానియొక్క ప్రకాశవంతమైన భాగములో, నేను గమనించిన దేమంటే మన హృదయం లేదా మనస్థితిపై యితరుల మనోభావాల ప్రభావం పడకపోవడం. అనగా ఏదైనా రావడం పోవడంగాని, ఉండీ ఉండకపోవడం గానీ వంటి అన్ని ఆలోచనలు ఒకే లాగున భావించబడు తున్నపుడు (అంటే భావాతీతం లేదా ద్వంద్వాతీతంగా ఉండడం) - అహం యొక్క రెండు భాగాలు చీకటి, వెలుగులనుంచి విముక్తుల మయ్యామని లేదా వాటిని అధిగమించామని గ్రహించాలి. ఈశ్వరధ్యానంలో మునిగిపోయి ఉండే అభ్యాసంలో మనయొక్క నేను తన (రంగు) ఉనికి పోగొట్టుకుంటూ క్రమంగా ఒకనాడు ఆ దివ్యత్వం (రంగు) పొందినప్పుడు 'నేను'అని చెపుతున్నది ఎవరి గురించి చెప్పబడుతుందో - ఆ జ్ఞానం ఇక ఉండదు. అప్పుడే 'అహం' యొక్క స్థూల బంధనాల నుండి మనం విముక్తి పొందినట్లు తెలుసుకోవాలి.

శ్రేష్టమైన జీవితలక్ష్యముగా ఈశ్వరప్రాప్తి యే మన హృదయంలో గాఢంగా నాటుకొన్నప్పుడు ఆ శ్రేష్టత్వంపైనే ఆధారపడుట, మనకు తెలిసినప్పుడు తెలియనప్పుడు కూడ వృద్ధి పొందుతుంది. ఈ ఆధారపడుటయే ముందు ముందు ఆత్మనివేదన (సబ్‌మిషన్), ఆత్మార్పణగా మారుతుంది. ఈ ఆత్మనివేదనను ఈశ్వరుడు స్వీకరించిన రోజున మనలోని స్థూలచైతన్యము తొలగిపోవాల్సిన అవసరం కల్గుతుంది. ఆదివ్యత్వంలోనే లయమైపోయి

ఉండే అభ్యాసం ఫలితంగా ఒకనాటికి 'నేను' అని చెప్పడానికైతే చెపుతాయి కాని మన లోపల దానితో సంబంధం ఉన్నట్లు అనిపించని స్థితి వస్తుంది. అనగా ఇప్పుడు ఆత్మ పరమాత్మలో లయమైపోయే సమయం వచ్చింది. ఇక అప్పుడు సమస్తమూ ఒకేలా (అనగా సర్వసమానభావం) ఉంటుంది. మనకు ఆత్మచైతన్యం కలుగనున్న శుభసందేశాన్ని అప్పుడు శ్రీ బాబూజీమహరాజ్ ప్రదానం చేస్తారు.

శ్రేష్టజీవిత లక్ష్యముగా ఈశ్వర సాక్షాత్కారాన్ని హృదయంలో నిలుపుకొన్నచో స్వతహాగా మన అంతరంగములో ఆ శ్రేష్టత్వముపై భక్తి నిండి పోతుందని పైన చెప్పాను. ఇంకా పురోగమించిన తర్వాత మనకు తెలిసీ తెలియకుండానే మన హృదయంలో ఈశ్వర అలంబన (డిపెండెన్సీ) ఏర్పడుతుంది. ఈ అలంబనమే ముందుకు సాగి అదే ఆత్మ నివేదనగా మారుతుంది. ఆత్మ నివేదన (సబ్‌మిషన్) దశ ఆరంభంకాగానే అహం యొక్క స్థూల ఆవరణ కరగిపోసాగుతుంది. ఈ ఆలంబనమే (డిపెండెన్సీ) ఈశ్వరునిలో మనకు యోగాన్ని కలిగించుటకు తిరుగులేని ఉపాయంగా పనిచేస్తుంది. ఇపుడు మన ఆలోచనా సరళి మంచిగా మారును. ప్రపంచం మనది అన్న స్థానంలో ఈశ్వరుడు మనవాడు అనే భావన ఏర్పడుతుంది. మొదట ఈ ఆలోచనాధార బాహ్యంతో సంబంధించి ఉంటుంది. ఎక్కడ ఎటువంటి ఆలోచనలు చేసినా లక్ష్యానికి ముడిపడినవిగానే ఉంటాయి. అంటే ప్రతిచోట, ప్రతివస్తువులోను, ప్రతి మంచిలోనూ ఈశ్వరునితో నింపాలనే కోరికతో కూడిన ఆలోచనలు కలుగుతాయి. దృష్టి యందు ఆయనే నిండిపోయిన శుభదినం సమీపిస్తుంది. దీని పరిణామంగా ఈ ప్రపంచం మనకు నిస్సారంగా, ఆకర్షణ హీనంగా కనబడుతుంది. అనగా బాహ్య వృత్తులు ఆలోచనా ధార ద్వార బాహ్య ప్రపంచము నందలి ఆకర్షణలో లీనమై ఉండేవి. ఇప్పుడు మన ఆలోచనలు ఈశ్వరుని నింపుకోడానికి ప్రయత్నించసాగినంతనే ఈశ్వరసృష్టి ఆయన సౌందర్యము ముందు నిర్మోహంగా, ఆకర్షణ హీనంగా కనిపించసాగింది. ఒక రోజుకు ఈ భౌతికత యొక్క ఆనవాలు కూడా నశించిపోతుంది. ఇక మన ఆలోచనా దృష్టి,

పనులు అన్నీ లక్ష్యమునందే మునిగిపోతాయి. ఈ దశ ఒక కవి మాటల్లో - 'తేనెలో మునిగిన తేనెటీగ కళ్లు తేనెతో నిండిపోగా రెప్పలు ఒంగిపోయాయి.'

ఈ మునిగిన తన్మయత ప్రభావం మన అంతరంగముపై పడుతుంది. మన అంతరంగం 'వారి'తో కలిపి దారముతో కుట్టినట్లుగా వినమ్రంగా వారి సమక్షంలో (అహం) వంగి ఉంటుంది. మన అహం మొత్తం వారికి వశమై వారిపావన చరణాల మీద సాగిలపడినట్లుగా ఉంటుంది. ఇప్పటివరకు మనం బాహ్యనేత్రాల్లో ఈశ్వరుని నింపుకుని మతిలేని విధంగా తిరుగుతూ ఉండగా - ఈశ్వరుడు, నేత్ర ద్వారం నుండి నెమ్మదిగా హృదయంలోనికి మనకు తెలియకుండానే ప్రవేశం చేస్తాడు. ప్రేమ యొక్క సహజ విధానం ఎలా ఉంటుందో చూడండి. హృదయం పూర్తిగా వారిని స్వీకరించింది. ప్రేమాశ్రువులు హృదయాసనాన్ని నిర్మలం చేశాయి. శ్రీ బాబూజీ యొక్క ప్రాణాహుతి ఆ ఆసనాన్ని అలంకరించింది. అప్పుడు 'లయ' అనే సూత్రం వారిని హృదయాసనం మీదికి లాగింది. ఇప్పుడు 'వారు' ఆ యెదలో ఆసీనులైపోయారు, అనే అనుభూతి కలిగింది. అంతరంగంలో ప్రతిక్షణం 'వారు' కొలువైయున్నట్లుగా అనిపిస్తుంది. మన అంతరంగమంతా భక్తిపూరిత వినమ్రతతో కరిగిపోతున్నట్లు అనిపిస్తుంది. మనలో ప్రియతమునితో స్వాభావికమైన అనుబంధం జనించి మనను అస్థిత్వం లేనివారిగ చేస్తుంది. ఈశ్వరునిలో లయావస్థ యొక్క మొదటి మెట్టు ఇదే! ఈ స్థితి ప్రాప్తించిన తర్వాత మన ఆలోచనాధార 'అహం' యొక్క స్థూలవత్తిడినుండి విడుదలై సూక్ష్మము నందు అనగా ఈశ్వరుని యందు ప్రవేశిస్తుంది. అంతరంగము యొక్క ఆవరణ అధికమగుచున్న ఔన్నత్యాన్ని తనదిగావించుకొన్నందున భౌతికత్వమనే రంగును అడుగడుగునా కోల్పోతుంది. ఆంతరిక ఆత్మనివేదన 'మాలిక్' యందు అధికమై ఎంతవరకు వృద్ధిపొందుతుందంటే అంతరంగము తనయొక్క ప్రత్యేకమైన ఉనికిని (లక్ష్యముతో కలసి మెలసిపోయి) తయారు చేసుకుంటుంది. ఆ స్థితికి రాగానే ఈ మార్పు 'లయావస్థగా' పరివర్తన చెందుతుంది. లయావస్థ కలుగుట చాల దుర్లభం. కాని ఎవరైనా మహా సద్గురువు నందు మన పూర్తి విశ్వాసమును పెంపొందించుకోవడమే శ్రేష్టమైన (కీలకమైన) విధానం. దాని వల్ల మన అంతరంగము లయమై ఉండుట తప్పక నేర్చుకుంటుంది.

లయావస్థ యొక్క స్వరూపమైపోయిన ఆధ్యాత్మిక మార్గశిక్షకుడు (సద్గురువు) లభిస్తే - వారే దిక్కు అని ఆధారపడి ఉండగా ఉండగా మొదట ఆత్మనివేదన లేదా తల్లీనత (నిమగ్నత) ఆ తర్వాత లయావస్థ యొక్క సూచన వాటంతటవే నకలులా మనలో దిగిపోతాయి. దీనికి ప్రమాణం ఏమంటే ఏ ఈశ్వరీయ ధార అయితే నిరంతరం సరిసమానంగా సమస్తమునందు ప్రవహిస్తూ ఉందో దాని ప్రాప్తి యొక్క సంపూర్ణ లాభం యిప్పుడే మనం పొందలేకపోతున్నాం. ఒక సమర్థ శిక్షకుడు అంటే గురువు, ఎవరైతే ఈశ్వరునిలో పూర్ణలయావస్థను పొంది పరిపక్వత చెందిన తర్వాత నైపుణ్యము లేదా ఆధిపత్యమును కూడా పొందియున్నారో అట్టి గురువు యొక్క ప్రాణాహుతి శక్తిప్రాప్తి వల్ల మన హృదయంలో వారే నిలచిఉండి (లయావస్థ చెంది) మరికొంతగా ప్రావీణ్యతా సామర్థ్యాన్ని మన అంతర్దశలో ప్రవేశపెట్టి పరిపక్వతలో నిగ్గుతేల్చుతారు. 'వారి' లో లయావస్థను పొందడంవల్ల మన బాహ్యాజీవితంలో విధులు నిర్వహిస్తూ కూడా దివ్యము అనగా ఈశ్వరునిలో లయమై ఉండడం మన అంతరంగం అభ్యాసం పొందుతుంది. లయావస్థ గాఢమైన కొలదీ మనలోని సూక్ష్మ అహం కూడా తొలగిపోసాగుతుంది.

ఇప్పుడు సహజంగానే ఆత్మనివేదన అంటే ఏమిటి? అనే ప్రశ్న ఉదయించవచ్చును. ఆత్మోద్ధరణకై మనం ఎవరైనా సమర్థ సద్గురువును ఆశ్రయించినపుడు మనకు తెలియకుండానే వారి మీద మనకు ఆలంబన లేక గురి ఏర్పడుతుంది. దీనినే డిపెండెన్సి (ఆధారపడడం) అంటాం. ఈ ఆలంబనవల్ల మనకు శాంతి ద్వంద్వరాహిత్యము (అంటే - రాగ ద్వేషాలు కష్టసుఖాలు వగైరా వానికి స్పందించని విధం) చేకూరి ఆ సద్గురువు యొక్క సతత స్మరణలో ఉండునట్లు తయారుచేస్తుంది. ఈ సుఖానుభూతితో సద్గురువు స్మరణ కూడా మిళితమై ఉంటుంది. నిజానికి ఆత్మనివేదన నిరంతర స్మరణ యొక్క సుందరమైన సుఖదాయకమైన ఫలితం. స్మరణ వల్ల వారి సాన్నిధ్యం, 'ఆవాహన' లభిస్తాయి. కాబట్టి సతతస్మరణ సంయోగానికి ఒక లింకు, బంధం అని చెప్పుట అనుచితంకాదు. స్మరణ అనేది అంతరంగము యొక్క గుడ్డిప్రేమ. దీనివల్ల మనం అసలు ఎందుకు ప్రేమిస్తున్నామో తెలీదు. కాని నిరంతర స్మరణవల్ల మనం పొందే పరమానందం వలన

నెమ్మది నెమ్మదిగా ఒక రోజున మన అంతరంగంలో విభోర స్థితి (డ్రౌనింగ్ కండిషన్) ఉద్విగ్న స్థితి అనగా తమాయించుకోలేని స్థితి ఏర్పడుతుంది. దీన్ని వివశత్వం అనవచ్చు. ఈ ఉద్విగ్న (వివశత్వ) స్థితి యొక్క ప్రతిఫలం వెంటనే మనకు అంతరంగానందు లభిస్తుంది. దాని ప్రతిఫలం ఏమంటే మనలో కేవలం 'వారి' దర్శనం మరియు 'పొందు' కోరిక మాత్రమే ఉంటాయి. ఈ స్థితివల్ల గొప్పలాభం ఏమనగా సతతస్మరణ వల్ల పరవశించిన ఆలోచనాధార, మన హృదయాంతరంగమును అంటిపెట్టుకున్న సంస్కారాలు ఛిన్నాభిన్నమై శుభ్రపడి ఈశ్వరవ్యాప్తి కొనసాగుతుంది. మన ఆలోచన, బుద్ధి జీవన విధానము అన్నింటిలోనుండి సంకుచితత్వము తొలగిపోతుంది. మనలోపల బయట కూడ ఒక విధమైన పవిత్రత వ్యాపించుచున్నట్లుగా మనం అనుభూతి పొందుతాము. ఇటువంటి ప్రేమ పూరితమైన కోరిక ముందుకు సాగి వృద్ధి పొందుతూ ఉంటే లోపల అంత మేరకు ఒక రకమైన శూన్యత ఏర్పడుతూ ఉంటుంది. ఆ శూన్యాన్ని కేవలం తనతోనే నింపాలన్న తపన మన అంతరంగాన్ని మెరుగుపరుస్తుంది. ఇప్పుడు ఈ విభోర అవస్థ, తన్మయావస్థలో మనం లీనమైపోగా ప్రియతముని ప్రతిరూపము మరల మరల అవతరిస్తూ ఉంటుంది. దాన్ని మనం "ఈశ్వరీయ ప్రకాశం మీలోపలంతా వ్యాపించింది" అంటాం. ఆయన యొక్క పావన ఉజ్వల రూపం ఆయన సామీప్యత యొక్క వెచ్చదనం మన స్థూలత్వాన్ని కరగించనారంభిస్తుంది "ఆత్మనివేదన లయావస్థకు ప్రాణం", అని బాబూజీ చాలా సరిగ్గా నాకు వ్రాశారు. మన హృదయంలో వినమ్రత కోమలత్వం సరళత రూపంలో సమస్తము కొరకు విశుద్ధమైన వ్యథ జనించినపుడు పరిపూర్ణమైన ఆత్మనివేదన ఉత్పన్నమైనట్లు అర్థంచేసుకోవాలి. అంతరంగం లోని ఈ మృదుత్వమే (సౌమ్యతాస్థితియే) ఆత్మనివేదనకు ప్రాణమై వున్నది. హృదయం శూన్యంగా అవడమే ఈ స్థితి ఉత్పన్నమైనదనుటకు గుర్తు.

నిరంతర స్మరణయొక్క సుందరపరిణామంగా నేను గ్రహించిన దేమంటే సతత స్మరణరూపమైన సామీప్యత యొక్క ప్రభావం మన అవచేతన మనస్సు (అంతర్మనస్సు) లో ప్రవేశిస్తుంది. అప్పుడే మన అంతరంగమున ఈశ్వర సాయుజ్యమునకై నిజమైన తపన మేల్కొంటుంది.

ఎందుచేతననగా మన అవచేతనము దివ్యత్వముతోనే యోగం చెందాలి కనుక. అది సంపూర్ణముగా జరిగినప్పుడు మనలో భక్తి, తన్మయత్వం స్వతస్సిద్ధంగా నెలకొంటాయి. దీనికై మనం ఏ ప్రయత్నం చేయనక్కర్లేదు.

పైన చెప్పిన సందర్భానికి తగినట్లుగా "అవచేతన మనస్సులో ఆసక్తి వుంటుంది" అని శ్రీ బాబూజీ చెప్పారు. ఇందువలన నిరంతర ఈశ్వర స్మరణ యొక్క మధుర తాపం అవచేతన మనస్సులోకి చేరుతూ ఆ తపన లక్ష్యప్రాప్తి (లక్ష్యం)తో యోగం చెందటానికి సన్నద్ధమైవుబుకుతుంది. మనలో ధ్యానం కల్గినపుడల్లా పైనుండి ఏదో అనుసంధానం చేయబడినట్లుగా అనిపిస్తుంది. ఇపుడు మన నిరంతర స్మరణ పూర్ణదశనందుతుంది. 'వారి' పరమపావన ప్రాణశక్తి, విశాలమైన నిర్మల చైతన్యశక్తితో కలిసి మనలో ఈ ఆసక్తి (తపన)ని తట్టి మేల్కొల్పటానికి సహాయపడుతుంది. అవచేతన మనస్సులో నెలకొన్న ఈ అసక్తి (తపన) కలగడానికి కారణం ఈశ్వరప్రాప్తి అనే లక్ష్యము. దాని నిరంతర స్మరణవల్ల మాత్రమేనని నేను ఖచ్చితంగా చెపుతాను. మన అంతరంగములో లయావస్థ ఆరంభమవుతున్న లగాయతు మనలో సంస్కారాలు ఏర్పడటం నిలిచిపోతుంది. అపుడు మనం ప్రాపంచిక జీవితంలో నడయాడుతూనే లయమైన స్థితిలో లీనమై వుంటామేకాని శరీరంలో (శారీరక స్పృహకల్గి) వుండము. ఆధ్యాత్మిక మార్గంలో ప్రాప్తించిన ప్రగతి స్వల్పమైనప్పటికీ మనకు ఈదశ అనుభవమవుతుంది. కాని ఎక్కువగా అవతార పురుషుల విషయంలో ఈ స్థితి వుండటం గమనార్హం. "అవతార పురుషులకు మనసు, ప్రాపంచిక స్పృహ వుంటుందా?" అని ఒకరు బాబూజీని ప్రశ్నించగా వారు ఇలా బదులిచ్చారు. అవతారపురుషులకు మనస్సు వుంటుంది. కాని అది ఒక విశిష్ట స్థాయిలో లయావస్థలో ఉంటుంది. ఈ లోకంలో కార్యార్థమై ఉంటం వల్ల. భౌతికంగా సంచరిస్తున్నాకూడా సంస్కారములు వారి నంటవు' అని. అందువల్ల నేను అర్థంచేసుకొన్నదేమంటే మాలిక్ మనల్ని సంస్కార బంధనాలకు బదులుగా అహం యొక్క స్థూల బంధనం నుండి త్వరగా విముక్తం చేస్తారు. కాని అహం యొక్క సూక్ష్మ బంధనం ఎంతవరకు వ్యాపించియుంది? ఏ స్థితి వరకు దానిని మనం కల్గివుంటాము? దీనికి సంబంధించినంతవరకు నేను ఖచ్చితంగా చెప్పేదేమంటే 'నేను' అని

వ్యవహరిస్తున్నపుడు 'నేను' అని చేసిన సంబోధన ఎవరిని గురించి చేస్తున్నామోనను ధ్యాస (భావన) వుండదు. ఇది అనాలోచితంగా వుంటుంది. ఈ స్థితియే స్థూల అహం నుండి విముక్తి పొందినట్లు చెప్పటానికి నిదర్శనమవుతుంది.

అటువంటి అంతర్దశ పొందినవప్పుడు నస్థూలచైతన్యం అదృశ్యమవుతుందని వ్రాశాను కదా! ఇప్పుడు మనం సూక్ష్మత్వం వైపు ప్రయాణించినకొలది అదే స్థితిని ఇతరుల కొరకు సమస్త జడ-చేతనముల కొరకు కూడా పొందగలం. మనం చెట్టు, గోడ, పాత్రలు, పదార్థాలు వేనిని స్పర్శించినా మన వాస్తవిక స్థితిలో దేనినీ స్పర్శించనట్లుగానే ఉంటుంది. మనస్థితి సమస్త బాహ్య ప్రపంచం యొక్క స్పర్శకు అతీతంగా ఉంటుంది. దీనిని నిర్వాణస్థితి అన్నారు అలా ఎందుకంటే మనదృష్టిలో లక్ష్యం తక్క మరేదీ లేనప్పుడు భౌతికస్పర్శయొక్క స్పృహ ఎందుకుంటుంది? మనము ఏ స్థాయి వరకైతే లయావస్థను పొందుతామో అదే మనముండే స్థానముగా మారి దానికి దిగువన ఉన్న ఆధారం తొలగిపోతుంది. ఎవరైనా పిలిచిన శబ్దమైనపుడు ఆ శబ్దం యొక్క స్పర్శశరీరానికి తాకకుండా మనముంటున్న లయావస్థ స్థానానికి ఆ కబురుచేరి - అదీ ఎంతో సూక్ష్మత్వంతో మనల్ని చేరుతుంది. జీవితమనే తీగె శరీరంతో బంధింపబడినట్లనండీ లేదా శరీరం యొక్క హద్దులో ప్రవహిస్తున్న ప్రాణం కానీండి - అది (ప్రాణాన్ని) ఈ శరీరరూపమైన ఇంటిలో ఉన్న అనుభూతికలుగుతూ అది మన శరీరానికి తెలుస్తూ ఉంటుంది. మరి ఎపుడైతే మన పురోగతి లేదా యాత్ర దీని హద్దులు దాటి (అతిక్రమించి) ఆవలనున్న ఈశ్వరీయక్షేత్రంలో ప్రవేశించసాగుతుందో మనం మహత్ ప్రాణంలో (ఈశ్వరీయప్రాణంలో) వ్యాపించినట్లే అనిపిస్తుంది. అప్పుడు అదే మనల్ని గూటికి చేర్చుతుంది. కాని అహంయొక్క ఈ సూక్ష్మస్థితి యొక్క వ్యాప్తి ఆత్మచైతన్యం యొక్క స్థితి ఎంతవరకు విస్తరించి ఉంటుంది? ఏ స్థితివరకు వీటినిపొందుతాము? అన్నది ప్రశ్న. దీనిని గురించి ఇది చెప్పగలను. ఇంకా మున్ముందు ఈశ్వరీయ స్థితియందు ఇంకా వ్యాపించిన తర్వాత నిదానంగా ఈ రకమైన ప్రక్రియ జరగడం నేను గమనించాను. అదేమంటే నెమ్మది నెమ్మదిగా పిలుపు

వినిపించినా కూడా - మనం ఉపసంహరించుకుని శరీరంలోకి తిరిగి రాలేము. పైగా అక్కడి నుండే ఆ స్థితి నుండే అనాలోచితంగానే (అప్రయత్నంగానే) నిర్దేశిస్తూ (సూచనలిస్తూ) వుండటం జరుగుతుంది. అనగా ఇలా జారీ అవుతున్న సూచనల స్పృహ కూడా మనకుండదు.

అయితే నేనిపుడు ఆ మొదటి స్థితిని నెమరు వేసుకుని చూస్తే - అది అలా ఎందుకు కలుగుతుంది అనే ఆలోచన కల్గుతుంది. అప్పుడు నాకు ఇలా స్ఫురించింది. ఒక స్థాయిలో లయం అవుతూ, అహం యొక్క, పొరలు పొరలుగా ఏర్పడియున్న ఆవరణలన్నీ దాటుకుంటూ ఆత్మకు ఆవల ఆ దివ్యస్థితికి అనుగుణంగా సూక్ష్మములో అనగా ఈశ్వరీయ స్థితిలో వ్యాపిస్తూ ఉంటాము. మనం లయావస్థలో ఒక స్థాయికి చెందిన స్థితియందు ఇమిడిపోయినచో ఆ స్థితియే మన స్వరూపమైనట్లనిపిస్తుంది. మనము ఆ స్థాయిలో అంతగా వ్యాప్తి చెంది ఆ దివ్యస్థితియందే లయమైపోయామన్నమాట. దీనిని బట్టి ఇప్పుడు ఆ స్థితి పూర్తిగా మనకు స్వానుభవమైపోయి దానిలో యింకా గాఢంగా లయం కావడం జరుగుతుంది. ఆ స్థితిలో పూర్తిగా లయమైపోవడం సంభవించాక, మనం మళ్ళీ ఖాళీగా శూన్యంగా ఉన్నట్లనిపిస్తుంది. ఈ స్థితిలో ఆవేదనయే మన స్వరూపంగా మారి మనముందు నిలచినట్లనిపిస్తుంది. దీని వల్ల మన అంతరంగంలో ఇంకా గాఢమైన స్థాయిలో శూన్యత తిరిగి జనించి తద్వారా అతిసూక్ష్మదశయందు అనగా ఆత్మయందు మనం లయము కానారంభవమవుతుంది. ఈశ్వరీయ సూక్ష్మ స్థితి యొక్క ఎటువంటి లయావస్థ మనం లయం కావడానికి, మనముందుకువస్తుందో, దానికి తగినట్లుగానే అదే స్థాయికి చెందిన శూన్యత మనలో ఏర్పడుతూ ఉంటూంటే మనం ఈశ్వరుని సూక్ష్మస్థితిలో (సూక్ష్మంలో) వ్యాప్తి నందుతూ పోతూ ఉంటాము. ఇదే మనకు లభిస్తున్న 'వారి' అపారకృప. లయావస్థయొక్క ఒక పరిమితివరకు లయమైన తర్వాత నేను గమనించినదేమన, ఆత్మచైతన్యము కూడ నమాప్తమగుట ప్రారంభమవుతుంది. అనగా ఇప్పుడు మన వ్యక్తిత్వము ఒక వ్యక్తి వరకే పరిమితమై ఉండక అది సర్వవ్యాపకం చెందనారంభమవుతుంది. ఇప్పుడు నెమ్మది నెమ్మదిగా అహం లయమైపోయి తపన అనేది బిందువురూపంలో

లేక సాక్షీభూతంగా మన వెన్నంటి సాగుతుంది. ఈ దశను పొందిన తరువాత శ్రీబాబూజీ మహారాజ్ చెప్పినది మనకు స్పష్టమవుతుంది. "ఇప్పుడు మనలో స్థూల చైతన్యము మరియు ఆత్మ చైతన్యము రెండింటి జాడ కూడా లేదు' '. దీనికి ప్రమాణంగానే మన లోపలి దశ గురించి "హృదయం వేదనతో తన ఉనికిని చెప్పుకుంటోంది," అని అనుకుంటాం.

ప్రియతముడైన సద్గురువుగారి కృపతో లయావస్థలోని సూక్ష్మ ప్రవాహములో మనము ప్రవేశమును పొందినపుడు మనకు చాలా లాభం చేకూరుతుంది. తపన అనేది మనం ఎంచదగినదిగాలేనంత సూక్ష్మతనందుతుంది. ఒక రకంగా అది కూడ మనమున్న సూక్ష్మస్థితిలో వ్యాపించి మిళితమైపోతుంది. సూక్ష్మ ఈశ్వరీయ స్థితిలో కూడ మనవ్యాప్తి అనగా ఈశ్వరీయస్థాయిలో ఐక్యమైపోయినపుడు తపన కూడ సూక్ష్మమై అసలు దాని ఉనికి మనలో ఉన్నదో లేదో కూడా తెలియనిదై వుంటుంది. లక్ష్యప్రాప్తి కొరకు కానరాని తపనతో మనశ్శాంతి కూడా ఉండదు. దీనిని వివరించాలంటే అశాంతియే అశాంతి చెందుతున్నట్లు ఉంటుంది. ఇపుడు ఆత్మ పరమాత్మలో ఐక్యం కావడం ప్రారంభమవుతుంది. ఇక వేరే దాన్ని గూర్చి చెప్పడానికేం ఉండదు. మార్గం అన్నా, సద్గురువు అన్నా ఈశ్వరుడు అన్నా సరే ఏమీ భేదం ఉండదు. ఈ దశను పొందినపుడు కబీరు యొక్క మాటలు సరితూగుతాయి. 'చేలా కె గురూ లాగే పాఀయ్' మొదటగా తన ప్రియ శిష్యుడు భగవదైక్యం చెందినందున సద్గురువు యొక్క సంతోషానికి అంతుండదు. అవధుల్లేని ఆ సంతోషంలో శిష్యుని కాళ్ళు గురువు స్పృశిస్తాడు. అతడు అనగా గురువు, శిష్యుని కొరకు సర్వం త్యాగం చేస్తాడు. బాబూజీ మహరాజ్ మనయొక్క స్థితిని కబీరు మాటల్లో తిరిగి చెప్పారు. మొదట 'సత్యము' - తరువాత 'మాయ' అనగా మొదట 'దైవం' ఆతరువాతే సోదరుడు, తల్లీ, అన్నట్లు భావింపచేస్తారు. అనగా ఏ ముఖ్య కేంద్రము నుండి అయితే సృష్టిచేయడానికై 'సంకల్పము' ఈశ్వరీయ శక్తి రూపముతో విడివడినదో దానివైపు అనగా అనంతము - (అల్టిమేట్) వైపునకు మనలను నడిపిస్తారు.

ప్రియతముని సతత స్మరణమువలన 'వారి' లో లయావస్థను పొందిన పిదప ఆత్మను కప్పిన మన ఆవరణలు పేరుకుపోయిన స్థూలత్వము తొలగిపోతున్నప్పటి నుండే మనం ఈశ్వరమయం కావటం మొదలవుతుంది. మనలోని 'మనము' (అహం) కరిగి సమాప్తమైపోతుండగా 'ఆయనే' వ్యాపిస్తూవస్తారు. దీని సంపూర్ణ స్థితిని మనం పొందిన తర్వాత తెలియని వ్యాకులతలాటి ఆ తపన యొక్క ఆ సూక్ష్మ బిందువు అజ్ఞాతంగా, మనలో ఎక్కడ దాగి వృద్ధి అవుతోందో చెప్పడం చాల దుర్లభం. మనము ఈశ్వరమయముగా అనుభూతి చెందుతాము. దీని అర్థం ఏమంటే - మనలోని అహం అనుదాని పరిమితియొక్క స్థూల సూక్ష్మ రూపములు రెండూ తొలగిపోగా మనలోని 'మన' అనునది ఆ మహత్తరమైన 'స్వ' యందు అనగా విశ్వాత్మయందు మిళితమైపోతూ ఉంటుంది. నెమ్మది నెమ్మదిగా ఆ మహత్ ఈశ్వరీయ 'స్వ' యందు అనగా ఈశ్వరీయ విరాట్ యందు కూడ లయావస్థ ఆరంభమవుతుంది. ఒకరోజున ఆ ఈశ్వరీయ విరాట్‌నందు మనవ్యాప్తి మరియు లయావస్థ పరిపూర్ణత నందగా, ఆ విరాట్‌లో అనగా మూలము యొక్క క్షేత్రంలో అడుగిడినట్లుగా అవగతమవుతుంది. ఈ మూల క్షేత్రములో విహరించినకొలదీ మన వ్యవస్థ అంతటా (సిస్టమ్ అంతటా) దివ్యత్వమే నెలకొనిఉన్నట్లుగా తోస్తుంది. ఈ స్థితిలో ప్రవేశం పొందిన తర్వాత మనం స్వయంగా పురోగమిస్తున్న అనుభూతి పొందుతాయి. మన పనిలో మన జీవన సరళిలో ఇతరులు కూడా దివ్య పథంలో మనం సంచరిస్తున్నట్లు గుర్తిస్తారు.

అనంతమైన అనుభవ దృష్టిలో మనం 'వారి' నే నింపుకున్న రోజు వస్తుంది. దీని అర్థం ఏమనగా ఇపుడు మన అహం యొక్క 'అ' నుండి 'హ' వరకు గల దశ ఇపుడు దివ్యమునందు మిళితమై వ్యాపించి పోయి ఉంటుంది. అంటే - మొదటి నుండి చివరి వరకు అహమును అధిగమించి మనం పూర్తిగా మాలిక్ యందు కలిసిపోయాము. ఇపుడు మన ఎదుట కేవలం . బిందు మాత్రమైన తపన మాత్రమే మిగిలి ఉంటుంది. దీనిని బిందువులో సింధువు (సముద్రం) మరియు సింధువులో బిందువు

కలిసియున్నట్లుగా చెప్పవచ్చు. బిందువు సముద్రంలో కలసి తానే సముద్రమవుతుంది. అలాగే బిందువులో సముద్రము తానే అవుతుంది. రెంటిలో ఉన్నది ఒక్కటే. కనుక స్వభావంలో రెండూ ఒకటే కదా! అనగా ఇప్పుడు తపన అనే బిందువు (.) మాత్రమే కర్తగా మిగిలిపోయింది. ఈ బిందువుకు ఎటువంటి విలువ ఉండదు. దీని వల్ల సంపాదించేది, నష్టపోయేది ఉండదు. అనగా పొందుట, పోగొట్టుకొనుట అనే ప్రస్తావనముగుస్తుంది. ఒకే విధంగా, ఒక నిరంతర దశవలె ఒక దఫా ఉన్నట్లు, మరోసారి లేనట్లు అనిపిస్తుంది కబీరు చెప్పినట్లు 'ఒకే బిందువు సమస్తమున వ్యాపించి యున్నది' అనే దాని అర్థము ఇప్పుడు నాకు గ్రహింపుకొచ్చింది. 'అ' అనగా 'లేదు' (నో – NO) తో 'హ' అనగా 'ఉన్నది' (YES)ని కలిపేది, వేరుచేసేది అయిన శక్తి ఈ బిందువుది మాత్రమే అవుతుంది. అనగా ఈ బిందువు యొక్క వ్యాపకత్వమే అయివుంటుంది. కేవలం బాబూజీ మహరాజ్ యొక్క కృప మరియు శక్తి ద్వార మనం ఈ బిందువు యొక్క వ్యాప్తి యందు మిళితమవుతూ అనగా దాని శక్తిని గ్రోలుచూ, మనం ఇంకా ముందుకు పురోగమిస్తూ ఉంటే అప్పుడు ఈ బిందువు కూడ నెమ్మది నెమ్మదిగా మసకబారిపోతుంది. ఒకానొక రోజున మనం పూర్తి అహం యొక్క ఈ బిందువును పూర్తిగా అంటనట్లుగా ఉంటాము. శ్రీ బాబూజీ మహరాజ్ అప్పుడే మనలను అహం నుంచి ఆవలకు తీసికొని వెళ్లుటకు బాధ్యత వహిస్తున్నట్లు మనకు అనిపిస్తుంది. 'వారు' కృపతో మనం అహం యొక్క బిందువ్యాప్తిలో అంతర్గతమై ఉన్నప్పుడు కూడా మనల్ని కనిపెట్టి ఉంటారు. అదేమంటే మనస్వేచ్ఛావస్థకంటే అతీతమైన ముక్తి మరియు స్వచ్ఛందావస్థయైన అంతిమం యొక్క సామ్రాజ్యంలో మనకు ప్రవేశం కల్పించడానికి సంకల్పిస్తారు. అనగా మనము ఈశ్వరీయ స్థితిపైన ఆధిపత్యము కలిగి ఉండే స్థాయికి 'వారు' మనలను తీసికొని వెళ్లాలని కోరుకుంటారు. "భక్తిలో యాచన లేకుంటే భక్తుడే భగవానుడయ్యేవాడు" అనేది మనకు అర్థమౌతుంది. అనగా ఇప్పుడిక యాచన - విన్నపము సమాప్తమవుతుంది. లేదా నేను బాబూజీకి వ్రాసినట్లుగా "ఇప్పుడు నేను పొందే దానను కాదు.

నిర్మాణ కర్తను" అనగా "భక్తురాలిని కాదు భగవంతుడను" అన్నట్లుగా ఉంటుంది. ఇప్పుడు బాబూజీ చెప్పినట్లు 'అ' అనగా 'లేదు' అనేదాన్ని 'ఉన్నది' గా భావించే స్థితి ఇప్పుడు మన ఎదుట ప్రత్యక్షమవుతుంది. దీనిని గురించిన ప్రత్యక్షానుభవం ఏమంటే 'అ' అనే స్థితి యొక్క అర్థము 'లేదు, అనీ 'హ' స్థితి అర్థము 'ఉన్నది' అనే దశకు సంబంధించినది కాబట్టి, ఇప్పుడు మనము 'లేదు' అనేదానిని 'ఉన్నది' అని భావించియే ముమ్ముందు 'మూలము' అనగా దివ్యత్వం నందు ప్రవేశిస్తాము. ఇప్పుడు ఈ సమయంలో స్థితి కొరకుగాని, దాని ప్రత్యక్షతకొరకుగాని ఒకవేళ మనవల్ల 'అ' అనగా 'లేదు' అనే శబ్దం ప్రయోగించబడినదైతే అది ఎవరికో ఎందుకో కూడ మనకు తెలీదు. ఒకవేళ 'హ' ఉన్నది అని అన్నట్లయితే మన ఎదుట ఒక విశాలమైన స్వచ్ఛమైన మైదానమే ఉండి, అక్కడ ఏమీ లేనట్లుగా అనిపిస్తుంది. మరి దీనిని ఏమని అనగలం. ఏదైతే మనకు సూక్ష్మాతి సూక్ష్మం యొక్క ఊహను, సూచనను ఇస్తుందో అది కేవలం 'అ' (లేదు)ను 'హ' (ఉన్నది)ను కలిపేటటువంటి ఆ 'బిందువు' మాత్రమే! ఒక బిందువు మాత్రమే అయి ఉండి అంతటా, సర్వత్రా వ్యాపించియున్నది అదే! అట్టి ఆ బిందువును 'ఉన్నది' అని చెప్పుట వ్యర్థం. ఎందుకంటే బిందువుకు విలువ ఏముంది. ఉన్నా ప్రాధాన్యత ఏమి ఉంటుంది? అది లెక్కకురాదు. కనుక యిక లేదు. అంచేత బిందువు 'ఉన్నది' అని కూడ చెప్పలేము. ఈ స్థితికి చేరుకొన్న తర్వాత మనం 'అంతిమము' వరకు చేరాలి అనే శ్రీ బాబూజీవారి పావన సంకల్పం నెరవేరుట మొదలవుతుంది. మనలో 'వారు' ఎల్లప్పుడూ ఉండుట వల్లనే 'లేదు' అనే దానిని 'ఉన్నది' అని భావించి సాగిపోవునట్టి దృశ్యాన్ని కూడ చూస్తాము. ఈ అందమైన దోషాన్ని మన ఎదుట దర్శింపజేయునటువంటి శ్రీ బాబూజీ మహారాజ్ మనల్ని కేవలం సాక్షులుగా చేస్తూ అంతిమం వైపు వెంట బెట్టుకుని వెళ్లుట మొదలవుతుంది. ఈ స్థితిలో మనం 'వారి'కి ఇలా ఇలా ఉంది అని ఈ స్థితిని గురించి వ్రాస్తూ ఉండగా మరల దానిని గురించి కొద్దిగా ఆలోచిస్తే - అసలు ఆ స్థితి అనేది ఉందా? లేదా? అని అనిపిస్తుంది. ఇందువల్ల 'లేదు' అనేదానిని 'ఉన్నది' అని ఒప్పించి మాలిక్ మనలను వెంటనిడుకొని ముందుకు తీసుకుని వెళుతున్నారన్నది ఋజువవుతూంది.

అహం యొక్క స్థూల బంధనాలను దాటి ఆవలకు చేరుకున్నప్పుడు మనలో రంగుల్ని గుర్తించే జ్ఞాన విచక్షణ కూడా ఉండదని నేను గ్రహించాను. మనల్ని ఎవరైనా ఆకుపచ్చ బకెట్ తీసుకురమ్మంటే ఆ రంగును గురించిన ఆలోచన ఏదీ లేకుండానే ఆకుపచ్చరంగు బకెట్‌ను తీసుకుపోతాం. ఈ విధంగా ఎందుకు జరుగుతుంది. దీనికి గల కారణం ఏమిటనగా - శరీరాన్ని రక్షించుకోడానికి మరియు ఈ ప్రపంచంలో జీవించుటకు కావలసినంత జ్ఞానం (స్పృహ) మనలో దానంతట అదే పని చేయుచూ ఉండగలదని నేను గ్రహించాను. దీనివల్ల నేను తెలుసుకున్న దేమంటే ఇటువంటి శ్రేష్టజీవితం గడుపుతూంటే మన ప్రాపంచిక కర్తవ్యాలు, వ్యవహారాలు అన్నింటిలోనూ కూడా పవిత్ర అనుకూలత నెలకొని ఉంటుంది - అని. రంగులను గుర్తించు స్పృహ మన నుండి తొలగించబడినప్పుడు దివ్యత్వంలో మగ్నమైన నిరాడంబరతాదశ (సరళత) మాత్రమే మిగిలి ఉంటుంది. "నిరాడంబరత్వమే (సాదగీయే) నా స్వరూపమైనట్లుగా ఉంది. అని బాబూజీ మహరాజ్‌కు ఈ దశను వ్యక్తం చేస్తూ వ్రాశాను. అంతరము యొక్క ఇటువంటి పావన, విశుద్ధస్థితిలో లయమవుతూ అవుతూ మాలిక్ యొక్క సమక్షంలో ఒకనాటికి మన అంతరంగ హృదయం అంతా తెరచుకుని స్థబ్దంగా ఉండిపోవునని నాకు నిరూపించబడినట్లుగా గ్రహించాను. అనగా మొదటగా మాలిక్ సమక్షంలో మన అంతరంగము విప్పారుతుంది. - వికసిస్తుంది. తర్వాత మనం (సాదగీ దశ యందు) నిరాడంబర లేదా నిరామయ దశలో వారి సమక్షంలో నిలబడి యున్నట్లు గ్రహిస్తాం. ఇప్పుడు 'వారు' మనకు తమ దర్శనం ఇవ్వడం ఇవ్వకపోవడం - ఆదరణ చూపడం చూపకపోవడం 'వారి' వంతు. కాని 'వారు' మన సమక్షంలో (మనలో) తమ హృదయం విప్పి మనల్ని తరింప జేయాల్సిందే! ఎందుకంటే మనస్థితియే 'వారి'ని మనల్ని అనుగ్రహించక తప్పని స్థితిలో వివశుల్ని చేస్తుంది. మనం సాక్షాత్కారం యొక్క స్థితిలో ప్రవేశించడానికి అదే ఆరంభమవుతుంది. ఈ విధంగా అంతరహృదయం విప్పారి వారి ముందు పరచియున్న స్థితిలో ఎదురుగా వారు ఉన్నారనే స్పృహ కూడా కోల్పోయాను.

అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటి? అనే ప్రశ్న ఒకటి మనలో కలగవచ్చు. దీనికి సమాధానం ఏమిటనగా - మనం అనంతంవైపు పురోగమిస్తూ ఉన్న ఆత్మ పరిణతి యొక్క విస్తారాన్ని మనం గుర్తిస్తూన్నదంతా నా ఆధ్యాత్మిక స్థితి యిలా ఉంది, అలా ఉంది, అని వ్రాస్తాము. కాని ఎప్పుడైతే శ్రీబాబూజీ మహరాజ్ మనలను ఆత్మ - తత్వమునకు కూడా అతీతంగా తీసుకుని వెళ్తారో అప్పుడు మనం మన ఆధ్యాత్మిక స్థితిని, స్థితిగతులను వ్రాయలేము. ఎందుకంటే అప్పుడు ఈశ్వరీయ వ్యాప్తియందు మనం కూడ వ్యాప్తి చెందుట మొదలవుతుంది. అప్పుడు మనం ఆ దశను అలానే వ్యక్తం చేస్తాము. మొదట మనం సమస్తమునందు ఈశ్వరదర్శనం పొందుతాము. పిమ్మట ఆపావనదశలో లయమవుతూనే ఒకనాడు ఈశ్వరీయ శక్తి యందు లీనమవుట ప్రారంభమవుతుంది. సమస్త విశ్వము నందు వ్యాపించి యున్న ఈశ్వరీయశక్తియందు లయమవుతూ - అవుతూ ఉండగా ఆ తరువాత ఈశ్వరుని యొక్క సర్వవ్యాపకతలయందు కూడ మనము ప్రవేశించే అవకాశాన్ని బాబూజీయే కల్పిస్తారు. ఆ తర్వాత మాలిక్ తమ సర్వవ్యాపకత యందు మనకు కూడా ప్రవేశాన్ని కల్పించి అందులో కూడ మనలను వ్యాపించునట్లుగా చేస్తారు.

ఇప్పుడు మన ఆలోచనల్లో నుండి ఉన్నతి యొక్క స్థానం కూడ స్వచ్ఛమవుతుంది. అంటే మన ఉన్నతి మన ఆలోచనలు, భావనలకంటే కూడ ఎంతో తేలికగా అయి 'దశ' ఆలోచనావత్తిడి నుండి అతీతంగా ఉంటుంది. అపుడు ఆలోచన అనునది 'ఆలోచన' లోనే సమసిపోతుంది. అనగా ఆలోచన అనేది వాస్తవికత యందు మిళితమై అందులోనే ఇమిడిపోతుంది. అనగా ఇప్పుడు మనలో ఆలోచనా రహిత స్థితి నెలకొని ఉంటుంది. "ఒకరిని గూర్చిన ఆలోచన 'ఒకరి'లో ఎక్కడ ఐక్యమగునో అక్కడే ఆలోచన అంతం (లోనికిచేరును) అన్న కబీరు వాక్కు ఈ సందర్భంలో ఇలా ఉంది. ఇలాంటి స్థితికి చేరుకొన్న తర్వాత ఆలోచన ఆలోచనలో కలిసి అంతమగును. ఎక్కడ। అన్నది ఎవరు తెలిసికోగలరు? ఇప్పుడు మన బాహ్య జీవితంలో గొప్ప మార్పు జరుగుతుంది. సిగ్గు, ఎగ్గూ, సుఖదుఃఖాలు, పరువు

ప్రతిష్టలు అన్నీ అవసరానుగుణంగా మనలో కార్యరూపము దాల్చి పనికాగానే మరల ఎక్కడివి అక్కడికి - యథాస్థానానికి మరలిపోతాయి. "గుణములు గుణములలోనే వర్తిల్లుతూ ఉంటాయి. మనం కేవలం ద్రష్టలుగా - ప్రేక్షకులుగా మాత్రమే ఉండిపోతాం" అన్న భగవద్గీతలోని కృష్ణభగవానుని వాక్యం - ఈస్థితి రూపంలో మనలో పనిచేయుట మొదలుపెడుతుంది. ఇపుడు ఈ ఈశ్వరీయ - విరాట్ యొక్క సూక్ష్మదశలో కూడ మనం ఐక్యమైపోయినట్లు అవుతుంది. ఇపుడు నలువైపులా మనకు మూలతత్వము యొక్క మూలస్థితి దృశ్య ప్రకాశమే మనకు లభిస్తుంది

ఇప్పుడు మనం సాధనలో ఉన్నత శిఖరానికి చేరాము. ఈశ్వర సాక్షాత్కారముతో పాటు ఐక్యతాస్థితి కూడ మనలో ఇమిడిపోయింది. ఇప్పుడు దీని తర్వాత ఏమిటి? అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇపుడు దారి కనబడ్డానికి ఇటు ఈశ్వరీయ ప్రవేశం కూడా చొరబడలేదు. మరి ప్రయాణించడమెలా? అయితే నా పరిశీలనకు అందినది ఏమిటంటే - చీకటి వెలుగులు ప్రసరించవీలులేని మన మార్గంలో సర్వత్రావ్యాపించియున్న సూక్ష్మ దివ్యత్వము మాత్రమే మన మార్గాన్ని ప్రకాశింపచేస్తున్నట్లుంది. మనం ప్రయాణిస్తున్నట్టుకూడా అనిపించదు. ఎందుకంటే గమనం కూడా తన పరిధిలోనే మిళితమై పోతుంది కనుక. అదేమి విచిత్రమో! పాదములు లేకయే నడుస్తున్నట్లు, చెవులు లేకయే వింటున్నట్లున్న స్థితివలె సహజసిద్ధమైన మార్గమేర్పడి మనకు ప్రత్యక్షమవుతుంది. మరి మనమో - నిశ్చింతంగా మొహమోటం లేకుండా దారి తెలియకుండా గమ్యం యొక్క స్పృహ లేకుండా కూడ స్పృహ - ఎరుక ఉన్నట్లే సాగిపోతూ ఉంటాము. ఇక గమ్యమెక్కడో? ఎవరు చెప్పగలరు! ఇప్పుడు సూక్ష్మం నుండి అతి సూక్ష్మంలోకి వెళుతున్నామా ఇదీ చెప్పలేము. ఒక హద్దు వరకు చేరుకొన్న తర్వాత సూక్ష్మత్వము కూడ స్థితిని అనుసరించడం విడిచిపెట్టి తన హద్దులోనే విలీనమైపోతుంది. ఏ ప్రేమ భక్తి మరియు లయావస్థల ఆధారముతో మనము ఉద్యమించి కొనసాగుతూ శ్రేష్టమైన దివ్యత్వంలో విలీనమయ్యామో వాటికి కూడా ఒక హద్దు ఉంది. అవన్నీకూడ తమతమ హద్దులకు చేరుకోగానే

నేను వాటిని చూస్తూ చూస్తూండగానే లయావస్థలో లయమైపోయాయి. ఇప్పుడు మన స్థితిని గురించి ఎంత స్వల్పంగా చెప్పాలనుకున్నా అసంభవమేమో అనిపిస్తుంది. ఒకవేళ ఇది మనస్థితి అని చెప్పినప్పటికి అది సరైనది కాదనిపిస్తుంది ఎందుకంటే మనం కేవలం సాక్షిగానే మిగిలిపోతాం కాబట్టి! స్థితి ఎదురుగా ఉంది. కలం రాస్తోంది. అది నాయొక్క స్థితో లేక స్థితి యొక్క స్థితో ఏమి చెప్పగలం? ఇప్పుడు చేరుకున్న ప్రతిస్థానం ప్రతి అంతస్థు మనకు గమ్యస్థానం వలె అనిపిస్తుంది. మరల మనం విరాగివలె వీటన్నిటిని విడిచిపెట్టి ముందుకు సాగిపోతాం. వాస్తవంగా నిజమైన వైరాగ్య స్థితిగురించి ప్రశ్నిస్తే దానికి ఈశ్వర ప్రసాదితమైన, యోగము పై అనురాగాన్ని కూడా మనం మన స్వంతానికి ఉంచుకోలేనటువంటిది, అని చెప్పుతాను నేను. మనలో ఇంతశక్తి, బలము ఎక్కడివి. దానిని ఇలా వివరిస్తే చాల బాగుంటుంది. - ప్రేమను వారు స్వంతం చేసుకున్నారు కనుక మనలోని ప్రేమతొలగిపోయింది. మనల్ని వారు తమలో లీనం చేసుకున్నారు కనుక వైరాగ్యం దూరమైంది. ఇప్పుడు మనం చేరుకొను ప్రతి ప్రదేశము కూడ మన గమ్య స్థానముగానే అనిపిస్తుంది. ఎందుకంటే దివ్య లక్ష్యము యొక్క విశాలమైన క్షేత్రం నందు అడుగు పెట్టినందున గమ్యస్థానము యొక్క అంటే సాక్షాత్కారం యొక్క ప్రతిసూక్ష్మతను ప్రత్యక్షంగావించుకొన్నందున మన అలసట అంతాపోయినట్లు ఒక చల్లదనం వలన అంతరంగంలో వ్యాపిస్తుంది. ఈ స్థితిని శాశ్వత మరియు సంపూర్ణశాంతి - అని అనవచ్చు. కాని మనం యింకా పురోగమించాల్సి ఉంది. మనం వెదికే గృహమైతే (లక్ష్యం) దొరికిందికాని 'గృహయజమాని' అంటే మాలిక్ అనగా ఈశ్వరుడు - యింకా మనకు స్వాగత మివ్వలేదు - అనగా దర్శనమిచ్చి తమ హృదయానికి హత్తుకోలేదు. కాని ఆ 'అది' లభించింది - 'అది' లభించింది. అన్నది చాల ముందు నుండే తెలవడం మొదలవుతుంది. శ్రీబాబూజీ మహరాజ్ వారి ప్రాణాహుతిశక్తి యొక్క సుందరమైన అద్భుతాన్ని ఒకదాన్ని నేను తెలుసుకున్నాను. మనం అందరం లక్ష్యం వరకు చేరుకునే 'సహజమార్గ్' లో అడుగుపెట్టిన మొదటిరోజు ... మనకు వెనకు

తిరిగే అవసరం గాని అవకాశాన్ని గాని ఇవ్వలేదు, మనకూ అలా వెనక్కితిరిగే శక్తి ఉండదు.

సన్యాసుల యొక్క ఒక విశేషతను గురించి నేను సాధువుల నుండి విన్నాను - చదివాను కూడా. అదేమంటే వారు ఒకసారి వదలి వెళ్ళిన ఇంటిని వెనుతిరిగి చూడరు. అందువల్ల మనం సాధన ప్రారంభించిన మొదటి రోజు నుండే సరైన అర్థంలో సన్యాసుల మవడం మొదలుపెట్టినట్టే. ఎందుకంటే ప్రతి దశలోనూ విహరించి విరాగిలా ఆ దశను వదలి ముందుకు సాగుతామే కాని వెనుదిరిగి చూడనే చూడం. రాబోయే ప్రతి దశా కూడా గమ్య స్థానంగానే అనిపిస్తుంది. ప్రతి ఉన్నత స్థితి ఇట్లే అనిపిస్తుంది. ఎందుకనగా మూల బిందువు చేరనంత వరకు ప్రతి భవనము (ప్రతి స్థితి) మూలస్థితిని పోలి వుంటుంది. ఆత్మతత్వమందలి చివరి (భవనమందు) స్థితియందు కూడా కొంతసేపు మాత్రమే ఉండి, మరల ముందుకు ప్రయాణిస్తాము. శ్రీ బాబూజీ వారి కృప, శక్తి మనలను అక్కడా కూర్చుని విశ్రాంతి తీసుకోనీయదు. అనంతశక్తిని మనలో యిముడ్చుకుని - నింపుకుని కూడా ఏమీ పొందనట్లుగా - రిక్తహస్తాలతో వెళుతున్నట్లుగా వెళ్ళిపోతాము. ఎందుకంటే మన సర్వస్వములోనూ ఆ ప్రియతముడే నెలకొని యున్నాడు. మన నడవడికను ఆయనే నిర్వహిస్తారు. నవ్వే అవసరం వచ్చినప్పుడు నవ్వనిస్తారు. ఏడవవలసిన అవసరం వస్తే ఏడవనిస్తారు. దేని నుంచి మరుగు పరచి వుంచాలో దానికి మరుగున ఉంచారు. ఎవరి ఎదుట నిలబెట్ట దలచారో వారి ఎదుట నిలబెట్టారు. వారికి తోచినప్పుడు సతాయిస్తారు - వేధిస్తారు. కానీ కావాలనుకుంటే ప్రేమిస్తారు - ఇలా చేస్తూ వారు సంతోషపడ్డారు, కాని మనం దైన్యంతో తపనతో అలమటించాము. చివరికి మనపై దయ చూపి, ఆ దైన్యాన్ని కూడా తనలోనే లీనం చేసుకున్నారు. వారి సంరక్షణలో మనకు పూర్తి స్వేచ్ఛను ప్రసాదించారు. బహుశః అపుడే ఆ బిందు మాత్రమైన 'అహం'ను కూడా అధిగమించగల్గుతున్నాం.

ఇప్పటి వరకు మనతో పాటు ఉన్న తీవ్రమైన తపనను కూడా విడిచి పెడతాము. కాని బహుశః ఆ తపన మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. అది

ఎప్పటి వరకో ఎవరు చెప్పగలరు ? బాబూజీ మహరాజ్‌కు ఎన్నోసార్లు "ఇప్పుడు నాలో ఎక్కడో హద్దులు లేనటువంటి తపన ఉన్నట్లుగా ఉంది. కాని ఎక్కడ? ఎలా ఉందో ? దీని జాడ తెలియడం లేదు," అని వ్రాశాను. యదార్థం ఏమంటే, తపన యొక్క ఆ బిందువును మనదిగా భావిస్తాము. ఎందుకంటే యిటువంటిదే మరో సందర్భంలో వస్తుంది కాని దానిని మనం శ్రద్ధ వహించి ఉండము. బాబూజీ గారికి నేను ఈ విషయం కూడా వ్రాశాను - అదేమంటే 'తపన ఉన్నది' అని అనిపించగానే మన దృష్టి దానిని వెంటాడుతుంది కాని అది మాయమవుతుంది. ఎందుకంటే బిందువు వ్యాప్తి చెంది బిందువులో మిళితమైపోయే సమయం వస్తుంది. ఇప్పుడు మన మార్గము, 'లేదు' అను దానిని 'ఉన్నది' అని భావించి ప్రయాణించే మార్గము అని కూడా చెప్పలేము. ఇటువంటి దశను చేరుకొన్న తరువాత, చాలాసార్లు నా శరీరంలో ఎక్కడయినా చాలా నొప్పి కలిగినప్పటికీ బాధ అనేది ఎక్కడో ఉంది, అని మాత్రం అనిపించేది. కాని అది ఎవరిదో తెలిసేది కాదు. కాని ఆ బాధ తీవ్రమై, శృతి మించినపుడు మరల ఈ శరీరములోనికి 'నేను' కుంచించుకున్నట్లయి, అప్పుడు ఈ నొప్పి తనకే కలుగుచున్నదనే ఆలోచన వస్తుంది. కొద్దో గొప్పో ఉందో లేదో అనే సందేహం వంటిది వస్తుంది. తరువాత ఒకానొక సమయం ఆసన్నమై బాబూజీ మహరాజ్ దేనిని అసలీయత్ (వాస్తవికత) అని అన్నారో అది ఆ గమ్యం యొక్క బిందువు ప్రత్యక్షమవుతుంది. ఇపుడు ఈ బిందువే ప్రతి స్థితి యందు కూడా గమ్యము యొక్క దర్శనమును ప్రత్యక్షము చేస్తూ, అసలీయత్ నందు లీనమవుతూ వుంటుంది. అనగా 'బిందువు', బిందువులో ఐక్యమయిపోవుట మన ఎదురుగా ప్రత్యక్షమవుతుంది. ఈ ప్రత్యక్షమును కూడా సమస్తమైన మానవాళికి నేడు సహజముగానే చేయుటకు సమర్థ సద్గురువు శ్రీ బాబూజీ తప్ప వేరెవరూ కనిపించుట లేదు. వాస్తవానికి ఇటువంటి విశిష్ట వ్యక్తిత్వము (స్పెషల్ పెర్సనాలిటి) కలవారు ఒక కాలములో ఒక్కరు మాత్రమే ఉంటారు. ఇద్దరు ఉండడానికి వీలులేదు. ఇది ప్రకృతి నియమము. ఇంతటి సూక్ష్మ ప్రకృతిపై ఇద్దరి ఆధిపత్యము ఉండడమనేది అసంభవము.

అసలైన గమ్యం లేదా అసలీయత్ యొక్క సాక్షాత్కారం అయినట్లు మొదట ఒక భ్రమ కలుగుతుంది. అనగా మనం దివ్యత్వాన్ని పొంది ఉండే ఒక విచిత్రమైన - భ్రమలో కూడిన స్థితిని కల్గి ఉంటాం. ఆ భ్రమ కొంచెం వాస్తవికతగా మారుతున్నపుడు ఇదేమిటా అని ఆశ్చర్యం కల్గుతుంది. అనగా 'అ' ను 'హ' తో సంయోగం చేసే "అహం" తత్వాన్ని (వ్యక్తిత్వాన్ని - అస్థిత్వాన్ని) ఇస్తున్న ఆ బిందువు అసలీయత్ యందు ప్రవేశించి మిళితమై, ఏకమైపోతుంది. అసలీయత్ (అసలైన వాస్తవికత) అనేది వెలువడే ముందు మన అనుభవము యొక్క దృష్టి ఆశ్చర్య చకితమై చూస్తూ ఉండిపోతుంది. తన వ్యాపకత్వాన్ని మనకు అనుభవ పరచడానికి దివ్యదృష్టిని ప్రసాదించిన ఆ అసలీయత్ ఆ పని పూర్తికాగానే మరల ఆ అనుభవ దృష్టి అదృశ్యమవటం ఆరంభమవుతుంది. అనుభవం మొదటనే సెలవు తీసుకుంది. కేవలం దృష్టి మాత్రమే ఉండిపోయింది. అసలీయత్ (రియాలిటీ) యొక్క దర్శనం కొరకు అటువంటిదే అయిన దివ్యదృష్టి ఉండాలి. కాని ఎప్పుడైతే దివ్యదృష్టి కూడా లయమైపోతుందో (ద్వైతం - నీవు నేను అను వేర్పాటు అన్నది సమాప్తమైంది కాబట్టి) అప్పుడు మిగిలిపోయింది కేవలం 'అసలీయత్' మాత్రమే. కేవలం ఇది మాత్రమే వ్రాయబడుతుంది. ఈ విధంగా నా జీవన సర్వస్వం అయిన శ్రీ బాబూజీ మహరాజ్ వారికి వ్రాశాను. ఇంకా మున్ముందు 'వారు' ఏమి వ్రాయిస్తారో 'వారి' కే తెలుసు. ఈ కలం వ్రాయడానికి సంసిద్ధంగా ఉంది.

వాస్తవంగా శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క పావన ప్రాణశక్తి మనలోపల నిద్రాణమై యున్న ఈశ్వరీయ చైతన్య శక్తిని తట్టి మేల్కొల్పుతుంది. ఈ ఈశ్వరీయ చైతన్య శక్తితోనే మనం దివ్య దర్శనమును పొందగలం. కనుక ఆ దివ్యదృష్టి మనలో అంకురిస్తుంది. ఈ చైతన్యశక్తి సరైన పద్ధతిలో మన లోపల జాగృతమైనప్పుడు సహజమార్గం యొక్క ప్రత్యక్షము, ఆధ్యాత్మిక దశల యొక్క సూక్ష్మత, ఈశ్వరీయ దశల యొక్క దివ్యతా ప్రకాశమూ మన అంతరంగము నందు స్వతహాగానే వ్యాప్తి చెందుతుంటాయి. సహజమార్గ సాధనా పద్ధతిలో ధ్యానాన్ని ఆధారం చేసికొనుట వల్ల మన అంతరంగంలో పావన ఈశ్వరీయ స్థితులు ప్రత్యక్షమై పోతూ ఉంటాయి. ఈశ్వరీయ స్థితుల

యొక్క మధురానుభూతులు మనకు ఈ దివ్య చైతన్యము ద్వారానే లభిస్తూ ఉంటాయి. ఇంకా ముందుకు వెళ్ళిన తర్వాత స్వయంగా మనం మౌనం దాల్చినపుడు మాలిక్ కృపా విధానము ఇంకా రకరకాలుగా మార్పు చెందుతూ మన అంతరంగంలో వికసించిన ఈశ్వరీయ గితుల ప్రత్యక్షతను, మనలో జాగృతమై మన ఎదుట నిల్చిన ఆ దివ్య చైతన్యము మరియు ఆ దివ్యానుభవములను వ్రాస్తూ పోతాము. కాని వాటిని చెప్పటం సులభం కాదు. సూక్ష్మ 'అహము' ను కూడా విడిచిపెట్టిన సూక్ష్మ స్థితి ఆరంభమైనప్పటి నుంచీ ఈ చైతన్యము, అనుభవమూ దివ్యత్వమునందుతూ ఉన్నట్లు నేను గ్రహించాను. అప్పుడే బాబూజీ మహరాజ్‌గారు ఆ అసలు (అసలీయత్) వాస్తవ స్థితుల యొక్క ప్రత్యక్షత యందు మనలను ప్రవేశపెట్టగా ఆ అసలు (వాస్తవ) స్థితి యొక్క వర్ణన కూడా మన ద్వారానే వ్రాయబడుతుంది. ఆ వర్ణన స్వయంగా తనను వర్ణిస్తున్నపుడు 'నేను' ను తొలగించి 'అసలు' మాత్రమే వ్యక్తమవుతూ ఉంటుంది. దీని యొక్క విశుద్ధ దర్శనము మనకు సహజ మార్గ సాధన యొక్క దివ్య దర్పణము ద్వారా గోచరిస్తుంది.

నజర్ ఇన్‌హెఁనలగె ఉమ్ర్ కీ కభీ భాయీ,
సంధ్యా బేసుధ్‌హుయె, హమ్‌గాతె చలే జాతేహైఁ

బాబూజీ, మీకింత వయసు వుందని భౌతికమైన వయస్సును గురించిన ఆలోచన (దృష్టి) మీకు కల్గకూడదనీ, దానిని మేము కూడా విస్మరించి, మైమరచి తమ దివ్య గుణగానమునే గానం చేస్తూ సాగిపోవాలని 'సంధ్య' ప్రార్థిస్తోంది.

# 12. ముగింపు

యాత్ర అనంతమైనది. బాటసారి గమ్యమెరుగనివాడు. కాగా నా యీ పుస్తకం యొక్క ముగింపు ఏ మై ఉంటుంది ? మనకు తెలియకపోయినా బాబూజీ యొక్క దివ్య మహిమ వల్ల గమ్యమే స్వయంగా పరుగెత్తుకుని ఎదురొచ్చింది. ఇప్పుడిక గమ్యం యొక్క గమ్యం ఏమై ఉంటుంది ? ఎక్కడ ఉంటుంది ? ఏమని వివరించాలి. దానిని గురించి ఎలా చెపుతారు ! ఎవరు చెప్పగలరు ? అవును. ఆ నివాసంపై ఆధిపత్యం వహించినవాడు గమ్యాన్ని స్వయంగా ఇక్కడ వరకు ఈడ్చుకొచ్చిన వాడు - అతడే చెబుతాడు. అతడే వ్రాయిస్తాడు. ఇక ఇప్పుడేముంది. కేవలం కదలకుండా నడవడం సంకల్పం లేకుండానే సాగిపోవడం - ఈ రెండే ఉన్నాయి. మనమిప్పుడొక సహజమైన బాటలో నడుస్తున్న వాళ్ళం. ఈ దారిలో నడుస్తూంటే మనం ఎప్పుడైనా ఏదైనా దారి నుంచీ ప్రయాణించి వచ్చామేమో కూడా తెలీదు. ఈ పుస్తకంలో వ్రాయబడినదేదైనా సరే శ్రీ బాబూజీ మహరాజ్ జారీ చేసిన విశదీకరణ మాత్రమే కాని ముగింపు కాబోదు. శ్రీరామచంద్ర మిషన్ యొక్క ప్రియమైన అభ్యాసీ బంధువులకు ఇది కేవలం కానుక వంటిది.

ఆధ్యాత్మిక క్షేత్రంలో ముగింపు యొక్క అర్థం నేను ఇలా గ్రహించాను. మన అహం యొక్క 'సంహారము' లేదా ప్రళయము అనునది జరుగుట మాత్రమే. మన అహం యొక్క సంహారాన్ని ఆనందంతో స్వయంగా తిలకిస్తాం. నేనొకసారి బాబూజీ మహరాజ్‌కు ఇలా వ్రాశాను "నేను మరణించి, నా కళేబరాన్ని స్వయంగా మోస్తున్నట్లుంది" అని. ప్రళయం (లయావస్థ) అయిన తర్వాత మళ్ళీ యింకా మన మహాప్రళయం అనగా 'లయ'కు లయావస్థ జరిగే సమయం కూడా ఆసన్నమవుతుంది. మన ప్రళయం యొక్క స్థితిలో స్వచ్ఛతనందిన దివ్య - అంతర్గతులు ఇంకా మనకు ప్రాప్తించిన గమ్యం ప్రళయమై (లయమై) పోయే సమయం వస్తుంది. ఇటువంటి దివ్యస్థితి లభించినందువల్ల, మన భౌతిక కళేబరం నుండి మనం తిరిగి దానిలో ఎప్పటికీ ప్రవేశించలేని విధంగా తొలగిపోతున్నట్లు గ్రహించాను. మళ్ళీ దానిని మనం స్పర్శించడం కూడా జరగదు. బహుదూరంగా, అనంతంలో

విశేష స్థితిలో లయమై బాహ్యంలో అనగా భౌతిక ప్రపంచంలో నీటిలోనున్న తామరాకువలె ఉంటాం. ఈ ప్రళయాన్ని ఎవరయినా చూశారా ? రాజయోగులమైన మనం సహజ మార్గ సాధనలో ధ్యానం ద్వారా లక్ష్యమును పొందాలను దృఢ సంకల్పాన్ని పూని ఈశ్వర ధ్యానమునందు లీనమై ఉన్నత స్థితులను పొందుచూ మన ప్రళయమును మరియు మన ప్రళయము యొక్క ప్రళయమును అనగా లయావస్థ యొక్క లయావస్థను కూడా మనము స్వయముగా సహజమార్గ దర్పణమునందు దర్శించుటయే గాక దానిని గురించి వ్రాస్తూంటాము కూడా. ఇది ఖచ్చితమైన నిజం. మరింతగా పురోగమించిన తర్వాత యోగము, ధ్యానము, సాధనామార్గము మరియు లక్ష్యములో పొందిన లయావస్థ అన్నీ కూడా ఎక్కడో లయమైపోతాయి. అప్పుడే కావచ్చు - దివ్యదేశ దర్శనమును సహజమార్గ దర్పణములో తిలకించి ఈ పుస్తకం యొక్క ముగింపు వ్రాయబడటమూ అలాగే మన మహా ప్రళయం జరిగే సమయం కూడా మన సద్గురు శ్రీ బాబూజీయే నిర్దేశిస్తారు. కాని ఈ మహా ప్రళయాన్ని (లయావస్థ యొక్క లయం) ఏ నేత్రం (ఆధ్యాత్మిక చక్షువు) దర్శించగలదు ? ఇది నేను చెప్పలేను. నాకు ఏ విధంగా అనిపిస్తూన్నదంటే మన ప్రియతమ 'మాలిక్' యొక్క మూలనేత్రమే (ఒరిజినల్ ఐ) దివ్యదృష్టియే ఈ మహా ప్రళయమును చూడగలదని అనిపిస్తూంది. కాని 'వారి' దివ్య దృష్టితో నా మహా ప్రళయాన్ని నేనే చూస్తున్నట్లు అనిపిస్తూంది. అంచేతనే ఈ పుస్తకం కూడా పాఠకుల ముందు ఉంచటం జరిగింది. నేనయితే, నాలోని మహా ప్రళయ సందర్భంలో మార్పు చెందుతున్న దివ్యగతుల సాక్షాత్కారమునకు కేవలం సాక్షీభూతురాలిగా నిలిచాను. ఈ గ్రంథం రచించడానికి నేను కేవలం నిమిత్తమాత్రురాలను. అసలు రచయిత ఆ 'దాత' అయిన 'వారు' (బాబూజీ) మాత్రమే.

ఇంకా ముందుకు వెళ్ళిన తర్వాత ఈ మాత్రం కూడా ఉండదు. ఎందుకనగా ఇప్పటి వరకు దివ్య స్థితులు అన్నీ వాటంతటవే మారిపోతున్నాయి. అనగా అంతరంగము నందు ప్రళయం జరుగుతోంది. ఈ కలము వాటిని గురించి వ్రాస్తూ వుంది. కాని నాకు దీనిని గురించి అనగా వ్రాస్తున్నాననే

ఎరుకే లేదు. దానిని గురించిన, ఆ ప్రళయమును గురించిన స్పృహ లేదు. నాకు తెలిసినదేమంటే మన హృదయాన్ని ధ్యానము నందు లీనం చేసి ఈశ్వరీయ ధారయందు మునిగిపోవునట్లుగా ప్రయత్నించినది మొదలు శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క పావన ప్రాణాహుతి వలన మన హృదయంలో పరమ ఈశ్వరీయ గతుల ఆవిర్భావం జరిగి మన ప్రళయమును అభివృద్ధి పరచ సాగుతుంది.

మనం బాహ్యం నుండి ఎంతెంతగా అంతర్ముఖం కావటంలో సఫలీకృతులమవుతామో అంతంతగానూ శ్రీ బాబూజీ యొక్క రాజ-యోగ-సాధన ద్వారా సాక్షాత్కారం కొరకు ప్రబలమైన కోర్కెతో మత్తెక్కినట్లు (మగ్నమై) వుంటూండగా ఒకవైపు 'వారి' దర్శనం మనలో (స్థిరపడుతూ) వెలుగొందుతూ వుంటుంది. మరోవైపు పుస్తకం యొక్క ఉపసంహారం అనగా మన మహా ప్రళయం యొక్క ఏర్పాటు కూడా ప్రారంభమవుతూ వుంటుంది. స్థితికి ఏ విధంగా తన స్థితి ఏదో స్వయంగా తెలియకపోతుందో అలాగే ఈ లయ యొక్క లయావస్థలో కూడా మనకు స్పృహ వుండదు. అదేమంటే అది మన స్థితియో లేక స్థితి యొక్క స్థితియో కూడా గ్రహించలేని పరిస్థితి అన్నమాట. అదే విధంగా ఈ పుస్తకం యొక్క ఉపసంహారానికి యిపుడు, ఈ పుస్తకం ద్వారా పాఠకుల సముఖాన ఎటువంటి దివ్య రత్నములు వెదజల్లబడనున్నాయో కూడా తెలియదు. ఇదంతా పరమ సద్గురు శ్రీ బాబూజీ కృప మరియు యోగీయ ప్రాణశక్తి ద్వారా మాత్రమే నేడు సర్వులకు సంప్రాప్తమవుతున్నది.

ఇంతేకాదు, ఆధ్యాత్మిక క్షేత్రములోని అసంఖ్యాక, అలౌకికమైన దివ్యగతులను అటువంటి మాటలను మరియు పదాలతో వ్యక్తపరచగల్గిన నైపుణ్యం కూడా శ్రీ బాబూజీగారి అనుగ్రహం వల్లనే నేడు సంభవమైనది. ఈ నేర్పు కూడా ఆ దివ్యదర్శనమును వ్యక్తపరచి (తెలియజెప్పి) వారిలోనే లయమైపోతుంది. ఇది ఎలాగంటే 'ఇల్లు' చేరాక దారిలో పడిన ప్రయాస నెమరువేసుకోవటమెందుకు? అన్నట్లుంటుంది. ఇదే స్థితిని గురించి శ్రీ బాబూజీ నాకు వ్రాసినట్లు జ్ఞాపకముంది. అదేమంటే "(ఫనాయే-ఫనా)

లయ యొక్క కూడా లయావస్థ స్థితి దాటిపోయింది. ఇపుడు పరిపక్వత నందవసిన స్థితి ప్రారంభమయింది. ఎంత త్వరితంగా స్థితి లయమై పోవటం జరుగుతుందో అదే వేగంతో ఇందులో పరిపక్వతా స్థితి, పరమేశ్వరుని కొలువులో మనకు బహుమతిగా లభిస్తుంది." ఇక్కడ (బకా) పరిపక్వతకు నిర్వచనం ఏమంటే మనకు క్రింద నున్న ఆధారాలన్నీ (భక్తి, ప్రేమ, ఆత్మనివేదన, ఆత్మ సమర్పణ, లయావస్థ అన్నీ) తొలగిపోవటమే. మరెక్కడకు పోగలం ? ఈ పరిస్థితిలో మనం ఎక్కడుంటే అదే మన 'నివాసం' (వతన్) అవుతుంది. వారు దీనినే "తురీయావస్థ" అంటారు. అని వ్రాశారు, వారు ఇంకా ఇలా వ్రాశారు - "నేను ఈ రెండు స్థితులను అనగా (ఫనాయే-ఫనా) లయ యొక్క లయావస్థ, తురీయావస్థలను -పరిశీలించితే నాకు రెండూ ఒకటిగానే అర్థమవుతోంది" అని. వారి (బాబూజీ) ద్వారా దర్శనం కావించబడిన ఈశ్వరీయ గతి యొక్క ఈ దివ్య దర్శనమును నేను తిలకించి నాలోనే యిముడ్చుకున్నాను. ఆశ్చర్యకర పరిణామమేమంటే ఆ దివ్యదర్శనమును నింపుకోగానే నాలో సమస్తమూ (శూన్యత) ఖాళీ ఏర్పడింది. ఇది వారిచ్చిన దివ్య ప్రసాదమే. ఇప్పుడు నోరు ఏ వాక్కు పలికినా, కలం ఏమి వ్రాసినా ఆ ప్రసాదం యొక్క ప్రసాదమే కాగలదు.

శ్రీ బాబూజీ మహరాజ్ నా ఈ హృదయాన్ని ఇటువంటి దివ్యదర్శనం యొక్క స్థితిలో లయం చెందినా కూడా ఈ దివ్యమైన ఉపసంహారమును నేను రచించు సామర్థ్యం కల్గి యుండునట్లుగా సంస్కరించి తమ దివ్యత్వాన్ని ప్రదానం చేసి ఈ విధంగా అలరించి సిద్ధపరచారు. ఈ విధంగా జరగటం వల్లనే ఈ గ్రంథ రచన సాధ్యమయింది. అది ఏ విధంగా వుంటుందని నేను గ్రహించానంటే - అంతర్దశ ఎంతగా సూక్ష్మత చెందుతూ వుంటుందో, వారి ప్రాణాహుతి ద్వారా అనుభవ దృష్టి కూడా అంతగా సూక్ష్మత చెందుతూ చెందుతూ ఒకానొక సమయంలో దివ్యదృష్టిగా మారుతుంది. సహజ మార్గ సాధన యొక్క సౌందర్య ప్రాధాన్యత ఇదే! ఇటువంటి పటిష్టమైన పద్ధతిలో శ్రీ బాబూజీ గారి దివ్య ఆధ్యాత్మికా విద్యా శిక్షణ మన అభ్యాసులకు

లభిస్తున్న ఫలితంగా దివ్యానుభవము, అనుభవ గ్రహీత యిద్దరూ అంతిమ సత్యములో లయమైపోతారు. శ్రీ బాబూజీ మహరాజ్ మనకు ఈశ్వరుని పూర్ణ దైవదర్శనము (దైవ సాక్షాత్కారమును), ప్రసాదించుటయే గాక పానకం, బెల్లం మాదిరిగా మనల్ని వారిలో (ఈశ్వరునిలో) ఐక్యం చేసి కలిపివేస్తారు. ఈ సన్నివేశంలోనే మనం శ్రద్ధ వహించవలసి వుంటుంది. దీనితో పాటుగా పుస్తక రూపంలో మళ్ళీ ఉపసంహారము యొక్క పరిచయము కూడా ప్రియమైన పాఠకులకు లభ్యమైపోయింది. అయినా, యాత్ర ఇంకా సమాప్తం కాలేదు, మార్గం మాత్రం ఆఖరైపోయింది. యాత్ర ఎప్పుడైతే 'అనంతం' వైపు మళుపు తిరిగిందో దాని వలన యాత్రను దృష్టిలో నింపుకొనే యోగ్య దృష్టి కూడా యిప్పుడు ఉండదు.

ఇప్పటి వరకు నేను గ్రహించిన విషయమిది - "ప్రతి (ముగింపు) అంతము ఏదో దివ్యత్వము యొక్క ఆరంభానికి ఆధారము అవుతుంది." కాని అంతము యొక్క అంతము కూడా జరిగినపుడు అనంతయాత్ర యొక్క స్థితి వ్రాయటానికి లభ్యమైతే దానిని కూడా తప్పక వ్రాస్తాను. అవకాశముంటే, ఆధ్యాత్మికోన్నతిలో ఆ ముఖ్య బిందువుల స్థితి మీద, శ్రీ బాబూజీ నాకు ప్రశిక్షణా సమయమందు యిచ్చిన పరిశోధన వల్ల తెలిసిన దానిని వెలుగులోకి తెచ్చి నా అభ్యాసీ బంధువులకు సేవ చేయటానికి నేను ప్రయత్నిస్తాను. ఇప్పుడు నేను సహజమార్గ సాధనలో ముఖ్య విషయాలను మాత్రమే కొంత అనుభవ జ్ఞానం ద్వారా వ్యక్తం చేయటానికి కృషి చేశాను. ఈశ్వరుడున్నాడని దాదాపు అందరూ విశ్వసిస్తారు కాని "వారి"ని కోరుకునేవారు చాలా తక్కువ. శ్రీ బాబూజీ కృపతో కలము మరియు వాక్కు ద్వారా అందరిలోను ఈశ్వర సాక్షాత్కారానికై కోరికను కలుగజేయటానికి యిప్పుడు నేను చేస్తున్నదీ ఇంకా చేయనున్నటువంటి ప్రయత్నమూ ఇదే. ఎందుకంటే "'ఏది వుండి వున్నదో' ' దానిని అంగీకరించక పోవటమేమిటి ? దానిని పొందటమే తరువాయి కావాలి. సత్యతత్త్వము శాశ్వతమైనది. దానిని తనలో నెలకొల్పుకోవటమే

సాహసమవుతుంది. ఈ సాహస యత్నంలో తన (వ్యక్తి యొక్క) అహంను బలిదానం చేయటం తప్పనిసరి అవుతుంది. కాని ఈ జ్ఞానం ఎవరి కుంటుంది? హృదయం ఒక ఫకీరు సమాధివలె వుండిపోతుంది.

ఇప్పుడు ప్రత్యక్షంగా వున్న ఆ అసలీయత్ (రియాలిటి) వ్యాప్తిని శ్రీ బాబూజీ గారి సులభమైన మాటల్లోనే వ్యక్తం చేయవలసి వుంది. చూచునది, తెలుసుకుంటున్నదీ అసలీయత్. ఈ అసలీయత్‌లోనే హృదయము, మనస్సు పరిశుద్ధమై, పునశ్చరణ (జ్ఞాపకం) చేసుకుని కొంత వ్రాయటానికి మళ్ళీ సిద్ధపడుతున్నాయి. భేదమేమంటే అసలీయత్ జ్ఞాపకం చేసుకొనబడేదీ కాదు, వర్ణించనలవి అయ్యేదీ కాదు. ఉన్నదల్లా అసలీయత్ మాత్రమే. ఈ అసలీయత్ యిప్పుడు కలం ద్వారా అనంత యాత్ర గురించి ఏదైనా వ్రాయగల్గితే శ్రేయోదాయకమవుతుంది.

